ఈనాడు

కరీంనగర్ 8-1-2018 సోమవారం సిటీ సంపుటి 44 సంచిక 149

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00. పేజీలు 14+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ఏప్రిల్ నుంచి పార్టీపథం

- జిల్లాలు, నియోజకవర్గాల వారీ సమీక్షలు
- ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో భేటీ
- అన్ని జిల్లాల్లో కార్యాలయాలు
- తెరాస అధినేత కేసీఆర్ నిర్ణయం

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చే ఎన్నికల కోసం పార్టీని పూర్తిస్థాయిలో పటిష్ఠం చేసే కసరత్తు ముమ్మరం చేశారు. వచ్చే ఏప్రిల్ నుంచి వంద రోజుల కార్యాచరణ సిద్ధంచేశారు. జిల్లా స్థాయి, లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహించడం ద్వారా పార్టీ ఎంపీలు, శాసనసభ్యులు, ముఖ్యనేతలతో భేటీ కావాలనీ ఆయన నిర్ణయించారు.

ప్రస్తుతం తెరాస అధికారంలో ఉన్నా.. రికార్డు స్థాయిలో దాదాపు 75 లక్షల సభ్యత్వ నమోదు జరిగినప్పటికీ గ్రామ స్థాయిలో పార్టీ బలంగా లేదు. ఎమ్మెల్యేలకు ఆసక్తి లేకపోవడం, పార్టీ వర్గాలతో సమన్వయం కుదరకపోవడం వంటి కారణాలతో గ్రామ, మండల స్థాయి కమిటీలూ ఏర్పాటు కాలేదు. జిల్లా కమిటీల స్థానంలో నియోజకవర్గ కమిటీలను ఏర్పాటు చేయాలని గతంలో నిర్ణయించినా అదీ కార్యాచరణకు నోచుకోలేదు. ఎమ్మెల్యేలున్న చోట నియోజకవర్గ కమిటీలు లేవు. పార్టీ ఎమ్మెల్యేలు లేని 39 నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జీలూ లేరు. పార్టీ ఎంపీలు లేని సికింద్రాబాద్, నాగర్‌కర్నూలు నియోజకవర్గాల్లో బాధ్యుల నియామకమూ ఎటూ తేలడం లేదు. దీంతో ఆయా శాసనసభ, లోక్‌సభ నియోజకవర్గాల్లో బాధ్యులెవరనే అంశంపై (మిగతా 2లో)

ఇప్పటిదాకా ప్రభుత్వం.. అభివృద్ధిపైనే దృష్టి



అధికారంలోకి వచ్చిన తర్వాత గత మూడున్నరేళ్లుగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పైనే దృష్టి కేంద్రీకరించారు. సభ్యత్వ నమోదు, ప్లీనరీల సందర్భాల్లోనే పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ వచ్చారు. శాసనసభ, పార్లమెంటు సమావేశాల సమయాల్లోనే ఎంపీలు, ఎమ్మెల్యేలతో భేటీ అవుతున్నారు. ఇటీవల పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై దృష్టి సారించిన ఆయన.. ఇందులో భాగంగా 3 నెలల క్రితం పార్టీ రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశారు. మరో 15 నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇకపై పార్టీ కార్యకలాపాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్న నిర్ణయానికొచ్చారు.

పాలరాతి గుట్టలపై పర్యాటక ప్రాజెక్టు

- సాగర్ బ్యాక్‌వాటర్‌లో ఏర్పాటు
- ఏడాది పొడవునా నదీ, అటవీ అందాల్ని వీక్షించేలా ప్రణాళిక

ఈనాడు- హైదరాబాద్, నల్గొండ - న్యూస్‌టుడే, చందంపేట: కృష్ణా జలాల్లో బోటింగ్.. పాలరాతి గుట్టలపై రిసార్టులు.. చుట్టూ ఉన్న అటవీ అందాల్ని వీక్షించేలా సరికొత్త పర్యావరణ పర్యాటక (ఎకో టూరిజం) ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. నాగార్జునసాగర్ బ్యాక్‌వాటర్‌లో అందంగా ఒదిగిన పాలరాతి గుట్టల మధ్య ఈ ప్రాజెక్టు రానుంది. ఏడాది పొడవునా పర్యాటకుల్ని ఆకర్షించేలా (మిగతా 2లో)



ఆదివారం తెల్లవారుజామున దిల్లీ సమీపంలో అలీపూర్ వద్ద జరిగిన ప్రమాదంలో నుజ్జయిన కారు. అంతర్‌చిత్రంలో సక్షమ్ యాదవ్

మద్యప్రాణ విషాదం!

- దిల్లీలో అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్ మృతి
- మరో నలుగురు కూడా..

2లో

హైదరాబాద్‌లో యువతుల ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు

- ఓ యువతి దుర్మరణం, ఇద్దరికి తీవ్రగాయాలు
- నిందితుడి రక్త నమూనాల్లో 206 బీఏసీ



హైదరాబాద్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మస్తానీ

పంచాయతీరాజ్ కొత్త చట్టం రూపకల్పనకు మంత్రివర్గ ఉపసంఘం

- ఛైర్మన్‌గా మంత్రి జూపల్లి, మరో ఆరుగురు సభ్యులు
- ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం

5లో

ఆసరా పింఛను పత్రంతోనూ ఇక ఓటెయ్యొచ్చు!

- 18 రకాల ఆధారాల్లో ఏదున్నా చాలు..
- రానున్న పంచాయతీ ఎన్నికల్లో వెసులుబాటు

14లో

ఆరోగ్య క్షయం

- తెలంగాణలో స్వైర విహారం
- రాష్ట్రంలో ఏటా 78,700 కొత్త కేసుల నమోదు
- మహమ్మారి బారిన ప్రతి లక్ష మందిలో 119 మంది
- కేవలం 56 శాతమే గుర్తింపు
- ప్రైవేటు ఆసుపత్రుల నుంచి కొరవడిన సహకారం
- సత్వర నియంత్రణ చర్యలకు కేంద్రం ఆదేశాలు

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణలో క్షయ స్వైర విహారం చేస్తోంది. రాష్ట్రంలో ప్రతి లక్ష మందిలో ఏటా 119 మంది ఈ మహమ్మారి బారిన పడుతున్నట్లు అంచనా కాగా.. ఇందులో 100 కేసుల్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే గుర్తిస్తుండగా.. ప్రైవేటు వైద్యశాలలు నిర్ధారించిన కేసుల సమాచారం ప్రభుత్వానికి అందకపోవడంపై కేంద్ర కుటుంబ ఆరోగ్యశాఖ ఆందోళన వ్యక్తంచేసింది. 2017లో తెలంగాణలో కొత్తగా 45,315 మందికి మాత్రమే వ్యాధి సోకినట్టు గుర్తించడం, ఇందులో ప్రభుత్వ ఆసుపత్రులే 37,767 కేసులను నిర్ధారించడాన్ని ఉదహరించింది. తెలంగాణలో ఏటా కొత్తగా 78,700 మంది క్షయ బారిన పడుతున్నట్లు వైద్య వర్గాల అంచనా. 2016 గణాంకాల (మిగతా 2లో)

కేంద్ర గణాంకాల ప్రకారం వ్యాధి తీవ్రత

- భారత్ సహా 30 దేశాల్లో వ్యాధి తీవ్రత అధికంగా ఉంది.
- ప్రపంచవ్యాప్త బాధితుల్లో భారత్‌లోనే 27 శాతం మంది ఉన్నారు.
- మన దేశంలో ఏటా 4.8 లక్షల మంది, రోజుకు 1,400 మందికి పైగా మృత్యువాత పడుతున్నట్లు అంచనా. వీరిలో అత్యధికులు నిరుపేదలే.
- దేశంలో ఏటా లక్షకుపైగా కొత్తకేసులు అధికారికంగా గుర్తింపునకు నోచుకోవడంలేదు.

పత్తిముంచిన సీసీఐ

- రైతులు తక్కువ ధరకు అమ్మేసుకున్నాక మార్కెట్ ధరకు కొనాలని నిర్ణయం
- వ్యాపారులకు దక్కనున్న లాభం

ఈనాడు - హైదరాబాద్



పత్తి రైతులు మునిగాక వ్యాపారులకు మేలు చేసేలా 'భారత పత్తి సంస్థ'(సీసీఐ) తాజాగా కొత్త నిర్ణయం తీసుకుంది. ఇకనుంచి వ్యవసాయ మార్కెట్లకొచ్చే పత్తి పంటను 'వాణిజ్య ధర'కు కొంటామని, ఈ కొనుగోళ్లు రాష్ట్రమంతా సోమవారం నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపింది. ఇప్పటికే ప్రయోగాత్మకంగా గత రెండురోజులుగా అక్కడక్కడ కొన్నది. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో పత్తికి డిమాండు పెరుగుతున్నందున మార్కెట్‌లో ఎంత ధర ఉన్నా అంతకు కొనుగోలు చేయనుంది. దీనివల్ల వ్యాపారుల్లో సైతం పోటీ పెరిగి మరింత ధర పెంచే సూచనలున్నాయి. ఈ నిర్ణయం వెనుక ఇతర కారణాలు సైతం ఉన్నాయి. గత అక్టోబరులో పత్తి పంట మార్కెట్‌కు రావడం ప్రారంభమైనప్పటి నుంచి ఉత్తరాది రాష్ట్రాల్లో మద్దతు ధరను రైతులకు వ్యాపారులు ఇచ్చారు. కానీ గత సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో కురిసిన వర్షాల వల్ల తెలంగాణలో పత్తి తడిచిందని ఇక్కడ ధర బాగా తగ్గించి ప్రైవేటు వ్యాపారులు కొన్నారు. సీసీఐ కూడా మద్దతు ధరకు కొనేందుకు వెంటనే ముందుకు రాలేదు. కొనుగోలు కేంద్రాలు తెరిచిన తర్వాత సైతం తేమ ఉందనే సాకుతో ఎక్కువ శాతం పంటను తిరస్కరించింది. సీసీఐ తిరస్కరణను మరో సాకుగా చూపి వ్యాపారులు మరింత ధర తగ్గించారు. ఒక దశలో క్వింటాకు రూ.3వేలకు మించి ఇవ్వలేదు. క్వింటా మద్దతు ధర రూ.4,320 కాగా ఇది సగానికి పైగా రైతులకు అందకుండా దెబ్బతీశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 14.27 లక్షల క్వింటాళ్ల పత్తిని మద్దతు ధరకు సీసీఐ కొన్నట్లు మార్కెటింగ్ శాఖ తాజాగా ప్రభుత్వానికి నివేదించింది. కానీ వ్యాపారులు 73.04 లక్షల క్వింటాళ్లను కొనేశారు. ఇవి (మిగతా 2లో)


పెద్ద ప్రధాన సంఖ్యను కనిపెట్టిన అమెరికన్

వాషింగ్టన్: అమెరికాకు చెందిన జొనాథన్ పేస్ అనే ఎలక్ట్రికల్ ఇంజినీర్.. అతి పెద్ద ప్రధానసంఖ్యను కనిపెట్టారు. దీనిలో ఏకంగా 2,32,49,425 అంకెలున్నాయి. 2ను 2తో 7,72,32,917 సార్లు గుణించి.. అందులో నుంచి 1ని తీసివేస్తే ఈ ప్రధాన సంఖ్య వస్తుంది. 2ను 2తో గుణిస్తూ పోయి.. చివరికి 1 తీసివేయగా వచ్చే ప్రధాన సంఖ్యలను మెర్సెన్ ప్రధాన సంఖ్య అంటారు. వీటిపై 350ఏళ్లకు (మిగతా 2లో)

వివాహేతర సంబంధాలకు అడ్డు వస్తుందన్న ఉద్దేశంతో చిత్తూరు జిల్లా పుత్తూరులో ఓ ఆర్ఎంపీ వైద్యుడు కిరాయి హంతకులతో భార్యను హత్య చేయించాడు. అంతకుముందు కాలం చెల్లిన మందులతోనూ ఆమెను అంతమొందించాలని ప్రయత్నించాడు.

మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలో ఓ మహిళ తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించింది.

నాగర్‌కర్నూలు జిల్లాలో ఓ వివాహిత థ్రిల్లర్ సినిమాను తలపించేలా భర్తను హత్య చేయించింది. ఆ తర్వాత భర్తపై రసాయనిక దాడి జరిగిందని పేర్కొంటూ ప్రియుడినే భర్తలా చూపి ఆసుపత్రిలో చేర్పించింది. అతడి వైద్య ఖర్చులను తల్లిదండ్రులతోనే పెట్టించింది.



ఏమైపోతుందీ.. బంధం!

- భాగస్వాముల హత్యకూ భయంలేని తనం
- యువతలో పెరుగుతున్న వివాహేతర సం'బంధం'
- భర్తలను చంపుతున్న భార్యలు
- భార్యలను కడతేరుస్తున్న భర్తలు
- కొంప ముంచుతున్న పెళ్లికి ముందు ప్రేమాయణాలు

ఈనాడు - అమరావతి

భార్యను చంపడానికి సుపారీ ఇస్తారొకరు... మత్తుమందు ఇచ్చి గొంతు నులిమి చంపేస్తారింకొకరు.. భర్తను చంపడానికి ప్రియుడితో కలిసి పథకం వేస్తారు మరొకరు... ప్రియుడితోనే చంపిస్తారు.. ఇంకొకరు.. ఇలా వివాహ బంధాల చుట్టూ వివాహేతర సంబంధాల చీకట్లు అలుముకుంటున్నాయి. శారీరక ఆకర్షణ, విలాసవంతమైన జీవనం, పెళ్లికి ముందు ప్రేమాయణం.. ఎన్నో వివాహ బంధాల్ని విచ్ఛిన్నం చేస్తోంది. పిల్లలను అనాథలను చేస్తోంది. జీవితాల్ని నాశనం చేస్తోంది. కట్టుకున్న వాడితో కడదాకా ఉంటానని చేసిన ప్రమాణాన్ని మరచి భర్తలనే కడతేరుస్తున్న భార్యలను చూస్తున్నాం. జీవితాంతం తోడుంటానని ఏడడుగులు వేసిన భర్తలు ఏడు నెలలైనా కాకుండానే భార్యలను తన్ని తగలేయడాన్నీ, అమానుషంగా చంపేయడాన్నీ చూస్తున్నాం.. కుటుంబ విలువలు, పెళ్లినాటి ప్రమాణాలు, సాంఘిక నిబంధనలు, చివరకు పిల్లల భవిష్యత్తునూ పణంగా పెట్టడాన్నీ చూస్తున్నాం... ఎందుకీ దారుణాలు.. ఏమిటీ విపరీత ధోరణి.. ఎందుకిలా అమానుషంగా తయారవుతున్నారు? అన్నింటికీ వివాహ బంధం విలువలేనిదిగా మారడమే (మిగతా 2లో)



గద్దెల ఆవరణలో విద్యుత్తు దీపాల బిగిస్తున్న సిబ్బంది

మేడారం జాతరకు ముమ్మర ఏర్పాట్లు

- కొనసాగుతున్న పలు శాఖల పనులు
- 15లోగా పూర్తి చేసేందుకు కసరత్తు

6లో

పల్లెకు పట్టణ వసతులు ఇంకెప్పుడు?

14లో

- రూర్బన్ పథకం వచ్చి రెండేళ్లు
- ఇప్పటికీ సర్వేలతోనే కాలక్షేపం
- కేంద్రంలోనూ ఉత్సాహం కరవు

'పాత పింఛను' ఈ ఏడాదే సాధిస్తాం

- మార్చిలో జనజాతర
- అప్పటికీ పరిష్కారం కాకుంటే పెన్‌డౌన్, సమ్మెకైనా వెనకాడబోం
- గజ్వేల్‌లో కదంతొక్కిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు
- అయుత ధర్మ దీక్షకు భారీగా హాజరు

5లో

ఇదీ సంగతి!



ఎప్పటికప్పుడు పేదరికాన్ని అంచనా వేస్తారట. ఇక్కడే కూర్చున్నాడు.




చెన్నైలోని పుజల్ కేంద్ర కారాగారంలో ఆర్బీఐ సరఫరా చేసిన రద్దు చేసిన రూ.1000, రూ.500ల నోట్లను తరుముగా చేసి ఖైదీలతో కాగితపు అట్టలు చేయిస్తున్నారు. ఖైదీలు తయారు చేసిన కాగితపు అట్టను చూపిస్తున్న పోలీసు



ఆదివారం నాగ్‌పుర్‌లో యోగాభ్యాసి మండల్ స్వామి 125వ జయంతి సందర్భంగా నిర్వహించిన పోటీల్లో యోగా చేస్తున్న విద్యార్థులు


పాలరాతి గుట్టలపై పర్యాటక ప్రాజెక్టు

(మొదటి పేజీ తరువాయి)

పర్యాటక శాఖతో కలిసి తెలంగాణ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ దీనికి శ్రీకారం చుడుతోంది. నల్గొండ జిల్లా దేవరకొండ డివిజన్ చందంపేట మండలంలోని నేరేడుగొమ్ము, వైజాగ్‌కాలనీ, చిన్న మునిగల్ పరిధి నల్లమల అటవీ ప్రాంతంలో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నారు. ఈ మేరకు నేరేడుగొమ్ము ప్రాంతంలోని కొండల మధ్య 15 ఎకరాల భూమిని రెవెన్యూ శాఖ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్‌కు అప్పగించింది. నెలాఖరు నాటికి ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడనున్నాయని. ఆ తర్వాత టెండర్ల ప్రక్రియను ప్రారంభిస్తామని సంబంధిత అధికారులు వెల్లడించారు.

పర్యాటక క్లస్టర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టులో బోటింగ్‌తో పాటుగా నల్లమల అటవీ అందాలు, జలాశయం మధ్యలో ఉన్న ఏళేశ్వరం మల్లన్నగుట్ట, నాగార్జునకొండ, దేవరశర్ల గుట్ట పైభాగంలో అతి పురాతన శివాలయం, అబ్బురపరిచే గాజుబేడం గుహలను కలుపుతూ ఒక పర్యాటక క్లస్టరుగా ఏర్పాటు చేయాలనే ఆలోచనతో అధికారులు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారు చేశారు. రూ.5 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు ఏర్పాటుకు డీపీఆర్ రూపొందించామనిఏకోటూరిజం ప్రాజెక్టు డివిజనల్ మేనేజర్ శిరీష తెలిపారు. ఈ ప్రాజెక్టుతో గిరిజనుల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ బండా నరేందర్‌రెడ్డి తెలిపారు.

ఆర్ఎస్ఎస్ సంఘ్ చాలక్‌గా బూర్ల దక్షిణామూర్తి



ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) మానవీయ ప్రాంత సంఘ్ చాలక్‌గా బూర్ల దక్షిణామూర్తిని శనివారం ఎన్నుకున్నారు. ఇకపై తెలంగాణలో జరిగే ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలు ఆయన ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఆయన కరీంనగర్‌లో నివసిస్తున్నారు.

మద్యం మత్తులో ప్రమాదం

ఈనాడు- హైదరాబాద్, జూబ్లీహిల్స్- న్యూస్‌టుడే: హైదరాబాద్ నగర రహదారులపై మద్యం మరోసారి నెత్తురును చిందించింది. ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు యువతులను మద్యం మత్తులో ఉన్న ఓవ్యక్తి తన కారుతో వెనుక నుంచి వేగంగా ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఓ యువతి మరణించగా, మిగిలిన ఇద్దరు తీవ్రగాయాల పాలయ్యారు. శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఈప్రమాదం వివరాలు.. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం ప్రాంతానికి చెందిన మస్తానీ(35) శ్రీనగర్‌కాలనీలోని గణపతి కాంప్లెక్స్ సమీపంలో నివసిస్తూ బ్యూటీషియన్ కోర్సు చేస్తున్నారు. విశాఖకు చెందిన అనూషరెడ్డి అలియాస్ ప్రియారెడ్డి అలియాస్ వెంకటలక్ష్మి(30) ఆర్నెల్లుగా మస్తానీతో కలిసి ఉంటున్నారు. వీరిద్దరూ జూనియర్ ఆర్టిస్టులుగా పనిచేసినట్లు తెలుస్తోంది. రాజమండ్రికి చెందిన అనూష(19) రెండురోజుల కిందట కూకట్‌పల్లిలోని తన స్నేహితురాలు నిహారిక ఇంటికి వచ్చారు. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత మస్తానీ, అనూషరెడ్డిలు ద్విచక్రవాహనంపై కూకట్‌పల్లికి వెళ్లారు. అనూషరెడ్డి వాహనం నడుపుతుండగా మస్తానీ మధ్యలో కూర్చొంది. వెనుక అనూషను ఎక్కించుకొని ముగ్గురూ మాదాపూర్ మీదుగా వెంకటగిరి నుంచి శ్రీనగర్‌కాలనీ వెళ్తుండగా ప్రమాదం జరిగింది.





పరిస్థితి విషమంగా ఉన్న అనూషరెడ్డి(పాత చిత్రం) ★ యువతులను ఢీకొన్న కారు (అంతర్‌చిత్రంలో) ప్రమాదకారకుడు విష్ణువర్ధన్ ★ ప్రమాదంలో దెబ్బతిన్న యువతుల ద్విచక్రవాహనం

విందులో మందు కొట్టి

పంజాగుట్టలో నివసించే పాల విష్ణువర్ధన్ శనివారం రాత్రి మాదాపూర్‌లోని తన స్నేహితుడి ఇంటికి విందుకు వెళ్లాడు. అనంతరం తనకారులో బయలుదేరాడు. అర్ధరాత్రి దాటాక 1.15 నిమిషాలకు జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 10లోని డైమండ్ హౌజ్ ప్రాంతంలో విష్ణువర్ధన్ కారు యువతుల ద్విచక్రవాహనాన్ని వెనుకనుంచి ఢీకొట్టింది. ముగ్గురు యువతులు చెల్లాచెదురుగా రహదారిపై పడిపోయారు. భయాందోళనకు గురైన విష్ణువర్ధన్ కారు వేగాన్ని పెంచి పోనిచ్చాడు. సదరన్ స్పైస్ మూలమలుపు వద్ద రహదారి మధ్య విభాగినిని కారు బలంగా ఢీకొట్టి ఆగిపోయింది. కారులోని రెండు బెలూన్‌లు తెరుచుకున్నాయి. పోలీసులు విష్ణువర్ధన్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని శ్వాస విశ్లేషణ పరీక్షలు నిర్వహించారు. అతడి రక్తనమూనాల్లో మద్యం శాతం 206 బీఏసీ(బ్లడ్ ఆల్కహాల్ కంటెంట్)గా ఉన్నట్లు తేలింది.

ఒక కారు ఢీకొని.. మరో కారు మధ్య నలిగి

ముగ్గురు క్షతగాత్రులను 108 వాహనంలో జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటికే మస్తానీ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అనూషరెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతున్నారు. అనూష ఆరోగ్యపరిస్థితి స్థిమితంగానే ఉంది. కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన సమయంలో పక్కనున్న మరో కారుకు మధ్యలో వీరివాహనం నలగడంతో ప్రమాద తీవ్రత పెరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సీసీ ఫుటేజీలను సేకరిస్తున్నారు. క్షతగాత్రులైన ఇద్దరి మహిళల చరవాణుల్లో అభ్యంతరకర వీడియోలు, కొందరు యువతుల ఫొటోలు ఉన్నట్లు పోలీసులు గుర్తించి, వాటిని విశ్లేషిస్తున్నారు. ద్విచక్రవాహనానికి శిరస్త్రాణం ఉన్నప్పటికీ అది ధరించారా లేదా తెలియరాలేదు. మస్తానీ, అనూషరెడ్డిలు అర్ధరాత్రి వెళ్లి అనూషను తీసుకొని రావాల్సిన అవసరం ఏమిటనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ప్రమాదఘటనపై ఐపీసీ సెక్షన్ 304 పార్ట్ 2, 337, 185 ఎంవీచట్టం కింద కేసు నమోదు చేసినట్లు జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్ తెలిపారు. మస్తానీ మృతదేహాన్ని ఆమె భర్త, తాడేపల్లిగూడేనికి చెందిన సురేష్‌కుమార్‌కు, తల్లి మదనమ్మకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్ మృతి

దిల్లీ: వాయవ్య దిల్లీలో హరియాణా సరిహద్దుల్లో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో అంతర్జాతీయ స్థాయి పవర్ లిఫ్టర్ సక్షమ్ యాదవ్ సహా ఐదుగురు మరణించారు. మరో వ్యక్తి గాయపడ్డాడు. వీరు ప్రయాణిస్తున్న కారు.. అదుపుతప్పి, తొలుత డివైడర్‌ను, ఆ తర్వాత ఒక స్తంభాన్ని ఢీ కొట్టింది. ఆ తర్వాత అనేకసార్లు అది పల్టీలు కొట్టింది. కారులో ఉన్న తికాం చంద్ (27), సౌరబ్ (18), యోగేశ్ (24), హరీశ్ రాయ్ (20)లు అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన సక్షమ్ యాదవ్ (28)ని ఎయిమ్స్‌లో చేర్చారు. సాయంత్రం 6.38 గంటల సమయంలో అతడికి గుండెపోటు రావడంతో కన్నుమూశాడని వైద్యులు తెలిపారు. గత ఏడాది మాస్కోలో జరిగిన పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో అతడు స్వర్ణ పతకం గెల్చుకున్నాడు.

ఈ ప్రమాదంలో గాయపడిన రోహిత్ పుట్టినరోజు కావడంతో స్నేహితులంతా వేడుక చేసుకోవడానికి వచ్చారు. వాహనంలో మద్యం సీసాలు లభించడంతో.. తాగి, వాహనం నడిపడం వల్ల ప్రమాదం జరిగిందా అన్నది పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పొగమంచు వల్ల రోడ్డు సరిగా కనిపించపోవడం వల్ల కూడా ఈ దుర్ఘటన జరిగి ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

పత్తిముంచిన సీసీఐ

(మొదటి పేజీ తరువాయి)

కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణ మార్కెట్లకు అమ్మకానికి మరో 3.87 లక్షల క్వింటాళ్లు వచ్చింది. ఈ ఏడాది రాష్ట్రంలో పత్తి 47 లక్షల ఎకరాల్లో సాగైందని.. 3 కోట్ల క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుందని తొలుత మార్కెటింగ్ శాఖ భావించింది. కానీ వర్షాలు, గులాబీ పురుగు నష్టాల వల్ల అందులో సగం క్వింటాళ్లు కూడా వచ్చే అవకాశాలు లేవని తాజా అంచనా. ఈ నెల 5న కామారెడ్డి జిల్లాలో క్వింటా పత్తిని వ్యాపారులే రూ.5200కు కొన్నారు. వ్యాపారులతో పోటీ పడి వాణిజ్య ధరకు సీసీఐ కొనాలంటే దాదాపు ఇంతే మొత్తం ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతీరోజు ఉదయం ముంబయిలోని సీసీఐ కార్యాలయం నుంచి ఎంత ధరకు తెలంగాణలో పత్తిని కొనాలన్న దానిపై రాష్ట్ర అధికారులకు సమాచారం వస్తుంది. దాని ప్రకారం మార్కెట్లకు వెళ్లి కొంటారు. ఈ నెల 5న సిద్దిపేట జిల్లా గజ్వేల్ మార్కెట్‌లో క్వింటాను రూ. 4800 చొప్పున వాణిజ్య ధర చెల్లించి సీసీఐ కొన్నది. ఇది మద్దతు ధరకన్నా రూ.480 అధికం. ఇలాగే వ్యాపారులు మొత్తం 73 లక్షల క్వింటాళ్లను మద్దతు ధరకన్నా కనీసం రూ.500కు అదనంగా అమ్ముకున్నా రూ. 365 కోట్ల వరకు వారికి లాభం రానుంది. సీసీఐ.. వ్యాపారుల నుంచి కొనకుండా రైతులకే ప్రాధాన్యమివ్వాలని రైతు సంఘాలు డిమాండు చేస్తున్నాయి.



ఆరోగ్య క్షయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకారం కొత్త వ్యాధిగ్రస్థుల్లో కేవలం 43,895(56 శాతం) మందే చికిత్స పొందుతున్నట్లు అధికారికంగా నమోదైంది. దీనిబట్టి దాదాపు 34,800 కేసులు గుర్తింపునకు నోచుకోలేదని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అంచనాకు వచ్చింది. రాష్ట్రంలో ప్రైవేటు వైద్యరంగంలో 437 ప్రయోగశాలలు, 1,613 ఆసుపత్రులు, 1376 ఒకే వైద్యుడు పరీక్షించే క్లినిక్‌లు.. మొత్తంగా 3,426 కేంద్రాలు ప్రభుత్వ ఆన్‌లైన్ విధాన నమోదు ప్రక్రియలో గుర్తింపు పొందగా.. ఇవేవీ కొత్తగా నమోదవుతున్న కేసులను ఆన్‌లైన్‌లో పొందుపర్చడం లేదనీ అభిప్రాయపడింది. క్షయ నియంత్రణపై సత్వరమే చర్యలు చేపట్టడంతోపాటు.. కొత్త కేసులను గుర్తించే లక్ష్యసాధనను అధిగమించాలంటూ తాజాగా ఆదేశాలు జారీచేసింది. తెలంగాణ సహా దేశ వ్యాప్తంగా ఈ వ్యాధి తీవ్రత, నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ తాజాగా రాష్ట్రానికి లేఖ రాసింది.

కేంద్రం సూచించిన సత్వర చర్యలివి..

- జాతీయ క్షయ నివారణ సంస్థకు సంబంధించి రాష్ట్రస్థాయిలో 24 ఉద్యోగాలకు గాను కేవలం 7(29శాతం) మాత్రమే భర్తీ కాగా, జిల్లా స్థాయిలో 657కు గానూ 222(34శాతం) ఖాళీలున్నాయి. వీటిని సత్వరమే భర్తీ చేయాలి.
- బాధితుల్లో కొందరు పూర్తిస్థాయిలో ఔషధాలు వాడకుండా మధ్యలోనే మానేస్తుండగా.. కొంతకాలానికి వ్యాధి తిరగబెడుతోంది. అలా జరగకుండా చూడాలి.
- తెలంగాణలో కొత్తగా మహమ్మారి బారినపడుతున్న వారికి మరింత సామర్థ్యమున్న మందులు ఇవ్వాలి. గిరిజన ప్రాంతాల్లోని బాధితులకు ఔషధాలతోపాటు.. ఆర్థిక సాయమూ అందించాలి.

పారితోషకం ఇలా

- చికిత్స పొందుతున్నన్ని రోజులూ గిరిజన రోగులకు నెలకు రూ.750 వరకూ వారి బ్యాంకు ఖాతాలో జమచేస్తారు.
- ఓ కొత్త రోగి ఔషధాలు క్రమం తప్పకుండా తీసుకునేలా ప్రోత్సహించే ఆరోగ్య సిబ్బందికి రూ. 1000, ఇప్పటికే గుర్తించిన రోగి మందులు ఉపయోగించేలా చూస్తే రూ.1500, క్షయ తిరగబడిన రోగి ఔషధాలు వాడే బాధ్యత తీసుకుంటే రూ.5 వేల చొప్పున ఒకే దఫాగా అందిస్తారు.
- క్షయ రోగిని గుర్తించిన ప్రైవేటు ఆసుపత్రికి రూ. 100, అతనికి చికిత్స అందిస్తే రూ.500 ఇస్తారు.

ఏమైపోతుందీ..బంధం!

(మొదటి పేజీ తరువాయి)

కారణమా? ఇష్టంలేని పెళ్లిళ్లే కారణమా? మరింకేంటి?

వివాహేతర సంబంధాలతో కుటుంబాలు వీధిన పడుతున్నాయి. మూడో కంటికి తెలియకుండా కొనసాగుతున్న ఈ అక్రమ సంబంధాలు బయటపడటం, ఘర్షణలకు దారితీయడం ప్రతి చోటా జరుగుతూనే ఉంది. కొన్ని చోట్ల భర్తలు భార్యలను కొట్టడం వంటి సంఘటనలూ తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఇప్పుడీ ఘర్షణలు హత్యలకూ దారి తీస్తున్నాయి. వివాహేతర సంబంధాలకు పాల్పడే భర్త, భార్యలను అడ్డుకోలేక.. సతమతమయ్యే భాగస్వాములూ ఎందరో ఉన్నారు. మరికొందరు వివాహేతర సంబంధాలను అడ్డుకోవాలన్న ఉద్దేశంతో కోపోద్రిక్తులై తమను తాము మరచిపోతున్నారు. కటకటాలను లెక్కబెడుతున్నారు. మరికొందరు వావి వరసలను మరచిపోయి మరీ వ్యవహరిస్తున్నారు. కర్నూలు జిల్లాలో చిన్న మద్దిలేటి అనే వ్యక్తికి అక్క కుమార్తెతో వివాహమైంది. అతడితో కాపురం చేయడం ఇష్టంలేని ఆమె ట్రాక్టరు డ్రైవరుతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఆమె ప్రియుడు, అతడి స్నేహితులు మద్దిలేటితో స్నేహం చేసినట్లు నటించి ప్రణాళిక ప్రకారం అతడిని చంపేశారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆ ఇద్దరు పిల్లలూ అనాథలయ్యారు. కృష్ణా జిల్లాకు చెందిన ఓ యువతి వివాహానంతరం అమెరికాకు భర్తతో కలిసి వెళ్లింది. కానీ.. అంతకు ముందు నుంచే మరో అబ్బాయితో శారీరక సంబంధాలున్నాయి. ఆలస్యంగా గుర్తించిన భర్త ఆమెను అమెరికా నుంచి పంపించాడు. దీనిపై పెద్ద రాద్ధాంతం జరుగుతోంది.

కారణాలివీ..!

- మానవ విలువలు, సాంఘిక, సమాజ కట్టుబాట్ల కంటే శారీరక సుఖాలకు ప్రాధాన్యం ఇవ్వడం.
- సీరియళ్లు, సినిమాల ప్రభావం.
- విహారాలు, డబ్బు, ఖరీదైన వస్తువులపట్ల మోజు, విలువైన బహుమతులు, అధికారం, పదవి, ఉద్యోగ పదోన్నతి, ఇతర ప్రయోజనాల కోసం ఆకర్షితులు కావడం.
- మారుతున్న జీవన శైలిలో భాగంగా అనివార్యమైన చిన్న కుటుంబాల్లో పర్యవేక్షణ తగ్గడం, స్వేచ్ఛ పెరగడం, సాంఘిక మాధ్యమాలు, సెల్‌ఫోన్ల వాడకం పెరిగిపోతుండటం.
- బలవంతపు పెళ్ళిళ్లు
- విస్తృతంగా అశ్లీల సాహిత్యం, బూతు వీడియోలు కోర్కెలను రెచ్చగొట్టేలా ఉంటుండటం
- దాంపత్య జీవితంలో విభిన్న రుచులు, విశృంఖల లైంగిక వాంఛల కోసం.

వైద్య సంబంధ కారణాలు

- పురుషుల్లో స్తంభన సమస్యలు. స్త్రీలలో జననావయాల వద్ద అనారోగ్య సమస్యలు
- కలయిక సమయంలో నొప్పి, భయం, బిగుసుకుపోవడం, అభ్యంతరం చెబుతుండటం, ఆసక్తి లేకపోవడం.
- మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక సమస్యలు లైంగిక క్రియలో అవరోధాన్ని కలిగిస్తుండటం.
- జీవనశైలి మార్పులతో ఏర్పడిన ఒత్తిడి, ఆత్రుత, కుంగుబాటు వంటివి పడకగది పనితనంపై ప్రభావాన్ని చూపుతుండటం.
- స్వలింగ సంపర్కం అలవాటుతో భాగస్వామికి దూరం కావడం.
- ఆహారం, కాలుష్యం, అనారోగ్యంవల్ల పురుషుల్లో లైంగిక ఆసక్తి, సామర్థ్యం సన్నగిల్లడం.

ప్రముఖుల్లోనూ ఈ ధోరణి..

కొంతమంది ఈ తరహా సంబంధాలను హోదాగానూ భావిస్తున్నారు. ఆయా రంగాల్లో ప్రముఖులూ ఇలా చేస్తున్నట్లు బహిర్గతం అవుతుండటంతో తప్పేమీ లేదన్న ఉద్దేశంతో కొందరు ఇదే బాటలో నడుస్తున్నారు. బాగా చదువుకున్నవారూ ఈ తరహా సంబంధాల చట్రంలో కూరుకుపోతున్నారు. అప్పటివరకూ ప్రముఖ వ్యక్తులుగా చెలామణి అయిన వారు ఒక్క రోజులోనే అప్రతిష్ఠ పాలవుతున్నారు. రక్షణగా ఉండాల్సిన పలువురు పోలీసుల్లోనూ వివాహేతర సంబంధాల జాఢ్యం ఉంది.

ఎన్నో కారణాలు..

ఒక్కొక్కరికి ఒక్కో కారణం ఉంటోంది. కొంతమంది సీరియస్‌గా తీసుకుని వివాహేతర సంబంధాలను కొనసాగిస్తూ చిక్కుల్లో పడుతున్నారు. ఆర్థిక సంబంధాలూ వివాహేతర సంబంధాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. కొన్నేళ్ల కిందటి వరకూ విడాకుల అంశాన్ని సీరియస్‌గా తీసుకునేవారు. ప్రస్తుతం ఆ ధోరణిలో మార్పు వస్తోంది. తల్లిదండ్రులూ విడాకుల వ్యవహారాన్ని సాధారణ అంశంగా భావించే రోజులొచ్చాయి. వివాహేతర సంబంధాల విషయంలోనూ ఇదే ధోరణి తగదు.

–ప్రొఫెసర్ వి.రాధికారెడ్డి, ప్రముఖ మానసిక వైద్యులు

నష్టాలే ఎక్కువ

ప్రలోభాలకు గురై... దురాశతో.. ఆధునిక జీవనశైలి అనే భ్రమతో?.. అమాయకత్వంతో.. సీరియళ్ల ప్రభావంతో.. కొందరు వివాహేతర సంబంధాల్లో మునిగి తేలుతున్నారు. వివాహేతర సంబంధంతో వచ్చే సుఃఖంకన్నా బయటపడితే వచ్చే నష్టం వెయ్యి రెట్లు ఎక్కువని ఆలోచించగలిగితే మనస్సు నియంత్రణలో ఉంటుంది.

– డాక్టర్ ఏవీ రాజశేఖర్, ఉపాధ్యక్షుడు, కౌన్సెలింగ్ సైకాలజిస్టుల సంఘం

పెద్ద ప్రధాన సంఖ్యను కనిపెట్టిన అమెరికన్

(మొదటి పేజీ తరువాయి)

పూర్వం.. ఫ్రెంచ్ మేధావి మారిన్ మెర్సెన్ అధ్యయనం చేశారు. కొత్త మెర్సెన్ ప్రధానసంఖ్యలను గుర్తించేందుకు గింప్స్ అనే స్వచ్ఛంద ప్రాజెక్టు నడుస్తోంది. గింప్స్ అందించే ఉచిత సాఫ్ట్‌వేర్‌ను వాడుతూ వేలాదిమంది ప్రధానసంఖ్యలను గుర్తించేందుకు ప్రయత్నిస్తుంటారు. విజయవంతమైనవారికి నగదు బహుమతులుంటాయి. తాజా ప్రధానసంఖ్యను గుర్తించేందుకు.. ఏకబిగిన ఆరు రోజులపాటు కంప్యూటర్ గణనలు చేసింది. పేస్ కృషికి రూ.1.98లక్షలు బహుమతిగా లభించబోతుంది. వంద కోట్ల అంకెలున్న ప్రధానసంఖ్యను కనిపెట్టేవారికి రూ.94లక్షలు గింప్స్ అందిస్తుంది.

గ్రహం అనుగ్రహం

8–1–2018 సోమవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
హేమంత రుతువు; పుష్య మాసం; బహుళ పక్షం
సప్తమి: రా. 9-05 తదుపరి అష్టమి
ఉత్తర నక్షత్రం: ఉ. 6-42 తదుపరి హస్త
అమృత ఘడియలు: రా. 12-43 నుంచి 2-19 వరకు
వర్జ్యం: మ. 3-06 నుంచి 4-42 వరకు
దుర్ముహూర్తం: మ. 12-28 నుంచి 1-12 వరకు
తిరిగి మ. 2-40 నుంచి 3-24 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6-36; సూర్యాస్తమయం: సా.5-37

ఏప్రిల్ నుంచి పార్టీపథం

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ శ్రేణుల్లో సందిగ్ధం నెలకొంది.

నియోజకవర్గ ఇన్‌ఛార్జీల నియామకంతో మొదలు: ఇందులో భాగంగా పార్టీ నేతలతో ఇటీవల సమావేశమై కార్యాచరణ ఖరారు చేశారు. దీని ప్రకారం ఈ నెలలోనే తొలుత అన్ని నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జీలను ప్రకటిస్తారు. మార్చిలో శాసనసభ బడ్జెట్ సమావేశాలు ముగిసిన వెంటనే అన్ని శాసనసభ, లోక్‌సభ నియోజకవర్గాల్లో పార్టీ స్థితిగతులపై సూక్ష్మస్థాయి పరిశీలనకు శ్రీకారం చుడతారు. ఆయా నియోజకవర్గాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలతో సమావేశాలు నిర్వహిస్తారు. వీటికి ఆయా నియోజకవర్గాల్లోని పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలను ఆహ్వానిస్తారు. వంద రోజులపాటు కొనసాగే ఈ క్రతువు ద్వారా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు, వచ్చే ఎన్నికల్లో విజయానికి అవసరమైన వ్యూహాలను ఖరారు చేస్తారు.

లోటుపాట్లు సరిదిద్దే దిశగా: పార్టీ రాష్ట్ర కమిటీ పని తీరుపై అధినేత కొంత అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. చాలా మంది ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు వారికి నిర్దేశించిన విధులు సరిగా నిర్వర్తించడం లేదని ఆయన భావిస్తున్నారు. ఎంపీలతో సమన్వయ లోపం కారణంగా స్థానిక ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాలకు వెళ్లడం లేదని, ఇన్‌ఛార్జీలు ఎవరో తేలనందున స్థానిక పార్టీ శ్రేణులు రాష్ట్ర కమిటీ నేతలను పట్టించుకోవడం లేదని అంచనాకు వచ్చారు. ఈ పరిస్థితిని సరిదిద్దాలని సీఎం భావిస్తున్నారు. బూత్‌స్థాయి నుంచి మండల, నియోజకవర్గ కమిటీలను పూర్తిస్థాయిలో నియమించి, 2019లో జరగబోయే ఎన్నికల సన్నద్ధతపై వాటికి దిశానిర్దేశం చేయాలని నిర్ణయించారు.

భూమి కొని కార్యాలయాల నిర్మాణం: పార్టీ శాశ్వత ప్రయోజనాల కోసం అన్ని జిల్లాల్లోనూ తెరాస సొంత కార్యాలయ భవనాలను నిర్మించాలని కేసీఆర్ నిర్ణయించారు. దీనికీ ఏప్రిల్ నుంచే శ్రీకారం చుడతారు. ఇప్పటికే ఖమ్మంలో పార్టీ జిల్లా కార్యాలయ నిర్మాణం జరిగింది. అదే నమూనాలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు అన్ని కార్యాలయాల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయడమో లేదా ఆయా జిల్లాలకు వెళ్లినప్పుడు ఈ క్రతువు చేపట్టడమో చేయాలని భావిస్తున్నారు. పార్టీ భవనాల కోసం సొంతంగా భూమిని కొనుగోలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయానికొచ్చారు.

తెరాసలోకి మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి!

మాజీ ఎమ్మెల్యే, భాజపా నాయకుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేసి తెరాసలో చేరేందుకు యత్నిస్తున్నట్లు తెలిసింది. దీనిపై సోమవారం ఆయన తన నిర్ణయాన్ని వెల్లడించనున్నారు. ప్రతాప్‌రెడ్డి 2004లో తెరాస తరఫున చేర్యాల నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2008 ఉప ఎన్నికలోనూ విజయం సాధించారు. 2009లో ఓడిపోయారు. తర్వాత భాజపాలో చేరారు.

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	9.3	30.0
మెదక్	11.6	31.4
హన్మకొండ	12.0	29.0
రామగుండం	12.4	30.4
హైదరాబాద్	13.5	29.4
కరీంనగర్	14.0	30.5
నిజామాబాద్	16.0	30.0
మహబూబ్‌నగర్	16.0	31.4
ఖమ్మం	17.0	30.0
సూర్యాపేట	20.0	32.5

అమెరికా పౌరసత్వంలో భారతీయం!

- **మెక్సికో తర్వాత అత్యధికంగా పౌరసత్వం పొందింది భారతీయులే**
- **2016లో 46,188 మంది భారతీయులకు అవకాశం**

ఈనాడు - హైదరాబాద్

అమెరికా పౌరసత్వం పొందేందుకు భారతీయులు తీవ్రస్థాయిలో పోటీ పడుతున్నారు. ఈ విషయంలో మెక్సికో అగ్రస్థానంలో నిలబడగా ఆ తర్వాత స్థానం భారత్‌దే కావడం విశేషం. పౌరసత్వం దక్కితే అక్కడ ఓటు హక్కుతోపాటు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందేందుకూ అర్హత లభిస్తుంది. వివిధ దేశీయులు 2016లో 7.53 లక్షల మంది అమెరికా పౌరసత్వం పొందగా అందులో 46,188 మందితో భారత్ ద్వితీయ స్థానంలో ఉన్నట్లు 'అమెరికా వలస గణాంకాల వార్షిక పుస్తకం-2016' వెల్లడించింది. హెచ్1బీ వీసాల గడువు పొడిగింపుపై అంతర్గత భద్రత విభాగం తాజా ప్రతిపాదనల నేపథ్యంలో ఈ గణాంకాలు ఆసక్తి కలిగిస్తున్నాయి.

వృత్తి నిపుణులకు తాత్కాలిక ఉద్యోగం కోసం అమెరికా జారీ చేసే హెచ్1బీ వీసాల్లో 70 శాతం



భారతీయులే దక్కించుకుంటున్నారనేది తెలిసిందే. విద్యార్థిగా వెళ్లి హెచ్1బీ వీసాలు పొందుతున్న వారు, ఇక్కడే ఉద్యోగం చేస్తూ హెచ్1బీ వీసాపై అమెరికా వెళ్లే భారతీయులు ఆ తర్వాత గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేస్తుంటారు. అది పొందితే అక్కడే శాశ్వతంగా ఉద్యోగం చేసుకోవచ్చు. గ్రీన్ కార్డు పొందిన 5 సంవత్సరాల తర్వాత పౌరసత్వానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులవుతారు. అది ఉంటే దాదాపు అమెరికా పౌరులతో సమానంగా భావిస్తారు. ఓటు హక్కు పొందుతారు. ప్రభుత్వం అమెరికా పౌరులకు కల్పించే అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాలు, పన్నుల మినహాయింపు తదితర వాటికి అర్హులవుతారు. కుటుంబ సభ్యులకూ గ్రీన్ కార్డు ప్రయోజనాల్ని అందించడం వంటి ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. ఈ కారణాల వల్లే అమెరికా పౌరసత్వానికి భారతీయులు ఆరాట పడుతూ అత్యధికంగా పౌరసత్వం పొందుతున్నట్లు తెలుస్తోంది. 2016లో 7,53,060 మందికి పౌరసత్వం దక్కగా మెక్సికో 1,03,350 మందితో మొదటి స్థానంలో ఉండగా తర్వాతి స్థానంలో భారత్ ఉంది. 2014 నుంచి 2016కి 8,334 మంది పెరిగారు. 'అమెరికా వచ్చిన వారిలో ఎక్కువ మంది ఆయా రంగాల్లో నైపుణ్యం ఉన్నవారే. వారికి అవకాశాలు విస్తృతంగా ఉంటాయి. అందువల్ల ఒకసారి వచ్చిన వారు ఇక్కడే స్థిరపడాలనుకుంటారు' అని అమెరికాలో ఆన్‌లైన్‌లో తెలుగు పత్రికను నడుపుతున్న అన్నవరపు కుమార్ అభిప్రాయపడ్డారు.

అత్యధికం కాలిఫోర్నియా నుంచే..

అమెరికాలో 2016లో 46,188 మంది భారతీయులు పౌరసత్వం పొందగా అత్యధికంగా కాలిఫోర్నియాలో 10,298 మంది ఉన్నారు. ఆ తర్వాత న్యూజెర్సీలో 5,312 మంది, టెక్సాస్‌లో 4,670, న్యూయార్కులో 2,954 మంది పౌరసత్వం పొందిన వారున్నారు.

మూడేళ్లలో వివిధ దేశాల్లో పౌరసత్వం పొందిన భారతీయుల సంఖ్య

దేశం	2014	2015	2016
అమెరికా	37,854	42,213	46,188
యూకే	37,693	27,771	28,720
జర్మనీ	1447	1375	1569
ఐర్లాండ్	2636	1929	1294
ఇటలీ	4305	5698	8876
మలేసియా	354	269	230
కెన్యా	306	236	496
నెదర్లాండ్	885	843	616
న్యూజిలాండ్	2522	2515	3287
పోర్చుగల్	574	430	699
సింగపూర్	2205	2167	2236
దక్షిణాఫ్రికా	875	347	414
యూఏఈ	387	503	495

(గమనిక: 2014లో 1,24,971 మంది, 2015లో 1,18,816, 2016లో 1,15,869 మంది భారతీయులు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల పౌరసత్వం పొందారు. 2017లో 84 దేశాల్లో 92,463 మందికి పౌరసత్వం దక్కింది.)

భూ దస్త్రాల ఆన్‌లైన్‌పైనే చూపంతా!

- **ఎల్ఆర్‌యూపీ-మా భూమి వెబ్‌సైట్ రెండింటిలో ఏది**
- **ఎదురుచూస్తున్న రైతులు**

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో భూ దస్త్రాల ప్రక్షాళన పూర్తికావడంతో అందరి దృష్టి 'మా భూమి వెబ్‌సైట్' పై పడింది. క్షేత్రస్థాయిలో సవరించిన మార్పులకు అనుగుణంగా భూ పత్రాలు పొందాలంటే ఆ మార్పులన్నీ ఈ వెబ్‌సైట్‌లో నిక్షిప్తం కావాల్సిఉంది. దీనికి అనుసంధానమై ఉన్న మీసేవ ద్వారా ప్రస్తుతం రైతులు వారికి కావాల్సిన భూముల పత్రాలు పొందుతున్నారు. అయితే కొత్తగా ఎల్ఆర్‌యూపీ పేరుతో సవరించిన దస్త్రాలను ఎలా పొందాలనే ఆతృత రైతుల్లో కనిపిస్తోంది. ఎల్ఆర్‌యూపీ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసిన సమాచారం అంతా మా భూమి వెబ్‌సైట్‌తో అనుసంధానం చేయాల్సి ఉంది. లేదా పూర్తిగా ఎల్ఆర్‌యూపీనే కొనసాగించాల్సిన పరిస్థితి. మరోవైపు అన్ని జిల్లాల్లో పునఃపరిశీలన చేస్తున్నారు. ఎక్కడైనా ఏవైనా సవరణలు మిగిలిపోయాయా, తప్పులు ఏమైనా దొర్లాయా అన్న కోణంలో ప్రత్యేక నమూనాతో సీనియర్ అధికారులు మండలాల్లో ప్రక్షాళన పూర్తయిన దస్త్రాలను తిరిగేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి నివేదిక కూడా ప్రభుత్వానికి చేరాల్సి ఉంది.

పట్టాపాసుపుస్తకాలపై చర్చ: దస్త్రాల ప్రక్షాళన అనంతరం భూమి హక్కుపత్రం(టైటిల్ డీడ్), పట్టాపాసుపుస్తకాలను కలిపి ఒకే కార్డులా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం విధితమే. 18 అంశాలతో, పూర్తి భద్రతా ప్రమాణాలతో ఎలక్ట్రానిక్ కార్డును తయారుచేసి ఇవ్వాలని నిర్ణయించారు. ప్రక్షాళన పూర్తివివరాలు ప్రభుత్వానికి చేరాయి. మరోవైపు కార్డుల ముద్రణ, ఎల్ఆర్‌యూపీ సాఫ్ట్‌వేర్ నుంచి సమాచారాన్ని ఆన్‌లైన్‌లోకి చేర్చి నిత్యం నిర్వహణ చేపట్టే ప్రక్రియలపై ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ప్రక్షాళన సమగ్ర సమాచారాన్ని వెంటనే ఆన్‌లైన్‌లో చేర్చకపోతే ఈ మధ్యకాలంలో క్రయ విక్రయాలు చోటుచేసుకోవడం, భూ యాజమాన్య హక్కులు మారడం లాంటివి జరిగితే కొన్ని పత్రాలను తిరిగి మార్చాల్సిన పరిస్థితి వస్తుందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల బాంబుపేలుళ్లు: నలుగురికి గాయాలు

రాయ్‌పుర్: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపుర్‌లో మూడు వేర్వేరు చోట్ల మావోయిస్టులు పెట్టిన బాంబులు పేలి.. నలుగురు క్షతగాత్రులయ్యారు. పుస్నర్ గ్రామానికి సమీపంలో జరిగిన పేలుడులో ఇద్దరు మహిళలు.. బుర్జి గ్రామంలో మరో బాంబు పేలి జిల్లా రిజర్వు దళం(డీఆర్‌జీ) కానిస్టేబుల్ గాయపడ్డారు. మెరుగైన చికిత్స కోసం వీరిని రాయ్‌పుర్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. బిరియా భూమి గ్రామంలో జరిగిన పేలుడులో డీఆర్‌జీ జవానుకు స్వల్పగాయాలైనట్లు పేర్కొన్నారు.

ఇతర రాష్ట్రాల మార్కెట్లపై అధ్యయనం

- **అధికారులకు మంత్రి హరీశ్‌రావు ఆదేశం**
- **13కల్లా నివేదిక ఇవ్వాలని సూచన**

ఈనాడు - హైదరాబాద్

ఇతర రాష్ట్రాల్లోని వ్యవసాయ మార్కెట్ల పనితీరుపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని మార్కెటింగ్ శాఖ అధికారులను మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. ఆదివారం మార్కెటింగ్ సంచాలకుల కార్యాలయంలో ఆయన వ్యవసాయ మార్కెట్లపై సమీక్ష జరిపారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్, హరియాణా తదితర రాష్ట్రాల్లో పంటలకు మద్దతు ధర ఎలా ఇస్తున్నారనే దానిపై పరిశీలించి ఈ నెల 13కల్లా నివేదిక ఇవ్వాలని సూచించారు. ఈ నివేదిక ఆధారంగా తెలంగాణలో కొత్త విధానాలను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. అన్ని జిన్నింగ్, రైస్, నూనె మిల్లుల వివరాలు, వాటి సామర్థ్యం, వాటి పరిధిలో సాగవుతున్న పంటల వివరాలను కూడా ఇవ్వాలని కోరారు. మన కూరగాయలు పేరుతో ప్రారంభించిన విక్రయ కేంద్రాలను మెట్రో స్టేషన్లలోనూ ప్రారంభించాలని సూచించారు. ఈ కేంద్రాల్లో సేంద్రియ బియ్యం, కూరగాయలను సైతం విక్రయించాలన్నారు. నాబార్డు రుణంతో చేపట్టిన 330 గోదాముల్లో మిగిలిన 18 నిర్మాణాలను మార్చి ఆఖరులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. సూర్యాపేట, చివ్వెంల వంటి ప్రాంతాల్లో వివాదాల వల్ల నిర్మాణాలు ఆగినందున వెంటనే వాటిని పరిష్కరించాలని మంత్రి జగదీష్‌రెడ్డితో ఫోన్‌లో హరీశ్‌రావు మాట్లాడారు. నిర్మాణాలు పూర్తయినవాటిని వెంటనే మార్కెట్ కమిటీలకు అప్పగించాలన్నారు. కేంద్రం కొత్తగా తెస్తున్న 'మోడల్ మార్కెటింగ్ చట్టం' ప్రకారం కొత్తగా అనుమతుల జారీలో జాగ్రత్తలు తీసుకోవాలని, వీటిపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. వచ్చే మార్చి ఆఖరులోగా అన్ని పశువుల మార్కెట్లను తనిఖీ చేసి రుసుం వసూలు పెరిగేలా చూడాలన్నారు. ఖాళీ పోస్టుల భర్తీకి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో కోటి ఎకరాల వరకు సాగులోకి వచ్చే అవకాశం ఉన్నందున మార్కెట్లలో కొత్త పోస్టులను భర్తీ చేయడానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. మార్కెటింగ్ సంచాలకురాలు లక్ష్మీబాయి, ప్రత్యేకాధికారి జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్లపై సమీక్ష జరుపుతున్న మంత్రి హరీశ్‌రావు

బాలికల చదువు కోసం 'పరుగు'

- **ప్రారంభించిన కేంద్ర మంత్రి మహేశ్‌శర్మ**

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: ఆడపిల్లల చదవుకు చేయూతను అందించేందుకు సేవాభారతి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం గచ్చిబౌలి స్టేడియం వద్ద 'రన్ ఫర్ గర్ల్ చైల్డ్' పేరిట పరుగు చేపట్టారు. ఇందులో ఉద్యోగులు, విద్యార్థులు ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. వేర్వేరు విభాగాల్లో నిర్వహించిన ఈ పరుగును కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి మహేశ్‌శర్మ ప్రారంభించారు. విజేతలకు రాష్ట్ర మంత్రి ఈటల రాజేందర్ పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మహేశ్‌శర్మ మాట్లాడుతూ.. దేశ జనాభాలో 50 శాతం ఉన్న మహిళల సాధికారతకు ప్రతిఒక్కరూ తమ వంతు ప్రయత్నం చేయాలన్నారు. ఈ పరుగు ద్వారా సేకరించిన విరాళాలను సేవాభారతి నిర్వహిస్తున్న కిషోర్ వికాస్ కేంద్రాల విస్తరణకు వెచ్చించనున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి రఘునాథ్ తెలిపారు. ప్రస్తుతం నగరంలో 100 కిషోర్ వికాస్ కేంద్రాలు ఉన్నాయని, ఈ కేంద్రాల్లో పేద బాలికలకు విద్యతోపాటు వ్యక్తిగత శుభ్రత, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. త్వరలోనే తెలంగాణలో మరో 400 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



'రన్ ఫర్ ఏ గర్ల్ చైల్డ్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి మహేశ్‌శర్మ

వ్యాధికే కాదు.. రోగికీ చికిత్స అందించాలి

కేంద్ర వైద్యమంత్రి జేపీ నడ్డా వ్యాఖ్య

రాయ్‌పుర్: వ్యాధిని నయంచేయడంపైనే కాకుండా.. రోగులకు చికిత్స అందించడంపైనా వైద్యులు దృష్టిసారించాలని కేంద్ర వైద్యమంత్రి జేపీ నడ్డా పిలుపునిచ్చారు. గతేడాది ప్రకటించిన జాతీయ వైద్యవిధానం.. నివారక, ప్రోత్సాహక సమగ్ర వైద్యసేవలను అందించాలని ప్రతిపాదించిందని ఆయన తెలిపారు. పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ మెమోరియల్ హెల్త్‌సైన్సెస్ అండ్ ఆయుష్ యూనివర్సిటీ ఆఫ్ ఛత్తీస్‌గఢ్ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన.. ఈ మేరకు ప్రసంగించారు. వ్యాధులతోపాటు రోగులు సమస్యలనూ ఎదుర్కొంటున్నారన్న విషయాన్ని అర్థం చేసుకోవాలని వైద్యులకు సూచించారు. రోగాన్ని నయంచేయాలనే ధ్యాసలో పడి.. రోగికి చికిత్స అందించాలన్న విషయాన్ని వైద్యులు మరిచిపోతారని అన్నారు. కొత్తగా ఏర్పాటుచేసిన వైద్యకళాశాలలో ఒక్కో విద్యార్థిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి దాదాపు రూ.3 కోట్లు వరకు ఖర్చుపెడుతున్నాయని.. తాము పొందుతున్న ఈ ప్రయోజనాన్ని సమాజానికి తిరిగి ఎలా చెల్లించుకోవాలన్న దానిపై ప్రతి విద్యార్థీ తీర్మానం చేసుకోవాలని అన్నారు.

మూడో పెళ్లి ఇంకా చేసుకోలేదు: ఇమ్రాన్ ఖాన్

ఇస్లామాబాద్: రహస్యంగా మూడోపెళ్లి చేసుకున్నారన్న వార్తలను పాకిస్థాన్ ప్రతిపక్ష తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్(పీటీఐ) పార్టీ అధినేత, మాజీ క్రికెటర్ ఇమ్రాన్ ఖాన్ ఖండించారు. మత కార్యక్రమాల్లో చురుగ్గాపాల్గొనే 44ఏళ్ల బుష్రా మేనక అనే మహిళకు తాను పెళ్లి ప్రతిపాదన చేసినట్లు వెల్లడించారు. ఆమె కొంచెం సమయం కోరారని, అంగీకారం లభిస్తే పెళ్లి చేసుకుంటానని స్పష్టంచేశారు.

సమస్యల పరిష్కారానికి కష్టపడుతున్నాం

మంత్రులు, ఎమ్మెల్యేలు పల్లెల్లోనే తిరుగుతున్నారు: ఈటల

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: రాష్ట్ర సాధన కోసం కష్టపడ్డామని, ఆ తర్వాత అంతకన్నా ఎక్కువ కష్టపడుతున్నామని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. తెలంగాణ ఉద్యోగుల సంఘం(టీయూఎస్) ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించిన దైనందిని, కాలమానిని ఆవిష్కరణ సభలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యేలు, మంత్రులు అస్తమానం పల్లెల్లో, ప్రజల మధ్యలో ఉంటూ.. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కష్టపడుతున్నారే తప్పా.. ఎవరూ సుఖపడటం లేదన్నారు. ఇటీవల కేంద్ర మంత్రి జైట్లీ కూడా ఉద్యమాలు చేసిన పార్టీలు అధికారంలోకి వస్తే.. వైఫల్యాలు చెందాయేగానీ ప్రజల ప్రేమను పొందలేకపోయాయని అన్నారని.. కానీ తెరాస ఉద్యమాలు, పాలనలోనూ విజయం సాధించిన పార్టీ అని కొనియాడారని పేర్కొన్నారు. కమల్‌నాథన్ నివేదికలోని సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని.. ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయో తెలిస్తేగానీ ఉద్యోగ భర్తీ చేయలేమని తెలిపారు. మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. సాధించుకున్న రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా నిర్మించుకుందామన్నారు. ఎంపీ దత్తాత్రేయ మాట్లాడుతూ.. ఈ ఏడాదిలో సర్వీస్ కమిషన్ తన కోటాను పూర్తి చేసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా స్పందన వస్తుందన్నారు. సంఘం అధ్యక్షుడు పద్మాచారి అధ్యక్షతన జరిగిన సభలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు, టీయూఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు సి.విఠల్, బెవరేజెస్ కార్పొరేషన్ అధ్యక్షుడు జి.దేవీప్రసాద్, టీఎన్జీవోస్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృగవని చుట్టూ 'పర్యావరణ పరిధి' కుదింపు!

- **ముగిసిన ముసాయిదా ప్రకటన కాలవ్యవధి**
- **ప్రతిపాదనలు సవరించి పంపాలని రాష్ట్రాన్ని కోరిన కేంద్ర ప్రభుత్వం**

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ శివారు చిలుకూరులోని 'మృగవని జాతీయవనం'(డీర్ పార్కు) చుట్టూ ఏర్పాటు చేయనున్న 'పర్యావరణపరంగా సున్నితప్రాంతం' (ఎకోసెన్సిటివ్ జోన్) జోన్ పరిధి భారీగా తగ్గనుంది. గతంలో ఇచ్చిన ముసాయిదా ప్రకటనలో జోన్ పరిధిని 5 కి.మీ.గా నిర్ణయించారు. కాగా ఆ ప్రకటన కాలవ్యవధి ముగిసిపోయిందన్న విషయాన్ని తెలుపుతూ.. ప్రతిపాదనల్ని సవరించి పంపించాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ నేపథ్యంలో నూతన ప్రతిపాదనలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. మృగవని జాతీయవనం దాదాపు 850 ఎకరాల్లో విస్తరించి ఉంది. రక్షిత అటవీప్రాంతంగా ఉన్న ఈ పార్కు జీవవైవిధ్యానికి నిలయం. ఇందులో సుమారు ఐదు వందలకుపైగా చుక్కల జింకలు, 50 వరకు సాంబారు దుప్పిలు, రెండొందలకు పైగా నెమళ్లు, ఇతర జంతువులు, పక్షులు ఉన్నట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వ వన్యప్రాణుల సంరక్షణ చట్టం మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ పార్కు చుట్టూ 'పర్యావరణపరంగా సున్నితప్రాంతం'గా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 2012లో ఈ మేరకు రాష్ట్రం నుంచి ప్రతిపాదనలు వెళ్లగా 2015లో కేంద్రం ముసాయిదా ప్రకటనను వెలువరించి అభ్యంతరాల స్వీకరించింది. ముసాయిదా ప్రకటనలో పార్కు చుట్టూ కొన్నివైపుల 5 కి.మీ.లు, కొన్నివైపుల 3 కి.మీ.ల వరకు పర్యావరణ సున్నితప్రాంతంగా ప్రతిపాదించారు. 15 గ్రామాలు ఈ జోన్ పరిధిలో ఉన్నాయి. జోన్ పరిధిని మరింత పెంచనున్నారని.. ఫలితంగా ముప్పై వరకు గ్రామాల అభివృద్ధిపై ప్రభావం పడుతుందన్న ప్రచారం జరిగింది. పర్యావరణ సున్నితప్రాంతం అమల్లోకి వస్తే అభివృద్ధిపై ప్రభావం పడుతుందన్న ఆందోళన సమీపగ్రామాల ప్రజలు, పారిశ్రామికవేత్తలు, స్థిరాస్తి అభివృద్ధి సంస్థల్లో వ్యక్తమైంది. ఇప్పటికే పాత రంగారెడ్డి జిల్లాలో 84 గ్రామాల్లో 111జీఓ కారణంగా అభివృద్ధి జరగడం లేదని.. ఎకోజోన్ కారణంగా హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధికి మరింత నష్టం జరుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం కూడా పర్యావరణ సున్నితప్రాంతం పరిధిని తగ్గించాలని కేంద్రాన్ని కోరుతూ వచ్చింది. ముసాయిదా ప్రకటన విడుదలైన 545 రోజుల్లో తుది ప్రకటన విడుదల కావాలి. కానీ భిన్నాభిప్రాయాల నేపథ్యంలో అది రాలేదు. ఈ క్రమంలోనే పాత ప్రకటన కాలవ్యవధి తీరడంతో.. దీన్నే ప్రస్తావిస్తూ ప్రతిపాదనల్ని సవరించి పంపాలని కేంద్రప్రభుత్వ కార్యదర్శి రాష్ట్ర ప్రభుత్వానికి డిసెంబరు 29న లేఖ రాసినట్లు అటవీశాఖ వర్గాల సమాచారం.

పరిధి సున్నా నుంచి కి.మీ. ఉండే అవకాశం: జోన్ పరిధిపై వ్యక్తమవుతున్న ఆందోళనలకు తాజా పరిణామంతో తాత్కాలికంగా విరామం పడినట్లయ్యింది. కేంద్రం నుంచి లేఖ రావడంతో కొత్త ప్రతిపాదనలకు అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. గతంలో పంపిన ప్రతిపాదనలు 2012నాటి పరిస్థితులవని.. ఇప్పుడు మృగవని జాతీయవనం చుట్టుపక్కల అభివృద్ధి పరంగా చాలా మార్పులు వచ్చాయని, బాహ్యవలయ రహదారి దగ్గరలోనే ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. గతంలో ప్రతిపాదించిన 5 కి.మీ.ల పరిధి గణనీయంగా తగ్గే అవకాశం ఉందని అటవీశాఖ వర్గాలు చెబుతున్నాయి. 'ఎకోజోన్ పరిధి 0-10 కి.మీ.ల వరకు నిర్ణయించవచ్చు. చెన్నైలో 'గిండి' జాతీయ పార్కుకు పర్యావరణ సున్నితప్రాంతం పరిధి 0 కి.మీ. ఉంది' అని అధికారులు గుర్తు చేస్తున్నారు. చిలుకూరు మృగవని జాతీయవనం పర్యావరణ సున్నితప్రాంతం పరిధిని కిలోమీటరుగానీ అంతకంటే తక్కువగాగానీ, అవసరమైతే సున్నాగా ప్రతిపాదించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అయితే ఎంతన్నది ఇప్పుడే చెప్పలేమని, స్పష్టత రావడానికి సమయం పడుతుందని అటవీశాఖ వర్గాల సమాచారం. పర్యావరణ సున్నితప్రాంతం పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో కాలుష్యకారక పరిశ్రమల స్థాపనకు, మైనింగ్‌కు అనుమతి ఉండదు. రహదారులు, ఇళ్లు తదితర నిర్మాణాలకు ప్రత్యేక అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది.



ఆదివారం హైదరాబాద్‌లో విదేశీ మద్యం స్వాధీనం కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితులు



కత్తి తరహా ఆకృతిలో రూపొందించిన సీసాను చూపుతున్న పోలీసు అధికారి

భారీగా విదేశీమద్యం స్వాధీనం

- **రెండు ముఠాలను అరెస్టు చేసిన ఆబ్కారీ శాఖ**
- **కొనుగోలు చేసిన వారిలో పలువురు స్థిరాస్తి వ్యాపారులు!**

ఈనాడు, హైదరాబాద్: రాజధాని నగరంలోని ప్రముఖులకు విదేశీ మద్యం అక్రమంగా సరఫరా చేస్తున్న రెండు ముఠాలను ఆబ్కారీశాఖ అధికారులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.80 లక్షల విలువైన 220 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఆబ్కారీశాఖ ప్రధాన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సంచాలకులు అకున్ సబర్వాల్ ఈ వివరాలను వెల్లడించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ముఖ్యంగా చెన్నై, ముంబయిల నుంచి విదేశీ మద్యాన్ని అక్రమంగా హైదరాబాద్ తీసుకొచ్చి అమ్ముతున్నారని తెలిపారు. చెన్నై, ముంబయి విమానాశ్రయాలతోపాటు చెన్నై నౌకాశ్రయం ద్వారా వీరు విదేశీ మద్యం తీసుకొచ్చి హైదరాబాద్‌లో తమ గోదాముల్లో నిల్వ చేస్తున్నారని.. ఇందుకోసం ప్రైవేటు బస్సులను వాడుకుంటున్నారని చెప్పారు. హైదరాబాద్ చేరిన తర్వాత వీటిని ఖాతాదారులకు సరఫరా చేసే ముఠా మరోటి ఉంటుందని వెల్లడించారు. ఈ వ్యాపారంలో ఆరితేరిన హరీష్‌సింగ్, శివపాటిల్‌లతోపాటు దూల్‌పేటకు చెందిన రాజేష్, నెల్లూరుకు చెందిన బస్సు డ్రైవర్లు కకాని భాస్కర్, గోపీకృష్ణ, గంజి అనిల్‌కుమార్, అరాంఘర్‌కు చెందిన కార్తీక్, చెన్నైకు చెందిన మాలిక్, మార్నింగ్‌స్టార్ ప్రైవేటు బస్సు మేనేజర్ నరేష్‌లను ఆదివారం అరెస్టు చేశారు. వీరి నుంచి మద్యం కొనుగోలు చేస్తున్న మలక్‌పేటకు చెందిన నిరంజన్‌రెడ్డి, పేట్‌బషీరాబాగ్‌కు చెందిన దాసరి మహేష్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు.

నెలకు రూ.6 కోట్ల వ్యాపారం: హైదరాబాద్‌లో సగటున నెలకు రూ.6 కోట్లకుపైగా ఇలా విదేశీమద్యం అక్రమ వ్యాపారం జరుగుతున్నట్లుగా అధికారులు లెక్కగట్టారు. ఆదివారం అరెస్టయిన హరీష్‌సింగే నెలకు రూ.50 లక్షల మద్యం అమ్ముతున్నాడని.. ఇలాంటి ముఠాలు ఆరు ఉన్నాయని సబర్వాల్ వెల్లడించారు. విదేశీమద్యం అక్రమంగా కొనుగోలు చేయడానికి సంబంధించి నగరంలోని స్థిరాస్తి వ్యాపారులకు ఉచ్చు బిగుసుకునేటట్లు కనిపిస్తోంది. ఆదివారం అరెస్టయిన ముఠాలను విచారించినప్పుడు నగరానికి చెందిన పలువురు స్థిరాస్తి వ్యాపారుల పేర్లు చెప్పినట్లు, తరచుగా వారు చేసుకునే పార్టీలకు తామే మద్యం సరఫరా చేస్తామని వివరించినట్లు తెలుస్తోంది. వీరు ఎవరెవరికి మద్యం సరఫరా చేస్తున్నారన్న వివరాలను సేకరిస్తున్నారు.

ఈనాడు


వెనకబాటుపై కొత్త వేటు

ఏడు పదుల భారతావనిలో పన్నెండు పంచవర్ష ప్రణాళికలు పూర్తిస్థాయిలో అమలైనా, ఆశించిన అభివృద్ధి సాధ్యపడిందా, అంటే- లేదన్నదే సమాధానం. ప్రపంచ జనాభాలో ఆరోవంతుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఇండియాలో ఆరోవంతు జిల్లాల వెనకబాటుతనం- మానవాభివృద్ధి సూచీల్లో భారత్ స్థానాన్ని దిగలాగుతోందన్నది వాస్తవం. దేశీయంగా భిన్న రాష్ట్రాల మధ్య, ఒక్కో రాష్ట్రంలో జిల్లాల నడుమ అభివృద్ధి పరంగా తీవ్ర అసమానతలు భారతావని ప్రగతిపథ ప్రస్థానానికి తీవ్ర అవరోధాలవుతున్నాయి. వాటిని అధిగమిస్తేగాని, 2022లో స్వాతంత్ర్య 75వ వార్షికోత్సవాల నాటికి 'నయాభారత్' ఆవిష్కారం సాధ్యంకాదన్న తలంపుతో నీతిఆయోగ్ ఓ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల్లో వెనకబాటు కాటుకు గురై కుములుతున్న 115 జిల్లాల్ని గుర్తించిన మోదీ ప్రభుత్వం సత్వరాభివృద్ధి వ్యూహాలతో వాటిని కదం తొక్కించడానికి సమకట్టింది. ఆయా ప్రగతి కాంక్ష జిల్లాల కలెక్టర్లు, ఇతర బాధ్యులు భేటీలో పాల్గొన్న ప్రధాని మోదీ- ఫలానా ప్రాంతం వెనకబడి ఉందంటే, అక్కడి ప్రజలకు అన్యాయం జరిగినట్లేనని నిష్కర్షగా పలికారు. ప్రజల ఆకాంక్షలతో ప్రభుత్వ పథకాలు జత కలవాలంటూ, 115 జిల్లాల్లో అభివృద్ధి పనుల సమన్వయం, పరిశీలన బాధ్యతల్ని కేంద్రప్రభుత్వంలోని సీనియర్ అధికారులకు అప్పగించారు. వెనకబడిన ప్రాంతాల్లో పనిచేయాల్సి రావడాన్ని ప్రజల జీవితాల్లో మేలిమి మార్పులు తీసుకొచ్చేందుకు దక్కిన సదవకాశంగా అధికారులు భావించాలంటూ, వచ్చే అంబేడ్కర్ జయంతి (ఏప్రిల్ 14) నాటికి ఆయా జిల్లాల్లో సానుకూల మార్పులు పొడగట్టాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. అత్యుత్తమ పనితీరు కనబరచిన జిల్లాలను తాను సందర్శిస్తాననడం స్ఫూర్తిమంతమే అయినా, దశాబ్దాల వెనకబాటు నెలల వ్యవధిలో మలిగిపోదన్నది నిర్ద్వంద్వం. రెండు తెలుగు రాష్ట్రాల్లో చెరో మూడు చొప్పున ఎంపికైన జిల్లాలు జాతీయస్థాయిలో మెరుగైన ఫలితాల సాధనకు పరిశ్రమించడం నేటి అవసరం!

పేదరికాన్ని దాని కవలలైన ఆకలి, అనారోగ్యాల్ని దునుమాడి ప్రజలందరికీ గౌరవప్రద జీవన పరిస్థితుల పరికల్పనకు కృషి చేస్తామన్న వాగ్దానాలతో స్వతంత్ర భారతి ఏరువాక మొదలైంది. భిన్న ప్రాంతాల ప్రాథమ్యాలు, అవసరాల్ని పరిగణనలోకి తీసుకోవాలని తొలి పంచవర్ష ప్రణాళిక, తక్కువ అభివృద్ధి చెందిన ప్రాంతాలపై దృష్టి సారించాలని రెండో ప్రణాళిక చాటగా- తక్కువ అభివృద్ధి సాధించిన పరగణాల్ని తక్కినవాటి స్థాయికి చేర్చాలన్న సదాశయ ప్రకటనతో మూడో ప్రణాళిక కాలగర్భంలో కలిసిపోయింది. తక్కువ తలసరి ఆదాయం, జనసమ్మర్దం అధికంగా ఉండటం, కమ్యూనికేషన్ సదుపాయాల కొరత ప్రాతిపదికన అరవయ్యో దశకంలోనే దేశంలో 123 జిల్లాలు వెనకబడి ఉన్నట్లు గుర్తించగా, అందులో ఏకంగా 82 శాతం- బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర్ ప్రదేశ్‌లకు చెందినవే. బిమారు (రుజాగ్రస్త) రాష్ట్రాలుగా వాటి గుర్తింపునకు కారణం అదే! 1996లో ఈఏఎస్ శర్మ కమిటీ, 2001లో ఎన్జే కురియన్ విశ్లేషణ, 2003లో మరో అధ్యయనం- దేశవ్యాప్తంగా ఎన్నెన్ని జిల్లాలు వెనకబాటుకు కక్కట కట్టినా- దశాబ్దాలుగా వాటి ముఖచిత్రం మారనే లేదు. 2007లో యూపీఏ ప్రభుత్వం, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి (బీఆర్‌జీఎఫ్) ఏర్పాటు చేసి తొలుత దాని పరిధి కింద 250 జిల్లాల్ని ఉద్ధరించాలనుకొన్నా క్రమంగా ఆ సంఖ్య 272కు చేరింది. పదేళ్ల కాలావధిలో రూ.31 వేలకోట్లకు పైగా ప్రణాళికా వ్యయీకరించినా- ఒక్కుమ్మడిగా చెప్పాలంటే, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. రాష్ట్రాలు మూడోవంతు నిధుల్నే వ్యయీకరించాయని, పది శాతం పనులు అసలు పట్టాలకే ఎక్కలేదని బీఆర్‌జీఎఫ్ వైఫల్యాల చిట్టా చాటుతున్న వేళ- బిమారు మార్గంలో ఉట్టి కొట్టాలన్న సత్సంకల్పం కొత్త పుంతల్లో ప్రతిఫలిస్తోంది!

పేదరికం, ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు- వెనకబాటుతనం నిర్ధారణకు నీతి ఆయోగ్ ప్రాతిపదికలు. పేదరికానికి 25 శాతం, ఆరోగ్యానికి 30 శాతం, విద్యకు 15, మౌలిక సదుపాయాలకు 30 శాతం 'వెయిటేజి'తో 115 జిల్లాల్ని ఎంపిక చేసిన నీతి ఆయోగ్- విద్యుత్, రోడ్లు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాల్ని మౌలిక వసతులకు కీలకంగా సంభావించింది. నీతి ఆయోగ్ కొత్తగా నిర్ధారించిన 115 జిల్లాల్లో ఎకాయెకి 65 పూర్వాశ్రమంలోని 'బిమారు' రాష్ట్రాలకు చెందినవి కావడం గమనార్హం. ఆకలి చావులు నమోదయ్యే కాంధమార్, కలహండి, కోరాపుట్‌లతోపాటు మరో అయిదూ తాజా వెనకబాటు జాబితాలో చోటుచేసుకోవడం ఒడిశా సాధించిన 'ప్రగతికి' నిలువుటద్దం! వామపక్ష తీవ్రవాదం బుసలతో కమిలిన జిల్లాల్ని జాబితాలో చేర్చిన కేంద్రం- మూడంచెల పాలన వ్యవస్థల మధ్య సమన్వయం, ఫలితాల సాధనపై దృష్టిసారించి నియమబద్ధంగా ముందడుగేస్తామంటోంది. అందుకోసం అదనపు/సంయుక్త కార్యదర్శులను ప్రభారి(ఇన్‌ఛార్జి) అధికారులుగా నియమించనుంది. బీఆర్‌జీఎఫ్ పద్దు కింద ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు జిల్లాలకు రూ.831 కోట్లు, తెలంగాణలో తొమ్మిది జిల్లాలకు రూ.1,600 కోట్లకు పైగా నిధులు అందించినట్లు కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం ప్రకటించింది. వాస్తవిక అవసరాల్ని సహేతుకంగా మదింపు వేసి నిధులు విడుదల చెయ్యడంతోపాటు వాటి సక్రమ వినియోగానికి పూచీపడే యంత్రాంగం జవాబుదారీతనంతో పని చేసినప్పుడే సత్ఫలితాలు ఒనగూడుతాయి. రాజ్యాంగం ప్రస్తావించిన జిల్లా ప్రణాళికా మండళ్ల స్ఫూర్తికి గొడుగు పట్టి, వికేంద్రీకరణ దిశగా అడుగులు పడినప్పుడే గ్రామాలు, జిల్లాలు తెప్పరిల్లి వెనకబాటుతనం మటుమాయమయ్యే అవకాశాలు విప్పారుతాయి!

సంస్కరణల జోరు... జనాకర్షణ జోడు





తుమ్మల కిశోర్

మరికొన్ని రోజుల్లో 2018 కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంటుకు సమర్పించనున్న నేపథ్యంలో అన్ని వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే ఆర్‌బీఐ గవర్నర్, సెబి, ఐఆర్‌డీఏఐ అధిపతులతో సహా పలు వర్గాలతో బడ్జెట్ సమాలోచనలు పూర్తయ్యాయి. ఎన్‌డీఏ ప్రభుత్వ హయాములో ఆర్థికమంత్రి జైట్లీ ఇప్పటిదాకా నాలుగు బడ్జెట్లు ప్రవేశపెట్టారు. 2019లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నందువల్ల ప్రభుత్వానికిది పూర్తిస్థాయిలో ప్రవేశపెడుతున్న చివరి బడ్జెట్ అవుతుంది. అందువల్లే ఈ బడ్జెట్ రాజకీయ ప్రాధాన్యమూ సంతరించుకుంది. పెద్దనోట్ల రద్దు, వస్తుసేవల పన్ను (జీఎస్‌టీ) అమలుతో వృద్ధిరేటు నెమ్మదించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి 5.7 శాతానికి పడిపోగా, రెండో త్రైమాసికంలో స్వల్పంగా వృద్ధి చెంది 6.3 శాతానికి పెరిగింది.

గ్రామీణాభివృద్ధి కీలకం

జీఎస్‌టీ పన్ను శ్లాబులను కుదించడంతో పన్ను ఆదాయం తగ్గడం, ఈ ఆర్థిక సంవత్సరంలో అంచనాలకు (జీడీపీలో 3.2 శాతం) మించి ద్రవ్యలోటు పెరిగే సూచనలుండటం, ద్రవ్యోల్బణం అంతకంతకూ ఎగబాకుతుండటం వంటివి బడ్జెట్ రూపకల్పనను సంక్లిష్టం చేయనున్నాయి. ముడిచమురు ధరల పెరుగుదల ఇదేవిధంగా కొనసాగితే అది వృద్ధిరేటుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పలు ప్రతికూలతల కారణంగా రాబోయే బడ్జెట్లో ప్రజాకర్షక పథకాలపై పెద్దగా దృష్టి సారించే అవకాశం లేదు. అయితే రానున్న బడ్జెట్‌ను రాజకీయ కోణం నుంచి చూసినట్లయితే ఆర్థికపరంగా కొంత సడలింపు, సర్దుబాట్లు చేసుకుని, కొంతమేర ప్రజాకర్షక పథకాలవైపు మొగ్గు చూపే అవకాశం లేకపోలేదు. గుజరాత్ ఎన్నికల ఫలితాలు, 2018లో పలు రాష్ట్రాల (ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, కర్ణాటక, మేఘాలయా, మిజోరం, త్రిపుర, నాగాలాండ్) ఎన్నికల నేపథ్యంలో బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యమిచ్చి గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేయాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. ప్రధాని మోదీ బలంగా ప్రవచిస్తున్న 'సబ్‌కా వికాస్' మంత్రాన్ని గ్రామీణ భారతావని నలుమూలలకూ తీసుకెళ్లే క్రమంలో బడ్జెట్లో నిధుల కేటాయింపు పెరిగే అవకాశం ఉంది. కేంద్రంలో అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచి ఈ మూడున్నరేళ్లలో మోదీ ప్రభుత్వం వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. అయినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదన్నది నిష్ఠుర సత్యం. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు, దివాలా చట్టసవరణ వంటి సాహసోపేతమైన ఆర్థిక సంస్కరణలను చేపట్టడంతో పాటు జన్‌ధన్ యోజన, డిజిటల్ ఇండియా, భారత్‌లో తయారీ, నైపుణ్య భారత్, స్వచ్ఛభారత్ వంటి పథకాలను ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకువెళ్లిన మోదీ ఓ సమ్మోహనశక్తిగా ఎదిగారు. అంతర్జాతీయ స్థాయిలో దేశ ఆర్థికవ్యవస్థపై మదుపరుల విశ్వాసం ఇనుమడించింది. ఈ నేపథ్యంలో 2019 సార్వత్రిక ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతోపాటు మరో అయిదేళ్లపాటు తమ స్థానాన్ని పదిలంగా ఉంచుకొనేందుకు ఈ బడ్జెట్లో కొంతవరకు 'ప్రజాకర్షక' మార్గాన్ని ఎంచుకొనే అవకాశం లేకపోలేదు. సంస్కరణల వేగం తగ్గకుండా వృద్ధికి ప్రాధాన్యమిస్తూ, 'ప్రజాకర్షక' పథకాలను పూర్తిగా విస్మరించలేని పరిస్థితి ఎదుర్కొంటూ బడ్జెట్ రూపకల్పన చేయడం ఏ ఆర్థికమంత్రికైనా అత్యంత క్లిష్టమైన విన్యాసమే!

దేశంలో దాదాపు 70శాతం జనాభా గ్రామాల్లో నివసిస్తున్నారు. వీరిలో అధికశాతం వ్యవసాయం, వ్యవసాయాధారిత రంగాల ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2016-17 ఆర్థిక సంవత్సరంలో దేశంలో ఆహారధాన్యాల ఉత్పత్తి 27.568 కోట్ల టన్నుల రికార్డు స్థాయికి చేరింది. దేశ జీడీపీలో వ్యవసాయరంగం వాటా 17.3 శాతం ఉంది. అయితే రైతు సగటు వార్షికాదాయం రూ.96,703 మాత్రమే! వ్యవసాయం గిట్టుబాటుకాక అధికశాతం రైతాంగం ప్రత్యామ్నాయ మార్గాలు వెదుక్కొనే దుస్థితి నెలకొంది. ఎన్‌డీఏ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి చేయూతనిచ్చేందుకు గత బడ్జెట్లలో పెద్దయెత్తున నిధులు కేటాయించి గ్రామీణాభివృద్ధిపై దృష్టి సారించింది. గత బడ్జెట్లో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.1.87 లక్షల కోట్ల కేటాయింపులు జరిపింది. 2017 బడ్జెట్‌లోనూ రూ.10 లక్షల కోట్ల రుణాలు అందించాలని ప్రతిపాదించింది. బ్యాంకులు వెనకంజ వేయడంతో రుణవితరణ లక్ష్యాలు నెరవేరలేదు. మూడు లక్షల రూపాయల దాకా ఇచ్చే స్వల్పకాలిక పంట రుణాలను సకాలంలో చెల్లించిన రైతులకు నాలుగు శాతం వడ్డీకే అప్పులు ఇవ్వాలని ప్రతిపాదించారు. అయినా సకాలంలో రుణాలు అందక రైతాంగం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకొంటోంది. ఈ పరిస్థితులను చక్కదిద్ది, రైతాంగానికి కొంత ఊరటనిచ్చే దిశలో బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి కీలక ప్రతిపాదనలు చేయాల్సిన అవసరం ఉంది. వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించడంతో పాటు చిన్న, సన్నకారు రైతులకు మరింత తక్కువ వడ్డీపై



పంట రుణాలు అందించేందుకు చర్యలు చేపట్టాలి. 'ప్రధాన్‌మంత్రి ఫసల్ బీమా యోజన'ను విస్తృతపరచి, పంట బీమాకు మరిన్ని నిధులు కేటాయించాలి. భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు ఆయా భూముల్లో పండించే పంటలపై అవగాహన కల్పించాలి. అధిక పంట దిగుబడుల సాధనకు వ్యవసాయ పరిశోధన కేంద్రాలను బలోపేతం చేయాలి. మెరుపు వేగంతో ఆర్థిక సంస్కరణలు చేపట్టిన మోదీ ప్రభుత్వం వ్యవసాయరంగంలోనూ సంస్కరణలకు ఉపక్రమించాలి. రైతాంగం ఆదాయ వనరులు పెంచేందుకు చర్యలు తీసుకోవాలి. ఎం.ఎస్.స్వామినాథన్ కమిటీ సిఫార్సుల అమలుకు నడుం బిగించాలి. రైతులకు నాలుగు శాతం వడ్డీపై పంట రుణాలు అందించి, పంటలకు బీమా సౌకర్యం కల్పించడం వంటి సిఫార్సులను ప్రభుత్వం ఇప్పటికే అమలుచేస్తోంది. వ్యవసాయరంగంలో ప్రైవేటు పెట్టుబడులు పెంచి గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించే దిశలో చర్యలు వేగవంతం చేయాలి.

దీర్ఘకాలిక పరిష్కారాలు

పండించే పంటకు కనీస మద్దతు ధర అందకపోవడం దేశ రైతాంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య. రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలకు పరిష్కారాలు చూపడానికి బడ్జెట్‌లో కొన్ని ప్రతిపాదనలు చేసే అవకాశం ఉంది. ఇవి దీర్ఘకాలం ఉపయోగపడేలా ఉండాలి. తక్షణం కొంత ఉపశమనం ఇవ్వడానికి 'రుణమాఫీ'పై ప్రభుత్వం పునరాలోచించే అవకాశాలున్నాయి. మౌలిక వసతుల కల్పనకు కేటాయింపులు పెంచడంతోపాటు ప్రైవేటు పెట్టుబడుల పెంపుదలకు పలు ప్రతిపాదనలు చేసే అవకాశం ఉంది. గత బడ్జెట్‌లో మౌలిక వసతుల కల్పనకు రూ.3.96 లక్షల కోట్లు కేటాయించారు. ఓడరేవుల ఆధునికీకరణతోపాటు కొత్తవాటి నిర్మాణం కోసం ఎనిమిది లక్షల కోట్ల రూపాయల వ్యయంతో 'సాగర్‌మాల' కార్యక్రమానికి మోదీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దాదాపు ఏడు లక్షల కోట్ల రూపాయల వ్యయంతో 83,677 కిలోమీటర్ల రహదారుల నిర్మాణానికి నిర్మించేందుకు ఇటీవల పచ్చజెండా ఊపింది. ఇందులో 34,800 కిలోమీటర్ల పొడవైన 'భారత్‌మాల' రహదారి మార్గాల నిర్మాణ పథకమూ ఉంది. రైల్వేమార్గాల ఆధునీకరణ, కొత్త రైళ్లు, బుల్లెట్ రైళ్ల ప్రవేశానికి సన్నాహాలు చేస్తున్నందువల్ల ఆ శాఖకూ భారీగా నిధులు ప్రత్యేకించాల్సి వస్తుంది.

ప్రతికూల పవనాలు

దేశ ఆర్థికవ్యవస్థలో ప్రతికూల పవనాలు వీస్తున్నాయన్నది చేదు వాస్తవం. జీఎస్‌టీ అమలు కారణంగా పన్నుఆదాయం తగ్గింది. ప్రభుత్వ రుణభారం ఇంతలంతలవుతోంది. ప్రభుత్వరంగ బ్యాంకు(పీఎస్‌బీ)ల మొండిబాకీల భారం (నిరర్థక ఆస్తులు) కలవరపెడుతోంది. ప్రభుత్వం, ఆర్‌బీఐలు దిద్దుబాటు చర్యలు చేపడుతున్నా, మొండిబాకీల పెరుగుదల ఆగడం లేదు. గడచిన సెప్టెంబర్ 30నాటికి బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తులు రూ.8.36 లక్షల కోట్లకు పెరిగాయి. ఇందులో పీఎస్‌బీల వాటా రూ.7.33 లక్షల కోట్లు. ప్రైవేటు రంగ బ్యాంకుల ఎన్‌పీఏలు రూ. 1.03 లక్షల కోట్లున్నాయి. మొత్తం పీఎస్‌బీల్లో దాదాపు సగం బ్యాంకులు పీసీఏ (సత్వర దిద్దుబాటు చర్య) జాబితాలో చేరాయి. మొత్తం బ్యాంకింగ్ రంగంలో 'స్ట్రెస్డ్ అసెట్స్' దాదాపు రూ.10 లక్షలకోట్ల దాకా ఉంటాయి. పీఎస్‌బీలను గట్టెక్కించే దిశగా ఇటీవల ప్రభుత్వం రూ.2.11 లక్షల కోట్ల మూలధన ప్యాకేజీని ప్రకటించింది. నాలుగేళ్లుగా పీఎస్‌బీలకు దాదాపు రూ.60 వేలకోట్ల మూలధనాన్ని ప్రభుత్వం అందజేసింది. రాబోయే బడ్జెట్లో రూ.10-15 వేలకోట్లు కేటాయించనుంది. పన్నుఆదాయం తగ్గినందువల్ల ప్రత్యక్ష, పరోక్ష పన్నుల రాబడిపై ఆర్థిక మంత్రి దృష్టి సారించే అవకాశం ఉంది. పన్ను పరిధిలోకి అధిక జనాభాను తీసుకొచ్చే లక్ష్యంతో పన్ను వసూళ్ల యంత్రాంగాన్ని బలోపేతం చేయడంతోపాటు, ఎగవేత అరికట్టే దిశలో చర్యలు చేపట్టాలి. డిజిటల్ లావాదేవీలను మరింత ప్రోత్సహించడం అందుకో మార్గం. వ్యక్తిగత ఆదాయపుపన్ను శాఖల్లో ఎటువంటి మార్పులు చేయకపోవచ్చు. కొన్నేళ్లుగా ఆదాయపుపన్ను మినహాయింపును రూ.2.50 లక్షలకే పరిమితం చేసినందువల్ల దీన్ని మూడు లక్షల రూపాయలకు పెంచాల్సిన అవసరం ఉంది. ఆదాయపుపన్ను చట్టం- 80 సీ కింద వివిధ పొదుపు పథకాల్లో వెచ్చించిన మొత్తాలపై ప్రస్తుతం ఉన్న పన్ను మినహాయింపు పరిమితిని (రూ.1.50 లక్షలు) రెండు లక్షల రూపాయల వరకూ పెంచాలి. గృహరుణాలపై మినహాయింపునూ కొంత పెంచాల్సిన అవసరం ఉంది. కార్పొరేట్ పన్ను రేటును వార్షిక ఆదాయంతో సంబంధం లేకుండా మొత్తం మీద 25 శాతానికి తగ్గించవచ్చు. వార్షిక ఆదాయం రూ.50 కోట్ల లోపు ఉన్న కార్పొరేట్ సంస్థలకే 25 శాతం పన్ను రేటు వర్తిస్తోంది. ప్రభుత్వం పన్ను ఆదాయం పెంచుకొనే మార్గాలను అన్వేషిస్తున్నందువల్ల ఈక్విటీలపై పెట్టిన పెట్టుబడులపై వచ్చే దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్స్‌పైనా పన్ను విధించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఏడాది దాటిన పెట్టుబడులపై క్యాపిటల్ గెయిన్స్ పన్ను మినహాయింపు కొనసాగుతోంది.

గతి తప్పుతున్న ద్రవ్యలోటు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ముడిచమురు ధరలు ఎగబాకడం, తగ్గుతున్న పన్ను ఆదాయం బడ్జెట్ రూపకల్పనను క్లిష్టతరం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వృద్ధికి ఊతమిస్తూ, సంస్కరణ వేగాన్ని కొనసాగిస్తూ బడ్జెట్‌ను ప్రజారంజకంగా తీర్చిదిద్దే క్రమంలో అరుణ్ జైట్లీ పలు ఆర్థిక విన్యాసాలు చేయక తప్పదు. 2022నాటికి దేశంలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు (రూ.1,93,406) చేయాలన్న ప్రధాని మోదీ సంకల్పం వాస్తవ రూపం దాల్చాలంటే, ఆర్థికమంత్రి గ్రామీణాభివృద్ధిపై దృష్టి సారించడంతోపాటు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ విధానాల సంస్కరణలకూ ప్రాధాన్యం ఇవ్వాలి. రైతుల ఆదాయం రెట్టింపు కావాలంటే 2022 నాటికి వ్యవసాయ రంగంపై రూ.1.48 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరమవుతాయి. ఏది ఏమైనా ఈసారి బడ్జెట్లో వ్యవసాయ రంగానికి చేయూతనిచ్చి, రైతాంగాన్ని ఆర్థిక సంక్షోభంనుంచి గట్టెక్కించేందుకు అరుణ్ జైట్లీ బహుముఖ వ్యూహంతో పలు కీలక ప్రతిపాదనలు చేయాలి!

(రచయిత- బ్యాంకింగ్ రంగ నిపుణులు)

మూడు 'ముళ్ల'బాట

ఆధునికత కొత్తపుంతలు తొక్కుతున్నా, మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నా నేటికీ కొన్ని గ్రామాల్లో బాల్య వివాహాలు ఆగడమే లేదు. చిరునవ్వులు చిందిస్తూ ఆడుతూ పాడుతూ చదువుకునే వయసులో చేస్తున్న వివాహాలు చిన్నారుల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నాయి దేశం ఎదుర్కొంటున్న సామాజిక సమస్యల్లో బాల్య వివాహం ముఖ్యమైనది. బాల్య వివాహాల్లో భారత్ ప్రపంచంలోనే ప్రథమస్థానంలో ఉంది. ప్రపంచంలో 40 శాతం బాల్యవివాహాలు మనదేశంలోనే జరుగుతున్నాయని యునిసెఫ్ సైతం వాపోయింది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని మొత్తం మహిళల్లో (20-24 సం.ల) మూడొంతులు (ఆరు కోట్లు) 18 ఏళ్లలోపు వివాహం అయినవారే ఉన్నారు.

మూఢనమ్మకాలే శాపాలు

మన దేశంలో ఏటా 2.66 కోట్ల బాల్య వివాహాలు జరుగుతున్నాయి. ఈ సంఖ్య బంగ్లాదేశ్‌లో 39.3 లక్షలు, పాకిస్థాన్ 18.8 లక్షలు, బ్రెజిల్ 29.3 లక్షలు, మెక్సికో 12.8 లక్షలుగా ఉంది. మనదేశంలో రాజస్థాన్ 3.7 శాతంతో బాల్యవివాహాల్లో మొదటిస్థానాన్ని ఆక్రమించింది. మహారాష్ట్ర 2.9, ఆంధ్రప్రదేశ్ 1.6, మిజోరం 1.2 శాతాలతో తదుపరి స్థానాల్లో ఉన్నాయి. బాల్య వివాహాలు హిందువుల్లో 2.39 శాతం, ముస్లిములో 2.21, క్రిస్టియన్లలో 1.79, సిక్కులు 1.93, బౌద్ధ మతస్థుల్లో 2.49, ఇతరుల్లో 1.82 శాతాల మేర జరుగుతున్నాయి. 2015-16లో ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహించింది. దీని ప్రకారం, తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో 35శాతం, పట్టణ ప్రాంతాల్లో 15.2 శాతం అమ్మాయిలకు 18 ఏళ్లలోపే వివాహాలు జరుగుతున్నాయి. అబ్బాయిల విషయానికొస్తే గ్రామీణ ప్రాంతాల్లో 32.3 శాతం, పట్టణాల్లో 14.5శాతం మందికి బాల్యవివాహాలు చేసుకుంటున్నారు. ఇదే ఆంధ్రప్రదేశ్‌లో 32.7శాతం బాలికలకు, 23.5శాతం బాలురకు మైనారిటీ తీరకముందే పెళ్ళిళ్లు చేసేస్తున్నారు. బ్రిటిష్ హయాములో విదేశీయులు మనదేశంలోని స్త్రీలను బలవంతంగా వివాహం చేసుకునేవారు. దీనికి భయపడి ఆ రోజుల్లో పెద్దలు తమ పిల్లలకు బాల్యంలోనే వివాహం చేసేవారు. కొంతమంది వృద్ధుల ఆఖరి కోరిక పేరిట చిన్న వయసులోనే పిల్లల పెళ్ళిళ్లు పూర్తిచేసి పంపించేవారు. తరవాత కందుకూరి, గురజాడ వంటివారి కృషి ఫలితంగా బాల్యవివాహాల పెడధోరణులకు దాదాపుగా అడ్డుకట్ట పడింది. కానీ గ్రామీణ ప్రాంతాలు, కొన్ని వర్గాల్లో మాత్రం అది నేటికీ కొనసాగుతుండటమే బాధాకరం. సాంకేతికంగా సమాజం ఎంతగా మార్పు చెందినప్పటికీ వీరి పోకడల్లో మార్పు రావడం లేదు. పేదరికం, అవగాహనాలోపం, నిరక్ష్యరాస్యత, ఆడపిల్లను భారంగా భావించడం, ఆచారాలు, మూఢనమ్మకాలు ఇందుకు కారణాలు. చాలా ప్రాంతాల్లో ఆడపిల్లలకు సరైన విద్యాసదుపాయాలు అందుబాటులో లేకపోవడమూ ఈ దురాచారం కొనసాగడానికి కారణమవుతోంది.

బాల్య వివాహాల వల్ల అధిక సంఖ్యలో అమ్మాయిలకు గర్భస్రావాలవంటి ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయి. ఆటపాటలతో ఎదగాల్సిన పిల్లలు రక్తహీనతకు గురై బలహీనమవుతారు. మాతృమరణాల సంఖ్యా పెచ్చరిల్లుతోంది. ఏటా 70 వేలమంది 15-19 సంవత్సరాల వయస్సు బాలికలు ప్రసవ సమయంలో ఇందువల్లే మరణిస్తున్నారు. 18 ఏళ్లలోపు వివాహం చేయడంవల్ల శారీరక ఎదుగుదల లేక పోషకాహార లోపాలతో పుడుతున్న పిల్లలు ఎక్కువగా అకాల మృత్యువాత పడుతున్నారు. చిన్న వయసులో పిల్లలు పుడితే పసిపిల్లలకు జన్యులోప సమస్యలూ ఉత్పన్నమవుతాయని వైద్యులూ హెచ్చరిస్తున్నారు. తెలిసీ తెలియని వయసులో వివాహం చేయడంవల్ల అత్తమామలు, ఆడపడుచులు, పిల్లల పెంపక భారాలు మీదపడి తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. కొందరు నిరాశ నిస్పృహలకు గురై ఆత్మహత్యకూ



అడ్డూఆపూలేని బాల్య వివాహాలు

ఒడిగడుతున్నారు. గృహహింసకు గురవుతున్న ఆడపిల్లల్లో 15 ఏళ్లలోపువారే అధికం. అవగాహనాలేమితో ఆర్థిక ఇబ్బందులు తలెత్తితే భార్యభర్తల మధ్య సఖ్యత కరవై, అది విడాకులకూ దారితీస్తోంది. సంక్షోభంలో చిక్కుకున్న అమ్మాయిలు కొందరు సులభంగా అక్రమ రవాణాకు ఎర అవుతున్నారు.

1860లో బాలిక వివాహానికి వయసు నిర్ధారించలేదు కానీ, భర్తతో కాపురం చేయడానికి పదేళ్ల వయసును అప్పటి సమాజం నిర్ణయించింది. తరవాత 1891లో బ్రిటిష్ ప్రభుత్వం బాల్య వివాహాల నిరోధ చట్టాన్ని తెచ్చింది. 12 సంవత్సరాల లోపు ఆడపిల్లల వివాహాలను నిషేధించింది. 1929లో వివాహ వయస్సు 14 ఏళ్లకు పెంచుతూ శారద చట్టాన్ని తీసుకొచ్చారు. 2006లో మార్పులు చేశారు. దీని ప్రకారం 18 ఏళ్లు నిండని బాలికలకు, 21 ఏళ్లు నిండని బాలురకు వివాహాలు చేయడం నేరం! వివాహాలు జరిపించిన తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, బంధువులు శిక్షార్హులు. లైంగిక వేధింపుల నుంచి పిల్లల రక్షణ చట్టం (2012) వచ్చింది. ఇది 18 సంవత్సరాలలోపువారికి వర్తిస్తుంది. 2017లో సుప్రీంకోర్టు ఐపీసీ 375ను అమలులోకి తీసుకువచ్చింది. సుప్రీంకోర్టు 2006లో కేసుకు సంబంధించి ప్రతివాది వాదనలకు సమాధానంగా ఐపీసీ 375(2)ను అనుసరించి తీర్పు ఇచ్చింది. 18 ఏళ్లలోపు బాలికను వస్తువుగా చూడరాదని ఆమెకూ ప్రాథమిక హక్కులున్నాయని గుర్తుచేసింది. 18 ఏళ్లు నిండని మైనర్ బాలికతో శృంగారం అత్యాచారం కిందకు వస్తుందని సుప్రీంకోర్టు స్పష్టీకరించింది. 375 సెక్షన్ ప్రకారం నేరానికి పాల్పడ్డ వ్యక్తికి మినహాయింపులు లేవని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఈ తీర్పుతో విచక్షణ, అసమానతల మధ్య నలిగిపోతున్న బాలికలకు కొండంత రక్షణ ఏర్పడింది. ఇన్ని రక్షణ చట్టాలున్నా బాల్యవివాహాలను అవేవీ అడ్డుకోలేకపోతున్నాయి. చట్టాల అమలులో లోపాలు, అవగాహనా రాహిత్యం వల్లే ఈ దురాచారం సమాజానికి నేటికీ సవాలు విసరుతోంది.

అందరి బాధ్యత

బాలల ప్రత్యేక సంరక్షణ పట్ల శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరముందని 1924లోనే బాలలహక్కులపై జెనీవా ప్రకటన విడుదలైంది. వివాహ ధ్రువీకరణ పత్రాలు జారీచేసే వ్యవస్థలను కట్టుదిట్టం చేయాలి. 18 ఏళ్లలోపు పెళ్ళిళ్లను అక్కడే అడ్డుకోగలగాలి. గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తల దగ్గర కిశోర బాలికల వివరాలు అందుబాటులో ఉంటాయి. వారిలో ఎవరికైనా చట్టవిరుద్ధంగా 18 ఏళ్లలోపు వివాహం జరుగుతుంటే ఆ కార్యకర్తలు సత్వరమే దగ్గరిలోని స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులను సంప్రతించి చర్యలు తీసుకునేలా సమాజంలో వ్యవస్థీకృత మార్పులు రావాలి. గ్రామాల్లో బాలికలకు చదువులపట్ల కొత్త ఆసక్తి రేకెత్తించడానికి ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలి. ప్రతి జిల్లాకు బాల్య వివాహాల నిరోధక అధికారి ఉంటారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను వారు విధిగా అమలు చేయాలి. గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలి. సమస్యాత్మక ప్రాంతాల్లో చట్టాల గురించి నిరంతరం తెలియజెప్పాలి. చిన్న వయసు వివాహాల వల్ల వచ్చే అనారోగ్య సమస్యలు, ఇతర అనర్థాలను తల్లిదండ్రులకు బోధించాలి. గ్రామీణ ప్రాంతాల్లో హానికరమైన సాంస్కృతిక నిబంధనలు, ఆచారాలు, మూఢనమ్మకాలను తొలగించాలి. బాల్య వివాహాల కట్టడి కోసం ప్రభుత్వాలతోపాటు, పౌరసంఘాలూ పాటుపడాలి. గ్రామ కమిటీలకు బాల్య వివాహాలను అడ్డుకునే అధికారముంది. అంగన్‌వాడీ కార్యకర్తలు, యువజన సంఘాలు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శి, మహిళా మండలి సభ్యులు, మండలస్థాయిలో తహశీల్దారు, జిల్లా స్థాయిలో కలెక్టరు, జాయింట్ కలెక్టరు భాగస్వాములు కావాలి. అప్పుడే బాల్యవివాహాల దురాచారానికి అడ్డుకట్ట పడుతుంది. బాలికల బంగరు భవిష్యత్తుకు మార్గం సుగమం అవుతుంది.

– శాంతి జలసూత్రం

ఆశయ సాధన

ఆశే శ్వాసగా జీవించేవారు ప్రపంచంలో ఎటుచూసినా కనిపిస్తారు. శ్వాస మరుస్తారేమో కాని, ఆశల్ని ఎన్నటికీ మరచిపోరు. అందుకే తమ అంతిమ శ్వాస తరవాత కూడా, వారసులు సుఖభోగాలతో రాచరిక జీవితం గడపాలని కొందరు ముందుగానే అన్ని ఏర్పాట్లూ చేస్తారు. అక్రమం, అవినీతి అనే ఆలోచనలకైనా తావివ్వరు. ఎంతకీ తరగని అపార సంపద కోసం- కుత్సితాలు, కుట్రలు అన్నీ సునాయాసంగా 'అది సహజమే' అన్నంతగా చేసేస్తారు!


చలిపిడుగు మీద పడినట్లు- ఏదో ఒక ఘడియలో అక్రమం, అవినీతి బహిరంగమే- కొందరు అవాక్కవుతారు. మరికొందరు ఇంతో అంతో పశ్చాత్తాపం చెందుతారు. తమ తప్పులే ప్రస్తుత దుస్థితికి కారణమన్న వాస్తవాన్ని గ్రహించినా, ఆ విషయాన్ని పైకి అంగీకరించే సంస్కారం అలాంటివారికి ఉండదు. తమకు కలిగింది ఆపదగానే భావిస్తారు తప్ప, దుష్కర్మల ఫలం అనుకోరు.

పశ్చాత్తాపం అంటే- అదేపనిగా తప్పులు చేస్తూ, వాటిని క్షమించాలని పదేపదే కోరడం కాదు. తప్పు చేసిన తరవాత (పశ్చాత్)... అలా చేసినందుకు ఎంతో బాధ (తాపం) కలగాలి. అప్పుడే అది దోష నివారణ అవుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. అలా అని, ఒకే తప్పును మళ్లీ మళ్లీ చేస్తూ అందుకు బాధపడుతూనే ఉండటం 'పశ్చాత్తాపం' అనిపించుకోదు.

ఎదుటివారి తప్పులు ఎంచడంలో అమిత ఆసక్తి, అధిక ఉత్సాహం చూపేవాళ్లు కొందరుంటారు. అంతకంటే తామే ఎక్కువగా తప్పులు చేస్తున్నామన్న నిజాన్ని వాళ్లు గ్రహించరు. ఎవరన్నా తమ తప్పుల్ని వేలెత్తి చూపితే సహించలేరు. నలుగురూ మెచ్చేది, నలుగురికీ పనికొచ్చేది ఒక్క పని చేసినా- అది అతడి వ్యక్తిత్వానికి వన్నె

అంతర్యామి

తెస్తుంది. తాడిచెట్టులా నిట్టనిలువుగా అపరిమిత సిరిసంపదలతో ఎదగడం కాదు... విశాలంగా కొమ్మలు విస్తరించి, అనేక మధుర ఫలాలు అందించే మామిడి చెట్టులా గుర్తింపు పొందాలి. అదే జీవన సాఫల్యం. అంటే- సంపద ఫలాల్ని సాటివారికీ అందించడం!



మనిషికి ఉండాల్సింది కేవలం ఆశలొక్కటే కాదు. అవి పుట్టుకతోనే వెంట వస్తాయి. ఆశయాల్ని, ఆదర్శాల్ని అతడు జీవితంలో ప్రధాన భాగం చేసుకోవాలి. వాటి సాధన కోసమే జీవితం అన్నట్లు జీవించాలి. 'నా కోసమే నా జీవితం' అనుకునేవాళ్లకు, పశు పక్షి కీటకాలకు ఎటువంటి తేడా ఉండదు.

మనిషి జన్మ ఉత్తమమైనదని అంటారు. ఇతర ప్రాణుల కన్నా అతడికి మెరుగైన దేహం, ఆలోచనా శక్తి లభిస్తాయి. వాటితో ఉత్తమ ఆశయాలను జీవిత లక్ష్యాలుగా చేసుకొని దీక్షగా సాధించగలిగినవారే ఉదాత్త మానవులు. కృషితో సాధించలేనిది ఏదీ లేదు. ప్రయత్నం, కృషి లేకుండా ఎవరికీ ఏ సత్ఫలితాలూ లభించవు. అదృష్టాన్ని అమాయకులే నమ్ముతారు. వారి నిరీక్షణ ఎడారిలో నది కోసం చూడటం లాంటిది! ఆలోగా మనిషి జీవితం గతించిపోతుంది. 'జీవితాన్ని జీవించడం' అంటే ప్రతి క్షణాన్నీ సద్వినియోగం చేసుకోవడం! ఆశయ సాధన కోసం కృషి చేసే ప్రతి క్షణమూ సద్వినియోగమే అవుతుంది. కృషి ఎంత తీవ్రంగా ఉంటే, గమ్యం అంత సమీపంలో ఉంటుంది.

మహత్తర ఆశయ సాధకులంటే ఎవరు? లోక హితం కోసం అహర్నిశలూ శ్రమించేవారు. భారత స్వాతంత్ర్యం కోసం గాంధీజీ, దీనజన సేవలో మదర్ థెరెసా, ఆధ్యాత్మిక వెలుగులు పంచేందుకు రమణ మహర్షి ఎంతో శ్రమించారు. ఆశయాల సాధనలో సర్వోత్తమ విజయాల్ని పొంది మహనీయులయ్యారు. వారి అడుగుజాడలే మానవాళికి భాగ్యరేఖలు!

– కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

‘పాత పింఛను’ ఈ ఏడాదే సాధిస్తాం

- మార్చిలో జనజాతర
- అప్పటికీ పరిష్కారం కాకుంటే పెన్‌డౌన్, సమ్మెకైనా వెనకాడబోం
- గజ్వేల్‌లో కదంతొక్కిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు
- అయుత ధర్మ దీక్షకు భారీగా హాజరు




అయుత ధర్మ దీక్షలోపాల్గొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు ★ మాట్లాడుతున్న టీఎస్ సీపీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ. చిత్రంలో సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జున్, కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు లింగమూర్తి, సమన్వయకర్త వీరేశం, కార్యవర్గ సభ్యుడు రవి

ఈనాడు డిజిటల్, సిద్దిపేట - గజ్వేల్, న్యూస్‌టుడే: పాత పింఛను విధానాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ ఏడాదిలో సాధిస్తామని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ధీమా వ్యక్తం చేశారు. ‘సీపీఎస్ అంతం.. మా పంతం’ అంటూ గళమెత్తారు. ఆదివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పింఛను పథకం ఉద్యోగుల సంఘం (టీఎస్ సీపీఎస్ఈయూ) ఆధ్వర్యంలో అయుత ధర్మదీక్ష చేపట్టారు. 31 జిల్లాల నుంచి 101 సంఘాలకు చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీగా తరలివచ్చారు. నూతన పింఛను విధానాన్ని రద్దు చేసి.. పాత విధానాన్ని పునరుద్ధరించాలన్నదే ఉద్యోగుల ప్రధాన డిమాండ్ అని టీఎస్ సీపీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ అన్నారు. దీక్షకు హాజరైన ఉపాధ్యాయులు, ఉద్యోగుల్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. న్యాయబద్ధంగా తాము చేస్తున్న పోరాటాన్ని ముఖ్యమంత్రి తప్పకుండా గుర్తిస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ ఏడాదిలోనే పాత పింఛను విధానాన్ని అమలు చేసేలా మరిన్ని పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. “రాష్ట్రవ్యాప్తంగా సీపీఎస్ పరిధిలోకి వస్తున్న 1.27 లక్షల మంది ఉద్యోగులు, వారి కుటుంబీకులతో మార్చిలో హైదరాబాద్‌లో జనజాతర కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. అప్పటికీ మా డిమాండ్ నెరవేరకపోతే పెన్‌డౌన్‌కు దిగుతాం. అవసరమైతే సమ్మెకు కూడా వెనకాడబోం. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తే ఉద్యోగులకు మేలు జరుగుతుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి ఉద్యోగుల వేదనను తీసుకెళ్లేవారే కరవయ్యారు. అన్ని సంఘాలకు చెందిన ఉద్యోగులంతా సంఘటితమై రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యాచరణకు సిద్ధమవ్వాలి” అని స్థితప్రజ్ఞ పేర్కొన్నారు. త్వరలోనే పీఆర్సీ అనే బూచి తెరపైకి రానుందని.. దాని వలలో పడి అసలైన లక్ష్యాన్ని పక్కకు పెట్టొద్దని ఆయన ఉద్యోగులకు హితవు పలికారు.

15 నిమిషాలు మౌనం..

పలు జిల్లాల నుంచి వచ్చిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు తొలుత ప్రదర్శనగా దీక్షాస్థలికి చేరుకున్నారు. దీంతో సభాప్రాంగణం కిక్కిరిసిపోయింది. ప్రత్యేక వేషధారణలు, ఫ్లకార్డులతో తమ నిరసన హోరును తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా 15 నిమిషాలపాటు మౌనదీక్ష చేపట్టి ఆందోళన విరమించారు. అయుత ధర్మ దీక్షలో టీఎస్ సీపీఎస్ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వాల శ్రీకాంత్, కోశాధికారి నరేశ్‌గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జున్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, వివిధ జిల్లాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రాంచంద్రం, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు భుజంగరావు, టీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు అంజిరెడ్డి, రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తెరాస భవన్‌లో జరిగిన కార్యక్రమంలో.. ఓ మహిళా నేతకు కండువా కప్పి తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘంలోకి ఆహ్వానిస్తున్న టీఆర్‌వీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు, ఎంపీ కవిత

నిరంతర విద్యుత్ ప్రపంచంలోనే అద్భుతం

- కేసీఆర్ సంకల్పం దేశానికే ఆదర్శం
- టీఆర్‌వీకేఎస్ గౌరవాధ్యక్షురాలు, ఎంపీ కవిత

ఈనాడు, హైదరాబాద్: రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా ప్రపంచంలోనే అద్భుతమని.. ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం దేశానికే ఆదర్శమని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టీఆర్‌వీకేఎస్) గౌరవాధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపీ కవిత అన్నారు. విద్యుత్ ఉద్యోగుల వల్లనే కేసీఆర్ సంకల్పం ఆచరణ సాధ్యమైందని చెప్పారు. వివిధ విద్యుత్ సంఘాలకు చెందిన నాయకులు ఆదివారం తెలంగాణ భవన్‌లో తెరాస అనుబంధ కార్మిక సంఘంలో చేరారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. నిరంతర ఉచిత విద్యుత్ ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. దేశంలోని మిగిలిన రాష్ట్రాలు దీనిపై అధ్యయనం చేస్తున్నాయన్నారు. విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ సంఘం, పార్టీ ప్రత్యేక శ్రద్ధ చూపుతాయన్నారు. సమావేశంలో ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి, టీఆర్‌వీకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జాన్సన్, ప్రకాశ్, టీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మ సీడీల విడుదల

సమ్మక్క-సారలమ్మల దివ్యచరితపై తెలంగాణ జాగృతి సాంస్కృతిక విభాగం రూపొందించిన పాటల సీడీని ఆ సంస్థ అధ్యక్షురాలు, ఎంపీ కవిత ఆదివారం తమ నివాసంలో ఆవిష్కరించారు. జాగృతి నేతలు నవీన్ ఆచారి, మేడే రాజీవ్‌సాగర్, కొడారి శ్రీను పాల్గొన్నారు.

దివ్యాంగుల కృతజ్ఞతలు

రెండు పడకగదుల ఇళ్ల మంజూరులో తమకు 5శాతం ఇళ్లను కేటాయించడపై దివ్యాంగులు ప్రభుత్వం తరపున ఎంపీ కవితకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి, వికలాంగుల నెట్ వర్క్ అధ్యక్షులు ఎం.శ్రీనివాసులు, కన్వీనర్ అంజనారెడ్డిల నేతృత్వంలో వారు కవితను ఆదివారం ఆమె నివాసంలో కలిశారు.

12 వేల మంది ఎంబీసీలకు నైపుణ్య శిక్షణ

ఒక్కో అభ్యర్థిపై రూ.25 వేల ఖర్చు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని అత్యంత వెనుకబడిన కులాలు(ఎంబీసీలు), సమాఖ్యలకు చెందిన నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇప్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2017-18లో కనీసం 12 వేల మందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించింది. ఒక్కో అభ్యర్థిపై కనీసం రూ.25వేల వరకు ఖర్చుచేయాలని భావిస్తోంది. నైపుణ్య శిక్షణకు దాదాపు రూ.30 కోట్లు బడ్జెట్‌గా ప్రభుత్వం అంచనా వేస్తోంది. సంచార జాతుల్లోని 36 కులాలకు చెందిన 2600 మంది, విశ్వబ్రాహ్మణ వర్గానికి చెందిన 2600 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. కుమ్మరి శాలివాహన వర్గాల్లో 1200 మంది, గీతకార్మిక సమాఖ్య నుంచి 1200 మంది, ఇతర ఎంబీసీల నుంచి 2000మంది నిరుద్యోగులను ఎంపిక చేయనున్నారు. అలాగే ఇప్పటికే ఉన్న సమాఖ్యల్లోని 2400మందికీ శిక్షణ ఇవ్వనున్నారు.

కుమ్మర శాలివాహనులకు ప్యాకేజీ ప్రకటించాలి

విద్యార్థులు, మేధావుల సమావేశం డిమాండ్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని కుమ్మర శాలివాహనుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని, హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లో భవనాలను నిర్మించాలని రాష్ట్ర కుమ్మర విద్యార్థి, మేధావుల సమావేశం డిమాండ్ చేసింది. సమగ్ర కుటుంబ సర్వేలో తమ లెక్కలను తక్కువగా చూపడంతో అన్ని విధాలుగా నష్టపోతున్నామని.. నిజాలను నిగ్గు తేల్చేందుకు ప్రభుత్వం మళ్లీ సర్వే నిర్వహించాలని కోరింది. ఆదివారమిక్కడ ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఐసీఎస్ఎస్ఆర్ సమావేశ మందిరంలో విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కుమ్మర మేధావులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు రవిశంకర్, సంగెం సూర్యారావు, ఎలిశాల కృష్ణ, సీహెచ్ అశోక్, శ్రీశైలం, కందికొండ శ్రీనివాస్, ఏరుకొండ నర్సన్న, కామిశెట్టి శంకర్, వేలాద్రి, ఏరుకొండ శ్రీనివాస్, కంభంపాటి సత్యనారాయణ, వీరన్న, మురుగేశ్, శివానంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ సామాజిక వర్గం అన్ని రంగాల్లో నిర్లక్ష్యానికి గురవుతోందని, జనాభాకు అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం లభించడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. తమ బలాన్ని చాటేందుకు త్వరలోనే భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని ప్రకటించారు.



రాష్ట్ర కుమ్మర శాలివాహన విద్యార్థి, మేధావుల సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

పంచాయతీరాజ్ కొత్త చట్టం రూపకల్పనకు మంత్రివర్గ ఉపసంఘం

సీఎం కేసీఆర్ నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్ : కొత్త పంచాయతీరాజ్ చట్టం రూపకల్పన, సహకార ఎన్నికలపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. దీనిపై ఉత్తర్వులు జారీ చేయాలని ఆదివారం అధికారులను ఆదేశించారు. ఉపసంఘం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన కొనసాగుతుంది. ఇందులో గతంలో పంచాయతీరాజ్ శాఖను నిర్వహించిన ప్రస్తుత వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌లను సభ్యులుగా నియమించారు. ఈ కమిటీ అధ్యయనం అనంతరం కొత్త పంచాయతీరాజ్ బిల్లును సిద్ధం చేస్తుంది. సహకార ఎన్నికలు ఎలా నిర్వహించాలనే అంశంపైనా ప్రభుత్వానికి సిఫార్సులు చేస్తుంది.

కరీంనగర్ జడ్పీ డైనందిని ఆవిష్కరణ

కరీంనగర్ జిల్లా పరిషత్ డైనందినిని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం ప్రగతిభవన్‌లో విడుదల చేశారు. ఇందులో మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఈటల రాజేందర్, హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ కేశవరావు, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, కరీంనగర్ జడ్పీ ఛైర్‌పర్సన్ తుల ఉమ పాల్గొన్నారు.

చెరువులో మునిగి నలుగురు దుర్మరణం

- మృతులంతా ఇంజినీరింగ్ విద్యార్థులే
- ఏలూరు శివారులో దుర్ఘటన

ఈనాడు, ఏలూరు: చెరువులో మునిగి నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతిచెందారు. పోలీసుల, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడికి చెందిన గుమ్మి విజయశంకర్(22), కృష్ణాజిల్లా కలిదిండి మండలం కొండంగి గ్రామానికి చెందిన అంకాల సాయికిరణ్ పరశురామ్(22), కామవరపుకోట మండలం కొత్తూరుకు చెందిన హరికృష్ణరాజు(22) ఏలూరులోని రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. చింతలపూడికి చెందిన కోట సాయి(21) ఈసీఈ ద్వితీయసంవత్సరం చదువుతున్నాడు. వీరంతా స్నేహితులు. రోజూ తమతమ గ్రామాల నుంచి కళాశాల బస్సులో వచ్చి సాయంత్రం ఇళ్లకు వెళ్లిపోతారు. ఈ నేపథ్యంలో శనివారం కళాశాలకని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన వీరు.. కళాశాలకు వెళ్లకుండా సరదాగా షికారుకు ఏలూరు శివారులోని వట్లూరు పెద్ద చెరువు ప్రాంతానికి వెళ్లారు. ఆ చెరువు పక్కనే ఉన్న జామతోటలో సరదాగా కొంతసేపు గడిపారు. ఆ తరువాత దగ్గరలోని చెరువులోకి ఈతకొట్టేందుకు దిగారు. చెరువు లోతుగా ఉండటంతో నీటిలో మునిగి మృతిచెందారు. చెరువు ఊరికి దూరంగా ఉండటంతో ఈ విషయం ఆదివారం ఉదయానికి గాని వెలుగు చూడలేదు. చెరువులో మృతదేహం తేలి కనిపించడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న ఏలూరు డీఎస్పీ ఈశ్వరరావు చెరువు గట్టుమీద కొన్ని దుస్తులు, జామతోటలో విద్యార్థుల గుర్తింపుకార్డులు, చరవాణిలు స్వాధీనం చేసుకుని సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది మృతదేహాలను ఒడ్డుకు చేర్చారు. ఘటనా ప్రాంతాన్ని పరిశీలించిన పోలీసులకు.. చెరువు పక్కనేఉన్న జామతోటలో విద్యార్థుల పుస్తకాలు, భోజనం బాక్సులు, మద్యం బాటిళ్లు, మంచినీళ్లప్యాకెట్లు లభించాయి. దీన్ని బట్టి విద్యార్థులు మద్యంతాగి ఆ మత్తులో చెరువులోకి దిగారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



మృతులు జి.విజయశంకర్, కోట సాయి, సాయికిరణ్ పరశురామ్, కె.హరికృష్ణరాజు

అభివృద్ధిని అడ్డుకుంటూ కాంగ్రెస్ రాక్షసత్వం

కడియం శ్రీహరి ధ్వజం

నాగర్‌కర్నూల్, ఈనాడు డిజిటల్: ఆరు దశాబ్దాల పోరాటంతో సాధించుకున్న తెలంగాణను అభివృద్ధి చేద్దామనుకుంటే కాంగ్రెస్ అడ్డుకుంటూ రాక్షసత్వం ప్రదర్శిస్తోందని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ధ్వజమెత్తారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలకుల వైఖరితో ప్రభుత్వ పాఠశాలలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, రైతులు విద్యుత్తు కొరతతో రోడ్డెక్కేవారని మండిపడ్డారు. ‘నా తెలంగాణ కోటి రతనాల వీణ అని మహాకవి దాశరథి అంటే, నా తెలంగాణ కోటి ఎకరాల మాగాణ అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టుల నిర్మాణానికి రూపకల్పన చేశారు’ అని కడియం పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే.. కాంగ్రెస్ నాయకులు ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. 2019 ఎన్నికల్లో తెరాస 100కుపైగా సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు.

దోపిడీలో దేశంలోనే మొదటి స్థానంలో తెరాస సర్కారు

దామోదర రాజనర్సింహ ధ్వజం

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని దోచుకోవడంలో, అప్పుల ఊబిలోకి నెట్టడంలో దేశంలో తెరాస సర్కారు మొదటి(నెంబర్ వన్) స్థానంలో ఉందని మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ ఆరోపించారు. తమ పార్టీ నేతలపై అధికార పార్టీ నేతలు దాడులు చేస్తే.. ప్రతి దాడులు తప్పవని హెచ్చరించారు. ఆదివారం సంగారెడ్డిలో ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజనర్సింహ మాట్లాడుతూ.. రూ.2 లక్షల కోట్ల అప్పుతో కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల, మిషన్ కాకతీయ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోందని విమర్శించారు. కమీషన్ల కోసం తెరాస నేతలు ఆంధ్రా గుత్తేదారులతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. కుటుంబ పాలన సాగుతోందని ధ్వజమెత్తారు. 24 గంటల విద్యుత్తు సరఫరా ఘనత తమ పార్టీదేనన్నారు. కామారెడ్డి జిల్లా కారేగాంలో మరణించిన వ్యక్తి వీఆర్ఏనా? కాదా? బహిరంగ చర్చకు సిద్ధమా అని మంత్రి కేటీఆర్‌కు సవాల్ విసిరారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు సునీతారెడ్డి, గీతారెడ్డి, ముత్యంరెడ్డి, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, సురేశ్ షెట్కార్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మకు నమ్మకద్రోహం!

- ఎలుకల మందు పెట్టి, గొంతు నులిమి హత్య
- సహజ మరణమని చెప్పి అంత్యక్రియలు, సమాధి నిర్మాణం
- డబ్బుల కోసం ఓ కుమారుడి కిరాతకం
- ప్రకాశం జిల్లాలో ఘోరం



దొడ్డా సుబ్బరత్నం (పాతచిత్రం) ★ నిందితుడు రంజిత్

ఒంగోలు నేరవిభాగం, నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: అమ్మ.. రెండక్షరాల కమ్మని పదం. కట్టుకున్న భర్త, కన్నపిల్లలే తప్ప మరోలోకమెరుగని పిచ్చిమాలోకం. అలాంటి తల్లికి అడుగడుగునా.. అవమానాలు, నమ్మకద్రోహాలే ఎదురవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామంలో తాజాగా ఓ పుత్రరత్నం డబ్బుల కోసం.. ఏకంగా అమ్మనే అంతమొందించాడు. స్థానిక దళితవాడకు చెందిన దొడ్డా సుబ్బరత్నం (54) అలియాస్ సుబ్బులమ్మ భర్త కొన్నేళ్ల క్రితమే మృతి చెందాడు. అప్పటి నుంచి బస్టాండ్ కూడలిలో జామకాయలు అమ్ముకుంటూ ఒక్కాగానొక్క కుమారుడు రంజిత్‌కుమార్(35)ను పెంచింది. పదేళ్ల కిందట వివాహం చేసింది. క్రమేణా రంజిత్‌కుమార్ చెడు వ్యసనాలకు లోనవడంతో అతడి భార్య ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి రంజిత్ తల్లి సంపాదనపైనే ఆధారపడి జీవించేవాడు. తన ఇంటి సమీపంలోనే ఒంటరిగా జీవిస్తున్న మద్దిరాల మణి(40) అనే మహిళతో సంబంధం పెట్టుకున్నాడు. సుబ్బులమ్మ బ్యాంకు ఖాతాలో రూ.2 లక్షలు ఉన్న సంగతి ఇటీవల తెలుసుకున్న రంజిత్.. ఆ డబ్బు తనకు ఇవ్వాలంటూ అప్పటి నంచి వేధించేవాడు. ఇందుకు ఆమె నిరాకరించేది.

డబ్బులు దక్కుతాయని..

తల్లి చనిపోతే బ్యాంకులో డబ్బు తనకు వస్తుందన్న దురాశతో రంజిత్‌కుమార్ ఆమెను చంపడానికి నిర్ణయించుకున్నాడు. ఈ నెల ఒకటో తేదీన రాత్రి భోజనంలో ఎలుకల మందు కలిపి తల్లికి పెట్టాడు. అనంతరం ఏమీ ఎరగనట్లు బయటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి దాటాక ఇంటికి వచ్చాడు. తల్లి మరణించలేదని గుర్తించి.. ప్రియురాలు మణితో కలిసి సుబ్బులమ్మను గొంతు నులిమి చంపేశాడు. రక్తపోటు, మధుమేహంతో బాధపడుతున్న తన తల్లి మంచంపై నుంచి కిందపడి మరణించిందని బంధువులు, గ్రామస్థులకు చెప్పాడు. ఈ నెల మూడో తేదీన అంత్యక్రియలు నిర్వహించాడు. వెంటనే సమాధి కూడా కట్టించాడు. మరోవైపు, సుబ్బులమ్మ హఠాన్మరణం గ్రామస్థుల్లో అనుమానం రేకెత్తించింది. తన తల్లిని తానే చంపానని రంజిత్ కూడా ఒకరిద్దరివద్ద నోరుజారినట్లు ప్రచారం జరిగింది. అది క్రమంగా విస్తరించి పోలీసులకు చేరింది. నాగులుప్పలపాడు ఎస్సై అజయ్‌బాబు గ్రామంలో ఆరా తీయగా.. రంజిత్‌కుమార్ తీరుపై అనుమానాలు బలపడ్డాయి. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నిజం వెల్లడైంది. బ్యాంకులో ఉన్న డబ్బు కోసం తాను, ప్రియురాలు మణి కలిసి తల్లికి ఆహారంలో ఎలుకలమందు కలిపి పెట్టామని, ఆపై గొంతు నులిమి హత్య చేసినట్లు రంజిత్‌కుమార్ పోలీసుల విచారణలో అంగీకరించాడు. దీంతో ఆదివారం సీఐ మురళీకృష్ణ, తహసీల్దారు సుజాత పర్యవేక్షణలో మృతదేహాన్ని వెలికి తీయించారు. అనంతరం రిమ్స్ వైద్యుడు రాజకుమార్ పోస్టుమార్టం నిర్వహించారు.

లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడాలి: అజీజ్‌పాషా

ఈనాడు, హైదరాబాద్: దేశంలో లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థలు ప్రమాదపుటంచుల్లో ఉన్నాయని.. వాటి పరిరక్షణ కోసం వామపక్ష శక్తులు ప్రజా ఉద్యమాలు కొనసాగించాలని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యులు, అఖిల భారత తన్‌జీమ్ ఇన్సాఫ్ అధ్యక్షుడు సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. ఆదివారం మఖ్దూం భవన్‌లో తన్‌జీమ్ ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మున్నీర్ పటేల్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మండలి సమావేశంలో అజీజ్‌పాషా ప్రసంగించారు.

ప్రజలను మోసం చేస్తున్న రాజకీయ పార్టీలు: శరద్‌యాదవ్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: దేశంలో 70 ఏళ్లుగా అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు ప్రజలను మోసం చేస్తూనే ఉన్నాయని, వారిని ఓటు బ్యాంకులుగానే చూస్తున్నాయని జేడీయూ నేత, కేంద్ర మాజీమంత్రి శరద్‌యాదవ్ అన్నారు. విశాఖలో ఆదివారం జరిగిన కేంద్ర మాజీ మంత్రి పి.శివశంకర్ స్మారక సమావేశంలో శరద్‌యాదవ్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ రంగాలన్నీ రాజ్యాంగానికి కట్టుబడి పనిచేయాలని, ప్రస్తుతం దీనికి భిన్నమైన వాతావరణం కేంద్రంలో నెలకొందని విమర్శించారు. రాజ్యాంగాన్ని మార్చడానికి కూడా సిద్ధపడుతున్నారని ఆరోపించారు. 2019ఎన్నికలు ముఖ్యమైనవని.. ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో శివశంకర్ కుమారుడు డా.వినయ్, మర్రి శశిధర్‌రెడ్డి, బొజ్జల లక్ష్మీభాయ్, బాబూద్దీన్‌ఖాన్, ఆచార్య కె.ఎస్.చలం, వి.వి.రామారావు పాల్గొన్నారు.

జడ్జీల నియామకంలో రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

ఖైరతాబాద్, నల్లకుంట, న్యూస్‌టుడే: న్యాయ వ్యవస్థ అగ్రకులాల చేతిలో బందీ అయిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య అన్నారు. వ్యవస్థలో అందరికీ అవకాశాలు కల్పిస్తూ జడ్జీల నియామకంలో రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరముందన్నారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం, తెలంగాణ న్యాయవాదుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన హైకోర్టు న్యాయవాదుల సమావేశంలో కృష్ణయ్య మాట్లాడారు. సుప్రీం కోర్టు, హైకోర్టుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన జడ్జీల నియామకం కల్పించాలన్నారు. అన్ని రకాల న్యాయవాదుల నియామకాల్లో బీసీలకు 54శాతం కేటాయించాలన్నారు. హైకోర్టు న్యాయవాది ఎన్.శ్రీనివాస్ యాదవ్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

23న నల్గొండలో నిరుద్యోగుల గర్జన

ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరుతూ ఈ నెల 23న నల్గొండలో ‘నిరుద్యోగుల గర్జన’ నిర్వహించనున్నట్లు ఆర్.కృష్ణయ్య తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేసేంతవరకు ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో జరిగిన నిరుద్యోగుల ఐకాస సమావేశంలో ఆయన మాట్లాడారు.

కారును ఢీకొడతావా.. కాళ్లు మొక్కు!

- ఆర్టీసీ డ్రైవర్ చేత మొక్కించిన తెరాస నేత
- ఫిర్యాదు ఇచ్చేందుకు వెళ్తే తన్నిన ఎస్ఐ
- సీఐ వద్ద వాపోయిన డ్రైవర్

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు, కారును ఢీకొట్టిన ఘటనలో తెరాస నేత పోలీస్‌స్టేషన్‌లోనే బస్సు డ్రైవర్‌తో కారు యజమాని కాళ్లను మొక్కించారు. సిద్దిపేట్ జిల్లా, కొండపాకకు చెందిన దొమ్మాట యాదయ్య హకీంపేట్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈనెల 5న 25హెచ్ రూట్ నెంబరు బస్సులో తిరుమలగిరివైపునకు వెళ్తూ ప్రమాదవశాత్తు కారును ఢీకొట్టాడు. దీంతో వాహనం కొంతమేర దెబ్బతింది. ఈవిషయమై డ్రైవర్ యాదయ్య, కండక్టర్ అంజయ్య తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. ఎస్సై రామరాజు వీరి మాటలను పూర్తిగా వినకుండానే దురుసుగా ప్రవర్తిస్తూ ఆర్టీసీ వారితోనే ప్రమాదాలు జరుగుతున్నాయంటూ అసభ్యకర పదజాలంతో దూషించాడు. కండక్టర్‌ను వెనక నుంచి కాలితో తన్ని యాక్సిడెంట్ అంటే ఇలా ఉంటుందని పేర్కొన్నట్లు యాదయ్య ఠాణా సీఐ రాజేశ్వర్‌రావుకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈకేసు విషయమై యాదయ్య, అంజయ్య ఆర్టీసీ అధికారులతో కలిసి ఈనెల 6న ఠాణాకు వచ్చారు. అదే సమయంలో కారు యజమాని యోగేశ్ స్థానిక తెరాసనేత రవీందర్ గుప్తాతో కలిసి వచ్చారు. యోగేశ్ కేసు పెట్టకుండా ఉండాలంటే కారు మరమ్మతుకు డబ్బులు చెల్లించడమే కాకుండా, అతని కాళ్లు పట్టుకొని క్షమించమని అడగాలని తెరాస నేత డిమాండ్ చేశారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో యాదయ్య తనను క్షమించాలంటూ యోగేశ్‌ను బతిమిలాడి అతని కాళ్లు మొక్కాడు. కారు బాగుచేయించుకోవడానికి రూ.5వేలను సైతం ఇచ్చినట్లు కండక్టర్ అంజయ్య పేర్కొన్నాడు. కాగా, ఓ వైపు ఫ్రెండ్లీ పోలీసింగ్ అని అంటున్నా ఎస్సై ప్రవర్తన సరికాదని, ఆయనపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని యాదయ్య ఇన్‌స్పెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈవిషయమై సీఐ రాజేశ్వర్‌రావును వివరణ కోరగా బస్సు, కారును ఢీకొట్టిన ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేశామని, ఇరువర్గాలను పిలిపించి ఒప్పందం కుదిర్చామనడంలో ఎలాంటి వాస్తవంలేదని పేర్కొంటుండడం గమనార్హం.

నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు: సీఎల్‌సీ

హైదరాబాద్, న్యూస్‌టుడే: తెరాస ప్రభుత్వం అవలంబిస్తోన్న ప్రజావ్యతిరేక, నియంతృత్వ వైఖరితో ప్రజా ఉద్యమాలను కాపాడుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని పౌర హక్కుల సంఘం(సీఎల్‌సీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య గడ్డం లక్ష్మణ్, ఉపాధ్యక్షులు వి.రఘునాథ్, రాష్ట్ర కార్యదర్శి నారాయణరావులు ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఏ శక్తీ ఆపలేదన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగను అరెస్టు అప్రజాస్వామికమని ధ్వజమెత్తారు.

రుణ విముక్తి బిల్లును ప్రవేశపెట్టేలా ఒత్తిడి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రైతుల అభ్యున్నతికి కోసం ప్రతిపాదించిన రుణ విముక్తి బిల్లు, గిట్టుబాటు ధర హక్కుగా పొందే బిల్లులను వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టేలా ఒత్తిడి తీసుకొస్తామని అఖిల భారత రైతు పోరాట సమన్వయ కమిటీ (ఏఐకేఎస్‌సీసీ) నేతలు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో రుణ విముక్తి, గిట్టుబాటు ధర హక్కు బిల్లులపై ప్రత్యేక చర్చ చేపట్టారు. జిల్లాల్లో రైతు సంఘాలు, నిపుణులతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు.

ట్యాంకులో ఊపిరాడక.. ముగ్గురు కార్మికుల మృతి

బెంగళూరు, న్యూస్‌టుడే: మురుగు నీటి శుద్ధి ట్యాంకును శుభ్రం చేస్తున్న ముగ్గురు కార్మికులు విషవాయువుల ప్రభావంతో మృతి చెందారు. బెంగళూరు సోమసుందర పాళ్యలోని ఎఫ్.డి.సఫల్ అపార్ట్‌మెంట్ వద్ద ఆదివారం ఈ ఘటన జరిగింది. మృతులను మాదేగౌడ (45), నారాయణస్వామి (38), శ్రీనివాస్ (52)గా గుర్తించారు. ప్రతి అపార్ట్‌మెంట్ నుంచి మురుగునీటిని బయటకు వదిలే ముందు.. శుద్ధి చేసి కాలువల్లోకి వదలాలన్న నిబంధనకు అనుగుణంగా ఈ శుద్ధి కేంద్రాలను నిర్మించారు.

బొగ్గు అన్వేషణకు ప్రతిబంధకాలు

- ౧౧,౦౬౧ మిలియన్ టన్నుల నిక్షేపాల గుర్తింపునకు రాని అనుమతులు
- ౮౦ శాతం నిల్వలు అటవీక్షేత్రాల్లో ఉండటంతోనే...
- సింగరేణి విస్తరణలో జాప్యం

గోదావరిఖని, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవడం అటవీ క్షేత్రాల్లో బొగ్గు నిక్షేపాల నిర్ధరణకు ప్రతిబంధకంగా మారుతోంది. ఇది సింగరేణి విస్తరణలో జాప్యానికి కారణమవుతోంది. ఇప్పటివరకు 10,846.17 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలను నిర్ధరించగా మరో 11,062.05 మిలియన్ టన్నుల నిక్షేపాలను గుర్తించాల్సి ఉంది. ఇందులో 80 శాతం నిల్వలు అటవీ క్షేత్రాల్లోనే ఉండటంతో సింగరేణి అన్వేషణ విభాగానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. రాష్ట్రంలో సింగరేణి ప్రస్తుతం 31 భూగర్భ, 18 ఉపరితల గనుల ద్వారా బొగ్గు ఉత్పత్తి చేస్తోంది. కొత్త గనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసుకున్న క్రమంలో అటవీ ప్రాంతాల్లోని బొగ్గు నిల్వల నిర్ధరణ పనులు వేగంగా ముందుకు సాగడం లేదు. గోదావరి పరీవాహక ప్రాంతంలో 21,908.22 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలున్నట్లు అంచనా వేశారు. అందులో 10,846.17 మిలియన్ టన్నుల బొగ్గును నిర్ధరించగా ఇప్పటివరకు 1310.58 మిలియన్ టన్నులను వెలికితీశారు. బొగ్గు నిర్ధరణకు అటవీ శాఖ అనేక ఆక్షేపణలు ముందుకు తెస్తోంది. అన్వేషణ పనుల్లో భాగంగా అటవీ ప్రాంతంలో ఎన్ని చెట్లు కోల్పోతే అంతకు రెట్టింపు స్థాయిలో మరో చోట మొక్కలు నాటాలన్న నిబంధనలు తీసుకొచ్చింది. వన్యప్రాణులున్న ప్రాంతాల్లో ఎక్కువ శబ్దం చేయకుండా బోర్లు వేయాలన్న నిబంధనలు కచ్చితంగా పాటిస్తేనే అనుమతులు మంజూరు చేస్తోంది. బొగ్గు నిర్ధరణకు సవివరణ నివేదికలు తయారు చేయడానికి దగ్గరగా బోర్లు తవ్వుతూ అన్వేషణ పనులు చేపట్టాల్సి ఉంటుంది. ముందుగా డీజీపీఎస్(డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం) ద్వారా బోర్లు వేసే ప్రాంతాన్ని పరిశీలించిన తర్వాతే అనుమతులు మంజూరు చేస్తోంది. సాధారణంగా ఉపరితల గని కోసం చదరపు కిలోమీటరుకు 12 నుంచి 15 బోర్లు వేస్తేనే సవివరణ నివేదిక తయారు చేసే అవకాశం ఉంటుంది. అలాగే భూగర్భ గనికి పొరల నిర్మాణం ఆధారంగా మరింత దగ్గరగా బోర్లు వేయాల్సి ఉంటుంది. కాగా అటవీ శాఖ చదరపు కిలోమీటరుకు 2 బోర్లకు మాత్రమే అనుమతినిస్తోంది. దీంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉన్న బొగ్గు నిక్షేపాలను వెలికితీసేందుకు సింగరేణికి మరింత సమయం పట్టనుంది.

మహాసముద్రాలపై భారత్ పట్టు

- పసిఫిక్ అగ్ని వలయ ప్రభావిత ప్రాంతాలకు భారత జాతీయ మహాసముద్ర సమాచార సేవా కేంద్రం సేవలు
- 11 ద్వీపకల్ప దేశాల ప్రతినిధులకు భాగ్యనగరిలో శిక్షణ

ఈనాడు, హైదరాబాద్: మహాసముద్రాలపై భారత్ పట్టు సాధిస్తోంది. ఇన్నాళ్లూ హిందూ మహాసముద్రానికే పరిమితమైన పరిశోధనలు... ఇప్పుడు పసిఫిక్ మహాసముద్రంవైపు సాగుతున్నాయి. నెలకోసారి పసిఫిక్ ద్వీపకల్పాలను అతలాకుతలం చేస్తున్న సునామీలపై హైదరాబాద్‌లోని భారత జాతీయ మహాసముద్ర సమాచార సేవా కేంద్రం (ఇన్‌కాయిస్) శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. భయంకరమైన పసిఫిక్ అగ్ని వలయం (పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్) ప్రాంతాలకు ఆపన్నహస్తం అందించారు. ప్రపంచ మహాసముద్ర అధ్యయనంలో భారత్‌కు దక్కిన అరుదైన గౌరవమిది. ఇప్పటివరకు అమెరికాపై ఆధారపడిన ద్వీపకల్ప దేశాలు... ఇప్పుడు భారత్ సాయం తీసుకోవడమే అందుకు నిదర్శనం!

ఏమిటీ అగ్ని వలయం?

పసిఫిక్ మహాసముద్రంలో భయంకరమైన ప్రాంతమిది. ప్రపంచంలోని 90% భూకంపాలు అక్కడే సంభవిస్తాయి. వాటిలో 80% అత్యంత తీవ్రంగా ఉంటున్నాయి. అందుకే దీనిని 'పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్'గా పిలుస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా గత 11 వేల సంవత్సరాల్లో సంభవించిన 25 భారీ విస్ఫోటకాల్లో మూడు అక్కడివే! సముద్ర గర్భంలోని భూఫలకాలు ఎక్కువగా కదులుతుంటాయి. చిన్న, పెద్ద అనే తేడాలేకుండా భూకంపాలు నిత్యం నమోదవుతుంటాయి. వాటిలోని తీవ్రమైన భూకంపాలు సునామీని సృష్టిస్తాయి. వీటి కారణంగా ప్రాణ, ఆర్థిక నష్టం భారీగా ఉంటుంది.

పరిష్కారం లేదెందుకు?

పసిఫిక్ ద్వీపకల్ప దేశాలు సాంకేతికంగా అభివృద్ధి చెందలేదు. అలాగని విపత్తులకు భయపడి ప్రజలు వలస వెళ్లట్లేదు. చాలా ద్వీపకల్పాల్లో జనసాంద్రత ఎక్కువగా ఉంటోంది. సాంకేతికత, సన్నద్ధతను మెరుగుపరుచుకుంటే విపత్తులను సమర్థంగా ఎదుర్కోవచ్చు. ప్రస్తుతం ఆ దిశగా ప్రయత్నాలు మొదలయ్యాయి.



పసిఫిక్ మహాసముద్రంలోని 'రింగ్ ఆఫ్ ఫైర్'

కచ్చితమైన ఫలితాలను చూపించాం

దక్షిణ పసిఫిక్‌లోని 'ఫిజి' దేశంలో నవంబరు, 2017న అంతర్జాతీయ సదస్సు జరిగింది. భారత్-పసిఫిక్ ద్వీపాల సుస్థిర అభివృద్ధిపై అందులో విస్తృతంగా చర్చించాం. సునామీలను ఎదుర్కొనేందుకు ఇన్‌కాయిస్ రూపొందించిన వ్యవస్థలను ఆయా దేశాలకు వివరించాం. అవి సాధించిన కచ్చితమైన ఫలితాలను చూపించాం. దీంతో అప్పటివరకు అమెరికా సాయం తీసుకుంటున్న దేశాలు... ఇప్పుడు భారత్‌వైపు దృష్టి మళ్లించాయి.

– పట్టాభి రామారావు, సీనియర్ శాస్త్రవేత్త, ఇన్‌కాయిస్


విదేశీ ప్రతినిధులకు శిక్షణ ఇస్తున్న సీనియర్ శాస్త్రవేత్త పట్టాభి రామారావు

ప్రయోగాత్మక శిక్షణ ఇచ్చాం



మొదటిదశ కింద అగ్ని వలయ పరిధిలోని మార్షల్, పలావు, సోలోమన్, సమోవా, నౌరు, నువే, వనౌతు, కిరిబటి, ఫిజి, కుక్ ఐలం, టోంగ దేశాల ప్రతినిధులకు తర్ఫీదు ఇచ్చాం. ఎప్పుడు, ఎక్కడ, ఎలా సునామీ సంభవిస్తుందో వివరించాం. విశ్వవ్యాప్త గుర్తింపు పొందిన పొటెన్షియల్ ఫిషింగ్ జోన్, ఓసెన్ స్టేట్ ఫోర్‌కాస్ట్ విధానాలను తెలియజేశాం. సునామీ సమాచారాన్ని 95% కచ్చితత్వంతో తీర ప్రాంతాలకు వేగంగా తెలియజేసి, నష్టాన్ని తగ్గించడంపై ప్రయోగాత్మక శిక్షణ ఇచ్చాం. విశాఖపట్నం, పూరి (ఒడిశా) సముద్ర తీర ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించాం. ఇండో-పసిఫిక్ ద్వీపాల బంధాన్ని మరింత విస్తృతపరుస్తాం.

– డాక్టర్.ఎస్.ఎస్.సీ.శెనాయ్, సంచాలకులు, ఇన్‌కాయిస్

ప్రశాంతంగా ముగిసిన 'పీజీ నీట్'

ఈనాడు, హైదరాబాద్: పీజీ వైద్యవిద్యలో ప్రవేశాల కోసం నిర్వహించిన జాతీయ స్థాయి అర్హత ప్రవేశ పరీక్ష(నీట్) ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. తెలంగాణలో హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈ పరీక్షకు సుమారు 11,473 మంది విద్యార్థులు హాజరయ్యారు. గతేడాది నుంచి నీట్ ద్వారా పీజీ వైద్యవిద్య సీట్లను భర్తీ చేస్తుండగా.. ఈ ఏడాది తొలిసారిగా ప్రతికూల మార్కులనూ ప్రవేశపెట్టారు. మొత్తం 300 ప్రశ్నలుంటాయి. గతేడాది నీట్ ప్రశ్నపత్రం కంటే ఈ ఏడాది కొంత కఠినంగా ప్రశ్నలొచ్చాయనీ, ముఖ్యంగా అనుభవపూర్వక పరిజ్ఞానంతో కూడిన ప్రశ్నలు ఎక్కువగా ఉన్నాయని కొందరు విద్యార్థులు తెలిపారు. ఆన్‌లైన్ పరీక్ష కావడంతో తెల్ల కాగితాలు, పెన్ను, పెన్సిల్‌తో అవసరం లేదనే భావనతో పలు కేంద్రాల్లో వాటిని విద్యార్థులకు అందజేయలేదు. గతేడాది కూడా ఆన్‌లైన్‌లో నిర్వహించినా అప్పుడు కాగితాలు, పెన్సిళ్లు అందించారు. ఈ ఏడాది ప్రశ్నల్లో గణాంకాలకు ప్రాధాన్యమున్న ప్రశ్నలు రావడంతో.. కాగితం అవసరమైందనీ, పర్యవేక్షకులను అడిగినా వాళ్లకూ ఆదేశాలు లేకపోవడంతో ఇచ్చేందుకు నిరాకరించారనీ, ఫలితంగా నియమిత సమయంలోపు పరీక్షను పూర్తిచేయడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నామని విద్యార్థులు చెప్పారు. జాతీయ స్థాయిలో ఒకేరోజు ఒకే ప్రశ్నపత్రంతో నీట్ నిర్వహించామనీ, గతేడాది విద్యార్థులు ఎదుర్కొన్న కొన్ని ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది పరీక్ష కేంద్రాల సంఖ్యను తెలుగు రాష్ట్రాల్లో పెంచామని జాతీయ పరీక్షల మండలి(ఎన్‌బీఈ) పాలకమండలి సభ్యుడు డాక్టర్ రవిరాజ్ తెలిపారు.

ఏపీ నుంచి 12,872మంది హాజరు

ఈనాడు, అమరావతి: నీట్ పీజీ-2018 ప్రవేశ పరీక్షను ఆదివారం జాతీయ పరీక్షల మండలి(ఎన్‌బీఈ) నిర్వహించింది. కంప్యూటర్ ఆధారిత పరీక్షలో 300 ప్రశ్నలతో కూడిన ప్రశ్నపత్రాన్నిచ్చారు. హైదరాబాద్‌తో సహా ఏపీలో పది కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎన్‌బీఈ పరిపాలన సంస్థ సభ్యుడు రవిరాజు తెలిపారు. ఏపీలో 12,872మంది, తెలంగాణలో 11,473 మంది పరీక్షలకు హాజరైనట్లు వెల్లడించారు.

విత్తన కంపెనీల్లో ముగిసిన ఐటీశాఖ సోదాలు

ఈనాడు, హైదరాబాద్ : విత్తన కంపెనీల్లో ఆదాయపన్నుశాఖ సోదాలు శనివారం రాత్రి ముగిశాయి. నూజివీడు సీడ్స్, కావేరీ సీడ్స్ సంస్థలకు చెందిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లోని కార్యాలయాలు, యాజమాన్యాలకు సంబంధించిన ఇళ్లలో మూడు రోజులపాటు 20కిపైగా ప్రత్యేక బృందాలు సోదాలు కొనసాగించాయి. ఈ సందర్భంగా పలు దస్త్రాలు, కంప్యూటర్ హార్డ్‌డిస్కులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం రెండు సంస్థలూ కలిసి దాదాపు రూ.800 కోట్లకు పన్ను చెల్లించాల్సి ఉంటుందని ఆదాయపన్ను అధికారులు లెక్కగట్టినట్లు తెలుస్తోంది. ఈ కంపెనీలు రైతుల నుంచి విత్తనాలు కొనుగోలు చేస్తున్నట్లు, ఇది వ్యాపారం పరిధిలోకే వస్తుంది కాబట్టి పన్ను చెల్లించాల్సిందేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. విత్తన సంస్థల యాజమాన్యాలు మాత్రం తాము రైతుల నుంచి భూములు లీజుకు తీసుకొని సాగు చేస్తున్నామని, వ్యవసాయ ఆదాయానికి పన్ను మినహాయింపు ఉంటుంది కాబట్టి తాము పన్ను చెల్లించాల్సిన అవసరం లేదని చెబుతున్నట్లు సమాచారం. దీనిపై నాలుగు రాష్ట్రాల్లోని దాదాపు వందమంది రైతుల నుంచి వాంగ్మూలం నమోదు చేయగా.. వారంతా తమ వద్ద నుంచి సంస్థలు విత్తనాలు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారని తెలిసింది. దీని ఆధారంగానే ఇప్పుడు అధికారులు ఉచ్చు బిగించినట్లు సమాచారం. రైతులు, విత్తన సంస్థల మధ్య జరిగిన లావాదేవీల విలువ రూ.800 కోట్ల వరకు ఉంటుందని లెక్కగట్టిన అధికారులు దానికి 30 శాతం పన్ను చెల్లించాల్సిందేనని పట్టుబడుతున్నారు. మొత్తంమీద మూడు రోజులపాటు నిరంతరాయంగా జరిగిన దాడులు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారాయి.



రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఆదివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ మైదానంలో నిర్వహించిన 'చాకలి పోరుగర్జన' సభలో మాట్లాడుతున్న బిహార్ మాజీ మంత్రి శ్యాంరజక్. వేదికపై హరియాణా రాష్ట్ర నేత అమిత్ ఖత్రీ, చాకలి రాష్ట్ర కమిటీ నేతలు, ఇతర ప్రతినిధులు ★ పెద్ద సంఖ్యలో హాజరైన రజకులు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

- 'చాకలి పోరుగర్జన'లో నేతల డిమాండ్

సరూర్‌నగర్, న్యూస్‌టుడే: తెలంగాణలో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని బిహార్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే శ్యాంరజక్ డిమాండ్ చేశారు. చాకలి ఎస్సీ సాధన సమితి కన్వీనర్ కొత్తకొండ శ్రీలక్ష్మి పాదయాత్ర ముగింపు సందర్భంగా ఆదివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం మైదానంలో 'చాకలి పోరుగర్జన' బహిరంగ సభను నిర్వహించారు. ముఖ్యఅతిథి శ్యాంరజక్ మాట్లాడుతూ.. రజకుల్లో అధికంగా పేదలున్నారని, ఐక్యంగా ఉండి ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న అంశాలను, ప్రధాన డిమాండ్‌ను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొత్తకొండ శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చడం సామాజిక న్యాయమన్నారు. రాష్ట్రంలో 32 లక్షల రజక కులస్థులు ఉన్నారని.. పదివేల మందికి కూడా ఉద్యోగాలు లేవని పేర్కొన్నారు. తమకు వాషింగ్ మిషన్లు వద్దని, ఎస్సీ జాబితాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. 2019 నాటికి తమ సమస్యలపై స్పందించకపోతే బలమైన నిర్ణయం తీసుకొని ముందుకెళ్తామని శ్రీలక్ష్మి చెప్పారు. వివిధ సంఘాల ప్రతినిధులు ఎలిజాల శ్రీనివాస్, అమిత్ ఖత్రి, సుబ్బారావు, రాంచందర్, అంజిబాబు, దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

సభలో తీర్మానాలు..

- రజకులను ఎస్సీ జాబితాల్లో చేర్చేందుకు తీర్మానాన్ని వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో పెట్టి ఏకగ్రీవంగా ఆమోదించేలా ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేయాలి. ఆ తీర్మానాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేలా ప్రధానిని ఒప్పించాలి.
- 50 ఏళ్లు నిండిన చాకలి వృత్తిదారులకు 2 వేల పింఛను ఇవ్వాలి.
- ప్రతి చాకలి కుటుంబానికి 3 ఎకరాల వ్యవసాయ భూమి కేటాయించాలి.

రైతులపై కాంగ్రెస్‌ది మొసలి కన్నీరు: తెరాస

ఈనాడు, హైదరాబాద్: అధికారంలో ఉన్నప్పుడు రైతుల ఉసురుతీసిన కాంగ్రెస్ ఇప్పుడువారి గురించి మొసలికన్నీరు కారుస్తోందని తెరాస ఎమ్మెల్సీ భాను ప్రసాద్‌రావు విమర్శించారు. ఆదివారం తెరాస ఎల్పీ కార్యాలయంలో మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఏనాడూ రైతులను పట్టించుకోలేదని, స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయలేదన్నారు. రాష్ట్రప్రభుత్వం రైతు సంక్షేమ చర్యలు చేపట్టడంతో తమకు పుట్టగతులుండవనే కొత్త నాటకాలకు తెరతీస్తోందని విమర్శించారు. ఆర్మూర్ డిక్లరేషన్ అంటూ కాంగ్రెస్ ప్రకటించిన విధానం బూటకమన్నారు.

'రేవంత్‌కు మంత్రుల గురించి మాట్లాడే అర్హత లేదు'

తెదేపా నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డికి తెరాస మంత్రుల గురించి మాట్లాడే అర్హతే లేదని రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాలసంస్థ(టీఎస్‌ఐఐసీ) ఛైర్మన్ గ్యాదరి బాలమల్లు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మళ్లీ గెలవలేననే భయంతో పదవికి రాజీనామా చేయకుండా తప్పించుకొని తిరుగుతున్న రేవంత్‌రెడ్డి అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

9న ఆర్టీసీ కార్మికుల ధర్నా: ఎన్‌ఎంయూ

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 9న బస్‌భవన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ఎన్‌ఎంయూ ఛైర్మన్ ఎం.నాగేశ్వర్‌రావు, అధ్యక్షులు కమాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

తల్లీకూతుళ్ల బలవన్మరణం

- వేధింపులు, ఆస్తి వివాదాలే కారణమా?

వీపనగండ్ల, న్యూస్‌టుడే: ఇద్దరు కుమార్తెలతో కలిసి తల్లి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలంలో ఆదివారం జరిగిన ఘటనతో గోపల్‌దిన్నె గ్రామంలో విషాదం అలముకుంది. మండలంలోని రంగవరం గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి కుమార్తె రోజా (28)కు, గోపల్‌దిన్నె గ్రామానికి చెందిన జనస్ కుమార్‌రెడ్డికి ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి లక్ష్మీలాష (5), వందన (3) కుమార్తెలు. జనస్ కుమార్‌రెడ్డి మానసికస్థితి సరిగా లేకపోవడంతో కుటుంబ బాధ్యతలను ఆయన తల్లిదండ్రులే చూసుకునేవారు.

కుంగదీసిన కుటుంబ కలహాలు

వివాహ సమయంలో కట్నంగా రూ.లక్ష నగదు, నాలుగు తులాల బంగారం ఇచ్చేలా ఒప్పందం కుదరగా. రోజా తల్లిదండ్రులు రెండు తులాల బంగారం ఇంకా ఇవ్వలేదని సమాచారం. ఈ విషయమై అత్తమామలు ఆమెను వేధిస్తున్నట్లు తెలిసింది. దీంతోపాటు..మామ ఈశ్వర్‌రెడ్డి తన పేరుమీద ఉన్న కొంత భూమి, ప్లాట్లు తదితర ఆస్తులను తన కుమార్తె పేరుమీద పట్టా చేయించినట్లు తెలుసుకున్న ఆమె మరింత కుంగిపోయింది. ఒకవైపు వేధింపులు, మరోవైపు ఆస్తి తనకు, పిల్లలకు కాకుండా చేశారన్న బాధతో ఆదివారం పిల్లలతో సహా తమ వ్యవసాయ బావిలోనే దూకి ఆత్మహత్యకు ఒడిగట్టింది. తొలుత తల్లి, పెద్ద కుమార్తె మృతదేహాలు దొరికాయి. రాత్రి పొద్దుపోయాక వందన మృతదేహం లభ్యమైంది. ఇంట్లో పురుగు మందు కలిపిన గ్లాసులు ఉండటాన్ని బట్టి బావిలో దూకేముందు రోజా పురుగు మందు తాగి ఉంటుందని, పిల్లలు తాగకపోవడంతో బావిలో దూకాలని నిర్ణయించుకుని ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు.


మృతి చెందిన తల్లి, ఇద్దరు కుమార్తెలు

584 మండలాల్లో ఒకేసారి 5కే రన్

విజయవాడ, న్యూస్‌టుడే: జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో ఆదివారం 13 జిల్లాల్లో నిర్వహించిన 5కే పరుగులో రెండు ప్రపంచ రికార్డులు నమోదయ్యాయని శాప్ ఉపాధ్యక్షుడు, ఎండీ బంగార్రాజు తెలిపారు. ఆదివారం సాయంత్రం శాప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "2010 సెప్టెంబరు 23న స్విట్జర్లాండ్‌లోని గ్లోబల్ ఎనర్జీస్ ఆధ్వర్యంలో ఒకే పరుగును 36 నగరాల్లో నిర్వహించి ప్రపంచ రికార్డు నెలకొల్పారు. ఆదివారం రాష్ట్రంలోని 584 మండలాల్లో ఒకే సమయంలో 5కే పరుగును విజయవంతంగా నిర్వహించి ఆ రికార్డును అధిగమించాం. 2013 మేలో స్విట్జర్లాండ్‌లో నిర్వహించిన పరుగులో 2,07,979 మంది పాల్గొని రికార్డు నమోదు చేశారు. ఆదివారం నిర్వహించిన పరుగులో 3,33,699 మంది పాల్గొని ఆ రికార్డును అధిగమించారు" అని బంగార్రాజు తెలిపారు.

సూర్యకుమారి బదిలీకి ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: విజయవాడ దుర్గగుడి కార్యనిర్వహణాధికారి ఎ.సూర్యకుమారి బదిలీ ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఆమెను సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాలని అందులో పేర్కొన్నారు. దేవాదాయశాఖ కమిషనర్ వై.వి.అనురాధకు దుర్గగుడి ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.


పరిశ్రమకు అవసరమైన భూమి కోసం పటంలో పరిశీలిస్తున్న కేంద్రబృందం

ఉక్కు పరిశ్రమ కోసం కేంద్ర బృందం పరిశీలన

బయ్యారం, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన వనరులను పరిశీలించేందుకు కేంద్ర బృందం ఆదివారం ఇక్కడికి చేరుకుంది. ఈ ప్రాంతంలో ఉక్కు పరిశ్రమకు అవసరమైన భూమి, విద్యుత్తు, నీటి వనరులు, రవాణా తదితర అంశాలపై బృందం సమీక్షించింది. రాంచీకి చెందిన కుముద్ రంజన్ (డీసీఎం ప్రాజెక్ట్ మేనేజర్), యూఎస్ రజాక్ (డీజీఎం లేఅవుట్ అండ్ లాజిస్టిక్స్), ఆనంద్‌కుమార్ (మేనేజర్ మైన్స్ అండ్ బెనిఫికేషన్), శశిభూషణ్‌కుమార్ (మేనేజర్ హైడ్రో, ఇంజినీర్) ఈ బృందంలో ఉన్నారు. మండలంలోని నామాలపాడు ప్రాంతంలో 2 వేల ఎకరాల అటవీ భూమితోపాటు మరో 2 వేల ఎకరాల అసైన్డ్‌భూమి ఉన్నట్లు అటవీశాఖ, రెవెన్యూ అధికారులు బృందానికి తెలిపారు. తర్వాత బృందం బయ్యారం పెద్దచెరువును పరిశీలించింది. బయ్యారం సమీపంలో విద్యుత్ ఉపకేంద్రం వివరాలను ఆరా తీశారు. గార్ల రైల్వేస్టేషన్‌నూ పరిశీలించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్నట్లు జిల్లాలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటుకు ఉన్న వనరులను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం అనిశెట్టిపల్లి, కిన్నెరసాని, ఉలవనూరు తదితర ప్రాంతాలనూ పరిశీలించినట్లు తెలిపారు. నివేదికను ఉక్కు మంత్రిత్వ శాఖకు అందజేస్తామన్నారు.

మేడారం జాతరకు ముమ్మర ఏర్పాట్లు

- కొనసాగుతున్న పలు శాఖల పనులు
- ౧౫లోగా పూర్తి చేసేందుకు కసరత్తు

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి (తాడ్వాయి, న్యూస్‌టుడే): మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతర ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరగనుంది. రెండేళ్లకోసారి జరిగే మహావేడుకను ఘనంగా నిర్వహించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి జాతరకు సుమారు 1.20 కోట్ల మంది భక్తులు వస్తారని అధికారుల అంచనా. జాతరలో ఏర్పాట్లకు, అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.80.55 కోట్ల నిధులను మంజూరు చేసింది. మొత్తం 20 శాఖలకు 530 పనులకు ఈ మొత్తాన్ని కేటాయించింది. నవంబరు చివరివారంలో మొదలైన పనులు పూర్తికావస్తున్నాయి. జనవరి 15లోపు పనులు పూర్తి చేసేందుకు అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

ముఖ్యమైన పనుల తీరుతెన్నులిలా!

- రహదారులు, భవనాలశాఖకు రూ.20 కోట్ల నిధులు కేటాయించారు. మహాముత్తారం మండలం పడిగిపల్లి నుంచి కాల్వపల్లి వరకు రహదారి విస్తరణ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. మేడారంలో మూడుచోట్ల బీటీ రహదారులు రీనివల్ అవుతున్నాయి. బారికేడింగ్ పనులు 80 శాతం పూర్తయ్యాయి. ఆలుబాక ప్రాంతంలో రెండు హెలిప్యాడ్ల నిర్మాణం సాగుతోంది.
- తాగునీరు, పారిశుద్ధ్యానికి రూ.22 కోట్లు కేటాయించారు. మొత్తం 10,480 తాత్కాలిక, అర్ధశాశ్వత, ప్లాస్టిక్ మరుగుదొడ్లు నిర్మించనున్నారు. జీఐ షీట్‌లు, సెప్టిక్ ట్యాంకు కోసం కందకాలు సిద్ధం చేస్తున్నారు. తాగునీటి సరఫరా, పైపులైను పనులు పూర్తికావస్తున్నాయి. జంపన్న వాగులోని ఊట బావుల్లో పూడికతీత పూర్తయింది. మిషన్ భగీరథ నీటి సరఫరాకు చేపట్టిన ట్యాంకు పనులు పూర్తవుతున్నాయి.
- దేవాదాయశాఖకు 2.60 కోట్లు నిధులు కేటాయించారు. వాగు సమీపంలో రెండుచోట్ల కల్యాణ కట్టల నిర్మాణ పనులు పూర్తవుతున్నాయి. గద్దెల ఆవరణలో విద్యుత్తు దీపాల ఏర్పాటు పనులు పూర్తయ్యాయి.
- నీటిపారుదలశాఖకు రూ.4.60 కోట్లు కేటాయించారు. వాగులో నీటి నిల్వకు అడ్డుకట్టల పనులు కొనసాగుతున్నాయి. షవర్ల బిగింపు పనులు పూర్తయ్యాయి. దుస్తులు మార్చుకునేందుకు భారీగా కంపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారు.
- వైద్యారోగ్యశాఖకు రూ.1.33 కోట్లు కేటాయించారు. 54 వైద్య శిబిరాలు ఏర్పాటు చేయబోతున్నారు. ఇప్పటికే రూ.66 లక్షలతో మందులు సరఫరా అయ్యాయి. 940 మంది సిబ్బంది వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాల్గొననున్నారు.
- గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్(ఐటీడీఏ) విభాగానికి రూ.4 కోట్లు కేటాయించారు. తితిదే కల్యాణ మండపం విస్తరణ పనులు పూర్తికావస్తున్నాయి. చిలకలగుట్ట చుట్టూ కంచె ఏర్పాటు పనులు పూర్తవుతున్నాయి.
- జిల్లా పంచాయతీరాజ్‌శాఖకు పారిశుద్ధ్య నిర్వహణ నిమిత్తం రూ.24.1 కోట్ల నిధులు కేటాయించారు. జాతర ప్రదేశాల్లో చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయిస్తున్నారు.
- విద్యుత్తు శాఖకు రూ.4 కోట్లు కేటాయించారు. తాడ్వాయి నుంచి మేడారం వరకు 11కేవీ విద్యుత్తు లైను పనులు పూర్తయ్యాయి. 33/11 కేవీ మినీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. నియంత్రికలు, తీగల బిగింపు, విద్యుత్తు దీపాలు పనులు పూర్తవ్వాలి.
- ఆర్టీసీకి రూ.2.48 కోట్ల నిధులు కేటాయించారు. మేడారంలో బస్టాండ్ ప్రాంతాన్ని చదును చేశారు. టికెట్ బుకింగ్ కౌంటర్లు, బారికేడ్ల నిర్మాణం, పందిళ్లు, మైక్‌లను ఏర్పాటు చేశారు.
- పోలీస్‌శాఖకు రూ.11 కోట్లు కేటాయించారు. ట్రాఫిక్ నియంత్రణకు రూట్‌మ్యాప్‌ను సిద్ధంచేసి పనులు చేపడుతున్నారు. సీసీ కెమేరాలు, స్టాపర్స్, చెక్‌పోస్టుల ఏర్పాటుకు స్థలాలు గుర్తిస్తున్నారు. పార్కింగ్ ఏరియాలో, హోల్డింగ్స్ పాయింట్స్‌ను గుర్తించారు. 250 సీసీ కెమేరాలు, 4 డ్రోన్లతో జాతరపై నిఘా ఏర్పాటు చేయనున్నారు. ఇవి తుదిదశలో ఉన్నాయి.


విద్యుత్తు నియంత్రిక అమరుస్తున్న సిబ్బంది


బీటీ రహదారి పనులు


నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లు

రూ.పది వేలతో చెక్‌డ్యాం


భాన్‌జీభాయ్ తక్కువ ఖర్చుతో తయారు చేసిన ట్రాక్టర్

2002... సౌరాష్ట్ర రైతులు వర్షాభావంతో అల్లాడిపోతున్న రోజులు... పొలాలకే కాదు, తాగడానికి నీరు లేని గడ్డు పరిస్థితులు. గుజరాత్ రాష్ట్రం జునాఘడ్ జిల్లాకు చెందిన భాన్‌జీభాయ్ అనే రైతు చలించిపోయారు. దీనికి ఎలాగైనా పరిష్కారం కనుక్కోవాలని తపించారు. చెక్‌డ్యాంలు కట్టుకోవడం ద్వారా నీటిని నిల్వ చేసి, భూగర్భ జలాలు పెంచవచ్చని తలంచారు. తలచిందే తడవుగా నలుగురు కూలీలతో చెక్ డ్యాం పనులు ప్రారంభించారు. నిర్మాణం పూర్తయ్యే సరికి, అతనికి అయిన ఖర్చు రూ.10,000. ఆ తర్వాత కురిసిన వర్షానికి అక్కడ నీరు నిలిచింది. ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లోని బోర్లలో భూగర్భజలాలు పెరిగాయి. పరిసరాలు పచ్చగా తయారయ్యాయి. దీన్ని చూసిన పలుగ్రామాల కర్షకులు భాన్‌జీభాయ్‌ని సంప్రదించారు. తామే ఖర్చు భరిస్తామని తమ గ్రామాల్లోనూ చెక్‌డ్యాంలు నిర్మించాలని కోరారు. ఇలా ఆయన ఇప్పటి వరకూ తక్కువ ఖర్చుతో గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో మొత్తం 25 చెక్‌డ్యాంలు కట్టారు. ఈయన సేవలు గుర్తించిన నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ లైఫ్‌టైం అచీవ్‌మెంటు అవార్డు-2017తో సత్కరించింది. గతంలోనూ ఈయన కర్షకులకు తక్కువ ధరలో ట్రాక్టర్లు, స్ప్రేయర్లు తయారు చేసిచ్చారు. 82 ఏళ్ల వయస్సులోనూ అన్నదాతల కోసం ఇంకా ఏమైనా చేయాలని ఉందని చెబుతున్నారాయన.

వైవిధ్యం



ఇక్కడ సంక్రాంతి 9 రోజులు

భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ... మనకు తెలిసిన సంక్రాంతి పర్వదినం రోజులు...

కానీ తొమ్మిది రోజులు పండగ జరుపుకునే సంప్రదాయం సంగతి తెలుసా...

విజయనగరం జిల్లా చీపురుపల్లి సమీపంలో ఉన్న ఇటకర్లపల్లి గ్రామం వెళ్లామనుకోండి...

అక్కడా సంబరాన్ని చూసెయ్యొచ్చు...



ఇటకర్లపల్లి గ్రామం చీపురుపల్లికి 12 కిలోమీటర్ల దూరంలో ఉంది. సంక్రాంతి పండుగ దేశవ్యాప్తంగా మూడు లేదా నాలుగు రోజులు జరుపుకొంటే ఇక్కడ మాత్రం తొమ్మిది రోజులు వేడుకలు నిర్వహించే కుటుంబాలున్నాయి. గ్రామంలో మీసాల, కొంచాడ, కెల్ల ఇంటిపేరున్న 200 కుటుంబాలు భోగికి ముందుగా వచ్చే ఆది, సోమ, మంగళవారాల్లో సంక్రాంతి సంబరాలు మొదలు పెడతారు. మీసాల కుటుంబీకులు ఈ విషయంలో ఓ అడుగు ముందుంటారు. వారి ఇళ్లల్లో సంక్రాంతి రోజు పెద్దలకు బియ్యం, నూతన వస్త్రాలు చూపించి తరువాత సరదాల్లో మునిగి తేలుతారు. దేశ, విదేశాల్లో ఎక్కడ ఉన్నా ఆయా కుటుంబాలు ఇటకర్లపల్లి చేరుకోవాల్సిందే. తొమ్మిది రోజుల సంబరాల్లో పాల్గొనాల్సిందే. ఇక్కడ ఇంకో ఆసక్తికర విషయం ఉంది... సాధారణంగా దేవుడికి సమర్పించే నైవేద్యంలో సంప్రదాయ వంటకాలు పెడతారు. ఇక్కడ మాత్రం సంప్రదాయ వంటకాలతో సహా శాకాహార, మాంసాహారాలను ప్రసాదంగా సమర్పిస్తారు. ఇలా ముందుగా పండగ చేసుకోవడం ఆనాదిగా వస్తున్న సంప్రదాయమని, దీని వెనక కారణాలు మాత్రం తమకు తెలీదని, మా పూర్వీకులు పాటించిన విధానాన్నే నేటికీ పాటిస్తున్నామంటూ వారంతా చెబుతున్నారు. ఈ పండగలో భాగంగా వీరంతా భోగి మంటలకు దూరంగా ఉంటారు. 100 ఏళ్ల క్రితం భోగి మంటలు వేస్తుండగా అందులో పిల్లి పడి మృతి చెందడంతో అప్పటి నుంచి భోగి మంటలకు దూరంగా ఉంటున్నామన్నారు.

– కేవీ సురేష్‌కుమార్, చీపురుపల్లి గ్రామీణం

● *అయ్యో నాయనా గీ పొద్దు జల్ది పండుకున్నవేందే.. లే గా సంఘం రేడియో టైమైంది...*
అరే రోజంతా చేను దగ్గర పనిజేసి అలిసిపోయి గా విషయమే మర్చిపోయిన బిడ్డా వస్తున్నాలే.

● *అమ్మా చీకటైంది నీ వంటపనులు జల్ది ముగించుకుని రావే.. సంఘం రేడియో సుద్దులు షురువైనాయి..*

సాయంత్రం అయిందంటే చాలు ఆ గ్రామాల్లో ఇదే సందడి. అమ్మా,నాన్న, నానమ్మ, తాతయ్య, పిల్లాపాపలు ఒక దగ్గరకు చేరి మధ్యలో రేడియోను పెట్టుకుని 'సంఘం రేడియో' ప్రసారాల కోసం ఎదురు చూస్తున్న దృశ్యాలు మనకు అనేక కుటుంబాల్లో కనిపిస్తాయి. మారుమూల పల్లెలకు కూడా డిజిటల్‌లో ప్రసారాలు అందుతున్న ఈ రోజుల్లో సంఘం రేడియో ప్రసారాలంటే ఎందుకింత ఆసక్తి..?

ఇంతింతై..



ఇది సంఘం రేడియో...
మీకందరికీ నమస్తె..!

రంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంతంలో సరిగ్గా సాయంత్రం ఏడు అయిందంటే చాలు... 'ఇది సంఘం రేడియో, వింటున్న మీకందరికి నమస్తె..' అంటూ ఓ పలకరింపు... అక్కడి నుంచి ఆ కార్యక్రమాలు ఆ ఇళ్లలో భాగమైపోతాయి. ఇంటిల్లిపాది చెవులూ రేడియోలకు అతుక్కుపోతాయి. మా ఊరి పాటలు, మా ఊరి మాటలు, దర్వాజలో దవాఖానా, మన వంటలు, మన రుచులు, ఊరి వార్తలు, యారండ్ల ముచ్చట్లు, మహిళల ఆర్థిక స్వావలంబన, న్యాయసలహాలు, బాలానందం, చావిడికట్ట కథలు, మీ లెటర్, మన భాష, మన సంస్కృతి, పర్యావరణం... ఇలా అన్నీ స్థానికుల అంశాలే. వారికి ఉపయోగపడే కార్యక్రమాలే. వారి నిత్య జీవితంతో ముడి పడిన విశేషాలే... ఒక దాని వెంట ఒకటి ప్రసారం అవుతుంటే అక్కడి ప్రజలు వినకుండా ఎలా ఉండగలరు.


జహీరాబాద్ సమీపంలోని మాచునూరు శివారులో డీడీఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న 'సంఘం రేడియో' విశేషాలివి. దేశంలో ఎన్నో రేడియోలున్నా దీన్ని గురించి ప్రత్యేకంగా ఎందుకు చెబుతున్నామనుకుంటున్నారా.. ఆగండాగండి అక్కడికే వస్తున్నాం. స్థానిక సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టే రీతిలో గ్రామీణ ప్రాంతాలకు ఉపయోగ పడేలా మహిళలతో రూపొందించిన కార్యక్రమాలను ప్రసారం చేస్తూ ఈ రేడియో అందరి మన్ననలను అందుకుంటుంది. ఈ ప్రసారాలు స్థానిక ప్రజలకు ఉపయోగపడటమే కాకుండా ఆసక్తికరంగా సాగుతున్నాయి. తమ పొలాల్లో వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి చేరుకుని తీరిగ్గా కబుర్లు చెప్పుకునే సమయానికి ఈ రేడియో పలకరిస్తుంది. సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరుగుతున్న ఈ ప్రసారాలకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది.

సాధారణంగా రేడియో ప్రసారాలంటే ఎవరో రూపొందించిన కార్యక్రమాలను విని సంతోషించడమే. కానీ సంఘం రేడియో అలా కాదు ఇందులో అక్కడి ప్రజలే భాగస్వాములు. అక్కడి ఆచార వ్యవహారాలు, సంస్కృతి, రోజు వారీ జీవనానికి ఉపయోగపడే అంశాలన్నీ ప్రచారాంశాలే. ఇప్పుడు 15 మంది మహిళలు తమకు కేటాయించిన గ్రామాల్లో అంశాలను కథనాలుగా తీర్చిదిద్దే పనిలో ఉన్నారు. చాలాకాలంగా వ్యవసాయం చేస్తున్న రైతుల అనుభవాలతో కూడిన కథనాలు, పండగలు, పర్వదినాలు, సేంద్రియ సాగు, స్థానిక యాసలో ప్రసారం చేస్తుండటంతో అందరికీ సులువుగా అర్థమవుతోంది.



మహిళలే నిర్వాహకులు

జహీరాబాద్ మండల పరిధిలోని పస్తాపూర్ గ్రామంలో మూడు దశబ్దాల క్రితం డక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) పేరుతో ఆవిర్భవించిన సంఘం తర్వాత వారి జీవనాడిగా మారింది. జహీరాబాద్, కోహీర్, న్యాల్‌కల్, ఝరాసంగం, రాయికోడ్ మండలాల్లోని 70కి పైగా గ్రామాల్లో 5వేల పైచిలుకు మహిళలతో సంఘాలను ఏర్పాటు చేసింది. వారి వికాసం కోసం వివిధ కార్యక్రమాలను చేపడుతున్న ఈ సొసైటీ ఆధ్వర్యంలోనే ఈ రేడియో కూడా ఏర్పాటైంది. 2008లో కేంద్ర ప్రభుత్వం, యునెస్కో సహకారంతో రూ.30 లక్షలతో ఏర్పాటైన ఈ రేడియో చాలా తక్కువ సమయంలోనే అక్కడి ప్రజల... ముఖ్యంగా మహిళల జీవితంలో భాగమైపోయింది. టీవీలు వచ్చినా, కేబుల్ ప్రసారాలు ప్రారంభమైనా, చివరకు డిజిటల్ మీడియా వచ్చినా ప్రజలను కట్టిపడేస్తోందంటే ఇందులో వచ్చే ప్రసారాల్లో ఉన్న స్థానికతే కారణం. మరో ఆసక్తికరమైన విషయమేంటంటే ఈ రేడియో స్టేషన్‌ను మహిళలే నిర్వహిస్తున్నారు. నేడు అనేక సంస్థల్లో సాంకేతిక నైపుణ్యం ఉన్న పట్టభద్రులు సైతం తికమక పడుతుంటే పదో తరగతి వరకు మాత్రమే చదువుకున్న రేడియో నర్సమ్మ, జనరల్ నర్సమ్మ అనే ఇద్దరు మహిళలు ఈ కేంద్రాన్ని విజయవంతంగా నడిపిస్తున్నారు. అంశాల ఎంపిక నుంచి, ఎడిటింగ్, ప్రసారాల పనులన్నీ వారే చూసుకుంటారు. ఈ విషయంలో సంస్థ డైరెక్టర్ పి.వి.సతీష్ పాత్ర చిరస్మరణీయం. డీడీఎస్ సంస్థలో పనిచేస్తున్న నలుగురు దళిత యువతులకు రేడియో ప్రసారాలపై ప్రత్యేకంగా శిక్షణనిప్పించారు. అప్పట్లో వారు ఈ ప్రాంతంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి రెండు వేల గంటలకు సరిపడా కథనాలను సిద్ధం చేశారు.'మా ఊరి రేడియో.. మన కోసమే రేడియో' నినాదంతో సాగుతున్న సంఘం రేడియో ఏడాదిలో 365 రోజులు పాటు రోజూ రాత్రి 7-9 గంటల సమయాల్లో 90.4 ఫ్రీక్వెన్సీలో ప్రసారాలు అందిస్తోంది. డీడీఎస్‌లో పనిచేస్తున్న మహిళలు నివసించే సుమారు 200 పైచిలుకు గ్రామాల ప్రజలు వీటిని వింటున్నారు.



ప్రస్తుతం రేడియోలు, టెలివిజన్, సినిమాలు స్థానిక ప్రజలకు అర్థం అయ్యే భాషల్లో రావడం లేదు. అందుకే మా ప్రాంతానికి చెందిన కార్యక్రమాలు, స్థానిక భాషతో కార్యక్రమాలను ప్రసారం చేస్తున్నాం. ఈ ప్రాంతంలోని రైతులు, మహిళలు, చిన్నపిల్లలకు సంబంధించిన కార్యక్రమాలు చేపట్టాం. గ్రామీణులతో పోటీలు, సేంద్రియ ఎరువుతో వ్యవసాయంలకు ఎక్కువ సమయం ఇస్తాం.

–జనరల్ నర్సమ్మ



మాకు పెద్ద పెద్ద చదువులు రాకపోయినా డీడీఎస్ ద్వారా అందించిన శిక్షణతో రేడియోకు చెందిన పరిజ్ఞానం నేర్చుకుని నిర్వహిస్తున్నాం. ప్రారంభంలో కొంత కాలం తికమక పడినా ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేకుండా నడిపిస్తున్నాం.

–రేడియో నర్సమ్మ

మంథన్ అవార్డు సొంతం

'సంఘం రేడియో వింటున్నా.. మీ అందరికి జనరల్ నర్సమ్మ నమస్కారం'.. 'వండేవాళ్లు వంటజేస్తూ.. ఇంకా తినెటోళ్లు తినుకుంటూ మన సంఘం సుద్దులు వినుండ్రీ', 'అక్కా మనం కలిసి పోదామే..మన సంఘంలో మాట్లాడా', అక్కా మన పంటలకు, పెంట ఎరువు ఏద్దాము, భూమిని బతికించుకుందాం, పత్తి పంట మనకొద్దు, మన పంటలే మనకు ముద్దు లాంటి గీతాలతో ప్రజలను చైతన్యవంతం చేస్తున్న సంఘం రేడియోకు ప్రతిష్ఠాత్మక మంథన్ అవార్డు దక్కింది. రేడియో ప్రసారాలను పర్యవేక్షించే అల్గోల్ నర్సమ్మ దిల్లీలో ఈ అవార్డు అందుకుంది. రేడియో ప్రసారాల కేంద్రం, నిర్వహణ జరుగుతున్న తీరును దేశ, విదేశాల ప్రతినిధులు ప్రశంసించిన సందర్భాలున్నాయి.

– టేకూర్ అంజయ్య, న్యూస్‌టుడే, జహీరాబాద్



కోడి కోసమని...

కోర్టు ఆదేశాలు ఒకపక్క.. పోలీసుల ఆంక్షలు మరోవైపు.. పందేలు వేస్తే కఠిన చర్యలు తప్పవన్న అధికారుల హెచ్చరికలు.. గ్రామాల్లో కోళ్లకు కత్తులు కట్టేవారిపై బైండోవర్ ... ఇవన్నీ కొనసాగుతుండగానే తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకించి గోదావరి జిల్లాల్లో పందెం రాయుళ్లు పుంజులను సిద్ధం చేస్తున్నారు... ఈ కోడిపందేలు సంక్రాంతి పండగ నాలుగు రోజులూ చర్చనీయాంశమైనా... వీటి వెనుక కొన్ని ఆసక్తికర విషయాలున్నాయి.. పుట్టుక, పెంపకం, తిండి, సిద్ధం చేసే విధానం ఆశ్చర్యాన్నిగొలుపుతాయి.

పెంచేదిలా...

● మంచి పోరాట పటిమ ఉన్న పుంజులతో పెట్టలకు జతకట్టించి వాటి గుడ్లను పొదిగి పిల్లలను కొంత సైజు వరకు పెంచి అమ్ముతారు. వాటిని గోదావరి జిల్లాల్లోని కొందరు భూస్వాములు తెచ్చి తమ తోటల్లో ఉంచి పెంచుతారు.

● సంక్రాంతి బరిలో నిలిపేందుకు కోడిపుంజులను నాలుగు నెలల ముందే ఎంపిక చేసుకుని వాటిని ప్రత్యేకంగా పోషిస్తారు. ఆగస్టులో సంవత్సరంకన్నా ఎక్కువ వయసున్న పుంజులను తీసుకొచ్చి పెంచుతారు.

● పందేలపై మోజు ఉండే వారు సంక్రాంతికి రెండు నెలల ముందుగానే పెంపకందారుల వద్ద ఉన్న పుంజులను ఎంచుకొని వాటికి సగం మొత్తం అడ్వాన్స్ ఇచ్చి.. అప్పటి నుంచి వాటి పెంపకానికయ్యే ఖర్చును కూడా ఇచ్చేసి వెళతారు. మంచి పందెం కోడి ధర రూ.15,000 నుంచి లక్ష వరకు సందర్భాలున్నాయి.

● గోదావరి జిల్లాల్లోని కొందరు భూస్వాములు పందెం పుంజులను బొబ్బిలి ప్రాంతం నుంచి తీసుకొస్తుంటారు.


జాగింగ్... ఈత..

● సంక్రాంతి బరిలో నిలిపేందుకు కోడిపుంజులను సిద్ధం చేయడం అంటే ఆషామాషీ కాదు. అప్పటివరకు గుగ్గిళ్లు, గంట్లు, రాగులు, చోళ్లు ఆహారంగా అందిస్తే.. సంక్రాంతికి నాలుగు నెలల ముందు నుంచి వీటి మెనూ పూర్తిగా మారిపోతుంది. బలవర్థకమైన ఆహారంతో పాటు వ్యాయామాలు చేయిస్తారు.

● పందెం పుంజుతో ఉదయమే జాగింగ్ చేయిస్తారు. తరువాత నీటిలో గంటపాటు ఈత కొట్టిస్తారు. ఇలా చేయడం వల్ల కోడికి సామర్థ్యం పెరుగుతుందని అంటారు.


● ఈత కొట్టిన తరువాత కొంత సమయం ఎండలో ఉంచుతారు. తరువాత గుడ్లు, బాదం పప్పు పెడతారు. మధ్యాహ్నం మటన్ కైమా, సాయంత్రం చోళ్లు, గంట్లు, రాగులు పెట్టి విశ్రాంతి ఇస్తారు.

● విశేషం ఏంటంటే పుంజులకు ప్రత్యేకంగా మసాజ్ చేస్తారు. గోరువెచ్చని నీటితో ఒళ్లంతా తుడుస్తారు. రెక్కల ఈకలను ప్రత్యేకమైన దువ్వెనతో దువ్వుతారు. ఇలా చేయడం వల్ల కోడి ఉల్లాసంగా ఉంటుందని చెబుతారు. వైద్య పరీక్షలు క్రమం తప్పకుండా చేయిస్తారు.


మైల: ఎరుపు, బూడిద రంగు ఈకలు


కొక్కిరాయి: నలుపుతో మరో రెండు మూడు రంగులు


కాకి: నల్లటి ఈకలు


డేగ: ఎర్రటి ఈకలు


సవల
మెడపై నల్లని ఈకలు


పింగళ: తెలుపు రెక్కలపై అక్కడక్కడా నలుపు రంగు, లేత గోధుమరంగు ఈకలు

శాస్త్రం ప్రకారం బరిలోకి...

● కోడిపందేల కోసం ఏకంగా ఓ పంచాంగమే ఉంది. దీనిపేరు 'కుక్కుట శాస్త్రం'. కుక్కుటం అంటే కోడిపుంజు. ఈ శాస్త్రాన్ని ఎవరు రాశారన్న దానిపై స్పష్టత లేకున్నా ప్రాచుర్యంలో ఉంది. ఇది పూర్తిగా కోడిపందేల గురించే చర్చిస్తుంది. శుక్లపక్షం, కృష్ణపక్షం అనుసరించి ఏ రోజున ఏ రకం పుంజు పందేనికి వేయకూడదో కూడా చెప్పారు. నక్షత్రాల ప్రభావం మానవుల పైనే కాకుండా పక్షులు, జంతువులపై కూడా ఉంటుందని... 27 నక్షత్రాలు కోళ్లపై ప్రభావం చూపుతాయని చెబుతారు. ఏ నక్షత్రానికి చెందిన కోడి ఏ నక్షత్రానికి చెందిన ప్రత్యర్థి కోడిపై విజయం సాధిస్తుందో ఈ శాస్త్రాన్ని బట్టే నిర్ణయిస్తారు. వారంలో ఏ రోజు ఏ దిశలో పందేనికి వదలాలో కూడా అందులో వివరించారు. ఈ విషయాలన్నీ చెప్పడానికి గోదావరి జిల్లాల్లో కొందరు పంచాంగకర్తలు కూడా ఉన్నారు.




● కుక్కుట శాస్త్రంలో పుంజుల సంరక్షణ, వాటి వర్గీకరణ, ఏ సమయాల్లో ఏ కోడిని పందేలకు వదలాలి తదితర అంశాలుంటాయి. అనేక మంది రాజులు దీన్ని అనుసరించే కోడిపందేలు నిర్వహించే వారని చెబుతారు. ఇప్పుడు ఈ శాస్త్రంతో ఓ యాప్‌నే నిర్వహిస్తున్నారులెండి.

● కోడి పందేల నిర్వాహకులు ఇప్పుడు సాంకేతికతను కూడా వినియోగించుకుంటున్నారు. భీమవరం, వెంప, మురమళ్లలో జరిగే పందేలను ఎక్కడో అమెరికాలో ఉండే ఎన్ఆర్ఐలు ఆన్‌లైన్‌లో వీక్షించగలుగుతున్నారు. అందుకు అనుగుణంగా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం స్కైప్, ఇతర ఆన్‌లైన్ వీడియో స్ట్రీమింగ్ సైట్ల ద్వారా పనికానిచ్చేస్తున్నారు.

– మేకల నాగేశ్వరరావు, రాజమండ్రి

ఈనాడు సినిమా

మళ్లీ సైకిల్ ఎక్కుతాడా?


పవన్‌కల్యాణ్

జీవితంలో మనం కోరుకొనే ప్రతి సౌకర్యం వెనకాల ఓ మినీ యుద్ధమే ఉంటుందంటున్నారు పవన్‌కల్యాణ్. మరి 'అజ్ఞాతవాసి'గా ఆయన చేసిన యుద్ధం ఎలాంటిదో తెలియాలంటే మాత్రం సినిమా చూడాల్సిందే. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అజ్ఞాతవాసి'. కీర్తి సురేష్, అను ఇమ్మాన్యుయేల్ కథానాయికలు. ఎస్.రాధాకృష్ణ నిర్మాత. ఈ నెల 10న చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఇటీవలే ట్రైలర్‌ని విడుదల చేశారు. "ఇది మనం కూర్చునే కుర్చీ. పచ్చటి చెట్టుని గొడ్డలితో పడగొట్టి, రంపంతో ముక్కలు ముక్కలుగా కోసి, బెరడుని బ్లేడుతో సానబెట్టి, ఒళ్లంతా మేకులతో కొట్టి కొట్టి తయారు చేస్తాం. ఎంత హింస దాగుందో కదా...' అంటూ మొదలవుతుంది ట్రైలర్. కౌగిలించుకోలేదండీ..., మళ్లీ సైకిలెక్కుతాడా వర్మా.., వీడి చర్యలు ఊహాతీతం... అనే సంభాషణలు ట్రైలర్‌లో వినిపిస్తూ వినోదాన్ని పంచుతాయి. పవన్ శైలి మాస్ అంశాలు ట్రైలర్‌లో పుష్కలంగా కనిపిస్తాయి. సంక్రాంతిని పురస్కరించుకొని భారీ అంచనాల మధ్య విడుదలవుతున్న ఈ చిత్రంలో ఖుష్బూ, ఆది పినిశెట్టి, రావు రమేష్ తదితరులు నటించారు. అనిరుధ్ స్వరాలు సమకూర్చారు.

ఇవే ఆనంద క్షణాలు


అల్లు శిరీష్, వి.ఐ ఆనంద్, సీరత్ కపూర్

"కొత్తగా ప్రయత్నిస్తే కచ్చితంగా మంచి ఫలితం వస్తుందన్న భరోసా కల్పించింది మా 'ఒక్క క్షణం'. ఇక మీదటా ఇదే పంథాలో కథలు ఎంచుకుంటా" అన్నారు అల్లు శిరీష్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఒక్క క్షణం'. వి.ఐ ఆనంద్ దర్శకత్వం వహించారు. హైదరాబాద్‌లో అల్లు శిరీష్ మాట్లాడుతూ "నా తొలి చిత్రం 'గౌరవం'. అందులో ఓ కొత్త తరహా ప్రయత్నం చేశాం. కానీ విజయం అందుకోలేదు. అందుకే.. 'కొత్త జంట' నుంచి కమర్షియల్ సినిమాలే చేస్తూ వచ్చా. కానీ మళ్లీ ధైర్యం చేసి 'ఒక్క క్షణం' అనే కథని ఎంచుకున్నా. ఈ విజయంతో నా నమ్మకం నిజమైంది. నా కెరీర్‌లో ఆనంద క్షణాల్ని అందించింద"న్నారు. దర్శకుడు చెబుతూ "కథని నమ్మి ఖర్చు పెట్టారు నిర్మాత చక్రి చిగురుపాటి. సాంకేతిక నిపుణులు కూడా చక్కటి సహకారం అందించార"న్నారు. "2017లో మంచి సినిమాల్లో నటించే అవకాశం లభించింది. కొత్తయేడాది ఓ సానుకూల దృక్పథంతో ప్రారంభమైంద"ని కథానాయిక సీరత్ కపూర్ చెప్పింది.

యువతరానికీ నచ్చింది


రామచంద్ర వారణాసి, అల్లాణి శ్రీధర్, అశోక్ కుమార్

"ఏడుకొండలవాడి మహిమలతో తెరకెక్కించిన 'శ్రీ చిలుకూరు బాలాజీ' పెద్దలకే కాదు, యువతరానికీ నచ్చింది. చిన్న చిత్రాలు మరిన్ని తెరకెక్కించాలన్న ఉత్సాహాన్ని తీసుకొచ్చింద"న్నారు అల్లాణి శ్రీధర్. ఆయన స్వీయ దర్శకత్వం వహించిన చిత్రమిది. ఫిల్మీడియా ప్రొడక్షన్ సంస్థ నిర్మించింది. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో చిత్రబృందం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. దర్శకుడు మాట్లాడుతూ "ఈ సినిమా బయటకు వస్తుందో లేదో అనే అయోమయంలో ఉన్నప్పుడు కేవలం ప్రచార చిత్రాలు చూసి ప్రముఖ పంపిణీదారులు ముందుకొచ్చి విడుదల చేశారు. పండక్కి పెద్ద సినిమాలొస్తున్నాయి. అయినా సరే, పండగ వెళ్లిపోయిన తరవాత మళ్లీ మా చిత్రానికి థియేటర్లు ఇస్తామని భరోసా కల్పించారు. త్వరలో విదేశాల్లోనూ ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు. "ఇలాంటి మంచి చిత్రాలకు నటుడిగా నావంతు సహకారం అందిస్తా"అన్నారు అశోక్ కుమార్. ఈ కార్యక్రమంలో పంపిణీదారుడు రామచంద్ర వారణాసి కూడా పాల్గొన్నారు.

గ్రహచారం ఆడిన ఆటరా


మంచు విష్ణు

ఇక్కడంటే రూపాయికి రూపాయే. అదే అమెరికాలో ఒక్క డాలర్‌కి అరవై ఆరు రూపాయలు. అందుకే అమెరికాలో వాలిపోయారు ఆచారి, ఆయన శిష్య బృందం. మరి అక్కడికెళ్లాక వాళ్లకి ఎదురైన అనుభవాలు ఎలాంటివి? ఆశించినట్టుగా వాళ్ల జీవితాలు కళకళలాడాయో లేదో? తెలియాలంటే 'ఆచారి అమెరికా యాత్ర' చూడాల్సిందే. విష్ణు మంచు కథానాయకుడిగా నటించిన చిత్రమిది. ప్రగ్యా జైస్వాల్ కథానాయిక. జి.నాగేశ్వర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. కీర్తి చౌదరి, కిట్టు నిర్మిస్తున్నారు. యమ్.ఎల్.కుమార్ చౌదరి సమర్పకుడు. ఆదివారం టీజర్‌ని విడుదల చేశారు. 'ఆచారం అమెరికా యాత్ర... గ్రహచారం ఆడిన ఆటరా' అంటూ సాగే గీతంతో పాటు... విష్ణు మంచు, బ్రహ్మానందంల మధ్య సరదా సంభాషణలతో నవ్వుల్ని పంచింది టీజర్. "హాస్య ప్రధానంగా సాగే చిత్రమిది. అమెరికా, మలేసియా, హైదరాబాద్‌ల్లో కీలక సన్నివేశాల్ని తెరకెక్కించాం. మంచు విష్ణు, జి.నాగేశ్వరరెడ్డి కలయికలో వచ్చిన 'దేనికైనా రెడీ', 'ఈడో రకం ఆడో రకం' ప్రేక్షకుల్ని ఎంతగానో అలరించాయి. మరోసారి అదే తరహాలో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించబోతోందీ చిత్రం. ఈనెల 26న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామ"ని చిత్రవర్గాలు తెలిపాయి. తనికెళ్ల భరణి, కోట శ్రీనివాస్ రావు, పోసాని కృష్ణమురళి, పృథ్వి, ప్రవీణ్, విద్యుల్లేఖ రామన్, ప్రభాస్ శ్రీను, ప్రదీప్ రావత్, ఠాకూర్ అనూప్‌సింగ్, సురేఖవాణి తదితరులు నటించిన ఈ చిత్రానికి రచన: మల్లాది వెంకటకృష్ణమూర్తి, మాటలు: డార్లింగ్ స్వామి, సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: సిద్ధార్థ్.

తెలుగు భాష గొప్పదనం తెలిసింది

"చాలా కాలం తరవాత నన్ను నేను తెరపై చూసుకున్న సినిమా 'గ్యాంగ్'. కొత్తదనానికి కమర్షియల్ అంశాల్ని జోడించాం" అన్నారు సూర్య. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'గ్యాంగ్'. ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో పాత్రికేయులతో మాట్లాడారు సూర్య.



■ "బాలీవుడ్‌లో విజయం సాధించిన 'స్పెషల్ ఛబ్బీస్'కి ఇది రీమేక్. మక్కీకి మక్కీ తీయలేదు. మనవైన మార్పులు చేశాం. కథలోని మూలం అలానే ఉంటుంది. మిగిలిన అంశాలు కొత్తగా ఉంటాయి. కార్తీక్, రమ్యకృష్ణలాంటి అనుభవజ్ఞులతో కలసి పనిచేయడం ఆనందంగా ఉంది. విఘ్నేష్ ఈ కథని తీర్చిదిద్దిన విధానం ఆకట్టుకుంటుంది. తను స్వతహాగా మంచి రచయిత. అది ఈ సినిమాకి బాగా పనికొచ్చింది"

■ "ఈమధ్య కమర్షియల్ అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నానేమో అనిపించింది. కొత్తదనానికి దూరం అవుతున్నానేమో అనే భావన మొదలైంది. 'గ్యాంగ్'లాంటి సినిమా ఆ లోటుని తీర్చింది. నేను పరిశ్రమలోకి వచ్చిన కొత్తలో ఎలా ఉన్నానో, ఎలా మాట్లాడేవాడినో గుర్తు తెచ్చిన సినిమా ఇది. అందుకే నా మనసుకు దగ్గరైంది. నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పుకొన్నా. ఎందుకంటే ఇందులో నా డైలాగులన్నీ ఓ కొత్త పంథాలో ఉంటాయి. డబ్బింగ్ చెబుతున్నప్పుడు చాలా ఆస్వాదించా. 'సుందర తెలుగు' అని ఎందుకు అంటారో అర్థమైంది. తెలుగు భాష గొప్పదనం తెలిసింది"

■ "రజనీకాంత్, కమల్‌హాసన్ రాక తమిళ రాజకీయాల్లో గొప్ప మార్పుని తీసుకొస్తుందని భావిస్తున్నా. ప్రజలకు ఏదో మంచి చేద్దామన్న ఉద్దేశం వాళ్లది. దారులు వేరైనా.. ఇద్దరూ మంచి మిత్రులు. అభిమానం వేరు, రాజకీయాలు వేరు అనే సంగతి వాళ్లకు తెలుసు. సినిమా గ్లామర్ మీదే ఓట్లు రావు. కానీ... మార్పు కోసం శ్రమిస్తున్నారు. నాకు రాజకీయాలంటే ఆసక్తి లేదు. ప్రజలకు సేవ చేయాలంటే ఏ రూపంలోనైనా చేయొచ్చు. విద్యాదానం మహా గొప్పది. ఆ రూపంలో పదిమందికీ సేవ చేయడానికి మా ట్రస్టు పనిచేస్తోంది"

■ "సినిమా సినిమాకీ మార్కెట్ పెరుగుతుంటుంది. దానికి తగ్గట్టుగానే బడ్జెట్ కూడా. 'గజిని' రూ.ఆరు కోట్లలో తీశాం. 'కాక కాక' రూ.కోటి 75 లక్షల్లో పూర్తి చేశాం. ఇప్పుడూ అదే బడ్జెట్‌లో సినిమాలు తీయమంటే కుదరదు. మార్కెట్‌లో చాలా తేడా వచ్చింది. ఇప్పుడూ అదే బడ్జెట్‌లో సినిమా తీయడం కుదరదు. 'సెవెన్త్ సెన్స్' కథ చెప్పినప్పుడు బడ్జెట్ ఎంతో మాకు తెలీదు. నిజానికి ఆ సినిమా బడ్జెట్‌కి తగిన మార్కెట్ నాకు లేదు. అలాంటప్పుడే 'సింగం' వచ్చింది. అదో కమర్షియల్ సినిమా. కానీ మాస్‌లో నన్ను నిలబెట్టింది. ఆ నమ్మకంతోనే 'సెవెన్త్ సెన్స్' కోసం ఆ స్థాయిలో ఖర్చు పెట్టగలిగాం"

నిన్న తప్పు తలుచుకుని ఫీలుకాకురా
తప్పు వల్ల కొత్త నిజం తెలుసుకోరా
ఛాన్స్ ఉంటే మళ్లీ తప్పు చేసి చూడరా
చేసిన ఆ తప్పే మళ్లీ చేయమాకు చేయమాకు
బిల్‌గేట్స్ గొప్పకాదురా ఓరయ్యరయ్య
నీకు నువ్వే కింగ్ సోదరా

గీతం: సైసైసై...
చిత్రం: ఇడియట్
రచన: కందికొండ
- పంపినవారు: మానూరు అప్పాజీకృష్ణ, బెంగళూరు


గీతోపదేశం

చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501512
మెయిల్ ఐడీ: cinema@eenadu.net

కొత్త ఏడాది వచ్చేసింది... కొత్త కళ తెచ్చేస్తోంది

బాలీవుడ్ బాక్సాఫీసుకు 2018 కొత్త కళను తీసుకురాబోతోంది. అగ్రకథానాయకులను ఆశ్చర్యపరిచే పాత్రల్లో చూపించనుంది. నాయికా ప్రాధాన్య చిత్రాలతో నారీమణుల సత్తా చాటిచెప్పనుంది. వెండితెర సాక్షిగా చారిత్రక వెలుగులను విరజిమ్మబోతోంది. జీవిత కథా చిత్రాలతో జీవం నింపబోతోంది. సీక్వెల్స్‌నూ రుచి చూపించబోతోంది. వారసులను పరిచయం చేయనుంది. ఇన్ని విశేషాలను మోసుకొస్తూ ఈ ఏడాది రాబోతోన్న ఆసక్తికరమైన చిత్రాలేంటే చూద్దాం.






మరుగుజ్జు షారుఖ్



కింగ్ ఆఫ్ రొమాన్స్‌గా పిలిపించుకున్న షారుఖ్ ఖాన్ మూడడుగుల మరుగుజ్జుగా కనిపిస్తే ఎలా ఉంటుంది?. మరుగుజ్జు అవతారంలోనూ ఏకంగా ఇద్దరేసి హీరోయిన్లతో డ్యూయెట్లు పాడుకుంటే ఎలా అనిపిస్తుంది? ఈ ఏడాదే ఆ విచిత్రం జరగనుంది. ఆనంద్ ఎల్.రాయ్ తెరకెక్కించబోతున్న 'జీరో'లో మరుగుజ్జుగా ఓ విభిన్నమైన పాత్రలో నటించనున్నాడు షారుఖ్. బాలీవుడ్‌లో ఇంతవరకూ ఏ కథానాయకుడూ చేయని పాత్రను షారుఖ్ చేస్తుండటం ఆసక్తి రేపుతోంది. టీజర్‌లో షారుఖ్‌ను చూసినవారు ఆశ్చర్యపోతున్నారు. ఈ చిత్రంలో కత్రినా కైఫ్, అనుష్క శర్మ కథానాయికలుగా కనిపిస్తారు. డిసెంబరు 21న విడుదల కానుంది.

దోపిడీ ముఠాలో ఆమీర్.. అమితాబ్


అమితాబ్‌బచ్చన్


అమీర్‌ఖాన్

ఆమీర్ ఖాన్.. మిస్టర్ పర్‌ఫెక్ట్. అమితాబ్ బచ్చన్.. బాలీవుడ్ లెజెండ్. ఈ ఇద్దరూ కలసి తెరపై కనిపిస్తే ఆ క్రేజే వేరు. ఈ ఏడాది ఆ ముచ్చట తీరనుంది. వారిద్దరూ 'థగ్స్ ఆఫ్ హిందూస్తాన్' అనే ఓ ఆసక్తికరమైన చిత్రంలో తొలిసారి కలసి నటించబోతున్నారు. బ్రిటిష్ హయాంలో భారతదేశంలో కరుడుగట్టిన దోపిడీ ముఠాలుగా పేరుతెచ్చుకున్న థగ్గుల నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతోంది. 'ధూమ్' సిరీస్ దర్శకుడు విజయ్ కృష్ణ ఆచార్య తెరకెక్కించనున్నారు. కత్రినా కైఫ్, ఫాతిమా సనా షేక్, జాకీ ష్రాఫ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'పైరేట్స్ ఆఫ్ ది కరీబియన్' తరహాలో ఈ చిత్రంలోనూ సముద్రంలో సాగే పోరాట సన్నివేశాలు ఆకట్టుకుంటాయట. దీపావళికి ఈ చిత్రం విడుదల కానుంది.

రేస్‌కు సల్మాన్ సై

కండల వీరుడు సల్మాన్ ఖాన్ ఈసారి బుర్రకు పదును పెట్టబోతున్నాడు. ఎత్తులు పైఎత్తులు వేసి ప్రత్యర్థులను చిత్తుచేయబోతున్నాడు. ఎందుకంటే ఆయన ఈ ఏడాది 'రేస్' మొదలెట్టబోతున్నాడు. సైఫ్ అలీఖాన్ కథానాయకుడిగా వచ్చిన 'రేస్', 'రేస్ 2' చిత్రాలు మంచి విజయం సాధించిన సంగతి తెలిసిందే. కథానాయకుడు, ప్రతినాయకుల మధ్య మైండ్‌గేమ్‌తో అనూహ్య మలుపులతో సాగే ఆ చిత్రాలు ప్రేక్షకులకు ఉత్కంఠ కలిగించాయి. ఇప్పుడు ఆ సిరీస్‌లో 'రేస్ 3' తెరకెక్కబోతోంది. సైఫ్ స్థానంలో సల్మాన్ కథానాయకుడిగా నటిస్తున్నారు. ఆయనే స్వయంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి రెమో డిసౌజా దర్శకుడు. జాక్వెలైన్ ఫెర్నాండెజ్ కథానాయిక. అనిల్ కపూర్, బాబీ డియోల్, కీలక పాత్రల్లో కనిపిస్తారు. జూన్‌లో విడుదల చేస్తారు.

ఐశ్వర్య ఫ్యానీఖాన్

ఐశ్వర్యరాయ్‌కి పెళ్లై ఒక పాపకు తల్లైనా ఆమె క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. ఐశ్వర్య చిత్రం వస్తోందంటే ఇప్పటికే అదే ఆసక్తి. ఈ ఏడాది ఓ సరికొత్త చిత్రంతో రాబోతోందామె. ఐశ్వర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఫ్యానీ ఖాన్'. 2000లో ఆస్కార్ పురస్కారానికి నామినేట్ అయిన డచ్ చిత్రం 'ఎవ్రీబడీ ఫేమస్'కి ఇది రీమేక్ కావడం గమనార్హం. ఐశ్వర్యరాయ్ గాయకురాలిగా నటిస్తోంది. ఆమె ప్రేమికుడిగా యువ కథానాయకుడు రాజ్‌కుమార్ రావ్ కనిపిస్తారు. అనిల్ కపూర్ కీలక పాత్రలో నటిస్తున్నారు. అతుల్ మంజ్రేకర్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం జూన్ 15న విడుదలయ్యే అవకాశముంది.

బయోపిక్ మ్యాన్.. ప్యాడ్‌మ్యాన్



ఇటీవల నిజజీవిత కథా చిత్రాలతో ఆకట్టుకుంటున్న అక్షయ్ కుమార్, ఈ ఏడాది మరో ఆసక్తికరమైన బయోపిక్‌తో రాబోతున్నాడు. 'ప్యాడ్‌మ్యాన్'గా ప్రేక్షకులను పలకరించబోతున్నాడు. పేద మహిళల కోసం అతి తక్కువ ఖర్చుతో శానిటరీ న్యాప్‌కిన్లను తయారుచేసే యంత్రాన్ని రూపొందించి, పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న అరుణాచలం మురగనందమ్ జీవితం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. రాధికా ఆప్టే, సోనమ్ కపూర్ ప్రధాన పాత్రల్లో కనిపిస్తారు. అమితాబ్ బచ్చన్ అతిథి పాత్రలో నటించారు. ఆర్.బాల్కి దర్శకుడు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. జనవరి 26న ఈ చిత్రం విడుదల కానుంది. దీంతో పాటు అక్షయ్ ప్రతినాయకుడిగా ఓ విభిన్నమైన గెటప్‌లో కనిపించనున్న '2.ఓ' కూడా ఈ ఏడాదే విడుదల కానుంది.

వివాదాలకు ఫుల్‌స్టాప్



చిత్రీకరణ మొదలైనప్పట్నుంచి వివాదాల్లో నిలిచిన చిత్రం 'పద్మావతి'. రాజ్‌పుత్ మహారాణి పద్మిని జీవితం ఆధారంగా సంజయ్ లీలా భన్సాలీ భారీ బడ్జెట్‌తో తెరకెక్కించారు. మహారాణి పద్మినిగా దీపికా పదుకొణె, పద్మిని భర్తగా షాహిద్ కపూర్, అల్లాఉద్దీన్ ఖిల్జీగా రణ్‌వీర్ సింగ్ నటించారు. ప్రచార చిత్రాలకు అనూహ్య స్పందన వచ్చింది. గతేడాది డిసెంబరులోనే విడుదల కావాల్సిన ఈ చిత్రం వివాదాల కారణంగా వాయిదా పడింది. అయితే ఇటీవల సెన్సార్ బోర్డు 'పద్మావత్'గా టైటిల్ మారిస్తే విడుదలకు అనుమతిస్తామని సూచించింది. దీంతో అదే పేరుతో త్వరలో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

తెరపై శ్రీదేవి కూతురు


ఇషాన్ ఖత్తర్, జాన్వీ కపూర్

అతిలోక సుందరి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ కథానాయికగా పరిచయం కానుందంటూ రెండుమూడేళ్లుగా వార్తలు వినిపించాయి. శ్రీదేవి కూతురు వెండితెరపై ఎలా ఉంటుందో చూడాలని అందరిలోనూ ఆసక్తి ఏర్పడింది. ఈ ఏడాది ఆ కోరిక తీరబోతోంది. ఓ ప్రేమకథా చిత్రంతో జాన్వీ పరిచయం కాబోతోంది. 'ధడ్కన్' చిత్రంలో ఆమె నాయికగా నటిస్తోంది. మరాఠీలో సంచలన విజయం సాధించిన 'సైరత్'కు ఇది రీమేక్. ఈ చిత్రంతో షాహిద్ కపూర్ సోదరుడు ఇషాన్ ఖత్తర్ కథానాయకుడిగా పరిచయం అవుతున్నాడు. శశాంక్ ఖైతాన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం జూలై 6న విడుదల కానుంది.

స్టూడెంట్ మళ్లీ వస్తున్నాడు

ఐదేళ్ల క్రితం కరణ్ జోహార్ తెరకెక్కించిన 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' చక్కటి విజయాన్నందుకుంది. ఆలియా భట్, వరుణ్ ధావన్, సిద్ధార్థ్ మల్హోత్రాలను తొలి అడుగుల్లోనే స్టార్స్‌గా మార్చేసిందా చిత్రం. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2' రాబోతోంది. టైగర్ ష్రాఫ్ కథానాయకుడిగా నటిస్తున్నాడు. కరణ్ జోహార్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని పునీత్ మల్హోత్రా తెరకెక్కిస్తున్నాడు. బాలీవుడ్ నటుడు చుంకీ పాండే కుమార్తె అనన్య పాండే నాయికగా పరిచయం కానున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాదే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తుంది.


టైగర్ ష్రాఫ్

తెర వెనుక సంజయ్‌దత్



ఆకాశానికెత్తేసిన విజయాలు, పాతాళంలోకి తోసేసిన వివాదాలు.. వెరసి సంజయ్‌దత్ జీవిత కథ ఓ కమర్షియల్ సినిమాకు ఏమాత్రం తీసిపోదు. అందుకే ఆయన జీవితాన్ని వెండితెరకెక్కిస్తున్నారు రాజ్‌కుమార్ హిరాణీ. ఇంకా పేరుపెట్టని ఈ చిత్రంలో సంజయ్‌దత్‌గా రణ్‌బీర్ కపూర్ నటిస్తున్నారు. ఓ బాలీవుడ్ కథానాయకుడి జీవితం తెరమీదకు రావడం ఇదే తొలిసారని చెప్పొచ్చు. అచ్చం సంజయ్‌లా కనిపించడానికి రణ్‌బీర్ ఎంతో శ్రమిస్తున్నాడు. జుత్తు పెంచడంతో పాటు కఠిన కసరత్తులు చేసి కండలు కూడా పెంచాడు. మనీషా కోయిరాలా, అనుష్క శర్మ, దియా మీర్జా, పరేష్ రావల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని మార్చిలో విడుదల చేస్తారు.

మరికొన్ని: రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా రోహిత్‌శెట్టి తెరకెక్కిస్తున్న తెలుగు 'టెంపర్' రీమేక్ 'సింబ', కరీనా కపూర్, సోనమ్ కపూర్ కలసి నటిస్తున్న 'వీరె ది వెడ్డింగ్', ఆలియా భట్ నాయికా ప్రాధాన్య చిత్రం 'రాజి', అనుష్క శర్మ 'పారి', రాణీ ముఖర్జీ 'హిచ్కీ', వరుణ్ ధావన్, అనుష్క శర్మ కలయికలో వస్తున్న 'సూయీ ధాగా', జాన్ అబ్రహమ్ 'పరమాణు: ది స్టోరీ ఆఫ్ పోఖ్రాన్', సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'చందమామ దూర్‌కే', సైఫ్ అలీఖాన్ కుమార్తె సారా అలీఖాన్ నాయికా పరిచయం అవుతున్న 'కేదార్‌నాథ్' లాంటి చిత్రాలూ ఈ ఏడాది ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.

ఝాన్సీరాణి కంగన



ధైర్యసాహసాలతో చరిత్రలో చెరగని స్థానం సంపాదించుకున్న ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ'గా రాబోతోంది. నాయికా ప్రాధాన్య చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటిస్తోంది. తెలుగు దర్శకుడు క్రిష్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం కోసం కంగన యుద్ధ విద్యల్లో శిక్షణ తీసుకుంది. చిత్రీకరణలో సాహసోపేతమైన పోరాటాలు చేస్తూ గాయపడింది. అయినా వెరవక చిత్రీకరణలో పాల్గొంటోంది. ఏప్రిల్ 27న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

వసుంధర

సోమవారం
జనవరి 8, 2018
కరీంనగర్



హై-హీల్స్..
హెయిర్ స్ట్రెయిటనింగ్.. కర్లింగ్, పియర్సింగ్

అమ్మాయిల్ని అల్ట్రామోడర్న్‌గా చూపించే అంశాలివి. అదేమిటీ.. పై జాబితాలో టాటూ లేదేమిటా అని వెతుకుతున్నారా? మనం ఇప్పుడు చెప్పుకొనేదంతా దాని గురించే కదా! ఇదో ట్రెండ్‌గా మారి దశాబ్దాలకు పైగానే అవుతున్నా.. దానిపట్ల ఉన్న వ్యామోహం ఇంకా తగ్గడంలేదు. ఒకప్పుడు సంపన్నులకే పరిమితం అనుకున్నది ఇప్పుడు అన్ని తరగతులకీ అందివస్తోంది. హై-ఫై స్టూడియోలని దాటి హైవేపై దుకాణాల దాకా వచ్చేసింది! ఈ వేగంలో పడి కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఈ టాటూలే అమ్మాయిలని సమస్యల్లో పడేస్తున్నాయి. అవేంటీ? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి మరి?

ఎలాంటి సమస్యలు వస్తున్నాయి?

టాటూ వేయించుకోవడమంటే చిన్నపాటి సర్జరీ చేయించుకోవడం లాంటిదే. ఆరోగ్యం, ఆహారనియమాలూ, మనకు పడని మందుల విషయాలు.. వీటన్నింటిపై అవగాహన ఉండాలి. నిజానికి నిపుణులైనవాళ్లు ఇవన్నీ గమనించే వేస్తున్నారు. లేదంటే టాటూల వల్ల చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. సాధారణంగా ఈ సమస్యలు కనిపిస్తున్నాయి..

- కొందరికి పిగ్మెంట్ ఇంజెక్షన్స్ పడవు.. ఇవి రియాక్షన్స్ ఇస్తాయి. టాటూ వేసిన చోటంతా పుండుగా మారి జ్వరాలు వస్తున్నాయి.
- ఈ మధ్యకాలంలో టెంపరరీ టాటూలని వేస్తున్నారు. ఇందులో పారా ఫినైల్ ఎమిడమైన్ అనే రసాయనం వాడతారు. వీటివల్ల డెర్మటైటిస్ వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ఈ రంగుల్లోని పాదరసం మోతాదు పెరిగితే శరీరానికీ హాని కావొచ్చు. ఇందులోని ఇనుము గుణం.. ఎమ్మారై స్కానింగ్ వంటివి తీసేటప్పుడు ఇబ్బంది పెట్టొచ్చు.
- శుభ్రతలేని వాతావరణంలో టాటూలు వేయించుకుంటే వాపు చాలా ఎక్కువగా ఉంటుంది. కొన్నిసార్లు దీన్నుంచి పసుపూ, ఆకుపచ్చని రంగుల్లో రసి కారుతుంటుంది. ఇన్‌ఫెటిగో, సెల్యులైటీస్ వంటి సమస్యలూ వస్తుంటాయి. ఇవేకాదు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా రక్తం ద్వారా వ్యాప్తి చెందే స్టెఫిలోకోకస్, హెపటైటిస్, హెచ్ఐవీ కూడా సోకే ప్రమాదం ఉంది.

పచ్చబొట్టు.. మచ్చగా మారకుండా!

ఏ ఫ్యాషన్‌కి ఎప్పుడు దశతిరుగుతుందో తెలియదు! ఒకప్పుడు 'అవుటాఫ్ ఫ్యాషన్' అనుకున్నది తర్వాత 'హాట్ ఫేవరెట్'గా మారిపోతుంది. పచ్చబొట్టుకి అచ్చంగా ఇది వర్తిస్తుంది. ఓ ఇరవైఏళ్లకిందట కూడా పచ్చబొట్టు పొడిపించుకోవడం అమ్మమ్మ, నాన్నమ్మలకే పరిమితమైన విషయం. ముఖ్యంగా చదువుకున్నవాళ్లు వాటికి వీలున్నంత దూరంగానే ఉండేవారు! మొదట్లో వివిధ అనారోగ్యాలకు అడ్డుకట్ట వేస్తాయని పచ్చబొట్టు పొడిపించుకుంటే, తరువాత ఎదుటివాళ్లపై ప్రేమని చాటుకోవడానికి వీటిని శరీరంలో భాగం చేసుకునేవారు. ఆలయాల్లోనో, జాతర్లలోనో సంచార గిరిజనులే వీటిని శరీరంపై వేసేవాళ్లు. చాలా నొప్పితో కూడిన విషయం అది. ఇలా ఉన్న పరిస్థితి, విదేశీ టాటూల ట్రెండ్ రాకతో.. ముఖ్యంగా అంతగా నొప్పి తెలియని గన్‌ల వాడకంతో ఒక్కసారిగా తలకిందులయ్యింది. వేలాదిరూపాయలు పెట్టిమరీ పచ్చబొట్టు వేసుకోవడానికి టాటూస్ స్టూడియో ముందు క్యూకట్టడం మొదలు పెట్టింది మన హై-ఫై యువత! ఇంతదాకా పెద్ద సమస్యలేదు. ఆ తర్వాతే ఓ వినియోగ వస్తువులా ఇది చవగ్గా మారిపోయింది. ధర తగ్గడంలో తప్పులేదు కానీ.. ఇందుకోసం వాడే గన్‌లూ, సూదులూ, రంగుల నాణ్యత పడిపోయింది. శుభ్రత కరవైంది. అదే ఇప్పుడు సమస్యలు తెస్తోంది.

వీళ్లకి పడదు..

- సోరియాసిస్ చర్మవ్యాధి ఉన్నవారు టాటూలను వేయించుకోకూడదు.
- కొంతమందికి ఎలా వేయించుకున్నా చర్మం ఉబ్బుతుంది. దీన్ని కిలాయిడ్ టెండెన్సీ అంటారు. వాళ్లూ వీటికి దూరంగా ఉండాలి.
- ఆరోగ్య పరిస్థితి కారణంగా స్టిరాయిడ్ మందులు, కొన్నిరకాల దీర్ఘకాలిక వ్యాధులకు మందులు వాడుతున్నప్పుడు వీటి జోలికి పోకూడదు.
- హృద్రోగ సమస్యలున్నవారూ, వ్యాధినిరోధక శక్తి తక్కువ ఉన్నవాళ్లూ వీటికి ఎంత దూరంగా ఉంటే అంతమంచిది.

వేసుకోవడానికి ముందూ.. తర్వాత!



- ఆరోగ్యం బాగాలేనప్పుడు టాటూ వేయించుకోకూడదు. వేయించుకునే ముందు సరిపడా నిద్రాహారాలుండాలి. పెయిన్ కిల్లర్ మాత్రలూ వాడుతుండకూడదు.
- పచ్చబొట్టు వేయడమంటే మనకు కావాల్సిన రంగులని.. కోరుకున్న ఆకృతుల్లో టాటూని చర్మం పొరల్లోకి ఇంజెక్ట్ చేయడమే. ఆ రంగులకి సంబంధించిన బ్రాండ్‌లు ఎఫ్‌డీఏ (ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్) అనుమతి పొందినవేనా అని ఓ సారి సరిచూసుకోండి.
- టాటు వేయించుకున్న తరువాత అక్కడ వేసే బ్యాండేజీని పన్నెండు గంటల తరవాత తీసేయాలి. ఒక్కసారి తీశాక మళ్లీ వాడకూడదు. ఆ ప్రాంతాన్ని గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. యాంటీ బయాటిక్ క్రీమ్‌ను రోజులో రెండు, మూడుసార్లు అప్లై చేయాలి. టాటూని గిల్లడమో, రుద్దడమో చేయకూడదు. క్లోరిన్ ఉన్న నీళ్లల్లో ఎక్కువసేపు నానకూడదు. ఎండలోకి వెళ్లకూడదు. తరచూ మాయిశ్చరైజర్ రాసుకోవాలి.

దీన్ని తొలగించాలంటే..



టాటూలు.. సామాజికంగా అబ్బాయిలకు లేని సమస్యలని అమ్మాయిలకి సృష్టిస్తున్నాయి. నిఖిత ఉదంతం ఇందుకో ఉదాహరణ. ప్రవీణ్‌ని ప్రాణప్రదంగా ప్రేమించిన ఆ అమ్మాయి అతని పేరుని ఛాతిపై పచ్చబొట్టు పొడిపించుకుంది. కానీ ఆ ప్రేమ కథ కంచికి చేరింది. ఇప్పుడేమో ఆమెకి ఇంట్లో సంబంధాలు చూస్తున్నారు. ఆ మచ్చని ఎలా తొలగించాలనే బాధలో పడిపోయింది నిఖిత. శైలీష.. వైద్య విద్యార్థిని. ఓసారి కాలేజీ ఉత్సవాల్లో ఉత్సాహంగా పచ్చబొట్టు పొడిపించుకుంది. ఎంబీబీఎస్ కాగానే ఈ అమ్మాయి సైన్యంలోకి వైద్యురాలిగా వెళ్లాలని దరఖాస్తు చేసుకుంది. దాంతో శైలీష తన ఆశయాన్నీ వదులుకోవాల్సి వచ్చింది. ఇవన్నీ పచ్చబొట్టుతో మనం ఎదుర్కొనే సామాజిక సమస్యలు. మరి వాటిని తొలగించే పద్ధతులేమిటీ? డెర్మాబిరేషన్, సర్జికల్, లేజర్.. ఇలా మూడు పద్ధతులతో వీటిని తొలగిస్తున్నారు. డెర్మాబిరేషన్ చాలా నొప్పితో కూడుకున్నది. పై చర్మంపొర తీసేస్తారు. ఇది చేయించుకున్న తరువాత మూడు నెలలపాటు సూర్యకాంతికి తగలకూడదు. లేజర్ చికిత్స ద్వారా టాటూను తొలగించుకోవడానికి 5-8 సిట్టింగులు అవసరమవుతాయి. సర్జికల్ విధానం ఖర్చుతో కూడుకుంది వీటిల్లో ఏ చికిత్సకైనా సరే టాటూ పోయినా మచ్చ మాత్రం పూర్తిగా మానదు!



డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజీషియన్

యువతకు విజయసూత్రాలివి..

కెరీర్ లక్ష్యాలని మనం ఎంత తొందరగా చేరుకోగలిగితే.. అంతగా భవిష్యత్తు ఆశయాలని సాధించగలం! కానీ ఇది అంత సులువైన విషయమేమీ కాదు. ఒక నిర్దిష్టమైన లక్ష్యంతోపాటు ఆ దిశగా పనిచేసేందుకు సరైన మార్గం ఎన్నుకోవడం ఎంతో అవసరం. అలాంటివాళ్ల కోసమే ఫోర్బ్స్ జాబితాలో యువ నాయకులుగా నిలిచిన కొందరు పాటించిన విజయసూత్రాలని ఆ సంస్థ క్రోడీకరించింది. అందులో కొన్ని..

విభిన్నమైన లక్ష్యాలు : మన రంగానికి చెందిన ఓ వ్యక్తి గొప్ప విజయం సాధించగానే మనమూ అదే దారిని అనుసరించకూడదు. దానికి విభిన్నమైన మార్గం, లక్ష్యాన్ని ఎంపిక చేసుకోండి. రేపు నలుగురికి స్ఫూర్తినిచ్చేలా ఉండాలి మన దారి.

పరిచయాలు పెంచుకోండి : చాలా మంది వారివారి లక్ష్యాలను సాధించే క్రమంలో ఎవరితోనూ కలవకుండా ఉంటారు. నలుగురితో అంత కలుపుగోలుగా వ్యవహరించడానికి ఇష్టపడరు. దీనివల్ల భవిష్యత్తులో ఎంతో నష్టపోవాల్సి ఉంటుంది. అందరితో కలుపుగోలుగా ఉన్నట్లయితే వారి నుంచి భవిష్యత్తులో వృత్తి, ఉద్యోగాల్లో ప్రమోషన్లు, కొత్త ఆలోచనల విషయంలో



సహాయం అందుకునే అవకాశం ఉంటుంది.

కచ్చితమైన మూడు లక్ష్యాలు : ఉదయం లేవడంతోనే ఆరోజు సాధించాల్సిన మూడు లక్ష్యాలని నిర్దేశించుకోండి. వాటిని కచ్చితంగా ఆ రోజులోపు పూర్తిచేసేందుకు ప్రయత్నించండి. కాలక్రమంలో మీకు ఎంతో ఆత్మవిశ్వాసం వస్తుంది.


ఫలితాలు మళ్లీ సమీక్షించుకోండి : ప్రతిరోజు మీ కార్యాలయాన్ని వీడేముందు ఓ పదినిమిషాలు ఆరోజు అనుకున్న దానిలో ఎంతమేర సాధించారో పునఃసమీక్షించుకోవడానికి కేటాయించండి. మరుసటి రోజు చేయవల్సిన పనులకు సంబంధించిన ప్రణాళికను ముందుగానే తయారుచేసుకోండి.

రంగవల్లిక

మూడువైపులా ముగ్గు వేసి ఒకవైపు మాత్రం వదిలేయడం మర్చిపోవద్దు.

18 చుక్కలు, 10 వరుసలు, 10 వచ్చేవరకు. సరిచుక్క






కనకదుర్గ
- పెదపాడు, పశ్చిమగోదావరి జిల్లా

ఇంటి ముంగిట రంగవల్లికలను తీర్చిదిద్దే మీకిదే మా ఆహ్వానం. పెన్నూ, పెన్సిల్‌తో చక్కగా వేసిన ముగ్గులను పంపండి. ముగ్గు, చుక్కల వివరాలతో పాటూ మీ ఫొటో, చిరునామా జతచేయాలి. ముగ్గుల్లో రంగులు నింపాల్సిన పని లేదు.





హెచ్.మంజు
- బెంగళూరు

15చుక్కలు, 8వరుసలు. 8 వచ్చే వరకూ మధ్యచుక్క

మా చిరునామా:
వసుంధర,
ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ,
అనాజ్‌పూర్,
హయత్ నగర్
మండలం,
రంగారెడ్డి జిల్లా - 501 512.
✦ email: vasundhara@eenadu.net

మరిన్ని ముగ్గుల కోసం www.eenadu.net చూడగలరు.

తెలుగు రాష్ట్రాల్లోని అన్ని గ్రామాల పరిస్థితే అక్కడ కూడా! ఎక్కువగా మధ్య, దిగువ తరగతి కుటుంబాలే. వ్యవసాయంపై ఆధారపడ్డవాళ్లే. ఏటా పంట కోసమే కాకుండా.. పిల్లల చదువులూ, అనారోగ్యాలూ, అవసరమైతే పెళ్లిళ్లు వంటివాటికి భారీగానే అప్పులు చేస్తుండేవారు. వందకి పది రూపాయల వంతున అప్పులు తెచ్చుకునేవారు. ఇందుకోసం కుదువపెట్టిన ఒంటిపై నగలూ, భూమి పత్రాలూ అన్నీ కోల్పోయేవారు. కేవలం ఐదేళ్లలో ఆ పరిస్థితి తలకిందులైంది! ఇప్పుడు దేశ, విదేశీ సంస్థలకి పొదుపూ, పెట్టుబడులపై పాఠాలు చెప్పగలుగుతున్నారు. ఒకప్పుడు అప్పులతో ఇబ్బంది పడ్డ మహిళలు ఇప్పుడు వ్యాపారస్తులయ్యారు. ఇదంతా ఎలా సాధ్యమైంది!



ఇప్పుడు వాళ్లే అప్పులిస్తున్నారు..!

పొదుపు.. ఇదొక్కటే ఆ మహిళల జీవితాన్నీ, ఆలోచనాధోరణిని మార్చేసిందని చెప్పాలి! సమష్టి ఆర్థిక క్రమశిక్షణతో సాధించిన పొదుపు.. సమైక్యంగా చేసిన పెట్టుబడులే వాళ్లని ఇప్పుడు ఈస్థాయికి తీసుకొచ్చాయి. వరంగల్ పట్టణానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది ఎలుకుర్తి గ్రామం. 2013లో ఈ గ్రామంలోని మహిళలకి ఓ వరంలా అందివచ్చింది స్వయం సహాయక సంఘం ఏర్పాటు! ముందుగా వీరిని అనంతపురం జిల్లాకు పంపించి అక్కడ సంఘాల పని తీరుపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఆ చైతన్యంతో మొదట్లో వీరు కష్టపడి సంపాదించిన దాంట్లో ఖర్చులన్నీపోనూ నెలకు రూ. 50 చొప్పున పొదుపుచేయడం ప్రారంభించారు. అందరూ కలిసి వేలాది రూపాయలు పొదుపుచేశాక.. ఆ సొమ్మును చిరువ్యాపారాల కోసం వినియోగించడం మొదలుపెట్టారు. దీనికితోడు ఐకేపీ, లింకు రుణాలు, బ్యాంకుల ద్వారా రుణాలు, స్త్రీనిధి వంటివి వాళ్లకెంతో ఉపయోగపడ్డాయి. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఏదోక వ్యాపారం చేసుకుంటున్న మహిళలే కనిపిస్తారు. కిరాణా, వస్త్రాలూ, బేకరీ, గాజులు, ఫోటోస్టూడియో ఇలా ఏదోక వ్యాపారంతో తమ కాళ్లపై తాము నిలబడ్డారు. తమలాంటి మరికొంత మందికి ఆసరాగా నిలుస్తున్నారు. వీరి ఉత్పత్తులను వరంగల్, మహబూబాబాద్, కాజీపేట, హైదరాబాదు తదితర మార్కెట్లకు ఎగుమతి చేస్తున్నారు. అప్పులు చేయాల్సిన అవసరం లేకుండానే తమ పిల్లలకు మంచి భవిష్యత్తునిస్తున్నారు. ఇప్పుడు గ్రామంలో సుమారు 98 గ్రామ సహాయక సంఘాలుండగా.. ప్రస్తుతం ఒక్కో సంఘం వద్ద పొదుపు చేసిన మొత్తం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు నిల్వ ఉంది. ఫలితంగా వారు అప్పులు తీసుకోవాల్సిన అవసరం తగ్గడంతో పాటు అప్పులిచ్చే స్థాయికి చేరుకున్నారు!

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా...

రుణాలు సకాలంలో చెల్లించడంలో ఎంతో నిబద్ధతతో వ్యవహరిస్తున్నారు. నగదురికార్డులను పక్కాగా నిర్వహిస్తున్నారు. అందుకే ఈ సంఘాల పనితీరును అధ్యయనం చేసేందుకు వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 39 స్వచ్ఛంద సంస్థలు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు వచ్చారు. గతేడాది కేంద్ర గ్రామీణాభివృద్ధిసంస్థ నుంచి లక్షరూపాయల అవార్డూ, ప్రశంసాపత్రం అందుకున్నారు. అంతేకాకుండా, నేషనల్ లైవ్లీహుడ్ మిషన్ ద్వారా జాతీయ ఉత్తమ స్వయం సహాయక పురస్కారం కూడా అందుకున్నారు.

- **కె.జ్యోతిరాజ్,** ఈనాడు పాత్రికేయ పాఠశాల

దారి మారితే హెచ్చరిస్తుంది!

హైదరాబాద్ పోలీసులు మహిళా భద్రత కోసం ప్రారంభించిన 'హాక్ ఐ' యాప్ సరికొత్త సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇదివరకే ఇందులో 'విమెన్ ట్రావెల్ మేడ్ సేఫ్' అనే ఆప్షన్ ఉంది. ఇందులో మనం ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నామో నమోదు చేసే అవకాశం మాత్రమే ఉండేది. మనం వెళ్లే వాహన డ్రైవర్ లేదా తోటి ప్రయాణికులు అనుమానాస్పదంగా ప్రవరిస్తే 'హెల్ప్' బటన్ నొక్కితే పోలీసులు మన సాయానికి వచ్చేవారు. ఇప్పుడు దాంతోపాటూ 'ట్రాక్ మీ' అనే ఆప్షన్ కూడా ఇచ్చారు. ఇది జీపీఎస్ ద్వారా పనిచేస్తుంది. దీన్ని నొక్కగానే మనం ఏదారిలో వెళ్తున్నామో పోలీసులు కంట్రోల్ రూమ్ నుంచే చూసే అవకాశం ఉంటుంది. సురక్షితంగా చేరుకున్నాక 'రీచ్డ్ సేఫ్లీ' అనే ఆప్షన్ నొక్కాల్సి ఉంటుంది. డ్రైవర్లు ఏమాత్రం పక్కదారి పడుతున్నట్లు అనిపించినా.. ఈ యాప్ మనతోపాటూ, పోలీసులనీ హెచ్చరిస్తుంది. వాళ్లు దగ్గర్లో ఉన్న ప్యాట్రలింగ్ వాహనాన్ని మన రక్షణ కోసం పంపిస్తారు. మీరు ఇంటర్నెట్ ఆఫ్ చేసినా సరే(ఆఫ్‌లైన్‌లో).. పనిచేసేలా ఈ ఆప్షన్ని తీర్చిదిద్దారు.

నజరానా

ఇనుప వస్తువులు తుప్పు పట్టాయా? కాసేపు వెనిగర్‌లో ఉంచి ఆ తరువాత ఉప్పూ, నిమ్మరసం కలిపిన మిశ్రమంతో రుద్ది చూడండి. తుప్పు వదిలిపోతుంది.

సెటిల్‌మెంటని చెప్పి నాన్చుతున్నాడు.. ఎలా?

? నేనూ, చెల్లి పుట్టాక అమ్మానాన్న విడిపోయారు. నాన్న వేరే పెళ్లి చేసుకున్నా మేం ఆయన దగ్గరే పెరిగాం. మా సవతి తల్లికి ఒక అబ్బాయి పుట్టాడు. నాన్న ఐదేళ్ల కిందట చనిపోయారు. అవసాన దశలో ఉన్నప్పుడు తమ్ముడు పట్టించుకోకపోతే మేం ఇద్దరమే ఆయన బాగోగులు చూశాం. నాన్న సంపాదించిన ఆస్తి కొంత ఉంది. దానిపై ఏ వీలునామా రాయకుండానే చనిపోయారు. దాంతో మా తమ్ముడు కాగితాలు కాలిపోయాయి అంటూ తన పేరునే ఆస్తి ఉందని చెబుతూ రిజిస్టర్ చేయించుకున్నాడు. ఆ విషయం తెలిసి మేం కోర్టుకి వెళ్లాం. దాంతో బయట సెటిల్‌మెంట్‌కి వచ్చాడు. మీకూ భాగం ఇస్తానని నమ్మబలికాడు. కానీ ఇప్పటికే మూడేళ్లు గడిచిపోయాయి. ఆ ఊసే లేదు. ఇవ్వననడం లేదు కానీ కాలయాపన చేస్తున్నాడు. ఏం చేయాలో చెప్పండి..? - **సోదరి**

✔ మీ నాన్నగారు వీలునామా రాయకుండా చనిపోతే అది ఇంటస్టేట్ ప్రాపర్టీ అవుతుంది. అలాంటి ఆస్తి మీద మీ ముగురికీ అంటే మీకూ, మీ చెల్లికీ, తమ్ముడికీ కూడా సమాన హక్కు ఉంటుంది. మీరు వేసిన కేసు ఇంకా కోర్టులోనే ఉందా? అలానే మీతో చేసుకున్న సెటిల్‌మెంట్ ఒట్టి నోటిమాటేనా లేకపోతే కాగితం రూపంలో ఉందా అన్నది తెలియడం లేదు. ఒకవేళ సెటిల్‌మెంట్ చేసుకుందామని చెప్పి న్యాయస్థానంలో కోర్టులో సర్దుబాటు చేసుకుని.. ఆ విషయంరాసుకుని ఉంటే దాని ప్రకారం అమలు చేయమంటూ కోర్టులో ఎగ్జిక్యూషన్ పిటీషన్ దాఖలు చేసుకోవచ్చు. కోర్టులో కేసు ఇంకా పెండింగ్‌లో ఉంటే మీ కేసును ఎప్పట్లాగే కొనసాగించండి. సెటిల్‌మెంట్ పేరు చెప్పి కాగితం రాసుకొని చేయకపోతే చీటింగ్ కేస్(సెక్షన్ 420 కింద) పెట్టవచ్చు. అలానే మీ తమ్ముడు చేసుకున్న ఆస్తి రిజిస్ట్రేషన్ చెల్లదని క్యాన్సిలేషన్ ఆఫ్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ కోసం కోర్టులో సూట్ దాఖలు చేయవలసి ఉంటుంది. వీలునామా కాగితాలు కాలిపోయాయి అని చెప్పి రిజిస్టర్ చేసుకోడానికి కుదరదు. 'రిజిస్టర్డ్ విల్' అయినాసరే వారసులు ఎవరైనా రిజిస్ట్రేషన్‌కు అభ్యంతరం చెపితే కోర్టు ఆర్డర్ లేకుండా రిజిస్టర్ చేయరు. కాబట్టి మీరు వెంటనే మీ కేసు ఏ దశలో ఉందో చూసుకొని మళ్లీ ప్రయత్నాలు మొదలు పెట్టండి. ఆస్తి మళ్లీ చేతులు మారకుండా చూసుకోండి.

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది



చదువు

మా చిరునామా:
చదువు
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501 512
■ edc@eenadu.net

ప్రిలిమ్స్‌లోనే పెను సవాల్!!



ప్రాథమిక పరీక్ష ద్వారా ప్రధాన పరీక్షకు ఎంపిక చేసే అభ్యర్థుల సంఖ్యను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తగ్గించింది. మరో వైపు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కూడా సంస్కరణల బాటలో ఉంది. ఈ పరిణామాలను ఉద్యోగార్థులు గమనిస్తుండాలి. అవగాహనతో కొత్త పరిస్థితులకు అనుగుణంగా సన్నద్ధతలో మార్పులు చేసుకోవాలి. ఇందుకు ఉపకరించే విశ్లేషణ ఇదిగో..!

ఇరవై అయిదు వేల మందికి మించి అభ్యర్థులు రాసే నియామక పరీక్షల్లో ప్రాథమిక, ప్రధాన పరీక్షలు (ప్రిలిమ్స్, మెయిన్స్) నిర్వహించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించింది. ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేయడానికి 1:15 నిష్పత్తిలో ఎంపిక చేసే కీలక మార్పుతో తాజాగా జీవో కూడా విడుదలయింది. కేటగిరీలోని ఉద్యోగాల సంఖ్యను బట్టి ఆయా కేటగిరీ వాళ్లనే 1:15 నిష్పత్తిలో ఎంపిక చేసే నిర్ణయమూ జరిగింది.



కొడాలి భవానీ శంకర్

ఇప్పటివరకూ జరిగిన ప్రిలిమ్స్-మెయిన్స్ పరీక్షలన్నీ 1:50 నిష్పత్తిలో ఎంపిక చేసేవారు. కేటగిరీని పట్టించుకునేవారు కాదు. ఫలితంగా ఒక మాదిరిగా చదివినవారు కూడా మెయిన్స్‌కు ఎంపికయ్యేవారు. కానీ సరైన సామర్థ్యాలు లేక అంతిమ ఫలితం పొందలేకపోయేవారు. దాంతో చాలామందికి ధన, కాల వ్యయం వృథా జరిగేది. చాలామంది పోటీ పరీక్షార్థుల జీవితం గందరగోళానికి లోనయ్యేది. ఇప్పుడు 1:15 నిష్పత్తి, అందులోనూ కేటగిరీ ఆధారంగా ఎంపిక చేసే పరిస్థితి వల్ల పూర్తి సామర్థ్యమున్న అభ్యర్థులే మెయిన్స్‌కు ఎంపికవుతారు. ఒక రకంగా ఆషామాషీ అభ్యర్థులు వైదొలగడం వల్ల అనవసర అసంతృప్తి, ఆందోళనలు తగ్గి సజావుగా పరీక్షలు జరిగే పరిస్థితి ఏర్పడుతుంది.

కొత్త పద్ధతిలో జనరల్ కేటగిరీ ఉద్యోగాల సంఖ్యను బట్టి మెరిట్ ప్రకారం 1:15 నిష్పత్తిలో మొదట ఎంపిక జరుగుతుంది. ఈ విభాగంలో ఎవరైనా ఎంపికయ్యే అవకాశముంది. తరువాత కేటగిరీలవారీగా ఆయా కేటగిరీల అభ్యర్థులను 1:15 నిష్పత్తిలో ఎంపిక చేస్తారు. జనరల్ సహా అన్ని కేటగిరీల్లోనూ 1/3వ వంతు నిష్పత్తిలో మహిళా రిజర్వేషన్‌ను కూడా పాటిస్తారు. వికలాంగులు మొదలైన వర్గాలకు సంబంధించిన పోస్టుల సంఖ్యను బట్టి ఆయా వర్గాల వారి నుంచే 1:15 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. తగినంతమంది అభ్యర్థులు లభ్యం కాకపోతే కటాఫ్‌ను తగ్గించే అధికారం పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ప్రభుత్వం ఇచ్చింది. ఫలితంగా సమ పోటీ ఏర్పడి, ఎక్కువమందికి అవకాశం కల్పించే పరిస్థితి ఏర్పడింది.

ఇటువంటి పరిస్థితిలో మెయిన్స్‌కి ఎంపిక కావడం ఒక పెద్ద ఛాలెంజ్ అని చెప్పవచ్చు. ఒకవిధంగా జీవన్మరణ సమస్యలా అభ్యర్థులు భావించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఏ పరీక్షార్థులు ఏం చేయాలి?

కొత్త పరిణామాల నేపథ్యంలో ఉద్యోగార్థులు పటిష్ఠ వ్యూహం పాటించటం అనివార్యం.

గ్రూప్-1

ఇప్పుడే సన్నద్ధత మొదలు పెట్టినవారు, మొదలు పెడదామనుకునేవారు పూర్తి సమయాన్ని స్క్రీనింగ్ సిలబస్‌కి కేటాయిస్తే మంచిది. స్క్రీనింగ్ సిలబస్‌పై పట్టు సాధించేందుకు కనీసం నాలుగు నెలల పాటు రోజుకు 4-6 గంటలు వెచ్చించాలి. పైగా ప్రస్తుతం అడుగుతున్న ప్రశ్నల్లో అత్యధికం అప్లికేషన్, వినియోగానికి సంబంధించినవి కావడంతో పూర్తి స్థాయిలో అవగాహన ఏర్పడేలా చదివితేనే ప్రయోజనం ఉంటుంది. ఇటీవలి కాలంలో జనరల్ స్టడీస్‌లో 100-105/150 మార్కులు చాలామంది అభ్యర్థులు సాధిస్తున్నారు. అందువల్ల గతంలో మాదిరిగా 85-90 మార్కుల్లో స్క్రీనింగ్ గట్టెక్కే పరిస్థితి లేదు.

సీనియర్ అభ్యర్థులు పూర్తిగా మెయిన్స్ పేపర్లపై దృష్టిసారించడం ప్రస్తుత పరిస్థితుల్లో సరైన నిర్ణయం కాదు. సన్నద్ధత సమయంలో కనీసం 1/3వ వంతు స్క్రీనింగ్ సిలబస్‌కు కేటాయించడం హేతుబద్ధ నిర్ణయం అవుతుంది.

తాజాగా సన్నద్ధత మొదలు పెట్టినవాళ్లు మెయిన్స్ భారం, భయం అనుకుంటే స్క్రీనింగ్ సిలబస్‌లో ఉన్న పాలిటీ, సైన్స్-టెక్నాలజీ, ఇండియన్ ఎకానమీ, భారతదేశ చరిత్ర లాంటి అంశాలను ఇంటిగ్రేట్ చేసి చదువుకునే వ్యూహాన్ని కూడా అనుసరించవచ్చు. తద్వారా కొంత మెయిన్స్ భారం కూడా తగ్గుతుంది.

గ్రూప్-2

ప్రస్తుతం ఉన్న గ్రూప్-2 స్క్రీనింగ్ సిలబస్‌లో పాలిటీ, ఎకానమీ, వర్తమానాంశాలు ఉన్నాయి. ఇవే పాలిటీ, ఎకానమీలు మెయిన్స్‌కు కూడా ఉపయోగపడతాయి. కాబట్టి పూర్తిస్థాయిలో లోతైన అధ్యయనం ఈ రెండు విభాగాల్లో చదవడం వల్ల మెయిన్స్‌కు కూడా సిద్ధపడినట్లే అవుతుంది. స్క్రీనింగ్‌కు చదివేటప్పుడే మెయిన్స్ సిలబస్ అంశాలు కూడా అనుసంధానం చేసుకుని ఈ రెండు విభాగాలనూ చదవటం మంచి వ్యూహం అవుతుంది.

స్క్రీనింగ్ సిలబస్‌లో వివిధ కోణాల్లో కరెంట్ అఫైర్స్ చదవమని సూచించారు. ప్రతిరోజూ నిరంతరం కరెంట్ అఫైర్స్ చదవడం వల్ల సైన్స్, ఆర్థిక, రాజకీయ, కళలు, క్రీడలు మొదలైన సబ్జెక్టుల్లో మెయిన్స్‌కు కావాల్సిన సమాచారం కూడా లభ్యమైనట్లే.

ఏపీ ఎకానమీ, ఏపీ చరిత్ర మెయిన్స్‌లోని జనరల్ స్టడీస్‌లోని మిగతా అంశాలు స్క్రీనింగ్ అనంతరం చదవడం మంచిది. లేదా ముందుగా స్క్రీనింగ్‌పై పట్టు పూర్తిస్థాయిలో లభించింది అనుకుంటే మిగతా మెయిన్స్ అంశాలపై దృష్టిపెడితే సరిపోతుంది.

ఇతర అభ్యర్థులు

◆ పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓ మొదలైన పరీక్షల అభ్యర్థులు పెద్దఎత్తున హాజరయ్యే పరీక్షలకు కూడా ముందస్తుగా స్క్రీనింగ్ సిలబస్‌కు తయారైతేనే మంచిది. ఈ పరీక్షలు మాత్రమే రాసే అభ్యర్థులు స్క్రీనింగ్‌లో గట్టి పట్టు వస్తేనే గ్రూప్-1, 2, సివిల్స్ అభ్యర్థులను స్క్రీనింగ్‌లో ఎదుర్కోగలుగుతారు.

◆ ఏఈఈ వంటి పరీక్షల్లో స్క్రీనింగ్ సిలబస్‌లో జనరల్‌స్టడీస్ పాత్ర 50 మార్కులకే పరిమితం. కానీ సిలబస్ భారీ స్థాయిలో ఉంది. ఇలాంటి ప్రత్యేక నిపుణత సంబంధిత పరీక్షల్లో స్క్రీనింగ్‌లో కూడా వారి సబ్జెక్టులు 2/3వ వంతు భాగాన్ని ఆక్రమించినా మెయిన్స్‌కి ఎంపిక కావాలంటే తప్పనిసరిగా జనరల్‌స్టడీస్ మార్కులే ప్రధానమని చెప్పవచ్చు. ఎందుకంటే సబ్జెక్టు సంబంధిత విభాగాల్లో దాదాపుగా ప్రతిభావంతులైన అభ్యర్థులు ఒకేరకమైన మార్కులను పొందుతారు. కానీ జనరల్‌స్టడీస్‌లోని లోతు, పరిధి దృష్ట్యా మార్కులు పొందడం క్లిష్టమే. అయితే ఆ వచ్చే మార్కులే స్క్రీనింగ్ నుంచి మెయిన్స్‌కు దారి తీస్తాయని గమనించాలి. మెయిన్స్‌లో 150 మార్కులకు ఎలాగూ జనరల్‌స్టడీస్ ఉంది కాబట్టి, ఆ స్థాయిలో స్క్రీనింగ్ సిలబస్‌ను చదివితే ఒకే సన్నద్ధతతో రెండు పరీక్షల్లో రాణించవచ్చు.

అటు ఏఈఈ, డీఎల్, జేఎల్ వంటి నిపుణత సంబంధిత ఉద్యోగాల పరీక్షలు రాసే అభ్యర్థులు ప్రస్తుత మారిన పరిస్థితుల్లో గ్రూప్ 1, 2 పరీక్షల స్క్రీనింగ్ గట్టెక్కాలి అంటే ప్రత్యేకంగా జనరల్‌స్టడీస్‌పై పట్టు సాధించాలి. రెండు పరీక్షలనూ వాటి స్థాయి జనరల్‌స్టడీస్ సన్నద్ధతలో ఎదుర్కోవడం కష్టం. అందువల్ల గ్రూప్-1, 2 స్థాయి జనరల్ స్టడీస్‌లో ఇటు ఈ పరీక్షలతోపాటు వారి నిపుణత సంబంధిత ప్రశ్నలనూ ఎదుర్కోగలుగుతారు.


టీఎస్‌పీఎస్‌సీ పరీక్ష విధానంలో సంస్కరణలు

తెలంగాణ స్టేట్ సర్వీస్‌ల ఏర్పాటు ద్వారా గ్రూప్స్ నియామకాలు జరిపేందుకు తెలంగాణ రాష్ట్రం సిద్ధపడుతోందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో 70:30 నిష్పత్తిలో యూపీఎస్‌సీ సిలబస్, టీఎస్‌పీఎస్‌సీ సిలబస్ ఉండే అవకాశం ఉంటుంది. అయితే అభ్యర్థులు పాత సిలబస్ స్థానంలో ఈ సిలబస్‌ను భారంగా, క్లిష్టంగా భావించే అవకాశముంది. ఒకవేళ ఈ మార్పు వాస్తవమైతే సన్నద్ధతలో మార్పుల ద్వారా మంచి మార్కులు సాధించవచ్చు. సివిల్స్ రాసే అభ్యర్థులను పెద్ద పోటీగా భావించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే తెలంగాణ చరిత్ర, తెలంగాణ ఉద్యమం, సామాజిక నిర్మితులు, జాగ్రఫీ, ఎకానమీ వంటి అంశాల్లో వారికి అవరోధాలు ఎలాగూ ఉంటాయి.

గ్రూప్-1, 2 ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలను ఒకే ఉమ్మడి పరీక్ష ద్వారా నిర్వహించినట్లయితే ఇప్పటివరకూ ఆబ్జెక్టివ్ ధోరణిలో తయారైన అభ్యర్థులు సబ్జెక్టివ్ విధానానికి మారాల్సి ఉంటుంది. అందువల్ల ఈ ప్రతిపాదిత మార్పులు ప్రభుత్వ ఆమోదం పొందితే గెజిటెడ్ ఉద్యోగాలు ఆశిస్తున్న అభ్యర్థులు ఇప్పటినుంచే వివిధ సిలబస్‌ల అంశాలను అవగాహన, అన్వయం, వినియోగం కోణాల్లో చదవాల్సి ఉంటుంది.

గ్రూప్-3, 4 ఉద్యోగాలకు కూడా ఉమ్మడి నోటిఫికేషన్ ద్వారా నియామకం జరిగేట్లయితే సిలబస్ మార్పులను అధ్యయనం చేయాలి. అందుకు అనుగుణంగా సన్నద్ధతలో మార్పులు రావాలి. ఈ విషయాల్లో స్పష్టత వచ్చేవరకూ అభ్యర్థులు ప్రధానంగా జనరల్‌స్టడీస్‌పై పట్టుకు ఈ సమయాన్ని వినియోగించుకోవాలి.

జనరల్‌స్టడీస్‌పై పట్టు సాధిస్తే స్క్రీనింగ్‌లో విజయం సాధించడమే కాకుండా మెయిన్స్‌కు కావాల్సిన ముందస్తు తయారీ కూడా ముగిసినట్లే. నోటిఫికేషన్లు వచ్చిన తరువాత చూడొచ్చనుకుంటే... సమగ్ర తయారీకి సమయం సరిపోదని గుర్తించాలి.



స్టడీ స్కిల్స్

రివిజన్ మళ్లీ మళ్లీ!

రాజేష్ తెలివైన విద్యార్థి. ఎప్పటి పాఠాలు అప్పుడు బాగా చదువుకుంటాడు. స్లిప్ టెస్ట్‌లు, మంత్లీ టెస్ట్‌ల్లో మార్కులు బాగా వస్తాయి. కానీ ఇంటర్ మొదటి సంవత్సరం ఫైనల్ పరీక్షల్లో అనుకున్న పర్సంటేజ్ రాలేదు. టెన్త్‌లో కూడా అలాగే జరిగింది. దీంతో ఆందోళన పెరిగిపోతోంది. నిరాశతో డిప్రెషన్‌కు గురయ్యాడు. నిపుణులను సంప్రదిస్తే చదివింది మళ్లీ సరిగా రివిజన్ చేయకపోవడంతో సమస్య తలెత్తిందని గుర్తించారు. అంతా చదివేశాం... వచ్చేసింది అయినా సరిగా రాయలేకపోయాం అని బాధపడే విద్యార్థులు రివిజన్ ప్రాధాన్యాన్ని గ్రహించడం లేదు. చదవడం అంతా ఒక ఎత్తయితే దాన్ని పునశ్చరణ చేయడం మరో ఎత్తు. సరిగా రివిజన్ చేస్తే కావాలనుకున్న మార్కులు కచ్చితంగా సొంతమవుతాయి.

చదువుకు సంబంధించి SQ3R (Survey, Question, Read, Repeat, Revise) పద్ధతి శాస్త్రీయమైంది. సర్వే అంటే సిలబస్‌లో, పాఠంలో అసలు ఏముందో స్థూలమైన అవగాహన ఏర్పరచుకోవడం. క్వశ్చన్ అంటే అవగాహనను ప్రశ్నలు, జవాబుల రూపంలోకి మార్చుకోవడం. రీడ్- మనకు వచ్చే దాకా చదవడం. రిపీట్, రివైజ్‌లను కలిపి స్థూలంగా రివిజన్ అని వ్యవహరిస్తారు.



డా. టి.ఎస్.రావు
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

జ్ఞాపకాలు తాత్కాలికం, శాశ్వతం అని రెండు రకాలు. చదువును శాశ్వత జ్ఞాపకాల్లోకి చేర్చాలి. అందుకు తగిన ప్రాక్టీస్ చేయాలి. ఒక పాఠాన్ని ఎంత బాగా చదివినా క్రమం తప్పకుండా రివిజన్ చేస్తేనే అది శాశ్వత జ్ఞాపకాల్లోకి చేరుతుంది. అలా చేరితేనే పరీక్షల్లో బాగా రాయగలుగుతారు.

ఒకసారి వచ్చే దాకా చదివితే అది 24 గంటలు గుర్తుంటుంది. 24 గంటల తర్వాత చదివితే వారం రోజుల వరకు గుర్తుంటుంది. వారం లోపు మళ్లీ చదివితే నెల జ్ఞాపకం ఉంచుకోవచ్చు. నెలలోపు నాలుగోసారి చదివితే 3 నెలల వరకు ఢోకా ఉండదు అనేది శాస్త్రీయంగా రుజువైంది. అంటే ప్రతి 3 నెలలకూ ఇంతకు ముందు చదివిందంతా రివిజన్ చేసుకోవాలి.

వారాల పద్ధతి

ఈ పద్ధతిలో ఫార్ములాలు, సంవత్సరాలు, వ్యతిరేక పదాలు, పర్యాయపదాలు, గ్రంథాలు-రచయితలు లాంటివి రోజూ చదవాల్సిన జాబితాలో చేర్చాలి (ఆదివారం మినహా). నిర్వచనాలు, కంఠస్థ పద్యాలు, కొటేషన్లు కనీసం వారానికి మూడుసార్లు చదవాలి (మంగళ, గురు, శని). 2-5 వాక్యాలలోపు ఉండి కొద్దో గొప్పో మార్చి రాయడానికి అవకాశం ఉన్న జవాబులను వారానికి రెండుసార్లు (సోమ, శుక్ర), వ్యాస రూప సమాధానాలను వారానికి ఒకసారి (ఆదివారం) రివిజన్ చేస్తే ఉత్తమం.

పరీక్షల నెలల్లో రోజూ రివిజన్‌కి ముందు 3 గంటలు కేటాయించాలి. పై 4 రకాల రివిజన్లు ఒకేరోజు రాకుండా వేర్వేరు రోజుల్లో వచ్చే విధంగా ప్లాన్ చేయాలి.

సమయం వృథా కాకుండా..!

కావాల్సిన పుస్తకాన్ని వెతుక్కోవడంలో, ఏది రివిజన్ చేయాలో నిర్ణయించుకోవడం లేదా గుర్తుచేసుకోవడంలో రోజుకి కనీసం 15 నిమిషాలు వృథా అయినా 200 రోజులకు 3000 నిమిషాలు అంటే 50 గంటలు కోల్పోతారు. అందుకే సబ్జెక్టుకు ఒక రంగు కేటాయించుకొని అట్టలు వేసుకోవాలి.

అట్టలు వేయడం కుదరకపోతే అన్ని వైపుల నుంచి స్పష్టంగా కనిపించే విధంగా కాగితం లేదా స్టిక్కర్ అంటించాలి. దీని వల్ల ఏ పుస్తకం ఏదో పేజీలు చూడకుండానే గుర్తించగలుగుతారు.

ఆసక్తికరంగా..!

రివిజన్ ఆసక్తికరంగా సాగడానికి కొన్ని చిట్కాలు పాటించవచ్చు. స్టడీ టేబుల్ మీద మూడు లేదా నాలుగు రంగుల బాక్సులు పెట్టుకోవాలి. లేదా మీ బుక్ కేసును వేర్వేరు రంగులతో భాగాలుగా విడదీయాలి. ఉదయం నిద్ర లేవగానే కొత్తగా చదవాల్సినవి ఎరుపు రంగు ప్రదేశంలో ఉంచాలి. రివిజన్ చేయాల్సినవి పసుపు, చూడకుండా రాయాల్సినవి, అప్పజెప్పాల్సినవి ఆకుపచ్చ రంగు ప్రదేశాల్లో ఉంచుకోవాలి.


మనం 4 రకాల రివిజన్ల గురించి అనుకున్నాం. వాటిలో వారానికి 6 రోజులు చదవాల్సిన నోట్సులకు ఎరుపు, వారానికి మూడు రోజులు చదవాల్సిన పుస్తకాలకు ఆకుపచ్చ, వారానికి రెండు రోజులు చదవాల్సిన వాటికి నీలం, వారానికోసారి చదివే దానికి పసుపు రంగు అట్టలు వేయాలి. వారాలకు కూడా వరుస అంకెలు కేటాయించి వాటిని ఆ పుస్తకాలపై కనిపించేలా వేసుకోవాలి. అప్పుడు ఏ రోజు ఏ పుస్తకం చదవాల్లో తేలిగ్గా గుర్తించవచ్చు. సరైన ప్రణాళిక రూపొందించుకొని, జాగ్రత్తలు పాటిస్తే రివిజన్ విజయవంతంగా పూర్తిచేయవచ్చు.



కొన్ని సూత్రాలు

- కొత్తవి నేర్చుకునే క్రమంలో పాత పాఠాలు మరచిపోకుండా చూసుకోవాలి.
- ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోడానికి క్రమం తప్పకుండా రివిజన్ చేయాలి.
- పాత పాఠాలు ఎంత బాగా గుర్తుంటే కొత్తవి అంత త్వరగా వస్తాయని గుర్తించాలి.
- రివిజన్ అంటే అప్పజెప్పడం కాదు. అది జ్ఞాపకాలను తాజాగా ఉంచుకోడానికి అవలంబించే పద్ధతని గ్రహించాలి.
- మొదట ఏ పుస్తకంలో చదివామో చివరి వరకూ అదే పుస్తకంలో చదవాలి. పుస్తకాలు మారిస్తే రివిజన్ ప్రయోజనం తక్కువ.

దూరవిద్యలో ఫైర్‌సేఫ్టీ



■ బీఏ చదివాను ఫైర్ అండ్ సేఫ్టీ కోర్సును దూరవిద్య ద్వారా చదవాలనుకుంటున్నాను. కుదురుతుందా? అందించే సంస్థలేవి?

– కె. నాగరాజు

జ: ఫైర్ ఫైటింగ్, విపత్తును ఎదుర్కోవడం, ఆస్తి, ప్రాణనష్టాన్ని తగ్గించడం వంటి వివిధ కార్యకలాపాలను చూసుకోవడమే ఫైర్ అండ్ సేఫ్టీ ఆఫీసర్ ముఖ్య ఉద్దేశం. దూరవిద్య ద్వారా ఈ కోర్సును (డిప్లొమా ఇన్ ఫైర్ అండ్ సేఫ్టీ) ఇగ్నో, దిల్లీ వారు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైర్ సేఫ్టీ ఇంజినీరింగ్, నాగ్‌పూర్‌వారు అందిస్తున్నారు. పదో తరగతి, ఆపై అర్హత ఉన్నవారు ఈ కోర్సును చేయడానికి అర్హులు.

బీఆర్క్ ఉద్యోగాలు



■ బీఆర్క్ కోర్సులో చేరితే అవకాశాలెలా ఉంటాయి?

- శ్రీరామ్, సింగరాయకొండ

జ: బీఆర్క్ చదివినవారు వివిధ నిర్మాణాల ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణం, సూపర్‌విజన్ బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వీళ్ల అవసరం ఎంతగానో ఉంది. ప్రధానంగా స్పెషల్ డిజైనింగ్, ఆస్థటిక్స్, సేఫ్టీ మేనేజ్‌మెంట్, వివిధ స్ట్రక్చర్ నిర్మాణాల్లో వీరిది ప్రధాన పాత్ర. వీరు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఆర్కిటెక్చరల్ ఇంజినీర్, డిజైనర్, సూపర్‌వైజర్, సైట్ ఇంజినీర్‌గా చేయవచ్చు లేదా సొంతంగా ప్రాక్టీసును కూడా పెట్టుకోవచ్చు. మనదేశంలో నాటా (నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్) పరీక్ష ద్వారా ప్రధాన విద్యాసంస్థల్లో బీఆర్క్‌లో ప్రవేశాన్ని పొందవచ్చు.

పైలట్ అవ్వాలంటే...?

■ పైలట్ అవ్వాలని నాకు అభిలాష. దీనికి కావాల్సిన విద్యార్హతలూ, ఫిట్‌నెస్ ప్రమాణాలు, శిక్షణ సంస్థలు, వాటి సుమారు ఫీజు వివరాలను తెలపగలరు.

- శ్రీకృష్ణ, వరంగల్

జ: పైలట్ అవ్వాలనుకునేవారు 10+2ను మేథమెటిక్స్, ఫిజిక్స్‌లతో పూర్తిచేసినవారు అర్హులు. మనదేశంలో డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)వారు పైలట్ లైసెన్స్‌ను జారీ చేస్తారు. డీజీసీఏ వారి అనుబంధ, గుర్తింపు పొందిన ఫ్లయింగ్ స్కూల్ నుంచి శిక్షణ పొందినవారికి పైలట్ లైసెన్స్‌ను మంజూరు చేస్తారు.



పైలట్ అవ్వాలంటే ఫిట్‌నెస్‌పరంగా క్లాస్-2 మెడికల్ పరీక్షను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ పరీక్షలో అభ్యర్థి ఫిట్‌గా ఉన్నట్లు తేలిన తరువాతే ఫ్లయింగ్ స్కూల్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పైలట్ ట్రైనింగ్ ఖర్చుతో కూడుకున్నది. ఫ్లయింగ్ స్కూల్‌నుబట్టి ఈ కోర్సుకు సుమారుగా రూ.14 లక్షల నుంచి రూ.16 లక్షల వరకూ ఖర్చు కావచ్చు.

ఇందిరాగాంధీ ఫ్లయింగ్ స్కూల్ మనదేశంలో ప్రఖ్యాత పైలట్ ట్రైనింగ్ సంస్థ. తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణ స్టేట్ ఏవియేషన్ అకాడమీ, ఫ్లయింగ్ ఏవియేషన్ అకాడమీ, వింగ్ ఏవియేషన్ మొదలైన సంస్థలు డీజీసీఏ అనుమతితో పైలట్ శిక్షణను అందిస్తున్నాయి.

- ప్రొ. బి. రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ, తిరుపతి

పోస్టు: ప్రొఫెసర్/ అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఫేజ్-2)
ఖాళీలు: 50
అర్హత: పీజీ/ నెట్/ స్లెట్/ సెట్/ పీహెచ్‌డీ.
ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్
చివరితేది: 05.02.2018
వెబ్‌సైట్: https://www.svuniversity.edu.in/

ఆంధ్రా యూనివర్సిటీ

పోస్టు: అసోసియేట్ ప్రొఫెసర్/ అసిస్టెంట్ ప్రొఫెసర్ **ఖాళీలు:** 337
అర్హత: పీజీ/ నెట్/ స్లెట్/ సెట్/ పీహెచ్‌డీ.
ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్
చివరితేది: 02.02.2018
వెబ్‌సైట్: http://andhrauniversity.edu.in/

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

సిర్పూరు కాగజ్‌నగర్ జేఎన్‌వీ

పోస్టు: టీజీటీ (సోషల్ సైన్స్)
ఖాళీలు: 01 **అర్హత:** బీఏ/ టెట్/ సీటెట్.
ఇంటర్వ్యూ తేది: 18.01.2018.
వేదిక: జేఎన్‌వీ, సిర్పూర్ కాగజ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లా.

ఐఎఫ్‌బీ, హైదరాబాద్

పోస్టు: కన్సల్టెంట్ తదితర పోస్టులు
ఖాళీలు: 08
అర్హత: ఇంటర్/ డిగ్రీ/ పీజీ/ టైప్ రైటింగ్.
ఇంటర్వ్యూ తేది: 16.01.2018
వేదిక: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ, దూలపల్లి, హైదరాబాద్.

ప్రవేశాలు

ఐఐడీటీ, తిరుపతి

1) పీజీ ప్రోగ్రామ్ ఇన్ సైబర్ సెక్యూరిటీ 2) పీజీ ప్రోగ్రామ్ ఇన్ బిజినెస్ అనలిటిక్స్ **కోర్సు ఫీజు:** రూ.4,75,000 **కోర్సులు ప్రారంభం:** 20.02.2018.
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ/ పీజీ. **ఎంపిక:** ప్రవేశపరీక్ష ద్వారా.
ప్రవేశపరీక్ష తేది: 21.01.2018. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
చివరితేది: 14.01.2018. **వెబ్‌సైట్:** http:// register.iidt.edu.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

విద్య నాణ్యత మెరుగుకు సాయపడాలి

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

జైపూర్: దేశంలో విద్య నాణ్యతను మెరుగుపరచడంలో విద్యాసంస్థలకు సాయమందించేందుకు.. దిగ్గజ వ్యాపార సంస్థలు ముందుకురావాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. జీవన ప్రదాతగా, వ్యక్తిత్వ నిర్మాతగా విద్య ఉండాలని ఆయన అన్నారు. రాజస్థాన్‌లోని టోంక్ జిల్లాలో.. ఆదివారం జరిగిన వనస్థలీ విద్యాపీఠ్ మహిళల విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో వెంకయ్యనాయుడు ఈ మేరకు ప్రసంగించారు. మహిళలకు సాధికారత కల్పించేందుకు విద్య అత్యుత్తమ మార్గమని తాను నమ్ముతానని.. పటిష్ఠ, సమ్మిళిత, సమానావకాశాలుండే భారత్‌ను నిర్మించడంలో అక్షరాస్యత, విద్య పునాదులుగా ఉంటాయని ఆయన అన్నారు.

రజనీ 'ముద్ర' మా లోగోలా ఉంది

ముంబయి సంస్థ అభిప్రాయం

దిల్లీ: ప్రముఖ నటుడు రజనీకాంత్ చేతివేళ్లతో చూపించే 'యోగ ముద్ర' తమ లోగో మాదిరిగా ఉందని ముంబయికి చెందిన ఓ స్టార్టప్ కంపెనీ చెబుతోంది. రాజకీయరంగ ప్రవేశం చేయనున్నట్లు ఆయన ప్రకటించినప్పటి నుంచి ఈ గుర్తుకు ప్రాధాన్యం పెరిగింది. అయితే ఇది తమ సంస్థ లోగో మాదిరిగా ఉందని 18 నెలల క్రితం ఏర్పాటయిన స్టార్టప్ సంస్థ వోక్స్‌వెబ్ తెలిపింది. దీనిపై రజనీకాంత్‌కు లేఖ రాశామని, ఆయన సమాధానం కోసం వేచిచూస్తున్నామని ఆ సంస్థ వ్యవస్థాపకుడు యశ్ మిశ్ర తెలిపారు.

రద్దుచేసిన నోట్లతో దస్త్రాల ప్యాడ్లు తయారీ

తమిళనాడు డీఐజీ మురుగేశన్ వెల్లడి

చెన్నై, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం 2016లో రద్దు చేసిన పెద్ద నోట్లను వినియోగించి ఖైదీలతో దస్త్రాల అట్ట(ప్యాడ్)లను తయారుచేయిస్తున్నట్లు తమిళనాడు జైళ్ల శాఖ డీఐజీ ఎ.మురుగేశన్ వెల్లడించారు. కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న వారి జీవితాలు ప్రకాశింపజేయడానికి ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలోని పుళల్ జైల్లో ప్రత్యేక శిక్షణ పొందిన ఖైదీలు సంబంధిత నోట్లతో ప్రస్తుతం 'ఫైల్ ప్యాడ్లు' తయారు చేస్తున్నారని చెప్పారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జైలుకి 70 టన్నుల చెల్లని నోట్లను అందించిందని.. ఇప్పటివరకు తొమ్మిది టన్నులు ఉపయోగించుకున్నట్లు తెలిపారు. రద్దు చేసిన నోట్లతో రోజుకి వెయ్యి ప్యాడ్లు తయారవుతున్నట్లు తెలిపారు. మొదటిగా ఆయా నోట్లతో గుజ్జు తయారు చేసి అనంతరం గట్టి ప్యాడ్లుగా రూపొందిస్తున్నామన్నారు.

అష్ట భార్యలను ముంచిన ఘనుడు!

కోయంబత్తూర్: లారీల వ్యాపారం బాగా నడవలేదు. 'పెళ్లిళ్ల వ్యాపారం' చేస్తే బాగుంటుందనుకున్నాడేమో ఆ రంగంలో దిగాడు. వరుసపెట్టి ఎనిమిది పెళ్లిళ్లు చేసుకొని వారిని కనీసం రూ.4.5 కోట్ల మేర ముంచాడు. ఇదీ కోయంబత్తూర్‌లోని వెల్లలూర్‌కు చెందిన బి.పురుషోత్తమన్ (57) కథ. ఆయన భార్య ఉషారాణి చాలా ఏళ్ల క్రితమే మరణించింది. ప్రస్తుతం 18 ఏళ్ల కుమార్తె ఉంది. కోయంబత్తూర్‌లో పెళ్లి సంబంధాల ఏజెన్సీ నిర్వహించే మోహన్, వనజ కుమారిలతో పరిచయం పెంచుకున్నాడు. విడాకులు తీసుకున్నవారు, వితంతువులను లక్ష్యంగా పెట్టుకొని ఎనిమిదేళ్లలో ఎనిమిది మందిని వివాహం చేసుకున్నాడు. చెన్నైలోని ఇందిరా గాంధీ (45) అనే లెక్చరర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది. మాయమాటలు చెప్పి ఆమెను పెళ్లాడాడు. ఆమెకు చెన్నైలో ఇల్లు ఉండడంతో దాన్ని అమ్మివేసి కోయంబత్తూర్‌లో కొనుగోలు చేయాలని చెప్పాడు. నిజమే అన్ని నమ్మి దాన్ని రూ.1.5 కోట్లకు అమ్మి అతని చేతిలో పెట్టింది. మళ్లీ అతడు కనిపించలేదు. ఎలాంటి ఆధారంలేని ఆమె పోలీసులను ఆశ్రయించడంతో నిజరూపం బయటపడింది. తనకు ముందు ముగ్గుర్ని, ఆ తరువాత మరో నలుగుర్ని పెళ్లి చేసుకున్నాడని తెలుసుకొని తెల్లబోయింది. కుముదవల్లి అనే మహిళలను కూడా ఇదే విధంగా పెళ్లాడి మోసగించాడు. రూ.17 కోట్ల ఆస్తి వివాదం కోర్టులో ఉందని, అంతవరకు డబ్బు సర్దమని ఆమెనుకోరాడు. గుడ్డిగా నమ్మిన ఆమె తనకున్న పొలాలను రూ.3 కోట్లకు అమ్మి అతని చేతిలో పెట్టింది. అతన్ని ఆమె చూడడం అదే చివరిసారి అయింది. అతనిపై ఇప్పటికే 18 మోసం కేసులు నమోదయి ఉన్నాయని పోలీసు ఇన్‌స్పెక్టర్ మసుతా బేగం చెప్పారు.

147 మంది భారత మత్స్యకారుల విడుదల

ఇస్లామాబాద్: కరాచీ జైలులో ఉన్న 147 మంది భారతీయ మత్స్యకారులను ఆదివారం పాకిస్థాన్ ప్రభుత్వం విడుదల చేసింది. ఎనిమిది నెలల క్రితం అరేబియా సముద్రంలో చేపలు వేటాడుతూ సరిహద్దును దాటారన్న కారణంతో వారిని అరెస్టు చేసింది. సుహృద్భావ చర్యల్లో భాగంగా వారిని విడిచిపెట్టామని, సోమవారం వాఘా సరిహద్దు వద్ద భారత అధికారులకు అప్పగిస్తామని పాక్ పోలీసు అధికారి ఒకరు చెప్పారు.

మేం విద్యుత్తు బిల్లులు కట్టాలా?

సౌదీ రాకుమారుల ధర్నా

రియాద్: తాము కూడా విద్యుత్తు, నీటి బిల్లులు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించినందుకు నిరసనగా అరెస్టయిన 11 మంది సౌదీ రాకుమారులు బైఠాయించి ఆందోళన చేశారు. ఇంతవరకు వీరికి సంబంధించిన బిల్లులను ప్రభుత్వమే చెల్లించేది. పొదుపు చర్యల్లో భాగంగా ఎవరి బిల్లులు వారే చెల్లించుకోవాలని ఆదేశించింది. ఇందుకు నిరసనగా వారంతా కసర్ అల్ హోకమ్ రాజభవనంలో ధర్నా చేశారు. నిధుల దుర్వినియోగం ఆరోపణలపై పలువురు రాకుమారులను పట్టాభిషిక్తుడు కానున్న యువరాజు గతంలోనే అరెస్టు చేయించారు.

ఏమిటీ ప్రకృతి వైపరీత్యం!

● మంచు తుపానుతో గడ్డకట్టిన అమెరికా ● ఆస్ట్రేలియాలో ఠారెత్తిస్తు న్న ఎండలు ● వాతావరణ మార్పులే కారణమంటున్న నిపుణులు

వాతావరణ మార్పులు ఎంతటి అనర్థాలకు దారితీస్తాయో.. ప్రస్తుతం భూగోళంపై రెండు ప్రాంతాల్లో చోటుచేసుకున్న తీవ్ర వాతావరణ పరిస్థితులే ఉదాహరణ. ఒకవైపు విపరీతంగా కురుస్తున్న మంచుతో ఉత్తర అమెరికా గడ్డకట్టింది. మరోవైపు ఠారెత్తిస్తున్న ఎండలతో ఆస్ట్రేలియా అల్లాడిపోతోంది. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఆదివారం మైనస్ 13 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైతే.. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో 47 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకావడం ప్రకృతి వైపరీత్యానికి పరాకాష్ఠ.



మంచు తుపానుతో వణికిపోతున్న న్యూజెర్సీ వాసి

అమెరికాలోని తూర్పు ప్రాంతాల్ని మంచు తుపాను అల్లాడిస్తోంది. విపరీతంగా పడిపోయిన ఉష్ణోగ్రత, గడ్డకట్టుకుపోయే చలిగాలుల్తో... అమెరికాలోని చాలా నగరాల్లో ప్రజలు ఇళ్లలో నుంచి బయటికి కూడా రావడం లేదు. విమానాలు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. వందలమంది విమానాశ్రయాల్లో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లను కమ్మేసిన మంచుతో వాహనాలు ముందుకు కదలట్లేదు. జనజీవనం అతలాకుతలమైంది. విద్యుత్, నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మంచు తుపాను దెబ్బకు కొందరు ప్రాణాలు కోల్పోయారు. న్యూయార్క్, న్యూజెర్సీ, కనెక్టికట్, మసాచుసెట్స్ తదితర నగరాల్ని మంచుతుపాను కమ్మేసింది. తూర్పు కెనడాలోని ఆంటారియో, క్యుబెక్ లాంటి నగరాల్లో మైనస్ 50 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



కొళాయి కింద చల్లబడుతున్న సిడ్నీ నివాసి

ఠారెత్తిస్తున్న ఎండల్తో ఆస్ట్రేలియా చెమటోడుస్తోంది. సిడ్నీ నగరంలో 1939 తర్వాత(79 ఏళ్ల తర్వాత) మొట్టమొదటిసారిగా 47.3 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ప్రజలు ఇళ్లలోని బయటికి రావడానికి జంకుతున్నారు. సముద్రతీరాల్లో, నీటి వనరులున్న చోట సేదదీరుతున్నారు. చాలాచోట్ల విద్యుత్‌కు, నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నిరాశ్రయులుగా ఉంటున్న వారికి ధార్మిక సంస్థలు నీటిని సరఫరా చేస్తున్నాయి. విక్టోరియా, దక్షిణ ఆస్ట్రేలియాల్లోని కొన్ని ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు చోటుచేసుకుని ఆస్తినష్టం సంభవించింది. వాతావరణంలో నానాటికీ సంభవిస్తున్న పెను మార్పులే ఈ విపత్తులకు కారణమని, మున్ముందు మరెన్ని అనర్థాలకు దారితీస్తాయోనని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.


చైనాలోని షాంక్సీ ప్రావిన్స్‌లో జియన్‌లో పట్టాలపై పేరుకుపోయిన మంచును తొలగిస్తున్న సిబ్బంది ★ మంచు తుపాను కారణంగా బోస్టన్‌లో కార్లపై మంచు

మంచు గాలులతో గడ్డకట్టిన కశ్మీర్

● ఒకేసారి పడిపోయిన ఉష్ణోగ్రతలు

దిల్లీ: మంచు గాలులు వీస్తుండడంతో కశ్మీర్ డివిజన్, లదాఖ్ ప్రాంతాలు గడ్డకట్టుకుపోయాయి. రాత్రి వేళ వాతావరణం మరీ చలిగా ఉంటోంది. ఆదివారం రాత్రి అత్యంత తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శ్రీనగర్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత మైనస్ ఆరు డిగ్రీల సెల్సియస్ ఉంది. శనివారం మైనస్ 1.2 డిగ్రీల సెల్సియస్ ఉండగా, ఒకేసారి అయిదు డిగ్రీలు పడిపోయింది. లదాఖ్ డివిజన్‌లోని కార్గిల్‌లో పరిస్థితి దారుణంగా ఉంది. ఇక్కడ మైనస్ 18.8 డిగ్రీల సెల్సియస్ నమోదు కావడం గమనార్హం. క్వాజీగుండ్‌లో మైనస్ 4.6, గుల్‌మార్గ్‌లో మైనస్ 9.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హిమాచల్ ప్రదేశ్‌లోనూ ఇదే పరిస్థితి. అక్కడ కూడా ఉష్ణోగ్రతలు ఒకేసారి 2-3 డిగ్రీల మేర తగ్గాయి. అక్కడి కైలాంగ్ ప్రాంతంలో మైనస్ 12.6 డిగ్రీల సెల్సియస్ నమోదయింది.

దిల్లీలో పరిస్థితి మెరుగు: దిల్లీలో వాతావరణం కాస్త మెరుగుపడింది. పగటి ఉష్ణోగ్రత 20.7 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, శనివారం రాత్రి కనిష్ఠ ఉష్ణోగ్రత 6.4 డిగ్రీల సెల్సియస్‌గా ఉంది. ఆకాశం నిర్మలంగా ఉంటుందని, సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. హరియాణాలో చలిగాలుల ప్రభావం అధికంగా ఉండడంతో పాఠశాలల శీతకాల సెలవులను ఈ నెల 14 వరకు పొడిగిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. పంజాబ్‌లోనూ ఇలాంటి వాతావరణమే నెలకొంది. ఛండీగఢ్‌లో శనివారం రాత్రి 5.8 డిగ్రీలు, రాజస్థాన్‌లోని మౌంట్ అబూలో 2 డిగ్రీలు నమోదయింది. మరికొన్ని రోజుల్లో పశ్చిమ బెంగాల్‌లో చలిగాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

రైళ్ల రాకపోకలకు అంతరాయం: దట్టమైన మంచు కారణంగా ఉత్తరాదిలో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. 39 రైళ్లను రద్దు చేయగా, 50 రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. 16 రైళ్ల సమయాలను మార్చినట్టు అధికారులు తెలిపారు.

భద్రతా వ్యవస్థను పటిష్ఠపరచాలి

● పోలీసు ఉన్నతాధికారులకు ప్రధాని మోదీ సూచన

టేకన్‌పూర్ (మధ్యప్రదేశ్): దేశంలో భద్రతా వ్యవస్థను మరింత పటిష్ఠపరచాలని ప్రధాని మోదీ పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. జమ్ము-కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు, నక్సలైట్ల ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. గ్వాలియర్ సమీపంలోని టేకన్‌పూర్‌లో ఉన్న బీఎస్ఎఫ్ అకాడమీలో ఆదివారం జరిగిన డీజీపీ, ఐజీల వార్షిక సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం మోదీ ట్వీట్ చేస్తూ..."భద్రత, పోలీసింగ్‌పై అధికారుల బృందాలతో చర్చలు జరిగాయి. మూడేళ్లల్లో తీసుకున్న నిర్ణయాల అమలుపై చర్చ జరిగింది" అని పేర్కొన్నారు. మోదీ సూచనల మేరకుహోంశాఖ 2014 నుంచి ప్రతి ఏటా పోలీసు ఉన్నతాధికారుల సదస్సు నిర్వహిస్తోంది. ఇంతవరకు గువాహటి, రాణా ఆఫ్ కచ్, హైదరాబాద్‌ల్లో సమావేశాలు నిర్వహించారు. వివిధ ప్రమాణాలు ఆధారంగా దేశంలో పది ఉత్తమ పోలీసు స్టేషన్లను గుర్తించాలని రాణా ఆఫ్ కచ్‌లో జరిగిన సమావేశంలో ప్రధాని సూచించారు. ఆ మేరకు కోయంబత్తూర్‌లోని ఆర్.కె.నగర్, హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీసు స్టేషన్లు మొదటి రెండు స్థానాలు పొందాయి. తొలుత గ్వాలియర్ విమానాశ్రయంలో ప్రధాని మోదీకి సీఎం శివ్‌రాజ్ సింగ్ చౌహాన్ తదితరులు స్వాగతం పలికారు.


ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్

జీఎస్టీ పన్ను చెల్లింపుదారుల విభజన

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నేపథ్యంలో కేంద్ర పన్నుల శాఖ, రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ మధ్య పన్ను చెల్లింపుదారుల విభజన ప్రక్రియ పూర్తయింది. రాష్ట్రంలో జీఎస్టీ కింద నమోదు చేసుకున్న వ్యాపార సంస్థలు, వ్యాపారుల విభజన చేశారు. ఇప్పటి వరకూ నమోదైన 2,98,927 మంది వ్యాపారుల్లో కేంద్ర జాబితాలోకి 99,955 మంది.. రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ పరిధిలోకి 1,98,972 మంది వ్యాపారులు వచ్చారు.

రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో అన్ని రకాల వ్యాపారులపై కేంద్ర జీఎస్టీ, రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కార్యకలాపాలు ఉండేలా విభజన జరిగింది. కేంద్ర జీఎస్టీ, రాష్ట్ర జీఎస్టీ పరిధిలోకి వచ్చిన వారికి సంబంధించి రిటర్న్‌ల దాఖలు, పన్ను రిఫండ్ సహా అన్ని అంశాలను ఎవరికి కేటాయిస్తే వారే పర్యవేక్షిస్తారు. విభజన వల్ల పూర్తి స్థాయిలో పర్యవేక్షణకు అవకాశం ఉంటుంది. కేంద్ర జీఎస్టీ చీఫ్ కమిషనర్ బి.బి. అగ్రావాల్, రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ముఖ్య కార్యదర్శి సోమేశ్‌కుమార్, సీజీఎస్టీ కమిషనర్ ఎం.శ్రీనివాస్, రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, సీనియర్ అధికారులు ఈ విభజన ప్రక్రియలో పాలుపంచుకున్నారు. లాటరీ ద్వారా సంస్థలను విభజించారు. ఏడాదికి రూ.కోటిన్నర కంటే ఎక్కువ లావాదేవీలు ఉన్న వ్యాపారులను 1:1 నిష్పత్తిలో.. కోటిన్నర కంటే తక్కువ లావాదేవీలు ఉన్నవారిని 1:9 నిష్పత్తిలో కేంద్ర జీఎస్టీ, రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ మధ్య విభజించారు.

జీఎస్టీ పరిధిలో విభజన ఇలా..

విభాగం	మొత్తం వ్యాపారులు	కేంద్ర జీఎస్టీ పరిధిలోకి	రాష్ట్ర పరిధిలోకి..
రాష్ట్రంలో జీఎస్టీ పరిధిలోని వ్యాపారులు	2,98,927	99,955	1,98,972
కొత్తగా నమోదుచేసుకున్నవారు	1,15,000	66,592	48,408
రూ.కోటిన్నర కంటే ఎక్కువ లావాదేవీలున్నవారు	36,830	18,414	18,416
రూ.కోటిన్నర కంటే తక్కువ లావాదేవీలున్నవారు	1,46,797	14,649	1,31,848

ఈ ఉచితం... అనుచితం

● విలాసవంత రైళ్లలోనూ అలాంటి ప్రయాణాలా?!

● పార్లమెంటరీ స్థాయీ సంఘం విస్మయం

దిల్లీ

రైల్వే నడుపుతున్న విలాసవంతమైన రైళ్లలోనూ పలువురు ఉన్నతాధికారుల ఉచిత ప్రయాణానికి రైల్వేబోర్డు వర్గాలే అనుమతిస్తున్న తీరు అనుచితంగా ఉందని పార్లమెంటరీ స్థాయీ సంఘం తప్పు పట్టింది. అసలే ఆ రైళ్లలో బెర్తులు 30 శాతమే భర్తీ అవుతుండగా ఇలాంటి ఉచితాల వల్ల మరింతగా నష్టం వాటిల్లుతోందని ఇటీవల సమర్పించిన నివేదికలో పేర్కొంది. రైల్వే బోర్డు, భారతీయ రైల్వే ఆహార విహార సంస్థ (ఐఆర్‌సీటీసీ), రాష్ట్రాల పర్యాటకాభివృద్ధి సంస్థల అధికారుల సిఫార్సుల మేరకు విలాస రైళ్లలో ఉచితంగా ప్రయాణించిన వందలాది మంది ప్రయాణికుల పేర్లను నివేదికలో ప్రస్తావించింది. వీరు ప్రయాణం చేసిన అయిదు రైళ్లలో టికెట్ ధరలు 500 నుంచి 650 డాలర్ల వరకు (ప్రస్తుత మారకపు విలువ ప్రకారం సుమారు రూ.33,500 నుంచి రూ.43,550) ఉన్నాయి. ఉచితంగా ప్రయాణించినవారిలో అత్యధికులు రైల్వే అధికారులే.

ప్రజల డబ్బును దుర్వినియోగం చేస్తున్నారు: మహారాజా ఎక్స్‌ప్రెస్, రాయల్ రాజస్థాన్ ఆన్ వీల్స్, డెక్కన్ ఒడిస్సీ, ప్యాలెస్ ఆన్ వీల్స్, గోల్డెన్ ఛారియట్ అనే అయిదు విలాసవంత రైళ్లను రైల్వే వివిధ ప్రాంతాల మధ్య నడుపుతోంది. నిర్వహణ ఖర్చులు రావడం కష్టమవుతున్న తరుణంలో ఉచిత ప్రయాణాలను ఎలా అనుమతిస్తారని కమిటీ ప్రశ్నించింది. 2011-16 మధ్య ఉచిత ప్రయాణాలు చేసినవారిలో రైల్వే మంత్రి మాజీ వ్యక్తిగత కార్యదర్శి, మాజీ ప్రత్యేక విధుల అధికారి, పలువురు డివిజనల్ రైల్వే మేనేజర్లు ఉన్నారు.

ఐఏఎస్, ఐపీఎస్‌లపై ఎంత సొమ్ము వెచ్చించారు?: ఐఏఎస్, ఐపీఎస్, ఇతర అధికారుల వేతనాలు, భత్యాలకు అయిన ఖర్చును తెలియజేయకపోవడంపై పార్లమెంటరీ అంచనాల స్థాయీ సంఘం కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసింది. దేశ పురోభివృద్ధికి అఖిల భారత సర్వీసు అధికారులు అందిస్తున్న సేవలను మదించేందుకు సమర్థ యంత్రాంగం ఉండాలని ఈ కమిటీ పేర్కొంది. ఈ అధికారులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ఖర్చును సంవత్సరాల వారీగా మూడు నెలల్లోగా అందించాలని ఈ కమిటీ కోరింది. ఈ వివరాలు అందకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేసింది.

అధ్వానంగా ఏకలవ్య పాఠశాలలు

ఈనాడు, దిల్లీ: గిరిజన బాలల కోసం నిర్వహిస్తున్న ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల నిర్వహణ నాసిరకంగా ఉన్నట్లు పార్లమెంటు స్థాయీ సంఘం అభిప్రాయపడింది. మౌలిక వసతుల కొరతతోపాటు, బోధన సిబ్బంది కూడా తగినంత లేరని పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ లోపమే ఇందుకు కారణమని అభిప్రాయపడింది. ఈ పాఠశాలల నిర్వహణకు కేంద్రం ఎప్పుడు పూర్తి స్థాయి నిధులు ఇస్తుందో తెలియదు, వీటి నిర్వహణను కేంద్రమే ఎందుకు తీసుకోదో అర్థం కాదని తెలిపింది. దేశం మొత్తమ్మీద 271 ఏకలవ్య పాఠశాలలు మంజూరు చేస్తే అందులో 81 పాఠశాలల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదని పేర్కొంది. వీటి పర్యవేక్షణకు కేంద్రీకృత ఆన్‌లైన్ వ్యవస్థను, పటిష్ఠ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది.

ఎన్నికల కోసమే సిద్ధరామయ్య హిందూ జపం!

● కర్ణాటకలో పాలన తిరోగమనం

● ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ విమర్శలు

ఈనాడు-బెంగళూరు: ఎన్నికలు సమీపిస్తుండటంతోనే ఇప్పుడు తాను కూడా హిందూవునే అంటూ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించుకుంటున్నారని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆక్షేపించారు. బెంగళూరులో ఆదివారం భాజపా నిర్వహించిన 'పరివర్తన యాత్ర'లో యోగి ప్రసంగించారు. గుజరాత్ ఎన్నికల సందర్భంగా రాహుల్‌గాంధీ, ఇప్పుడు సిద్ధరామయ్య మందిరాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. 'నేను కూడా హిందువు అన్నంతనే హిందువైపోతారా? గతంలో భాజపా రాష్ట్ర ప్రభుత్వం గోవధను నిషేధించింది. సిద్ధరామయ్య ప్రభుత్వం దాన్ని ఎత్తి వేసింది.'అని విమర్శించారు. సిద్ధరామయ్య పాలనలో రాష్ట్రం తిరోగమనం పట్టిందని, శాంతిభద్రతలు కుప్పకూలాయని, అభివృద్ధి స్తంభించిందన్నారు. రాష్ట్రంలో 22 మంది హిందూ కార్యకర్తలు హత్యలకు గురైనప్పటికీ ప్రభుత్వం దుండగుల్ని శిక్షించలేదని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత అభివృద్ధి పథకాల్ని సిద్ధరామయ్య అమలు చేయకుండా గాలికి వదిలేస్తున్నారన్నారు. కేంద్రం, రాష్ట్రంలో ఒకే పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడే ప్రగతిని సాధించే వీలున్నందున వచ్చే విధానసభ ఎన్నికల్లో భాజపా అభ్యర్థుల్ని గెలిపించాలని కర్ణాటక ప్రజలకు పిలుపునిచ్చారు. కేంద్ర పర్యావరణ మంత్రి ప్రకాశ్ జావడేకర్ మాట్లాడుతూ.. గార్డెన్ సిటీగా పేరు గాంచిన బెంగళూరు గార్బేజ్ సిటిగా (చెత్త నగరం) దిగజారిందని వ్యాఖ్యానించారు. ఒకప్పుడు చల్లటి నీరిచ్చి సేదదీర్చిన తటాకాల్లో ఇప్పుడు మంటలు చెలరేగుతున్నాయని వ్యాఖ్యానించారు.


బెంగళూరు సభలో యోగి ఆదిత్యనాథ్‌ను సత్కరిస్తున్న భాజపా నేతలు

ఆసియాన్‌తో మైత్రికి

ప్రవాస భారతీయులు అద్భుత వారధులు

● విదేశాంగ మంత్రి సుష్మ వ్యాఖ్య

సింగపూర్: 'ఆసియాన్' కూటమితో దృఢ బంధాన్ని ఏర్పరచుకోవడంలో ప్రవాస భారతీయులు.. భారత్‌కు అద్భుత వేదికయ్యారని విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ పేర్కొన్నారు. సింగపూర్‌లో ఆసియాన్-ప్రవాసీ భారతీయ దివస్ సదస్సును ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఆసియాన్ పట్ల భారత నిబద్ధతను పునరుద్ఘాటించారు. "అన్ని దేశాలూ అంతర్జాతీయ నిబంధనలకు కట్టుబడటంతోపాటు సార్వభౌమ సమానత్వం, పరస్పర విశ్వాసం వంటి సూత్రాలకు అనుగుణంగా నడుచుకుంటే భద్రత నెలకొంటుంది. మన ఆర్థిక వ్యవస్థలు సుసంపన్నమవుతాయి" అని ఆమె చెప్పారు. భారత్, ఆసియాన్‌వి ఉమ్మడి లక్ష్యాలన్నారు. భారత పురోగతిలోను, ప్రపంచంతో దేశ ఆర్థిక బంధాన్ని ముందుకు తీసుకెళ్లడంలోను రాష్ట్రాల పాత్ర కీలకమని చెప్పారు. ఈ సదస్సుకు అసోం ముఖ్యమంత్రి శర్బానంద సోనోవాల్ హాజరుకావడాన్ని ప్రస్తావిస్తూ.. ఈశాన్య భారత్ ఎదిగి, ఆగ్నేయాసియాకు వారధిగా మారుతుందని చెప్పారు.

మోదీ ఫోన్ కాల్‌తో..: 2015లో సౌదీ అరేబియా నేతృత్వంలోని సంకీర్ణ దళాలు యెమన్‌పై దాడులు మొదలుపెట్టగానే తాను మోదీ వద్దకు వెళ్లి.. సౌదీ రాజుతో మీకున్న సత్సంబంధాలను ఉపయోగించుకోవాలని కోరినట్లు సుష్మ చెప్పారు. ఆ వెంటనే ప్రధాని.. రాజుకు ఫోన్ చేసి, భారతీయులను సురక్షితంగా తరలించేందుకు సాయం చేయాలని కోరినట్లు చెప్పారు. సానుకూలంగా స్పందించిన రాజు.. వారం పాటు రోజూ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ బాంబు దాడులను నిలిపివేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. "ఆ వెంటనే యెమన్ అధికారులతో మాట్లాడా. ఎడెన్ రేవును, సనా విమానాశ్రయాన్ని తెరవాలని, తద్వారా 2 గంటల విరామంలో పౌరులను జిబౌటీకి తరలిస్తామని చెప్పా. భారతీయులకు ఎలాంటి హాని కలిగించబోమని యెమన్ అధికారులు హామీ ఇచ్చారు అని సుష్మా తెలిపారు.


ఆసియాన్-ప్రవాసీ భారతీయ దివస్ కార్యక్రమంలో రోబోతో కరచాలనం చేస్తున్న సుష్మాస్వరాజ్

ఘనంగా 'అవినాశలింగం' స్నాతకోత్సవం

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోయంబత్తూరులోని 'అవినాశలింగం ఇన్‌స్టిట్యూట్ ఫర్ హోం సైన్స్, హయ్యర్ ఎడ్యుకేషన్ ఫర్ ఉమెన్' స్నాతకోత్సవం ఆదివారం వర్సిటీ ప్రాంగణంలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్నాతకోత్సవ ప్రసంగానంతరం ఆమె ర్యాంకర్లను సత్కరించారు. ప్రతిభ కనబరిచిన 74 మందికి బంగారు పతకాలను అందించారు.


పట్టా ప్రదానం చేస్తున్న రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్

పార్టీల నిధుల ప్రక్షాళనపై సూచనలు స్వీకరిస్తాం


● ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

దిల్లీ: రాజకీయ నిధుల సేకరణ విధానాలను ప్రక్షాళన చేయడానికి ప్రభుత్వం సలహాలు స్వీకరించనుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. ఈ విషయమై ఫేస్‌బుక్‌లో తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఎన్నికల బాండ్ల విధానం ప్రస్తుత పద్ధతుల కన్నా ఎంతో మెరుగైనదని, పారదర్శకతతో కూడుకున్నదని తెలిపారు. 'ఇప్పుడున్న విధానం ఏమిటంటే విరాళాల స్వీకరణ, వ్యయం అంతా నగదు రూపంలోనే ఉంటోంది. అజ్ఞాత, నకిలీ వ్యక్తుల పేర్లతో విరాళాలు వస్తున్నాయి. మొత్తం ఎంత వసూలయిందీ బహిర్గతపరిచే అవకాశాలే లేవు. గుర్తుతెలియని మార్గాల నుంచి అక్రమంగా నగదు వచ్చి పడుతోంది. చాలా పార్టీలు ఈ విధానం కొనసాగాలని కోరుకుంటున్నాయి. ప్రత్యామ్నాయాలు తీసుకొచ్చినా వ్యతిరేకిస్తుంటాయి. నిజాయతీతో కూడిన విరాళాలను ప్రోత్సహించడానికే చెక్కులు, ఆన్‌లైన్ నగదు బదిలీ, ఎన్నికల బాండ్లను తీసుకొచ్చాం. ఈ విషయమై ఇంకా మెరుగైన సూచనలను స్వీకరిస్తామ'ని పేర్కొన్నారు.

జైట్లీ పరువునష్టం కేసులో ఆప్ నేతకు రూ.10వేలు వడ్డన

న్యాయస్థాన విచారణకు ఆటంకం కలిగిస్తున్నందుకు రూ.10,000 చెల్లించాలని ఆప్ నేత అశుతోష్‌ను దిల్లీ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ దీపక్ షెరావత్ ఆదేశించారు. దిల్లీ-జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షునిగా కేంద్రమంత్రి జైట్లీ ఉన్నప్పుడు నిధుల దుర్వినియోగం జరిగిందంటూ ఆప్ నేతలు గతంలో ఆరోపించారు. దీనిపై జైట్లీ పరువునష్టం దావా వేశారు. ఈ కేసులో ప్రతివాదులుగా అశుతోష్‌తో పాటు దిల్లీ సీఎం కేజ్రీవాల్ తదితరుల్ని చేర్చారు. ఆంగ్లంలో జైట్లీ ఇచ్చిన వాంగ్మూలాన్ని అర్థం చేసుకోవడంలో ఇబ్బంది లేకపోయినా దానిని మళ్లీ హిందీలో నమోదు చేయాలని అశుతోష్ కోరడాన్ని న్యాయస్థానం తప్పుపట్టింది.

అమెరికా దిగ్గజ వ్యోమగామి జాన్ యంగ్ కన్నుమూత



వాషింగ్టన్: అమెరికా దిగ్గజ వ్యోమగామి జాన్ యంగ్(87) కన్నుమూశారు. న్యూమోనియా వ్యాధితో బాధపడుతున్న ఆయన శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచినట్లు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' వెల్లడించింది. యంగ్ ఆరుసార్లు అంతరిక్షంలోకి వెళ్లారు. చంద్రుడిపై కూడా కాలుమోపారు. జెమిని-3, జెమిని-10, అపోలో-10, అపోలో-16 సహా పలు అంతరిక్ష ప్రాజెక్టుల్లో పాలుపంచుకున్నారు. వ్యోమనౌకకు కమాండర్‌గా వ్యవహరించిన తొలి వ్యక్తిగానూ యంగ్ చరిత్ర సృష్టించారు.


బొగ్గుగని కుప్పకూలడంతో నలుగురు మృత్యువాత

మధ్యప్రదేశ్‌లో విషాదం

బైతూల్: మధ్యప్రదేశ్‌లోని బైతూల్ జిల్లాలో ఆదివారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పతార్‌ఖేడా ప్రాంతంలో ఓ బొగ్గుగని కుప్పకూలడంతో నలుగురు దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఓ బాలిక ఉన్నారు. ఈ దుర్ఘటనలో మరో మహిళ గాయపడ్డారు. వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్(డబ్ల్యూసీఎల్) సంస్థ పనులు నిలిపివేసిన ఓ గనిలో మహిళలు అక్రమంగా తవ్వకాలు జరుపుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుందని అధికారవర్గాలు వెల్లడించాయి. మృతులందరూ స్థానిక టాట్యా కాలనీకి చెందినవారేనని తెలిపాయి.

ఈనాడు బిజినెస్


7వ తేదీన ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	400	వరంగల్	402
చిల్లరగా(ఒక గుడ్డు)	4.60	విశాఖపట్నం	400
బెంగళూరు	400	చెన్నై	405
8వ తేదీకి		చిత్తూరు	398
విజయవాడ/గోదావరి	398	నమక్కల్	395

మరింత పైకి వెళ్లొచ్చు!



సమీక్ష : దేశీయ మార్కెట్లు కొత్త ఏడాది తొలి వారంలో స్వల్పలాభాలతో శుభారంభం చేశాయి. నవంబరు ద్రవ్యలోటు గణాంకాలతో మదుపర్లు ఆందోళన చెందడంతో దేశీయ మార్కెట్లు వారం ప్రారంభంలో స్తబ్దుగానే మొదలయ్యాయి. వారం మొత్తం కూడా చాలా తక్కువ శ్రేణిలోనే ట్రేడింగ్ కొనసాగింది. మూడో త్రైమాసిక ఫలితాల కోసం మార్కెట్ ఎదురు చూస్తుండడం ఇందుకు నేపథ్యం. అయితే ఎంపిక చేసిన షేర్లతో పాటు మధ్య, చిన్న స్థాయి సంస్థల్లో కొనుగోళ్లు మార్కెట్‌కు దిశానిర్దేశం చేశాయి. వాహన విక్రయాలు, మౌలిక రంగంలో వృద్ధి, తయారీ-సేవల పీఎమ్ఐ రాణించడానికి తోడు దివాలా బిల్లుకు పార్లమెంటు ఆమోదం తెలపడం, పునరుత్పాదక విద్యుత్ లక్ష్యాన్ని పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం, 6 బలహీన ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోకి రూ.7577 కోట్ల మూలధనం ఇస్తామన్న ప్రకటనలు మార్కెట్లు రాణించడానికి కారణమయ్యాయి. అయితే బడ్జెట్‌ను దృష్టిలో పెట్టుకుని పెరిగిన ప్రతిసారీ మదుపర్లు లాభాలు స్వీకరించారు. మొత్తం మీద సూచీలు కొత్త గరిష్ఠ స్థాయిల వద్ద ముగిశాయి. సెన్సెక్స్ 0.28 శాతం లాభంతో 34,153 వద్ద ముగిసింది. రంగాల వారీగా చూస్తే లోహ, మన్నికైన వినిమయ వస్తువులు, యంత్ర పరికరాలు రాణించగా.. చమురు-గ్యాస్, వాహన, ఐటీ రంగాలు డీలా పడ్డాయి. విదేశీ సంస్థాగత మదుపుదార్లు రూ.1738 కోట్ల నికర కొనుగోళ్లు; ఫండ్‌లు రూ.936 కోట్ల నికర విక్రయాలు చేశాయి.

శుక్రవారానికి లాభపడిన, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 4:3గా నమోదవడం .. మధ్య, చిన్న స్థాయి రంగాల్లో కొనుగోళ్లపై ఆసక్తిని సూచిస్తోంది.

ఈవారంపై అంచనా } గత వారం మార్కెట్ 33,600 వద్ద మద్దతుతో చాలా వరకు స్థిరీకరణకు గురైంది. అయితే జీవన కాల గరిష్ఠ స్థాయి వద్ద ముగిసింది. స్వల్పకాలంలో మరింత పైకి వెళ్లే అవకాశం ఉంది. ఆర్థిక ఫలితాలు, దేశీయ స్థూల గణాంకాలు, అంతర్జాతీయ సంకేతాలు భారత మార్కెట్లకు సంకేతాలను ఇవ్వవచ్చు. ఈ వారం మొదలయ్యే కార్పొరేట్ సంస్థల ఫలితాలు ముఖ్యంగా టీసీఎస్, ఇన్ఫోసిస్ గణాంకాలు కీలకంగా మారనున్నాయి. ఫలితాలను బట్టే ఎంపిక చేసిన స్క్రిప్‌లలో కదలికలు ఉండొచ్చు. శుక్రవారం వెలువడే నవంబరు పారిశ్రామికోత్పత్తి సూచీ గణాంకాలు, సీపీఐ ద్రవ్యోల్బణ గణాంకాలకు అనుగుణంగా మార్కెట్ స్పందించవచ్చు.

ప్రభావిత అంశాలు } అంతర్జాతీయంగా చూస్తే అమెరికా, ఇతర దేశాల నుంచి వెలువడే గణాంకాలు మార్కెట్‌కు దిశానిర్దేశం చేయొచ్చు. రెండున్నరేళ్ల గరిష్ఠానికి చేరిన ముడి చమురు ధరలపైనా మదుపర్లు దృష్టి సారించొచ్చు. ఇరాన్‌లో అనిశ్చితి, ఒపెక్ చర్యల కారణంగా చమురు ధరలు మరింత పెరుగుతాయా లేదా అన్నది ఇపుడు కీలకం. ఒక వేళ ముడి చమురు ధరలు పడితే మాత్రం సానుకూలంగా మారుతుంది. రూపాయి బలంగా మారితే ఎగుమతి ఆధారిత రంగాల లాభాలకు కళ్లెం వేయవచ్చు. విదేశీ సంస్థాగత మదుపర్లు మార్కెట్లో పెట్టుబడులను కొనసాగిస్తుండగా.. ఫండ్‌లు లాభాలు స్వీకరిస్తున్నాయి. ఒక వేళ ఫండ్‌ల విక్రయాలు ఇలాగే కొనసాగితే మార్కెట్ లాభాలు పరిమితం కావొచ్చు.

తక్షణ మద్దతు స్థాయిలు: 33800, 33458, 33114; **తక్షణ నిరోధ స్థాయిలు:** 34340, 34630, 34950

సూచీలు జీవన కాల గరిష్ఠ స్థాయిలను చేరిన నేపథ్యంలో 33,600 వద్ద మద్దతులో మరింత పైకి వెళ్లొచ్చు.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ

కాస్తయినా సరే.. లాభాలు


- ఆర్థిక ఫలితాలు కీలకం
- గురు, శుక్రవారాల్లో టీసీఎస్, ఇన్ఫీ ఫలితాలు
- ఎఫ్ఎమ్‌సీజీ షేర్లకు సానుకూలతలు
- ఔషధ, లోహ స్క్రిప్‌లూ రాణించొచ్చు

స్టాక్ మార్కెట్ ఈ వారం

దేశీయ సూచీలు ఈ వారం కొద్ది స్థాయిలోనైనా సరే లాభాలనే నమోదు చేయవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూలతలు మన మార్కెట్లలో ప్రతిఫలిస్తాయని చెబుతున్నారు. అయితే ఎటువంటి ప్రధాన వార్తలూ లేనందున సూచీలు చాలా వరకు ఒక శ్రేణికి లోబడి కదలాడవచ్చని అంచనా. జీడీపీ నాలుగేళ్ల కనిష్ఠానికి (6.5%) చేరడం కూడా మార్కెట్‌పై ప్రభావం చూపొచ్చు. గురువారం ప్రారంభం కానున్న దిగ్గజ సంస్థల ఆర్థిక ఫలితాల వెల్లడి కూడా దిశానిర్దేశం చేయొచ్చు. సోమవారం నిఫ్టీకి 10490 వద్ద కీలక మద్దతు; 10600 వద్ద నిరోధం కనిపించొచ్చు. ఒక వేళ సూచీ 10600 స్థాయిని అధిగమిస్తే ఈ వారంలో 10800 వరకు పయనించొచ్చు. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ మెటల్ సూచీలు లాభాలు కొనసాగించొచ్చు. వివిధ రంగాలపై విశ్లేషకుల అంచనాలు..



చమురు: చమురు శుద్ధి, రిటైలింగ్ కంపెనీలు ప్రతికూల ధోరణితో స్థిరీకరణకు లోనుకావొచ్చు. బలమైన మూలాల కారణంగా మధ్య నుంచి దీర్ఘకాలానికి ఈ కంపెనీలు సానుకూలంగా కనిపిస్తున్నాయి. సాంకేతికంగా చూస్తే ఈ వారానికి మాత్రం కాస్త బలహీనతలున్నాయి. బీపీసీఎల్‌కు రూ.473 వద్ద మద్దతు; రూ.500 వద్ద నిరోధం; హెచ్‌పీసీఎల్‌కు రూ.396 వద్ద మద్దతు; రూ.432 వద్ద నిరోధం కనిపిస్తున్నాయి.



బ్యాంకింగ్: ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. అక్టోబరు-డిసెంబరు ఆర్థిక ఫలితాలపై మదుపర్లు కన్నేయనున్నారు. సౌత్ ఇండియన్ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, కర్ణాటక బ్యాంక్‌లు ఈ వారమే ఫలితాలు ప్రకటించనున్నాయి. ఎంపిక చేసిన బ్యాంకు షేర్లలో కొంత లాభాల స్వీకరణ జరగొచ్చని అంటున్నారు. ప్రభుత్వ మూలధన పునర్నిర్మాణ పథకం కింద మూలధనం పొందే బ్యాంకులపైనా మదుపర్లు కన్నేయవచ్చు.



వాహన: ప్రధాన వార్తలేమీ లేనందున చాలా తక్కువ శ్రేణికి పరిమితమై వాహన షేర్లు కదలాడవచ్చు. గ్రామీణ గిరాకీ బలంగా ఉండడంతో వాహన కంపెనీలు బలమైన ఆదాయాలు నమోదు చేయగలవన్న అంచనాలున్నాయి. ఈ వారం మారుతీ సుజుకీ రూ.9500ని అధిగమిస్తే.. రూ.9700-9800 స్థాయికి వెళ్లే అవకాశం ఉంది. హీరో మోటోకార్ప్ రూ.3700-3840; టాటా మోటార్స్ రూ.425-440; టీవీఎస్ మోటార్ రూ.735-760 స్థాయిల్లో చలించొచ్చు.




సిమెంటు: మిశ్రమ ధోరణిలో కదలాడవచ్చు. ఏసీసీ, అంబుజా సిమెంట్‌లు హెచ్చుతగ్గులకు లోనవవచ్చు. అల్ట్రాటెక్ మాత్రం రాణించే అవకాశం ఉంది. ప్రభుత్వం మౌలిక రంగంపై ఎక్కువ వ్యయాలు చేస్తుందన్న అంచనాల మధ్య సిమెంటు కంపెనీలపై విశ్లేషకులు మధ్య కాలం నుంచి దీర్ఘకాలానికి సానుకూలంగా ఉన్నారు. ఈ వారం ఏసీసీ రూ.1760-1835; అంబుజా సిమెంట్స్ రూ.266-284 మధ్య కదలాడవచ్చు.



ఎఫ్ఎమ్‌సీజీ: పెద్ద నోట్ల రద్దుకు ముందు స్థాయిలకు గిరాకీ చేరడంతో చాలా వరకు కంపెనీల విక్రయాలు రాణిస్తున్నాయి. నాలుగు త్రైమాసికాల పాటు స్తబ్దుగా ఉన్న ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీల ఫలితాలు ఈ అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో రాణించొచ్చు. స్వల్పకాలంలో ఏషియన్ పెయింట్స్ రూ.1354 స్థాయికి చేరొచ్చు. హెచ్‌యూఎల్ రూ.1330-1380, ఐటీసీ రూ.261-264; డాబర్ ఇండియా రూ.354-370 మధ్య కదలాడవచ్చు.



ఐటీ: ఫలితాలకు ముందు ఈ రంగ కంపెనీలు చాలా తక్కువ శ్రేణికి పరిమతమై చలించొచ్చు. టీసీఎస్ ఫలితాలు గురువారం, ఇన్ఫీ ఫలితాలు శుక్రవారం వెలువడనున్నాయి. ఐటీ కంపెనీల అక్టోబరు-డిసెంబరు ఫలితాలు స్తబ్దుగా ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఐటీ సూచీకి 11800-12100 వద్ద నిరోధం; 11340-11500 వద్ద మద్దతు లభించొచ్చంటున్నారు. టీసీఎస్‌కు రూ.2750-2980 స్థాయిలో నిరోధం ఎదురుకావొచ్చని.. రూ.2540-2600 స్థాయిలో మద్దతు లభించొచ్చని అంటున్నారు. ఇన్ఫోసిస్‌కు మద్దతు, నిరోధ స్థాయులు వరుసగా రూ.980; రూ.1050 వద్ద ఉన్నాయి.



ఔషధ: ఈ రంగ కంపెనీల షేర్లు లాభాలను కొనసాగించొచ్చు. అమెరికాలో చాలా ఉత్పత్తులను ప్రవేశపెట్టడం, దేశీయంగా మెరుగైన వృద్ధి ఉన్నందున సానుకూలతలు కొనసాగుతాయని భావిస్తున్నారు. గతంలో ఫార్మా షేర్లు అధ్వాన పరిస్థితులు చూశాయి. ఇక పుంజుకుంటాయని విశ్లేషకులు అంటున్నారు. సన్‌ఫార్మా రూ.640 స్థాయి వరకు పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. డాక్టర్ రెడ్డీస్, లుపిన్‌లు సైతం లాభాలనే తెచ్చిపెట్టవచ్చని భావిస్తున్నారు.



యంత్ర పరికరాలు: విద్యుత్, మౌలిక రంగాల్లో సానుకూల సెంటిమెంటు కారణంగా యంత్ర పరికరాల షేర్లు లాభాలను అందుకుంటాయని విశ్లేషకులు చెబుతున్నారు. శుక్రవారం వెలువడే పారిశ్రామికోత్పత్తి సూచీ గణాంకాల కోసం ఈ రంగ షేర్లు ఎదురు చూస్తున్నాయి. రాబోయే కొద్ది వారాల్లో భెల్ రూ.109; థెర్మాక్స్ రూ.1250, సీమెన్స్ రూ.1310, సీజీ పవర్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ రూ.95 స్థాయికి పెరిగే అవకాశం ఉంది. ఎల్ అండ్ టీ ఈ వారం రూ.1360 స్థాయి దిశగా పయనించొచ్చు.



లోహ: లోహ, గనుల కంపెనీల షేర్లు ఈ వారం సానుకూలంగా చలించొచ్చు. అటు ప్రాథమిక లోహాలు, ఇటు ఉక్కు ధరలు పెరగడం ఇందుకు నేపథ్యం. ముడి ఇనుము ధరలు పెరిగిన నేపథ్యంలో ఎన్ఎమ్‌డీసీపై మదుపర్లు దృష్టి సారించొచ్చు. అయితే ఈ షేరుపై 'కొనుగోలు' నుంచి 'అట్టేపెట్టి ఉంచుకోండి'కి సిఫారసును మార్పు చేసినట్లు ఎడెల్‌వీజ్ సెక్యూరిటీస్ పేర్కొంది.

మార్కెట్ విలువ

(రూ. కోట్లలో) డిసెంబరు 29 / జనవరి 5

మొత్తం లాభం 7633 | మొత్తం నష్టం -26971

రిలయన్స్	1235	584582	583347
టీసీఎస్	-3053	513881	516934
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు	-3393	481880	485273
ఐటీసీ	-244	320487	320731
హెచ్‌యూఎల్	-2511	293612	296122
మారుతి	-8981	284984	293965
హెచ్‌డీఎఫ్‌సీ	2484	275736	273252
ఎస్‌బీఐ	-2849	264313	267162
ఓఎన్‌జీసీ	3914	253713	249799
ఇన్ఫోసిస్	-5940	221038	226978

రూ.100 కోట్లకు పైగా ఎన్‌పీఏ ఖాతాలు 1,463

ఆర్థిక శాఖ వెల్లడి

దిల్లీ: దేశంలోని 21 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రూ.100 కోట్లు, అంతకుమించిన మొత్తాలు మొండిబకాయిలు, నిరర్థక ఆస్తులుగా మారిన ఖాతాలు 1463 ఉన్నాయని ఆర్థిక శాఖ వెల్లడించింది. వీటిలో విలువ రూపేణ అత్యధిక మొత్తం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)కే ఉన్నాయి. 21 ఖాతాల నుంచి రూ.77,538 కోట్ల మొండి బకాయిలు ఎస్‌బీఐకి ఉన్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)కు 143 ఖాతాల నుంచి రూ.45,973 కోట్లు స్తంభించాయి. అధికమొత్తాల నిరర్థక ఖాతాల సంఖ్యా పరంగా పీఎన్‌బీ తరవాత స్థానంలో కెనరా బ్యాంక్ ఉంది. యూనియన్ బ్యాంక్‌కు 79 నిరర్థక ఆస్తులు, ఓరియెంటల్ బ్యాంక్‌కు 68 మొండి బకాయిలు, యూకో బ్యాంక్‌కు 62 ఉన్నట్లు ఆర్థిక శాఖ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం ముగిసే సరికి ప్రభుత్వ రంగ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తులు రూ.7.34 లక్షల కోట్లకు చేరిన సంగతి విదితమే.

ఈ వారం బోర్డు సమావేశాలు

నేడు	: ప్రకాశ్ ఇండస్ట్రీస్, యునికెమ్ లేబొరేటరీస్
మంగళ	: సౌత్ ఇండియన్ బ్యాంక్
గురు	: టీసీఎస్, బజాజ్ కార్ప్, హిందుస్థాన్ మీడియా, ఇండస్‌ఇండ్ బ్యాంక్, శ్రీ సిమెంట్, సింటెక్స్ ప్లాస్టిక్స్, సూర్యజ్యోతి స్పిన్నింగ్
శుక్ర	: ఇన్ఫోసిస్, గెయిల్, హెచ్‌టీ మీడియా, కర్ణాటక బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రా
శని	: ముత్తూట్ క్యాపిటల్

ఎయిరిండియాను ప్రైవేటీకరించొద్దు

- పునరుద్ధరణకు అయిదేళ్లు సమయం ఇవ్వండి
- పార్లమెంటరీ స్థాయీసంఘం సిఫారసు

దిల్లీ: ఎయిరిండియాలో ప్రభుత్వ వాటా విక్రయించడానికి ఇది సరైన సమయం కాదని, ఆ సంస్థ పునరుద్ధరణకు కనీసం అయిదేళ్ల సమయం ఇవ్వాలని, ఆ సంస్థ రుణాలను మాఫీ చేయాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫారసు చేసింది. ఎయిరిండియా పునరుత్తేజం కోసం, విడతలుగా అందించిన సాయం వల్ల ప్రయోజనం కలగకపోగా, ఆ సంస్థ ఆర్థిక, నిర్వహణ సామర్థ్యంపై వ్యతిరేక ప్రభావం చూపాయని పేర్కొంది. అవసరాల కోసం అధిక వడ్డీకి రుణాలు తీసుకునేలా ఎయిరిండియాపై ఒత్తిడి ఏర్పడిందని వివరించింది. అందువల్లే ఎయిరిండియాపై రుణభారం పెరిగిందని తెలిపింది. దేశానికి గర్వకారణంగా నిలిచిన జాతీయ విమానయాన సంస్థలో వాటా విక్రయించకుండా, ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలించాలని రవాణా, పర్యాటకం, సంస్కృతిపై నియమించిన స్థాయీసంఘం సూచించింది. ఇప్పుడు సంస్థను మూసివేసినా, ప్రైవేటీకరించినా, ఎంత మంది ఉపాధి కోల్పోతారో కూడా ప్రభుత్వం ఆలోచించాలని కోరింది. ఉద్యోగుల ప్రయోజనాలు పరిరక్షించాలని విజ్ఞప్తి చేసింది.

ఉద్దీపన సమయంలో ఎందుకు?

జాతీయ అవసరాలకు తగినట్లుగా ఎయిరిండియా సేవలందిస్తోందని, ముఖ్యంగా ప్రకృతి విపత్తులు, దేశీయంగా-అంతర్జాతీయంగా సామాజిక-రాజకీయ అనిశ్చితులు ఏర్పడిన సందర్భాల్లో, ఈ సంస్థ మాత్రమే వ్యాపార దృక్పథంతో వ్యవహరించక, ఆపదలో ఉన్న వారిని తరలించడంలో యథాశక్తి తోడ్పడుతోందని స్థాయీసంఘం ప్రశంసించింది. ఎయిరిండియాకు కల్పించిన ఆర్థిక ఉద్దీపన పథకం 2012 నుంచి పదేళ్ల పాటు 2022 వరకు అమలు కావాల్సి ఉందని గుర్తు చేసింది. ఇప్పటికే వివిధ అంశాల్లో ఆ సంస్థ పనితీరు మెరుగు పడుతోందని తెలిపింది. కార్యకలాపాలపై లాభాలు ఆర్జించే స్థితికి ప్రస్తుతం చేరిందని, అందువల్ల సంస్థ ప్రైవేటీకరణ ఇప్పుడు వద్దని వివరించింది. ఉద్దీపన ప్రణాళిక గడువు



ముగిశాకే, ఎయిరిండియా ఆర్థిక, నిర్వహణ సామర్థ్యాన్ని ప్రభుత్వం మదింపు చేసి, అప్పుడు మాత్రమే నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఎయిరిండియా అనుబంధ సంస్థలైన ఎయిరిండియా ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్, ఎయిరిండియా శాట్స్ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, అలయన్స్ ఎయిర్, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ వంటివి ఇప్పటికే లాభాలు ఆర్జిస్తున్నాయని, వాటిల్లో ప్రభుత్వ వాటాను విక్రయించవద్దని స్థాయీసంఘం గట్టిగా సిఫారసు చేసింది.

రుణాన్ని రద్దు చేయాలి

ఎయిరిండియాపై పడిన రుణ భారం ప్రభుత్వ విధానాల ఫలితంగా ఏర్పడిందేనని, అందువల్ల ఆ రుణాన్ని ప్రభుత్వం మాఫీ చేయాలని విజ్ఞప్తి చేసింది. పునరుత్తేజానికి ఆ సంస్థకు కనీసం అయిదేళ్ల గడువు ఇవ్వాల్సిందేనని సూచించింది. ప్రభుత్వరంగ సంస్థ తరహాలో, కొద్దిపాటి ప్రభుత్వ నియంత్రణతో ఆ సంస్థ మనుగడ సాగించేలా చూడాలని కోరింది. ఒక వేళ ఎయిరిండియా ప్రైవేటీకరణ తప్పనిసరైతే, అధికారులు, సిబ్బందికి ఆర్థిక రక్షణ కల్పించేందుకు ఆర్థిక, పౌరవిమానయాన శాఖలు సంయుక్తంగా వ్యూహాత్మక ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించింది.

ఆన్‌లైన్ అమ్మకాలపై పతంజలి దృష్టి

8 పోర్టళ్లతో 16న ఒప్పందం

దిల్లీ: బాబా రామ్‌దేవ్ ఆధ్వర్యంలోని పతంజలి సంస్థ తయారు చేస్తున్న ఎఫ్ఎమ్‌సీజీ ఉత్పత్తులు ఆన్‌లైన్‌లోనూ విరివిగా అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటివరకు తమ సొంతపోర్టల్ www:patanjaliayurved.net లో సంస్థ ఉత్పత్తులు లభిస్తున్నాయి. అత్యధికులకు చేరువయ్యేందుకు, 8 అగ్రశ్రేణి ఇ కామర్స్ పోర్టళ్లు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, పేటీఎం మాల్, 1ఎంజీ, బిగ్‌బాస్కెట్, గ్రోఫర్స్, షాప్‌క్లూస్, స్నాప్‌డీల్ పోర్టళ్లతో సంస్థ ఒప్పందం చేసుకోనుంది. హరిద్వార్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న పతంజలి, ఈనెల 16న ఇక్కడ నిర్వహించనున్న కార్యక్రమంలో అన్ని పోర్టళ్ల ప్రతినిధులు పాల్గొంటారని అంచనా. బాబా రామ్‌దేవ్‌తో పాటు పతంజలి ఎండీ ఆచార్య బాలకృష్ణ కూడా హాజరవుతారు. 'ఆన్‌లైన్ అమ్మకాలను భారీగా పెంచుకోవాలన్నది మా ప్రణాళిక. ఇప్పటివరకు కొన్ని ఉత్పత్తులు మాత్రమే ఆయా పోర్టళ్లలో లభిస్తున్నాయి. ఇకపై అన్ని ఉత్పత్తులను క్రమపద్ధతిలో అందుబాటులోకి తెస్తాం' అని పతంజలి ప్రతినిధి ఎస్.కె.తిజారావాలా వెల్లడించారు. తమ ప్రవేశంతో ఆన్‌లైన్‌లో ఎఫ్ఎమ్‌సీజీ ఉత్పత్తుల అమ్మకాల తీరే మారుతుందని పేర్కొన్నారు.

70 పట్టణాలు.. 25,000 సభ్యత్వాలు

- ఈ ఏడాది బీఎన్ఐ లక్ష్యం
- జాతీయ సంచాలకులు మురళీ శ్రీనివాసన్

చినకాకాని (గ్రామీణమంగళగిరి), న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా ఈ ఏడాది 70 కొత్త పట్టణాలకు విస్తరించడంతో పాటు 25వేల మంది సభ్యులను చేర్చటమే బి.ఎన్.ఐ. (బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్) లక్ష్యమని ఆ సంస్థ జాతీయ సంచాలకులు మురళీ శ్రీనివాసన్ చెప్పారు. ఆదివారం గుంటూరు జిల్లా మంగళగిరి మండలం చినకాకానిలోని హాయ్‌ల్యాండ్‌లో బి.ఎన్.ఐ. మెంబర్స్ డే వేడుకలు జరిగాయి. సభ్యుల మధ్య వ్యాపార విస్తరణకు బి.ఎన్.ఐ. సేవలందిస్తోందన్నారు. ఇందులో వ్యాపారులు, వృత్తినిపుణులు సభ్యులుగా నమోదు కావచ్చని తెలిపారు. విజయవాడ చాప్టర్‌లో ఇప్పటికి 175 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. చిన్న పట్టణాల్లోని సభ్యులు కూడా ఇతర దేశాల సభ్యులను సంప్రదించి నమ్మకమైన వ్యాపార సేవలు పొందవచ్చని వివరించారు. సమావేశంలో విజయవాడ చాప్టర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు జై.హెచ్.దేశాయ్, విశాల్ హెచ్.దేశాయ్, విశాఖపట్నం రీజినల్ డైరెక్టర్ మిధున్, తూర్పు గోదావరి జిల్లా ప్రాతీయ సంచాలకులు శ్రీకర్ కందా, మనోజ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

మారుతీ 'సూపర్‌క్యారీ' విస్తరణ

దిల్లీ: తేలికపాటి వాణిజ్య వాహనం సూపర్‌క్యారీ విక్రయశాలలు మరిన్ని నెలకొల్పాలని మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) నిర్ణయించింది. 2016 సెప్టెంబరులో ఆవిష్కరించిన ఈ వాహనానికి ఆదరణ బాగున్నందున, ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 25 రాష్ట్రాల్లోని 140 నగరాలలో ఉన్న 162 ప్రత్యేక వాణిజ్య వాహన విక్రయశాలల్లో ఈ వాహనం అందుబాటులో ఉంది. కొనుగోళ్లు అధికంగా జరిగే అన్ని ప్రాంతాల్లోని వారికి సూపర్‌క్యారీని అందుబాటులోకి తేవాలన్నది సంస్థ ప్రణాళిక అని సంస్థ ప్రతినిధి తెలిపారు. 700 కిలోగ్రాముల సరకును రవాణా చేయగల ఈ తరహా వాహనాల విపణిలో సూపర్‌క్యారీకి 8.7 శాతం వాటా ఉందని వివరించారు.

మళ్లీ ఉబర్ ఆటోలు

బెంగళూరు, పుణెలతో శ్రీకారం

దిల్లీ: మొబైల్ యాప్ ద్వారా క్యాబ్ బుక్ చేసుకునే సేవలు అందిస్తున్న ఉబర్ సంస్థ, ఆటోరిక్షా సేవలనూ పునఃప్రారంభించనుంది. గతంలో కూడా ఆటోలు బుక్ చేసుకునే వీలును ఉబర్ కల్పించినా, 2016 మార్చిలో నిలిపి వేసింది. ఇప్పుడు మళ్లీ ఈ సేవలకు బెంగళూరు, పుణె నగరాలతో ఈనెలలోనే పునఃప్రారంభించనుంది. క్రమంగా ఈ సేవలను విస్తరిస్తామని సంస్థ ప్రతినిధి తెలిపారు. ఉబర్ క్యాబ్‌లలో వెళ్లేవారికి లభిస్తున్న రక్షణ సదుపాయాలే ఆటో ప్రయాణికులకూ లభిస్తాయని, నగదు, పేటీఎం, డెబిట్/క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లించే వీలు కూడా ఉంటుందన్నారు. పోటీ సంస్థ ఓలా ప్రస్తుతం దేశవ్యాప్తంగా 73 నగరాలలో ఆటో సేవలు అందిస్తోంది. ఆ సంస్థ కింద 1.2 లక్షల ఆటోలు నమోదై ఉన్నాయి.


కమొడిటీస్ ఈ వారం

రాగి మెరవక పోవచ్చు!




• బంగారం, వెండి

బంగారం ఫిబ్రవరి కాంట్రాక్టు సోమవారం రూ.29,160 వద్ద ప్రారంభమైంది. రూ.29,061 వద్ద కనిష్ఠ స్థాయికి చేరిన తర్వాత సానుకూల కొనుగోళ్లు కనిపించాయి. 0.18 శాతం లాభంతో రూ.29,212 వద్ద ముగిసింది. వరుసగా మూడో వారామూ లాభాలనే పొందింది. ఈవారంలో రూ.29,408 నుంచి స్వల్పకాలిక ట్రేడర్లు లాభాలు స్వీకరించడం మంచిది. రూ.29,772 వద్ద నిరోధం ఎదురవుతుందని అంచనా. ఆ స్థాయి పైన కొనసాగితే మినహా స్థిరీకరణకే అవకాశాలున్నాయి. మధ్య నుంచి దీర్ఘకాల ట్రేడర్లు రూ.29,025 స్థాయి వరకు తగ్గినపుడుల్లా కొనుగోలు చేయవచ్చు. వెండి మార్చి కాంట్రాక్టు రూ.39,089 వద్ద మొదలైంది. ఊగిసలాడినప్పటికీ వరుసగా నాలుగో వారమూ ర్యాలీ కొనసాగించింది. గురువారం రూ.38,900 కనిష్ఠ స్థాయికి చేరిన తర్వాత జోరు పెరిగింది. రూ.39,372 వద్ద గరిష్ఠ స్థాయిని చేరి.. చివరకు 0.40% లాభంతో రూ.39,246 వద్ద ముగిసింది. సాంకేతికంగా చూస్తే సోమవారం రూ.39,445 స్థాయి పైన ట్రేడయితే మాత్రం రూ.39,644 వరకూ ఆ తర్వాత రూ.40,060 వరకు ర్యాలీ కొనసాగొచ్చు. రూ.39,545 తరవాత స్వల్పకాల ట్రేడర్లు లాభాలు స్వీకరించడం మంచి వ్యూహమవుతుంది. మధ్య నుంచి దీర్ఘకాల ట్రేడర్లు మాత్రం రూ.38,220 కిందకు వస్తే మినహా మరికొన్ని లాట్లను జతచేసుకోవచ్చు.




• ప్రాథమిక లోహాలు

రాగి ఫిబ్రవరి కాంట్రాక్టు ఈ వారం కూడా ఒత్తిడి ఎదుర్కోవచ్చు. కాబట్టి ఇప్పటికే ఉన్న షార్ట్ సెల్ పొజిషన్లను రూ.445 స్థాయి వరకు అట్టేపెట్టి ఉంచుకోవడం మంచి వ్యూహమే అవుతుంది. కాపర్ కాంట్రాక్టు పైకి వెళితే తాజాగా షార్ట్ సెల్ పొజిషన్లు తీసుకోవచ్చు. రూ.445 లక్ష్యంతో రూ.459 దరిదాపుల్లో విక్రయించడం మేలు. సీసం జనవరి ఫ్యూచర్ కాంట్రాక్టు ఈ వారం రూ.158 దిగువకు(ముగింపు పద్ధతిన) వస్తే మినహా రూ.164 వరకు ఆ తరవాత రూ.167 వరకు పరుగులు తీయొచ్చు. జింక్ జనవరి ఫ్యూచర్ కాంట్రాక్ట్ రూ.210 కిందకు దిగితే మినహా రూ.216 వరకు వెళ్లడానికి అవకాశాలున్నాయి. రూ.206 లక్ష్యంతో రూ.216 పైన షార్ట్ సెల్ చేయొచ్చు. మూడు వారాల తరవాత అల్యూమినియం ఫ్యూచర్ కాంట్రాక్టు నష్టపోయింది. ఇంకా నష్టపోయే అవకాశం ఉన్నందున ఈ వారం కూడా పెరిగినపుడల్లా విక్రయించడం మేలు. నికెల్ జనవరి కాంట్రాక్టు సాంకేతికంగా చూస్తే విక్రయించిన జోన్‌లో కనిపిస్తోంది. కాబట్టి రూ.820ను స్టాప్ అవుట్‌గా పెట్టుకుని రూ.766 ఆ తర్వాత రూ.745 లక్ష్యంతో విక్రయించడం మంచి వ్యూహం.



• ఇంధన రంగం

ముడి చమురు జనవరి కాంట్రాక్టు అధికంగా కొనుగోలు జరిగినట్లుగా కనిపిస్తున్నా.. ఇంకా అవకాశం ఉంది. రూ.3798 దిగువకు చేరితే మినహా.. మరింత పెరగడానికే అవకాశం ఉంది. కాబట్టి లాంగ్ పొజిషన్లను రూ.3998 వరకు అట్టేపెట్టి ఉంచుకోవచ్చు. అయితే తాజా కొనుగోళ్లు మాత్రం వద్దు. తక్కువ నష్టభయం కోరుకునే ట్రేడర్లు వచ్చే రెండు వారాల పాటు ట్రేడింగ్‌కు దూరంగా ఉండడమే మేలు. రూ.166 స్థాయి దిగువకు చేరితే మరింత బలహీనతలు కనిపించవచ్చు. కాబట్టి ఆ స్థాయిపై ఓ కన్నేయడం మంచిది. ముడి పామాయిల్ జనవరి ఫ్యూచర్ కాంట్రాక్టు ఈ వారం రూ.558 దిగువకు చేరితే మరింత తగ్గవచ్చు. ఆ స్థాయి దిగువన మాత్రామే తాజా విక్రయాలు చేయొచ్చని భావిస్తున్నాం.



• వ్యవసాయ ఉత్పత్తులు

ధనియా జనవరి కాంట్రాక్టు గత రెండు వారాలుగా నష్టాలతోనే ముగిసింది. రూ.5149 స్థాయి వరకు ఇది నష్టపోవచ్చు.

గతవారం పొజిషన్లు ఇలా

కమొడిటీ (నవంబరు కాంట్రాక్టు)	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/(క్షీణత) (శాతంలో)
రాగి(ఫిబ్రవరి)	467.00	452.65	(3.25)
సీసం(జనవరి)	160.35	161.75	0.87
జింక్(జనవరి)	212.40	213.90	0.71
అల్యూమినియం(జనవరి)	145.05	139.30	(3.96)
నికెల్(జనవరి)	814.00	794.50	(2.40)
ముడి చమురు(జనవరి)	3858.00	3887.00	0.75
సహజ వాయువు(జనవరి)	191.40	177.60	(7.21)
ధనియాలు(జనవరి)	5524.00	5270.00	(4.60)
సోయాబీన్(జనవరి)	3070.00	3166.00	3.11
జీలకర్ర(జనవరి)	21,695.00	20,920.00	(3.57)

ఆ స్థాయి వద్ద లాభాల స్వీకరణ మేలు. జీలకర్ర జనవరి కాంట్రాక్టును చూస్తే ఇప్పటికే ఎక్కువ విక్రయాలైనట్లుగా కనిపిస్తోంది. సాంకేతికంగా చూస్తే మరింత దిద్దుబాటుకు అవకాశం ఉంది. పెరిగినపుడల్లా విక్రయించడం ఈ వారం మంచి వ్యూహమవుతుంది. పొజిషన్లు ఉన్న వారు రూ.20,360 వరకు తమ షార్ట్ పొజిషన్లను అట్టే పెట్టిఉంచుకోవచ్చు. ఈ వారం సోయాబీన్ ఫ్యూచర్ కాంట్రాక్టుకు రూ.3426 వద్ద నిరోధం ఎదురుకావొచ్చు. కాబట్టి ఆ స్థాయి పైన ట్రేడయితే తప్ప రూ.3226 దిగువన విక్రయించడమే మేలు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

ఛాంపియన్స్



హార్దిక్ ప్రదర్శన అదరహో...

కేప్‌టౌన్: బ్యాటుతో, బంతితో హార్దిక్ పాండ్య అద్భుత ప్రదర్శన చేశాడని.. తొలి టెస్టులో భారత్ ఆశలను నిలిపాడని చెతేశ్వర్ పుజారా అన్నాడు. "అలాంటి ఇన్నింగ్స్ హార్దిక్ ఆడగలడని మాకెప్పటి నుంచో నమ్మకం ఉంది. అతడు ఆ ఇన్నింగ్స్‌తో ఆడడంతో డ్రెస్సింగ్‌రూమ్‌లో సానుకూల వాతావరణం వచ్చింది. హార్దిక్ చేసిన ఆ పరుగులు జట్టుకు ఎంతో ముఖ్యం. అవి మ్యాచ్‌లో మా ఆశలను సజీవంగా ఉంచాయి. హార్దిక్ ఆ ఇన్నింగ్స్ ఆడకపోయి ఉండుంటే మేం ఇబ్బందుల్లో ఉండేవాళ్లం. అతడు రెండు ముఖ్యమైన వికెట్లు కూడా పడగొట్టాడు. కాబట్టి అతడి ప్రదర్శన అసాధారణం" అని పుజారా చెప్పాడు. పాండ్య తొలి ఇన్నింగ్స్‌లో ధాటిగా ఆడి మ్యాచ్‌లో భారత్ ఆశలు నిలిపిన సంగతి తెలిసిందే. "పాండ్య అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. ఇంతకుముందు విదేశాల్లో అతడు పెద్దగా టెస్టు మ్యాచ్‌లు ఆడలేదు. కానీ తుది జట్టులో ఉంటే అతడి నుంచి అలాంటి ఇన్నింగ్స్ ఆశిస్తాం. పాండ్య లాంటి ఆటగాడు ఉంటే జట్టు సమతూకంగా ఉంటుంది. పాండ్య ఈ ప్రదర్శనను కొనసాగిస్తాడని ఆశిస్తున్నాం" అని పుజారా చెప్పాడు. ఎలాంటి పరిస్థితిలోనైనా సహజశైలిలో షాట్లు ఆడడం పాండ్య స్వభావం. ఈ నేపథ్యంలో.. అతడు తన శైలిని మార్చుకోవాల్సిన అవసరం లేదని పుజారా అభిప్రాయపడ్డాడు. "పాండ్య తన సహజ శైలిలో షాట్లు ఆడేందుకు ఇష్టపడతాడు. ఎలాంటి స్థితిలోనైనా అలాగే ఆడతాడు. అదే అతడి విజయ రహస్యం. శ్రీలంకపైనా అలాగే ఆడాడు" అని అన్నాడు.



వరుణుడి బ్యాటింగ్

- రోజంతా వదలని వర్షం
- మూడో రోజు ఆట రద్దు
- భారత్-దక్షిణాఫ్రికా తొలి టెస్టు

రెండు రోజులు 98 ఓవర్ల చొప్పున..

వర్షం కారణంగా తొలి టెస్టు మూడో రోజు ఆట పూర్తిగా రద్దయిన నేపథ్యం ఆ నష్టాన్ని చివరి రెండు రోజుల్లో కొంతమేర భర్తీ చేయాలని అంపైర్లు నిర్ణయించారు. 4, 5 రోజుల్లో రోజుకు 98 ఓవర్ల చొప్పున ఆడించేలా నిబంధనలు మార్చారు. ఐతే ఆట మాత్రం యధావిధిగా భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2 గంటలకే ఆరంభమవుతుంది. ఐతే ఈ అదనపు 8 ఓవర్లు వేసేందుకు చివరి రెండు సెషన్లను 15 నిమిషాల చొప్పున పొడిగించనున్నారు. మొత్తంగా ఆట అరగంట అదనంగా సాగుతుంది.

ఆమ్లా ఎంతసేపు నిలుస్తాడు.. డివిలియర్స్ ఎంత కొడతాడు.. డుప్లెసిస్ ఎలా ఆడతాడు.. పాండ్య జోరు కొనసాగిస్తాడా.. భువనేశ్వర్ మళ్లీ లయ అందుకుంటాడా.. బుమ్రా పుంజుకుంటాడా.. పరిస్థితుల్ని భారత బౌలర్లు ఏమేరకు సద్వినియోగం చేసుకుంటారు.. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ఎంతసేపు సాగుతుంది.. ఆధిక్యం ఎంతకు పెరుగుతుంది.. భారత్ ముందు ఎంత లక్ష్యం నిలుస్తుంది.. మూడో రోజే భారత్ రెండో ఇన్నింగ్స్ మొదలవుతుందా.. ఈసారి మన బ్యాట్స్‌మెన్ ఎలా ఆడతారు.. ఆట ఆఖరుకు మ్యాచ్ ఫలితమేంటో నిర్ణయమైపోతుందా.. ఇలా ఆదివారం ఆట ఆరంభానికి ముందు ఎన్నెన్నో విశ్లేషణలు.. చర్చోపచర్చలు.. ఊహాగానాలు! కానీ వాటన్నింటికీ తెరదించేశాడు వరుణుడు. ఆటగాళ్లను మైదానంలోకి రానివ్వకుండా తానొక్కడే రోజంతా ఆడుకున్నాడు. భారత్-దక్షిణాఫ్రికా తొలి టెస్టులో మూడో రోజు ఆట పూర్తిగా రద్దయింది.

కేప్‌టౌన్

ఆసక్తికరంగా సాగుతున్న భారత్-దక్షిణాఫ్రికా రెండో టెస్టుకు వరుణుడు బ్రేక్ వేశాడు. కేప్‌టౌన్‌లోని న్యూలాండ్స్ మైదానంలో జరుగుతున్న ఈ టెస్టులో మూడో రోజు ఆట వర్షం కారణంగా పూర్తిగా రద్దయింది. శనివారం రాత్రి నుంచే వర్షం పడుతుండగా.. ఉదయం మరింత జోరందుకుంది. తొలి సెషన్ అంతా వర్షం పడుతూనే ఉంది. లంచ్ విరామ సమయానికి కొంచెం తెరపినివ్వడంతో మైదాన సిబ్బంది రంగంలోకి దిగారు. సూపర్ సాపర్లతో నీటిని తొలగించే ప్రయత్నం చేశారు. రెండో సెషన్ నుంచి ఆట మొదలవుతుందని భావిస్తుండగా.. మళ్లీ వర్షం జోరు మొదలైంది. అక్కడి నుంచి వరుణుడి దోబూచులాట సాగింది. వర్షం కొంచెం తగ్గడం.. సిబ్బంది మైదానంలోకి వచ్చి కవర్లు తొలగించడం.. అంతలోనే మళ్లీ వర్షం రావడం.. ఇలాగే కొన్ని గంటలు గడిచాయి. టీ విరామం తర్వాత కూడా వర్షం ఆగకపోవడంతో అంపైర్లు ఆట రద్దు చేయక తప్పలేదు. రెండో రోజు ఆట ఆఖరుకు దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 20 ఓవర్లాడి 65/2తో నిలిచిన సంగతి తెలిసిందే. హషీమ్ ఆమ్లా (4), కాగిసో రబాడ (2) క్రీజులో ఉన్నారు. ఓపెనర్లు మార్‌క్రమ్ (34), ఎల్గర్ (25) ఔటయ్యారు. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 286 పరుగులు చేయగా.. భారత్ 209 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.

అయినా ఫలితం ఖాయమే!: ఒక రోజు ఆట పూర్తిగా రద్దయినప్పటికీ తొలి టెస్టులో ఫలితం రావడానికి అవకాశాలు మెండుగానే ఉన్నాయి. కేప్‌టౌన్‌లో సోమవారం వర్షం పడే సూచనలు లేవు. ఆట యధావిధిగా ఆరంభమయ్యే అవకాశముంది. ఇప్పటికే రెండు ఇన్నింగ్స్‌లు ముగిశాయి. దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లోనూ 2 వికెట్లు పడిపోయాయి. ఆ జట్టు ఆలౌట్ అయినా కాకపోయినా.. నాలుగో రోజు చివరి గంటలో భారత్ బ్యాటింగ్ చేస్తుండే అవకాశముంది. ఆ స్థితిలో భారత్ లక్ష్యాన్ని ఛేదించినా, ఆలౌట్ అయినా చివరి రోజు ఫలితం వచ్చేందుకే ఆస్కారం ఎక్కువ. ఈ మ్యాచ్‌లో మొదట్నుంచి బౌలర్ల ఆధిపత్యమే సాగుతోంది. ఈ నేపథ్యంలో ఇన్నింగ్స్‌లు సుదీర్ఘంగా సాగకపోవచ్చు. కాబట్టి మళ్లీ వరుణుడు అడ్డం పడితే తప్ప మ్యాచ్‌లో ఫలితం రావడం ఖాయం!



సంబరాల్లో కేప్‌టౌన్: భారత్-దక్షిణాఫ్రికా మధ్య రసవత్తరంగా సాగుతున్న తొలి టెస్టులో ఒక రోజంతా ఆట రద్దవడం క్రికెట్ ప్రియుల్ని నిరాశకు గురి చేసినప్పటికీ.. ఈ మ్యాచ్‌కు ఆతిథ్యమిస్తున్న కేప్‌టౌన్ నగరంలో లేక లేక వర్షం పడే సరికి స్థానికుల ఆనందానికి అవధుల్లేవు. ఈ నగరం మూడేళ్లుగా సరిపడా వర్షాలు లేక కరవుతో ఇబ్బంది పడుతోంది. ఇక్కడ నీటి సమస్య రోజు రోజుకూ తీవ్రమవుతోంది. ఇలాంటి స్థితిలో వర్షా కాలం కాకపోయినప్పటికీ ఇప్పుడు అనుకోని విధంగా వరుణుడు కరుణించడంతో స్థానికులు సంతోషంలో మునిగిపోయారు. వర్షపు నీటిని ఒడిసిపడుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా కనిపించాయి.



స్టెయిన్ లేకున్నా గెలవాలి

కేప్‌టౌన్: భారత్‌తో తొలి టెస్టుకు తమ జట్టు అగ్రశ్రేణి ఫాస్ట్‌బౌలర్ డేల్ స్టెయిన్ అర్ధంతరంగా దూరమైనప్పటికీ.. తాము మ్యాచ్ గెలిచే అవకాశాన్ని విడిచిపెట్టకూడదని దక్షిణాఫ్రికా యువ పేసర్ కాగిసో రబాడ అన్నాడు. "మేం అదృష్టవశాత్తూ నలుగురు సీమర్లతో బరిలోకి దిగాం. కాబట్టి మిగతా పనిని ముగ్గురే పూర్తి చేయాలి. డేల్ దూరం కావడం ఎప్పుడూ బాగుండదు. అందులోనూ గాయం నుంచి కోలుకుని ఇప్పుడే పునరాగమనం చేశాడు. అతడికి నా సానుభూతి. ఐతే ముగ్గురు పేసర్లతోనే మేం ఈ మ్యాచ్ గెలిచే మార్గం చూడాలి" అని రబాడ అన్నాడు. భారత తొలి ఇన్నింగ్స్ సందర్భంగా రెండో రోజు తమ బౌలర్లపై ఎదురుదాడికి దిగిన హార్దిక్ పాండ్య గురించి టీ విరామం జట్టంతా చర్చించుకుని ఒక ప్రణాళికతో మైదానానికి తిరిగొచ్చి అతడిని ఔట్ చేసినట్లు రబాడ వెల్లడించాడు. "అతడి జోరును అడ్డుకోవడానికి ఏం చేయాలా అని చర్చించుకున్నాం. అందుకే మూడో సెషన్లో అరౌండ్ ద వికెట్ బౌలింగ్ చేశాం. అది పని చేసింది. హార్దిక్ తన సహజ శైలిలో షాట్లు ఆడేందుకు ప్రయత్నిస్తాడు. అలాఆడితే ప్రత్యర్థి జట్టు వెనుకబడేందుకు అవకాశముంది. అందుకే మేం ప్రతి దాడి చేశాం" అన్నాడు.



మా సన్నద్ధత బాగుంది

క్రైస్ట్‌చర్చ్: కోచ్ రాహుల్ ద్రవిడ్ మార్గనిర్దేశకత్వంలో తమ జట్టు అండర్-19 ప్రపంచకప్‌కు మెరుగ్గా సన్నద్ధమైందని భారత కెప్టెన్ పృథ్వీ షా అన్నాడు. ట్రోఫీని గెలుచుకోవడమే తమ లక్ష్యమని చెప్పాడు. "మేమిక్కడికి వచ్చి వారం రోజులవుతోంది. కొన్ని మ్యాచ్‌లు ఆడాం. అంతా సవ్యంగా సాగుతోంది. మా జట్టు సన్నాహం బాగుంది. ప్రపంచకప్ గెలవడమే మా లక్ష్యం. ఐతే ప్రస్తుతానికి మా దృష్టంతా మా తొలి మ్యాచ్ (జనవరి 13న ఆస్ట్రేలియాతో)పైనే. ఆ తర్వాత ఏం జరుగుతుందో చూద్దాం" అని పృథ్వీ షా అన్నాడు. అండర్-19 ప్రపంచకప్‌లో సోమవారం నుంచి సన్నాహక మ్యాచ్‌లు జరుగుతాయి. అసలు టోర్నీ 13న ఆరంభమవుతుంది.

ఘనంగా ఆరంభోత్సవం: ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ ప్రారంభోత్సవం ఆదివారం క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లే ఓవల్‌లో ఘనంగా జరిగింది. టోర్నీలో పోటీపడుతున్న మొత్తం 16 జట్ల కెప్టెన్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. క్రైస్ట్‌చర్చ్, క్వీన్స్‌టౌన్ నగరాల్లో మొత్తం ఏడు వేదికల్లో టోర్నమెంట్ జరుగుతుంది.

సచిన్ కుమార్తెకు బెదిరింపులు

పశ్చిమ బెంగాల్ వాసి అరెస్టు



ముంబయి: భారత క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ తనయురాలు సారాను ఫోన్‌లో వేధించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం పశ్చిమ బెంగాల్‌కు చెందిన 32 ఏళ్ల దేవ్ మిధి సచిన్ ఇంటి ల్యాండ్ లైన్ ఫోన్‌కు 20 సార్లు కాల్ చేశాడు. సారాతో అతను అసభ్యంగా మాట్లాడాడు. ఆమెను పెళ్లి చేసుకుంటానని అన్నాడు. సారాను కిడ్నాప్ చేస్తానని కూడా దేవ్ బెదిరించాడు. దీంతో ఆమె ముంబయిలోని బాంద్రా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఫోన్ కాల్‌ను ఛేదించడం ద్వారా సారాతో అసభ్యంగా మాట్లాడింది దేవ్ అని, అతడిది పశ్చిమ బెంగాల్ అని తెలుసుకున్నారు. పోలీసులు అతడిని ముంబయికి తీసుకొచ్చి కోర్టులో ప్రవేశ పెట్టనున్నారు. దేవ్‌కు మతిస్థిమితం లేదని అతడి కుటుంబ సభ్యులు అంటుండగా.. ఈ విషయాన్ని నిర్ధరించేందుకు పరీక్షలు నిర్వహించనున్నారు.


సాయిప్రణీత్

హైదరాబాద్ ప్రతాపం

6-(-1)తో అవధెపై ఘనవిజయం

చెన్నై: ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో ఆదివారం హైదరాబాద్ హంటర్స్ జట్టు చెలరేగిపోయింది. ఆదివారం చెన్నైలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో హంటర్స్ 6-(-1) తేడాతో అవధె వారియర్స్‌ను చిత్తు చేసింది. ఒక్క మ్యాచూ గెలవని అవధె.. ట్రంప్ మ్యాచ్‌లోనూ ఓడిపోవడంతో -1 పాయింట్లతో మ్యాచ్‌ను ముగించాల్సి వచ్చింది. ముందుగా పురుషుల డబుల్స్ డబుల్స్ మ్యాచ్‌లో మార్కిస్ కిడో-సియాంగ్ జోడీ 14-15, 15-6, 15-11తో చిన్ చంగ్-చున్ మన్ జంటను ఓడించి హంటర్స్‌కు శుభారంభాన్నందించింది. తర్వాత హోరాహోరీగా సాగిన పురుషుల సింగిల్స్ తొలి మ్యాచ్‌లో లీ హ్యున్ 14-15, 15-9, 15-14తో పారుపల్లి కశ్యప్‌ను ఓడించడంతో హంటర్స్ ఆధిక్యం 2-0కు పెరిగింది. అవధె ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకున్న రెండో పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ 10-15, 10-15తో సాయిప్రణీత్ చేతిలో షాక్ తినడంతో అవధె ఓటమి ఖరారైంది. తర్వాత హైదరాబాద్ ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకున్న మహిళల సింగిల్స్‌లో కరోలినా మారిన్ 15-5, 15-7తో సైనా నెహ్వాల్‌ను చిత్తు చేసి జట్టు ఆధిక్యాన్ని 5-(-1)కి పెంచింది. చివరిదైన మిక్స్‌డ్ డబుల్స్ పోరులో సాత్విక్ సాయిరాజ్-బెర్నాడెత్ 15-9, 15-9తో సెతియావన్-క్రిస్టినా జంటను ఓడించడంతో హైదరాబాద్ తిరుగులేని ఆధిక్యంతో మ్యాచ్‌ను ముగించింది. ఈ విజయంతో లీగ్‌లో మొత్తంగా 14 పాయింట్లు సాధించిన హంటర్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. అవధె 12 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది.

గెలుపు బాటలో ఆస్ట్రేలియా

మార్ష్ సోదరుల శతకాలు ● ఇంగ్లాండ్‌తో యాషెస్ ఆఖరి టెస్టు


షాన్ మార్ష్ (156), మిచెల్ మార్ష్ (101)

సిడ్నీ: ఇంగ్లాండ్‌తో యాషెస్ ఐదో టెస్టులో ఆస్ట్రేలియా ఘనవిజయం దిశగా సాగుతోంది. అసాధారణంగా పోరాడితే తప్ప ఇంగ్లాండ్ పరాజయాన్ని తప్పించుకోవడం కష్టమే. మార్ష్ సోదరులు శతకాలు బాదడంతో తొలి ఇన్నింగ్స్‌లో 303 పరుగుల భారీ ఆధిక్యం సంపాదించిన ఆసీస్.. బంతితోనూ విజృంభించింది. భారీ లోటుతో నాలుగో రోజు, ఆదివారం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లాండ్.. ఆట ముగిసే సమయానికి 93 పరుగులకే 4 వికెట్లు చేజార్చుకుంది. రూట్ (42)తో పాటు బెయిర్‌స్టో క్రీజులో ఉన్నాడు. 15 పరుగులకే ఓపెనర్లు స్టోన్‌మన్ (0), కుక్ (10) వికెట్లు కోల్పోయిన ఇంగ్లాండ్ ఆ తర్వాత.. 68/4తో నిలిచింది. ఐతే పట్టుదలతో ఆడిన రూట్.. బెయిర్‌స్టోతో అభేద్యమైన ఐదో వికెట్‌కు 25 పరుగులు జోడించాడు. లైయన్ రెండు వికెట్లు పడగొట్టాడు.

అన్నదమ్ములు దంచారు: ఉదయం 479/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 649/7 వద్ద డిక్లేర్ చేసింది. ఆస్ట్రేలియా తరఫున ఒకే ఇన్నింగ్స్‌లో సెంచరీలు చేసిన మూడో సోదర ద్వయంగా షాన్ మార్ష్ (156), మిచెల్ మార్ష్ (101)లు ఘనత సాధించారు. ఇంతకుముందు గ్రెగ్ ఛాపెల్-ఇయాన్ ఛాపెల్, స్టీవ్ వా-మార్క్‌వా ఈ ఘనత సాధించారు. మొత్తం ఇకే ఇన్నింగ్స్‌లో శతకాలు సాధించిన ఎనిమిదో అన్మదమ్ములుగా షాన్, మిచెల్ నిలిచారు. వీళ్లిద్దరు ఐదో వికెట్‌కు 169 పరుగులు జోడించారు. వికెట్‌కీపర్ పైన్ 38 పరుగులతో అజేయంగా నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 346 పరుగులు చేసింది.

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 346; ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 649/7 డిక్లేర్డ్ (ఖవాజా 171, షాన్ మార్ష్ 156, మిచెల్ మార్ష్ 101, పైన్ 38 నాటౌట్; అలీ 2/170); **ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్: 93/4** (కుక్ 10, స్టోన్‌మన్ 0, విన్స్ 18, రూట్ 42 బ్యాటింగ్, మలన్ 5, బెయిర్‌స్టో 17 బ్యాటింగ్; లైయన్ 2/31)

ఏటీకేపై బెంగళూరు విజయం



బెంగళూరు: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో ఆదివారం బెంగళూరు ఎఫ్‌సీ జట్టు 1-0తో డిఫెండింగ్ ఛాంపియన్ ఏటీకేపై విజయం సాధించింది. బెంగళూరు తరఫున కెప్టెన్ సునీల్ ఛెత్రి (39వ నిమిషం) గోల్ కొట్టాడు. ఈ విజయంతో మూడు పాయింట్లు సంపాదించిన బెంగళూరు.. 9 మ్యాచ్‌ల నుంచి మొత్తం 18 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. దిల్లీ డైనమోస్, చెన్నయిన్ ఎఫ్‌సీ మధ్య జరిగిన మరో మ్యాచ్ 2-2తో డ్రాగా ముగిసింది. ఈ ఫలితంతో దిల్లీ పరాభవ పరంపరకు అడ్డుకట్ట పడింది. ఈ మ్యాచ్‌కు ముందు వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో దిల్లీ ఓడింది. మొత్తం 9 మ్యాచ్‌లు ఆడిన చెన్నయిన్ 17 పాయింట్లతో, పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉంది. ఎఫ్‌సీ పుణె సిటీ 16 పాయింట్లతో మూడో స్థానంలో, ముంబయి సిటీ ఎఫ్‌సీ 14 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్నాయి. దిల్లీ డైనమోస్ (8 మ్యాచ్‌లు) 4 పాయింట్లతో అట్టడుగున కొనసాగుతోంది.


కిర్గియోస్

వోజ్నియాకికి షాక్

ఆక్లాండ్: డెన్మార్క్ భామ కరోలినా వోజ్నియాకికి షాక్! డబ్ల్యూటీఏ ఆక్లాండ్ క్లాసిక్ టెన్నిస్ టోర్నీ ఫైనల్లో ఆమెను జూలియా జార్జెస్ (జర్మనీ) కంగుతినిపించింది. సింగిల్స్ తుది సమరంలో జార్జెస్ 6-4, 7-6 (7-4)తో టాప్‌సీడ్ వోజ్నియాకిని ఓడించింది. ఈ పోరులో 11 ఏస్‌లు సంధించిన జార్జెస్.. ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసింది. రెండో సెట్లో మాత్రమే జార్జెస్‌కు వోజ్నియాకి పోటీ ఇవ్వగలిగింది. ఐతే ఈ సెట్‌ను టైబ్రేకర్‌లో గెలుచుకున్న జార్జెస్ టైటిల్ కూడా సొంతం చేసుకుంది. మరోవైపు ఆస్ట్రేలియన్ ఓపెన్ ముంగిట యువ ఆటగాడు నిక్ కిర్గియోస్ సత్తా చాటాడు. అతను బ్రిస్బేన్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో కిర్గియోస్ 6-4, 6-2తో ర్యాన్ హరిసన్ (అమెరికా)ను వరుస సెట్లలో ఓడించాడు.

చెస్ ఒలింపియాడ్‌లో భారత్ పసిడి గెలవొచ్చు



ముంబయి: చెస్ ఒలింపియాడ్‌లో బరిలోకి దిగే జట్లలో భారత్ టాప్ 5-6లో ఉంటుందని ఆరుసార్లు ప్రపంచ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ అన్నాడు. చెస్ ఒలింపియాడ్‌లో భారత్‌కు స్వర్ణం సాధ్యమా అని అడిగినప్పుడు.. "ఎందుకు కాదు! భారత్ టాప్ 5-6 జట్లలో ఒకటి. మాకు స్వర్ణం సాధించే అవకాశం లేదనడం హాస్యాస్పదం. మాకు మంచి అవకాశాలు ఉన్నాయి" అని ఆనంద్ అన్నాడు. తాను ఒలింపియాడ్‌లో ఆడాలానే ఆసక్తితో ఉన్నానని అతడు చెప్పాడు. చెస్ ఒలింపియాడ్ సెప్టెంబరులో జార్జియాలో జరుగుతుంది.

పల్లెకు పట్టణ వసతులు ఇంకెప్పుడు?

- రూర్బన్ పథకం వచ్చి రెండేళ్లు
- ఇప్పటికీ సర్వేలతోనే కాలక్షేపం
- కొన్నిచోట్ల స్వల్పంగా పనులు
- అంచనా వ్యయం రూ.1,600 కోట్లపైనే
- ఇప్పటికి వచ్చింది రూ.23 కోట్లు
- కేంద్రంలోనూ ఉత్సాహం కరవు

ఈనాడు- హైదరాబాద్

పల్లెల్లోనూ పట్టణ తరహా సదుపాయాలను కల్పించాలనే ధ్యేయంతో కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం ప్రవేశపెట్టిన 'శ్యామప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్'.. తెలంగాణలో ఇప్పటికీ ఆశించిన ఫలితాలు సాధించలేక పోయింది. మొదటి దశలో ఏడాదిన్నర క్రితం ఎంపికైన క్లస్టర్లలో ఎల్ఈడీ దీపాల ఏర్పాటు వంటి కొద్దిపాటి పనులే చేపట్టగా, మిగతా వాటిలో ఇంకా కుటుంబ సర్వేలతోనే కాలం గడుపుతున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కూడా ఈ కార్యక్రమం అమలుపై ఉత్సాహాన్ని కనబర్చటంలేదని తెలుస్తోంది. దిల్లీ నుంచి సూచనలూ రాకపోతుండటంతో ఇక్కడి అధికార గణాలు సైతం ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నాయి.

రూర్బన్ పథకం సజావుగా అమలైతే గ్రామాల్లో మౌలిక సదుపాయాలతో పాటు ఉపాధి అవకాశాలూ పెరుగుతాయి. గ్రామీణులు పట్టణాలకు వలసబాట పట్టాల్సిన అవసరమూ తగ్గుతుంది. ఏటా వంద చొప్పున మూడేళ్లలో 300 క్లస్టర్లను రూర్బన్ కింద అభివృద్ధి పర్చాలని నిర్ణయించిన కేంద్రం.. 2016, ఫిబ్రవరిలో పథకాన్ని ఆవిష్కరించింది. రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 18 క్లస్టర్లను ప్రతిపాదించగా.. కేంద్రం తొలి విడతలో నాలుగింటిని ఎంపిక చేసింది. ఒక్కో క్లస్టర్‌కు చేసే ఖర్చులో 30 శాతం లేదా రూ.30 కోట్లు.. ఏది తక్కువైతే దాని ప్రకారం కేంద్రం నిధుల్ని అందజేస్తుంది. గిరిజన గ్రామాల క్లస్టర్‌కైతే రూ.25 కోట్లు ఇస్తుంది. మిగతా మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే వివిధ పథకాల ద్వారా ఖర్చు చేయాల్సి ఉంటుంది. రాష్ట్రం ఒక్కో క్లస్టర్‌కు రూ.100 కోట్లకు పైగానే వ్యయమయ్యే ప్రణాళికలు తయారు చేసింది. కేంద్రం రెండు, మూడు దశల్లో మరో 12 క్లస్టర్లకు ఆమోదముద్ర వేసింది. దీంతో మొత్తం 16 క్లస్టర్లకు రూర్బన్ కింద అనుమతి లభించినట్లయింది. ప్రణాళికల ప్రకారం రూ.1,600 కోట్లకు పైగానే నిధులు అవసరం. కేంద్రం ఇప్పటిదాకా రాష్ట్రానికి రూ.23 కోట్లు అందజేసింది. సమగ్ర ప్రణాళికల తయారీ కోసం ఒక్కోదానికి రూ.35 లక్షల చొప్పున కేంద్రం అందజేసింది. ఆయా గ్రామాల్లో కుటుంబ సర్వేను నిర్వహించి పేర్లను కంప్యూటరీకరించటం వంటి పనుల్ని ఈ నిధులతో చేపట్టాల్సి ఉంటుంది.



రూర్బన్ కింద ఎంపికైన సంగారెడ్డి జిల్లా ర్యాకల్ గ్రామం

క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి..

రూర్బన్ మిషన్ కింద ఎంపికైన గ్రామాల్లో ఇప్పటికైతే పెద్దగా అభివృద్ధి కార్యక్రమాలంటూ అమల్లోకి రాలేదు. తొలి విడతలోని అల్లాపూర్, ర్యాకల్ జుక్కల్ క్లస్టర్లకు ఒక్కో దానికి రూ.5.40 కోట్ల చొప్పున, చిర్రగుంట గిరిజన క్లస్టర్‌కు రూ.2.70 కోట్లను కేంద్రం ఇప్పటికే అందజేసింది. వీటిలో సంగారెడ్డి జిల్లాలోని ర్యాకల్ క్లస్టర్ పరిధిలోగల 27 పంచాయతీల్లో పనులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో ఎల్ఈడీ దీపాల్ని, అమర్చి సీసీ రోడ్లు వేస్తున్నారు. పది పాఠశాలల్లో డిజిటల్ తరగతులకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక్కడి ప్రణాళిక ప్రకారం రూ.137 కోట్లు అవసరం. మిగతా గ్రామాల్లో మాదిరిగానే వీధిలైట్లు, రహదారులు వేస్తున్నారని, రూర్బన్ మిషన్ ప్రత్యేకత ఏముందని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. భూపాలపల్లి జిల్లా నాగారం క్లస్టర్‌లో సర్వే పనులే పూర్తవ్వలేదు. నల్గొండ జిల్లాలోని కొండభీమనపల్లి గిరిజన క్లస్టర్‌లోని 21 గ్రామాలదీ ఇదే పరిస్థితి. అయితే.. వివిధ పథకాల సమ్మేళనమే రూర్బన్ మిషన్ స్వరూపమనీ, అన్ని విభాగాలూ ఈ క్రతువులో పాలుపంచుకోవటానికి కొంత జాప్యం తప్పదని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.



నల్గొండ జిల్లాలోని కొండభీమనపల్లి గ్రామం



చైనా తూర్పు తీరంలో సముద్రంలో చమురును తీసుకెళ్తున్న ట్యాంకర్.. సరకు రవాణా నౌకను ఢీకొట్టింది. షాంఘైకి 160 నాటికల్ మైళ్ల దూరంలో జరిగిన ఈ ప్రమాదంలో 32 మంది గల్లంతయ్యారు. ఇరాన్ నుంచి దక్షిణ కొరియాకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గల్లంతైన వారిలో ఎక్కువ మంది ఇరాన్‌కు చెందినవారుగా భావిస్తున్నారు.

ఆధార్ గోప్యత అతిక్రమణపై ఎఫ్ఐఆర్

- కార్డు జారీ సంస్థ ఫిర్యాదు మేరకు నమోదు
- ఎఫ్ఐఆర్‌లో విలేకరి పేరు

దిల్లీ: ఆధార్ కార్డుల వివరాలు గోప్యంగా లేవంటూ 'ది ట్రిబ్యూన్' పత్రిక వెలువరించిన పరిశోధనాత్మక కథనానికి సంబంధించి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) డిప్యూటీ డైరెక్టర్ బి.ఎం.పట్నాయక్ ఫిర్యాదు మేరకు దిల్లీ పోలీసులు ప్రథమ సమాచార పత్రం(ఎఫ్ఐఆర్) నమోదు చేశారు. 100 కోట్లకు పైగా భారతీయుల ఆధార్ వివరాలను తెలుసుకోగల ఓ సేవను పత్రిక కొనుగోలు చేసిందంటూ తమకు సమాచారం అందిందని.. ఇది ఆధార్ గోప్యతను అతిక్రమించడమేనని పట్నాయక్ ఈ నెల 5న ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అదేరోజున ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. పత్రికకు కథనం అందించిన విలేకరి రచనా ఖైరా పేరును కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చామని.. అయితే, ఎవరినీ నిందితులుగా పేర్కొనలేదని స్పష్టం చేశారు. ఎఫ్ఐఆర్‌లో పేర్లు ఉన్నవారందరినీ ప్రశ్నిస్తామని వెల్లడించారు. యూఐడీఏఐ ఫిర్యాదు నేపథ్యంలో 'ది ట్రిబ్యూన్', విలేకరిపై ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఈ వ్యవహారాన్ని భారతీయులంతా ఖండించాలని పార్టీ ప్రధాన అధికార ప్రతినిధి రణదీప్‌సింగ్ సూర్జేవాలా ఆదివారం పిలుపునిచ్చారు. ఆధార్ వివరాల గోప్యతకు భంగం కలిగిస్తున్నవారిపై చర్యలు తీసుకోవడానికి బదులుగా.. లోపాలను బయటపెట్టినవారిపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించడమేంటంటూ ప్రశ్నించారు. మరోవైపు, ఎఫ్ఐఆర్ నమోదుపై విమర్శలు వెల్లువెత్తడంతో యూఐడీఏఐ స్పందించింది. పత్రికా స్వేచ్ఛను తాము గౌరవిస్తామని స్పష్టం చేసింది. తమ ఫిర్యాదును మీడియా, ప్రజావేగులకు వ్యతిరేక చర్యగా చూడొద్దంటూ విజ్ఞప్తి చేసింది. మరోవైపు, ఆధార్ గోప్యత అతిక్రమణపై 'ది ట్రిబ్యూన్'కు కథనం అందించిన విలేకరి రచనా ఖైరా తాజా పరిణామాలపై స్పందిస్తూ.. ఎఫ్ఐఆర్ నమోదు ద్వారానైనా తన కథనంపై యూఐడీఏఐ స్పందించినందుకు ఆనందంగా ఉందన్నారు. ఇప్పుడైనా ప్రభుత్వం రంగంలోకి దిగి ఆధార్ గోప్యతకు కలుగుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. తాను అందించిన కథనంలోని ప్రతి పదానికి కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు.

ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ఎడిటర్స్ గిల్డ్ విజ్ఞప్తి

'ది ట్రిబ్యూన్' కథనంపై ఎఫ్ఐఆర్ నేపథ్యంలో 'ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా' తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వం జోక్యం చేసుకొని.. పత్రికతోపాటు విలేకరిపై ఎఫ్ఐఆర్‌ను యూఐడీఏఐ ఉపసంహరించుకునేలా చూడాలని విజ్ఞప్తి చేసింది. ఆధార్ గోప్యత అతిక్రమణ అంశంపై నిష్పక్షపాత దర్యాప్తు జరిపించాలని కూడా కోరింది.

కొవ్వును కరిగించేస్తుంది

వాషింగ్టన్: అతిబరువుతో బాధపడే వారికి శుభవార్త. భారీగా పేరుకున్న కొవ్వును వదిలించుకునేందుకు తోడ్పడే కొత్త ఔషధాన్ని పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఆహార నియమాలు పాటించక పోయినా ఇది చక్కటి ఫలితాలను ఇవ్వడం విశేషం. స్థాయిలు పెరిగేకొద్దీ కొవ్వు కణాలు ప్రత్యేక ప్రొటీన్లను విడుదల చేయడం మొదలుపెడతాయి. ఈ ప్రొటీన్లు కొవ్వు కణాల్లోని జీవక్రియా రేటును నెమ్మదింపచేస్తాయి. దీంతో ఊబకాయం, టైప్-2 మధుమేహం, హృద్రోగాలు లాంటి వ్యాధులు చుట్టుముడతాయి. ప్రస్తుతం ఈ కొవ్వు కణాల జీవక్రియా రేటుపై అమెరికాలోని టెక్సాస్ మెడికల్ స్కూల్ నిపుణులు దృష్టిసారించారు. దీన్ని క్రియాశీలం చేసే ఔషధాన్ని వారు అభివృద్ధి చేశారు. ఊబకాయ ఎలుకలకు పది రోజులపాటు దీన్ని అందించారు. దీంతో ప్లాసెబో తీసుకున్న ఎలుకలతో పోలిస్తే.. వీటి బరువు సగటున ఏడు శాతం వరకూ తగ్గినట్లు వెలుగులోకివచ్చింది. అంతే కాదు కొవ్వు కణాలూ 30 శాతం వరకూ కరిగినట్లు బయటపడింది.

'పాశ్చాత్య అల్పాహారం' తీసుకుంటే.. శిశువులకు మహా మేధస్సు



లండన్: తెలివైన పిల్లలు పుట్టాలని ఆశపడుతున్నారా? అయితే క్లోరిన్ స్థాయిలు అధికంగా ఉండే మాంసం, గుడ్లతోకూడిన పాశ్చాత్య అల్పాహారాన్ని తీసుకోవాలని గర్భిణులకు తాజా అధ్యయనం సూచిస్తోంది. అమెరికాలోని కార్నెల్ వర్సిటీ నిపుణులు దీన్ని చేపట్టారు. 25 మంది నవజాత శిశువుల సమాచారాన్ని వారు విశ్లేషించారు. వీరిలో కొందరి తల్లులకు గర్భధారణ సమయంలో పాశ్చాత్య అల్పాహారాన్ని తీసుకొమ్మని సూచించారు. అనంతర పరిశోధనల్లో వీరికి పుట్టిన శిశువుల్లో బాల మేధావి లక్షణాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ విషయం ఎలుకల్లో ఇప్పటికే రుజువైందని పరిశోధకులు మేరీ కాడిల్ తెలిపారు. చివరి మూడు నెలల గర్భధారణ సమయంలో తీసుకునే క్లోరిన్ సహిత పోషకాలు జీవితాంతం చిన్నారులకు ఎనలేని మేలుచేస్తాయని ఆమె వివరించారు. చేపలు, పాలు, పప్పులతోపాటు బ్రకోలి లాంటి కూరగాయలూ అధికంగా తీసుకోవాలని సూచించారు.

శిశువుల్లో హృద్రోగాలను ఆదిలోనే కనిపెడుతుంది

* అధునాతన స్కానింగ్ పరిజ్ఞానం అభివృద్ధి



వాషింగ్టన్: శిశువులు పిండ దశలో ఉన్నప్పుడే వ్యాధులను కనిపెట్టే అధునాతన పరిజ్ఞానాన్ని అమెరికా శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. పుట్టుకతోనే చుట్టుముట్టే హృద్రోగాలను అడ్డుకునేందుకు ఇది తోడ్పడే వీలుంది. మెదడు, గుండె తదితర అవయవాలకు అందే రక్త సరఫరాను అంచనా వేసేందుకు వెలాసిటీ సెలెక్టివ్ ఆర్టెరియల్ స్పిన్ బ్లీడింగ్ (ఏఎస్ఎల్) స్కానింగ్ పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తారు. ఇది నాళాల గుండా ప్రసరించే రక్తంలో నీటి అణువులపై దృష్టి కేంద్రీకరిస్తుంది. వీటి ఆధారంగా ఎలాంటి వర్ణ ద్రవ్యం అవసరం లేకుండా రక్త ప్రసరణ వేగాన్ని అంచనా వేస్తుంది. గర్భంలోని శిశువులకు అందే ఆక్సిజన్, పోషకాల స్థాయిల్లో తేడాలను గుర్తించేందుకు ప్రస్తుతం ఈ పరిజ్ఞానాన్నే పరిశోధకులు ఉపయోగించుకున్నారు. దీని సాయంతో మూడు నెలలు వయసుదాటిన పిండాల్లో హృద్రోగ లక్షణాలను గుర్తించగలిగామని పరిశోధనకు నేతృత్వం వహించిన కేథరిన్ లింపెరోపోలస్ తెలిపారు.

మెదడు వైఫైలానే పనిచేస్తుంది!



లండన్: మన మెదడు వైఫై వ్యవస్థలానే పనిచేస్తుందని తాజా పరిశోధనలో తేలింది. చూపుల సాయంతో ఎప్పటికప్పుడు ఎదుటివారి నుంచి సమాచారం సేకరిస్తుందని వెలుగులోకి వచ్చింది. గట్టి నమ్మకాలు ఏర్పడటానికి ఈ సమాచారమే మూలమని బయటపడింది. బ్రిటన్‌లోని షెఫీల్డ్ వర్సిటీ నిపుణులు డిగ్బీ టాటమ్ నేతృత్వంలో నిపుణులు ఈ పరిశోధన చేపట్టారు. ఇతరులతో సంభాషించే విధానంపై వారు దృష్టి కేంద్రీకరించారు. 'ఎదుటివారితో మాట్లాడేటప్పుడు వారి భావోద్వేగాలు, ఆసక్తులను మనం ఇట్టే గుర్తుపడుతుంటాం. దీనికి మెదళ్ల మధ్యలో అనుసంధానాలే కారణం. వీటిని అంతర అనుసంధానాలుగా పిలవొచ్చు'అని టాటమ్ వివరించారు. ఈ సమాచార వేగాన్ని కాంతి ప్రసారంతో పోల్చొచ్చని తెలిపారు.

శని చందమామపై భూమి తరహా లక్షణాలు



న్యూయార్క్: శని గ్రహం చుట్టూ తిరుగుతున్న దాని చందమామ టైటాన్‌కు సంబంధించిన సవివర మ్యాప్‌ను అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) శాస్త్రవేత్తలు రూపొందించారు. దీని ఉపరితలం చాలా మేర భూమిని పోలి ఉన్నట్లు గుర్తించారు. అనేక వనరుల నుంచి సేకరించిన డేటాను కలగలిపి ఈ మ్యాప్‌ను సృష్టించారు. ఇందులో కొత్త పర్వతాలు సహా అనేక అంశాలు వెలుగు చూశాయి. ఈ పర్వతాల ఎత్తు 700 మీటర్లను మించలేదు. టైటాన్ ఉపరితలంపై ఎత్తు పల్లాల వివరాలనూ ఈ మ్యాప్ అందించింది. ఆ చందమామ మధ్యరేఖా ప్రాంతంలో రెండు పల్లపు ప్రాంతాల పూర్వాపరాలను శాస్త్రవేత్తలు విశ్లేషించగలిగారు. అవి ఆవిరైపోయిన సముద్రాలు లేదా శీతల అగ్నిపర్వత ప్రవాహాల ఆనవాళ్లు అయ్యి ఉండొచ్చని పేర్కొన్నారు. లోగడ ఊహించినదాని కన్నా ఈ చందమామ కొంచెం నలుచదునుగా ఉంటుందని తేలింది. దీని పై పొర మందంలో చాలా ఎక్కువ వైరుధ్యాలున్నాయని వెల్లడైంది. టైటాన్ మీదున్న అనేక సరస్సులు భూమి మీదున్న జల వనరులను పోలి ఉన్నాయని పరిశోధకులు తెలిపారు.

భోజన వేళల్లో మార్పులతో బరువు పరార్!



వాషింగ్టన్: బరువు తగ్గాలని కోరుకుంటున్నారా? శరీరంలోని అదనపు కొవ్వును కరిగించుకునేందుకు ప్రయత్నిస్తున్నారా? అయితే, భోజనవేళలపై శ్రద్ధ పెట్టాలని సూచిస్తున్నారు అమెరికాలోని అలబామా విశ్వవిద్యాలయ పరిశోధకులు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల మధ్య ఆహారం తీసుకోవడం ప్రస్తుతం అమెరికాలో చాలామంది పాటిస్తున్న నియమం. ఈ వ్యవధిని ఇంకాస్త తగ్గిస్తే మరిన్ని మెరుగైన ఫలితాలుంటాయని పరిశోధకులు తాజాగా గుర్తించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు మాత్రమే ఆహారం తీసుకొని.. అనంతరం మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు ఉపవాసం ఉంటే శరీరంలో కెలోరీలు త్వరగా కరుగుతున్నట్లు గుర్తించామని పరిశోధకులు చెప్పారు. వేగంగా బరువు తగ్గేందుకు ఈ భోజనవేళ నియమం దోహదపడుతోందన్నారు. 11 మందిపై పరిశోధనల ద్వారా గుర్తించామని.. ఆరోగ్యంపై ఈ నియమం పూర్తిస్థాయి ప్రభావాలను విస్తృత పరిశోధనల అనంతరం వెల్లడిస్తామని పేర్కొన్నారు.

నేర పరిశోధన సీరియళ్లను చూసినా.. నేరాన్ని కప్పిపుచ్చలేరు!

బెర్లిన్: నేర పరిశోధన కథలకు బుల్లితెరపై లభించే ఆదరణ అంతా ఇంతా కాదు. చాలాదేశాల్లో ఈ టీవీ షోలు, సీరియళ్ల హవా నడుస్తోంది. దీంతో నేరగాళ్లు ఈ షోలను చూసి.. నేరాల నుంచి తప్పించుకునే మెళకువలు నేర్చుకుంటారని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అయితే, అలాంటి చింత అవసరం లేదని చెబుతున్నారు జర్మనీ పరిశోధకులు. ఫోరెన్సిక్ డ్రామాలను చూసినంత మాత్రాన నేరాలను మరుగునపడేసే వ్యూహాలను నేర్చుకోలేరని వారు తెలిపారు. 'క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్(సీఎస్ఐ)' సిరీస్ 2000లో ప్రారంభమైన అనంతరం అమెరికాలో చోటుచేసుకున్న నేరాలను తాము విశ్లేషించామని పేర్కొన్నారు. సీఎస్ఐ వంటి షోల వల్ల నేరాల నుంచి తప్పించుకోవడంలో కలిగే లబ్ధిపై వివిధ కేసుల్లో దోషులుగా తేలిన 24 మందిని ఆరాతీసినట్లు చెప్పారు. చేసిన నేరాలను కప్పిపుచ్చుకోవడంలో నేరగాళ్లకు ఈ సీరియళ్లు దోహదపడట్లేదని తేలిందన్నారు.

ఆసరా పింఛను పత్రంతోనూ ఇక ఓటెయ్యొచ్చు!

ఈనాడు-హైదరాబాద్: రానున్న పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు ఆసరా పింఛను పత్రం సహా 18 రకాల ఆధారాల్లో ఏ ఒక్కదాన్ని చూపించైనా సరే ఓటు వేయవచ్చు. ఓటరు స్లిప్పులను పోలింగ్ కేంద్రానికి తీసుకురావాలనే నిబంధన ఇక ఉండబోదు. ఓటరు స్లిప్పుజారీ ప్రక్రియలో అవాంతరాలు ఏర్పడుతుండటంతో ఎన్నికలసంఘం ఈవిధానాన్ని మారుస్తూ ఉత్తర్వులిచ్చింది. ఆ ప్రకారం.. ఎన్నికల సంఘం అందజేసిన ఓటరు గుర్తింపు కార్డు లేనివారు 18 రకాల పత్రాల్లో దేన్నైనా పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లవచ్చు. రైతులైతే పట్టాదారు పాసు పుస్తకాన్ని చూపించొచ్చు. ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు, ఆసరా పింఛను పత్రం (ఉత్తర్వు), ఫొటోతో కూడిన ఎస్సీ, ఎస్టీ ధ్రువపత్రం, దివ్యాంగుడికి ఇచ్చే పత్రం, బ్యాంకు పాస్‌పుస్తకం, ఆయుధ లైసెన్సు.. ఇలా ఏదీ అందుబాటులో ఉంటే దాన్ని చూపించి ఓటెయ్యవచ్చు. ఫొటో గుర్తింపు కార్డుల్లో స్వల్ప తప్పులు ఉన్నప్పటికీ పోలింగ్ సిబ్బంది అభ్యంతరం చెప్పకూడదని ఎన్నికల సంఘం తన ఉత్తర్వులో పేర్కొంది. దీంతో రానున్న పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్‌శాతం పెరుగుతుందని ఎన్నికల సంఘం అంచనా వేస్తోంది. ఓటు వేసేందుకు వెళ్లినప్పుడు ఓటరు ఫొటోతో సహా ఉండే స్లిప్పును వెంట తీసుకెళ్లే విధానం 2013లో పంచాయతీ ఎన్నికల్లో, ఆ తర్వాత జిల్లా, మండల పరిషత్ ప్రాదేశిక సభ్యుల ఎన్నికల్లో అమలయింది.

శంషాబాద్ కేంద్రంగా కేథలిక్ డయాసిస్ ఆవిష్కరణ

- దేశవ్యాప్తంగా సిరో-మలబార్ కేథలిక్ చర్చి సేవల విస్తరణ

హైదరాబాద్, బాలాపూర్-న్యూస్‌టుడే: కేరళలోని సిరో-మలబార్ కేథలిక్ చర్చి పరిధిలో శంషాబాద్ డయాసిస్‌ను ఆదివారం ఆవిష్కరించారు. తొలి బిషప్‌గా రఫాయెల్ తట్టిల్ పట్టాభిషిక్తులయ్యారు. ఈ డయాసిస్‌ను లాంఛనంగా వాటికన్ పరిధిలోకి చేర్చారు. ఈ సందర్భంగా బాలాపూర్ మండలం బడంగపేట్‌లో జరిగిన కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసఫ్, సిరో-మలబార్ కేథలిక్ చర్చి మేజర్ ఆర్చిబిషప్ కార్డినల్ జార్జి అలెంచెర్రి, భారత కేథలిక్ బిషప్‌ల కాన్ఫరెన్స్ అధ్యక్షుడు కార్డినల్ బసేలిస్ క్లీమిస్, వాటికన్ ప్రతినిధి ఆర్చిబిషప్ సిరిల్ వాసిల్, హైదరాబాద్ ఆర్చిబిషప్ తుమ్మ బాల తదితరులు పాల్గొన్నారు. శంషాబాద్ డయాసిస్ సిరో-మలబార్ కేథలిక్ చర్చి పరిధిలోని 31వ డయాసిస్ కావడం విశేషం. దీని పరిధిలో ఈశాన్య ప్రాంతాలు సహా 24 రాష్ట్రాలు (దాదాపు వంద నగరాలు) ఉంటాయి.

అతి ప్రాచీనం కేరళ చర్చి: కేరళలోని సిరో-మలబార్ కేథలిక్ చర్చి ప్రపంచంలోనే అతి ప్రాచీనమైనది. ఏసు క్రీస్తు శిష్యుడైన సెయింట్ థామస్ అపోస్టెల్ దీనిని క్రీస్తు శకం 52వ సంవత్సరంలో నెలకొల్పారు. పాశ్చాత్య దేశాలకు క్రైస్తవ మతం చేరకముందే ఇక్కడచర్చి ఏర్పాటు కావడం విశేషం. ఆయన కేరళలోని కొండుంగళ్లూర్‌లో చర్చి నెలకొల్పారు. వాటికన్ పరిధిలో ఉన్న మూడో పెద్ద చర్చి ఇదే. మొదటి రెండు స్థానాలను లాటిన్ కేథలిక్ చర్చి, ఉక్రెయిన్ కేథలిక్ చర్చిలు పొందాయి. ఈ చర్చి పరిధిలో అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడాల్లో కూడా డయాసిస్‌లు ఉన్నాయి. పోర్చుగీసు మిషనరీలు రావడంతో కొంతకాలం పాటు ఈ చర్చి అధికారాలు తగ్గాయి. 1886లో కేవలం త్రిస్సూర్, కొట్టాయం ప్రాంతాలకే పరిమితమయింది. 1955లో దీని ప్రరిధిని మొత్తం కేరళ, కర్ణాటక, తమిళనాడులకు విస్తరిస్తూ వాటికన్‌లోని పోప్ నిర్ణయం తీసుకున్నారు. శంషాబాద్ డయాసిస్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు గత అక్టోబరు 9న పోప్ ఫ్రాన్సిస్ ప్రకటించారు. దీని పరిధిలోకి మిగిలిన రాష్ట్రాలను తీసుకురావడంతో ఈ చర్చి దేశమంతటా విస్తరించినట్టయింది.

తిరుపతి నుంచి ఇండిగో సేవలు

ప్రారంభించిన కేంద్ర విమానయాన శాఖ మంత్రి అశోక్‌గజపతిరాజు

ఈనాడు, తిరుపతి: 'మన దేశం విమానయాన రంగంలో మంచి అభివృద్ధి సాధిస్తోంది. ఏటా విమాన ప్రయాణికులు పెరుగుతున్నారు. ఈ విషయంలో మనం ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉన్నామ'ని కేంద్ర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు అన్నారు. ఆదివారం ఆయన రేణిగుంట విమానాశ్రయంలో ఇండిగో కొత్త సేవలను లాంఛనంగా ప్రారంభించారు. ఇండిగో ఇప్పటివరకు తిరుపతి నుంచి విమానాలు నడపలేదు. మొదటిసారి ఆదివారం నుంచి ప్రతిరోజూ హైదరాబాద్‌కు మూడు, బెంగళూరుకు రెండు చిన్నతరహా విమాన సేవలను ప్రారంభించింది. వీటిని ప్రారంభించిన మంత్రి మాట్లాడుతూ విమానయాన రంగంలో కనెక్టింగ్ ఫ్లైట్ విస్తరణ పెరగాలన్నారు. దీనివల్ల చిన్నచిన్న నగరాల నుంచి కూడా సులభంగా విదేశాలకు వెళ్లేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇప్పటికే దేశంలో 80 కనెక్టింగ్ ఫ్లైట్‌సెంటర్లు ఉన్నాయని, ఈ సంవత్సరాంతంకల్లా అవి రెట్టింపు కావాలని ఆకాంక్షించారు. ఇండిగో సంస్థల ఛైర్మన్ ఆదిత్యఘోష్ మాట్లాడుతూ వేంకటేశ్వరుని సన్నిధిలో సేవలు ప్రారంభించడం ఆనందంగా ఉందని అన్నారు.

నివేదికను పరిగణించకుండా మాపై కక్ష సాధింపా?

- రుసుముల పెంపు 10 శాతం సరిపోదు
- ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

గోల్నాక, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన తిరుపతిరావు కమిటీ నివేదికను పరిగణనలోకి తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు విద్యాసంస్థలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ట్రస్మా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతిరావు కమిటీ సమగ్ర నివేదికను సమర్పించిందన్నారు. దీన్ని ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. వచ్చే విద్యాసంవత్సరం 10 శాతం ఫీజు పెంచుకోవచ్చని నివేదిక తెలిపిందని, అది సరిపోదని 15 శాతం పెంచుకునేందుకు అవకాశం కల్పించాలని అన్నారు. రూ.40 వేలలోపు ఫీజు తీసుకునే ప్రైవేటు పాఠశాలలకు జడ్ఎఫ్ఆర్‌సీ (జోనల్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ) నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. పాఠశాలల అక్కౌంట్స్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం కుదరదని, అధికారులు వచ్చి ఆడిట్ చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. సమావేశంలో ట్రస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్‌రావు, కోశాధికారి భూపాల్‌రావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్తర కొరియా నాయకుడితో చర్చలకూ సిద్ధమే: ట్రంప్

థర్‌మోంట్: ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జాంగ్ ఉన్‌తో చర్చలకూ తాను సిద్ధమేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఆదివారమిక్కడి విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందించారు. 'చర్చలను నేను అన్నివేళలా నమ్ముతాను. అవకాశం వస్తే కిమ్‌జాంగ్‌తో చర్చల్లో తప్పకుండా పాల్గొంటాను. ఈ విషయంలో నాకు ఎలాంటి సమస్యలూ లేవు. అయితే ఎలాంటి చర్చలైనా షరతులతోనే నడుస్తాయి'అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఆ షరతులేంటో మాత్రం చెప్పలేదు. రెండేళ్ల సుదీర్ఘ విరామం అనంతరం ఉత్తర కొరియా, దక్షిణ కొరియా మధ్య అధికారిక చర్చలు మంగళవారం మొదలుకానున్నాయి. దక్షిణ కొరియాలో శీతకాల ఒలింపిక్స్ నిర్వహణలో తోడ్పాటుపై రెండు దేశాల ప్రతినిధులు ప్రముఖంగా దృష్టి సారించనున్నారు. ఈ విషయంపైనా ట్రంప్ స్పందించారు. 'ప్రస్తుతం వారు ఒలింపిక్స్ గురించి చర్చిస్తున్నారు. ఇది ఓ ఆరంభం. చాలా పెద్ద ఆరంభం'అంటూ ఆయన వ్యాఖ్యానించారు.

విమానంలో ధూమపానం.. ప్రయాణికుడిపై కేసు

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా విమానం మరుగుదొడ్డిలో ధూమపానం చేసిన ఓ ప్రయాణికుడిపై శంషాబాద్‌లో కేసు నమోదైంది. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఠాణా సీఐ మహేశ్ తెలిపినప్రకారం.. హైదరాబాద్ మలక్‌పేట్‌కు చెందిన వ్యాపారి జలీల్‌పాషా(40) ఆదివారం షార్జా నుంచి ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానంలో హైదరాబాద్‌కు వచ్చాడు. విమానంలో ఉన్న సమయంలో ఆయన మరుగుదొడ్డిలోరహస్యంగా తెచ్చుకున్నఎలక్ట్రానిక్ సిగరెట్‌ను కాల్చాడు. గమనించిన ఎయిర్ లైన్స్ సిబ్బందిజలీల్‌పాషాను అదుపులోకి తీసుకున్నారు. శంషాబాద్‌లో విమానం దిగిన తర్వాత ఆర్జీఐఏ పోలీసులకు నిందితుడిని అప్పగించారు.

యూపీలో రోడ్డు ప్రమాదం.. 11 మంది మృతి

ఫిరోజాబాద్: ఉత్తరప్రదేశ్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 11 మంది మరణించారు. ఫిరోజాబాద్‌లో రద్దీగా ఉండే జాతీయ రహదారిపై వేగంగా మలుపు తిరిగే ప్రయత్నంలో ఒక ట్రక్కు అదుపు తప్పింది. తొలుత త్రిచక్ర వాహనాన్ని ఢీకొట్టి తర్వాత కారు మీద బోల్తా పడింది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00